www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

'కాళేశ్వరం'పై తీన్‌మార్!

కాగ్, ఎన్‌డీఎస్‌ఏ, విజిలెన్స్ నివేదికల ఆధారంగానే విచారణ విధివిధానాలు

- ముసాయిదాను సిద్ధం చేసిన ప్రభుత్వం
- నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలని సూచన
- హైకోర్టు మాజీ జడ్జి నేతృత్వంలో కమిషన్
- మాజీ సీఎం కేసీఆర్‌సహా అప్పటి మంత్రి, ఉన్నతాధికారులను విచారించే అవకాశం

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని అన్ని కాంపోనెంట్లపై హైకోర్టు మాజీ జడ్జి నేతృత్వంలోని కమిషన్‌తో విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఈ మేరకు విచారణ విధివిధానాల(టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్-టీవోఆర్)తో కూడిన ముసాయిదాను సిద్ధం చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి, నీటి పారుదల శాఖ

మిగతా 13వ పేజీలో...

ఆదివారం | 3-3-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 21 | సంచిక (Issue) : 335

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, బహుళపక్షం, తిథి: సప్తమి ఉ. 8.46 తదుపరి అష్టమి; నక్షత్రం: అనూరాధ మ. 3.56 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: రా.9.38-11.15; దుర్ముహూర్తం: సా.4.45-5.32; అమృతఘడియలు: శేషం ఉ.6.41; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.36; సూర్యాస్తమయం: 6.19

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ట్యాంక్‌బండ్‌పై పీవీ విగ్రహం

కొమురంభీం, ఐలమ్మ, సర్వాయి పాపన్న, జైపాల్ రెడ్డి, శ్రీపాదరావువి కూడా

ఇందుకు త్వరలో మంత్రివర్గ ఉపసంఘం

దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

శ్రీధర్‌బాబు మేనేజ్‌మెంట్ కోటా అయినా మెరిట్ నిరూపించుకున్నారని ప్రశంస



ఇందిరమ్మ ఇళ్లపై జరిగిన సమీక్షలో సీఎం రేవంత్, పొంగులేటి

ఇంటికి శ్రీకారం!

11 నుంచి ఇందిరమ్మ ఇళ్ల పథకం.. ఐదో గ్యారంటీ అమలుకు నిర్ణయం

- సొంత ఇల్లు లేని అర్హులందరికీ ప్రయోజనం
- తొలి దశలో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు
- స్థలం ఉన్నవారికి రూ.5 లక్షలు నగదు
- లేని వారికి స్థలం ఇచ్చి రూ.5 లక్షల సాయం
- వెంటనే విధి విధానాలు తయారు చేయండి
- లబ్ధిదారు ఇష్టప్రకారమే ఇంటి నిర్మాణం..
- కానీ ఒక వంట గది, టాయ్‌లెట్ తప్పనిసరి
- డబుల్ బెడ్ రూం తరహా తప్పులు జరగొద్దు
- ఇళ్ల పథకంపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పేదవాడి సొంతింటి కలను నెరవేర్చేందుకు.. ఆరు గ్యారంటీల్లో భాగంగా ప్రకటించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకాన్ని ఈ నెల 11న రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనుంది. ఈ మేరకు పథకం విధి విధానాలు, నిబంధనలను రూపొందించాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఇంటి నమూనాలు, డిజైన్లు తయారు చేయించాలని సూచించారు. నిరుపేదల సొంతింటి కలను దశల వారీగా నెరవేరుస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంపై శనివారం సచివాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలని అధికారులకు నిర్దేశించారు. లబ్ధిదారులకు ఆర్థిక సాయం ఏయే దశల్లో విడుదల చేయాలనేదానిపై నిబంధనలను సిద్ధం చేయాలని సూచించారు. ఈ నిధులు దుర్వినియోగం కాకుండా కట్టుదిట్టమైన మార్గదర్శకాలు

మిగతా 13వ పేజీలో...

అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ విద్య

- ఆరేళ్ల లోపు చిన్నారులకు అందించేలా ఏర్పాట్లు
- సాధ్యాసాధ్యాల పరిశీలనకు సీఎం రేవంత్ ఆదేశం
- గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారం పక్కాగా అందాలి
- సీసీ కెమెరాలు సహా బయోమెట్రిక్ హాజరుకు చర్యలు
- అద్దె ఇళ్లలోని 12,315 కేంద్రాలకు సొంత భవనాలు
- గ్రేటర్ పరిధిలో మొబైల్ అంగన్‌వాడీలు: రేవంత్

13

మరో 5,278 మందికి ఉద్యోగ నియామక పత్రాలు

రేపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అందజేత

13

భూదాన భూముల్లో.. కాలనాగులు



దాతలు దానం చేసిన భూదాన భూములు.. బడా బాబుల పాలయ్యాయి. భూదాన బోర్డు అధీనంలో ఉండాల్సినవి కొందరు వ్యక్తుల పేరిట రిజిస్ట్రేషన్ అయ్యాయి. క్రయ విక్రయాలు జరపడానికి ఏమాత్రం వీల్లేదనే నిబంధన ఉన్నా, నిషేధిత జాబితాలోనూ ఉన్నా, హైకోర్టు ఉత్తర్వులు కూడా ఉన్నా.. అక్రమార్కులకు ఇవేవీ అడ్డురాలేదు. అప్పటి ప్రభుత్వ అండదండలతో అధికారులను లొంగదీసుకుని కోట్లాది రూపాయల విలువైన భూములను అడ్డదారిలో తమ సొంతం చేసుకున్నారు. వీరిలో ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు. హైదరాబాద్ నగరంలోని వట్టినాగులపల్లి భూదాన భూముల వ్యవహారంలో ఇలా తవ్వేకొద్దీ భూ కుంభకోణాలు బయటపడుతున్నాయి.

వట్టినాగులపల్లిలో 29.27 ఎకరాలు మాయం

- ధరణి ముసుగులో రూ. 2 వేల కోట్ల విలువైన భూములు బడా నేతల పేర్ల మీద రిజిస్ట్రేషన్
- కొనుగోలుదారుల్లో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- రిజిస్ట్రేషన్ చేయరాదంటూ హైకోర్టు పలుమార్లు ఆదేశాలిచ్చినా పట్టించుకోని రెవెన్యూ శాఖ
- నిబంధనలకు విరుద్ధంగా పెద్దల పేరిట నమోదు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

వట్టినాగులపల్లిలో ధరణిని బూచిగా చూపించి సాఫ్ట్‌వేర్ అసోసియేట్స్ మ్యూచువల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి చెందిన భూములతోపాటు భూదాన భూములను స్వాహా చేసిన వైనంపై 'ఆంధ్రజ్యోతి' శనివారం 'ధరణి బూచితో భూమి స్వాహా' శీర్షికన కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్ సోదరుడు బోయినపల్లి శ్రీనివాసరావు పేరిట ఆగమేఘాలపై జరిగిన ఈ భూముల రిజిస్ట్రేషన్ వ్యవహారాన్ని 'ఆంధ్రజ్యోతి' బట్టబయలు చేయడం కలకలం రేకెత్తించింది. ఈ వ్యవహారంపై మరింత లోతుగా పరిశీలన జరపగా.. ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ భూములతో పాటు పక్కనే ఉన్న మిగతా భూదాన భూములను కూడా అప్పటి ప్రభుత్వంలో ఉన్న పెద్దలు కొల్లగొట్టిన వ్యవహారం బయటపడింది. వట్టినాగులపల్లిలో మొత్తం ఆరు సర్వే నంబర్లలోని 29.27 ఎకరాల భూదాన భూములు ఎన్నికలకు ముందు పెద్దల చేతుల్లోకి వెళ్లిపోయినట్లు తేలింది. రాజకీయ బలానికి అధికారం తోడు కావడంతో గుట్టుచప్పుడు కాకుండానే ఈ వ్యవహారం జరిగినట్లు వెల్లడైంది. ఇందులో అప్పటి ప్రభుత్వంలో చక్రం తిప్పిన అనేకమంది నేతలు ఉండడం గమనార్హం. వట్టినాగులపల్లిలో వారు కొల్లగొట్టిన భూదాన భూముల విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.2 వేల కోట్లకు పైగానే ఉంటుంది. వట్టినాగులపల్లిలోని సర్వే నంబర్లు 186, 187, 188, 189లో మొత్తం 56 ఎకరాల భూమి

మిగతా 14వ పేజీలో...

మరో ముగ్గురు బీఆర్ఎస్ ఎంపీలూ

జంప్?



- కారు దిగి కమలం గూటికి చేరనున్న ప్రజా ప్రతినిధులు
- వారితో మంతనాలు సాగిస్తున్న కమలం పార్టీ ముఖ్యులు
- ఎంపీల బాటలోనే మాజీ మంత్రి కుమారుడు కూడా!
- వరంగల్, నల్లగొండలో ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు సైతం

హైదరాబాద్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌కు చెందిన మరో ముగ్గురు లోక్‌సభ సభ్యులూ బీజేపీలో చేరనున్నారా..? ఇప్పటికే కాషాయ కండువా కప్పుకొన్న తమ ఇద్దరు సహచర ఎంపీల బాటలోనే వారూ నడవనున్నారా..? టికెట్లు దాదాపుగా ఖరారైనప్పటికీ గులాబీ పార్టీని వీడాలనే నిర్ణయానికి వచ్చేశారా..? బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తే గెలిచే అవకాశాలు తక్కువగా ఉన్నట్లు భావిస్తూ.. ప్రత్యామ్నాయంగా బీజేపీ వైపు దృష్టి సారిస్తున్నారా? కారు దిగి కమలం గూటికి వెళ్లనున్నారా..? రాజకీయ సమీకరణాలు చూస్తుంటే ఈ ప్రశ్నలన్నింటికీ ఔననే సమాధానమే వస్తోంది. తెలంగాణ నుంచి కనీసం పది ఎంపీ స్థానాలు కైవసం చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ.. ఈ క్రమంలో బీఆర్ఎస్ వారిని చేర్చుకునే దిశగా కసరత్తు ముమ్మరం చేసింది. ఆ పార్టీ సిట్టింగ్ ఎంపీలపై దృష్టిసారించింది. బీజేపీకి చెందిన కీలక నేతలు.. గులాబీ పార్టీ ముగ్గురు ఎంపీలతో

మిగతా 12వ పేజీలో...

మల్కాజిగిరి ఈటలకే

- తొమ్మిది మందితో బీజేపీ తెలంగాణ అభ్యర్థుల తొలి జాబితా
- సిటింగ్‌లు కిషన్‌రెడ్డి, సంజయ్, అర్వింద్‌లకు టికెట్
- ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావుకు పెండింగ్
- చేవెళ్ల నుంచి కొండా, జహీరాబాద్ బీబీ పాటిల్‌కు..!
- భువనగిరిలో బూర..
- హైదరాబాద్‌లో మాధవీలత
- నాగర్‌కర్నూల్ నుంచి రాములు కుమారుడు భరత్‌ప్రసాద్

12

195 కమలాలు

- బీజేపీ లోక్‌సభ అభ్యర్థుల తొలి జాబితా
- మోదీ, రాజ్‌నాథ్, అమిత్‌షా సహా 34 మంది కేంద్రమంత్రులు, ఇద్దరు మాజీ సీఎంలకు చోటు
- న్యూఢిల్లీ నుంచి సుష్మాస్వరాజ్ కుమార్తె బాన్సురీ స్వరాజ్‌కు అవకాశం
- ఎస్సీలకు 27, ఎస్టీలకు 18, ఓబీసీలకు 57 సీట్లు
- మొత్తమ్మీద 28 మంది మహిళలు చాన్స్

2

రాష్ట్రానికి ఐఐహెచ్‌టీ

- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ఏర్పాటుకు కేంద్రం ఆమోదం
- ముఖ్యమంత్రి రేవంత్, తుమ్మల విజ్ఞప్తులకు స్పందన
- తెలంగాణ చేనేతకు అంతర్జాతీయ ఖ్యాతి: మంత్రి తుమ్మల

13



'అత్యంత పేదరికాన్ని' నిర్మూలించిన భారత్

- మోదీ ప్రభుత్వ విధానాలే కారణం
- వాస్తవ తలసరి వినియోగంలో ఏటా 2.9 శాతం వృద్ధి
- తగ్గిన పట్టణ, గ్రామీణ అసమానతలు
- అమెరికా మేధో సంస్థ బ్రూకింగ్స్ నివేదిక

2

నేడు పల్స్‌పోలియో

- ఉదయం 7నుంచి సాయంత్రం 6వరకు
- 40.57 లక్షల మంది 0-5 వయసు చిన్నారులు
- 50.30 లక్షల పోలియో డోసులు సిద్ధం
- రాష్ట్రంలో 22,445 పోలియో బూత్‌లు

13



కేంద్రం హెచ్చరికతో దిగొచ్చిన గూగుల్

» ప్లేస్టోర్ నుంచి తొలగించిన పది యాప్‌ల పునరుద్ధరణ

న్యూఢిల్లీ, మార్చి 2: సర్వీసు రుసుము చెల్లింపు వివాదంతో ప్లే స్టోర్ నుంచి పలు భారతీయ స్టార్టప్ కంపెనీల యాప్‌లను తొలగించడంపై కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఈ చర్యను తాము అంగీకరించబోమని సెర్చ్ ఇంజన్ దిగ్గజం గూగుల్‌కు తేల్చిచెప్పింది. కేంద్ర ఐటీ, టెలికాం శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ శనివారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ స్టార్టప్ రంగం భారతీయ ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకం అని, వాటి భవితవ్యాన్ని ఏ సాంకేతిక దిగ్గజానికో వదిలివేయలేమని స్పష్టం చేశారు. స్టార్టప్‌లకు అవసరమైతే అండగా నిలుస్తామని ప్రకటించారు. ఈ క్రమంలో గూగుల్‌తో పాటు స్టార్టప్ ప్రతినిధులను సోమవారం చర్చలకు పిలిచారు. కాగా, శుక్రవారం గూగుల్ 10 యాప్‌లను ప్లే స్టోర్ నుంచి తొలగించింది. ప్రముఖ మ్యాట్రిమోనీ.కామ్‌కు చెందిన భారత్ మ్యాట్రిమోనీ, క్రిస్టియన్ మ్యాట్రిమోనీ, ముస్లిం మ్యాట్రిమోనీ, జోడీతో పాటు ఇన్ఫో ఎడ్జ్‌కు చెందిన జీవన్ సాథీ వీటిలో ఉన్నాయి. తమకు సంబంధించిన నౌకరీ, నౌకరీ రిక్రూటర్, నౌకరీ గల్ఫ్, 99 ఎకర్స్, శిక్షా యాప్‌లనూ ప్లే స్టోర్ నుంచి తొలగించినట్లు ఇన్ఫో ఎడ్జ్ శనివారం పేర్కొంది. ఎలాంటి నోటీసులూ ఇవ్వలేదని తెలిపింది. ప్రభుత్వ తీవ్ర హెచ్చరికతో సాయంత్రానికి పరిస్థితి మారిపోయింది. నౌకరీ, 99 ఎకర్స్ తదితర యాప్‌లను గూగుల్ ప్లేస్టోర్‌లో పునరుద్ధరించింది. కాగా, గూగుల్ సర్వీస్ రుసుములను సుప్రీం కోర్టులో సవాల్ చేసిన సంస్థల్లో మ్యాట్రిమోనీ.కామ్, ఇన్ఫో ఎడ్జ్, డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌తో పాటు ప్రముఖ తెలుగు ఓటీటీ ఆహా కూడా ఉంది.

అమెరికాలో భారత నృత్య కళాకారుడి హత్య

» తుపాకీతో పలుమార్లు కాల్చి చంపిన దుండగులు


అమర్‌నాథ్ (ఫైల్)

న్యూయార్క్, మార్చి 2: అమెరికాలో భారతీయులు, ఇండో-అమెరికన్లపై దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా మిస్సోరిలోని సెయింట్ లూయిస్ ప్రాంతంలో జరిగిన దాడిలో కోల్‌కతాకు చెందిన కూచిపూడి, భరతనాట్య కళాకారుడు అమర్‌నాథ్ ఘోష్ (34) దారుణ హత్యకు గురయ్యారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఘోష్ ఉన్నత విద్య కోసం గతేడాది అమెరికాకు వెళ్లారు. సెయింట్ లూయిస్‌లోని వాషింగ్టన్ యూనివర్సిటీలో పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ విభాగంలో మాస్టర్స్ (ఎంఎఫ్‌ఏ) చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం వాకింగ్‌కు వెళ్లిన ఆయనపై గుర్తు తెలియని వ్యక్తులు పలుమార్లు కాల్పులు జరిపారు. ఘోష్ అక్కడికక్కడే మృతిచెందారు. కాగా ఘోష్ హత్యకు గురైన సమాచారాన్ని ఆయన స్నేహితురాలు, టీవీ నటి దేవలీనా భట్టాచార్జీ శుక్రవారం వెల్లడించారు. మృతదేహాన్ని భారత్‌కు తీసుకురావడంలో సాయం చేయాలని ప్రధాని మోదీ, విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌కు ఆమె విజ్ఞప్తి చేశారు. ఘోష్ తండ్రి ఆయన బాల్యంలోనే కన్నుమూయగా, తల్లి మూడు సంవత్సరాల క్రితమే మరణించారని దేవలీనా తెలిపారు. ఈ హత్యకు గల కారణాన్ని తెలుసుకోవాలని భారత రాయబార కార్యాలయాన్ని ఆమె కోరారు. మరోవైపు తుపాకీ దాడిని చికాగోలోని భారత రాయబార కార్యాలయం తీవ్రంగా ఖండించింది. మృతుడి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపింది. ఘోష్ బంధువులకు అన్ని విధాల సహాయం అందిస్తామని పేర్కొంది.

లోకం తీరు



లోక్‌సభ ఎన్నికల్లో పోటీ అంటే

వారసులకు భయం: మోదీ


బిహార్‌లో ఓ కార్యక్రమంలో మోదీతో నితీశ్

ఔరంగాబాద్, క్రిషి నగర్, మార్చి 2: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడానికి ప్రతిపక్ష పార్టీల్లో వారసులకు ధైర్యం చాలడం లేదని ప్రధాని మోదీ ఎద్దేవా చేశారు. అందుకే వారు రాజ్యసభ ద్వారా పార్లమెంటులోకి అడుగు పెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. బిహార్ ప్రజలను భయాందోళనల్లో ముంచి వారసత్వ రాజకీయాలు చేసిన వారిని ఎన్డీయే కూటమి హద్దుల్లో ఉంచిందని చెప్పారు. బిహార్‌లోని ఔరంగాబాద్ జిల్లాలో శనివారం జరిగిన ఒక ర్యాలీలో ప్రధాని మాట్లాడుతూ... కాంగ్రెస్, ఆర్జేడీ కూటమిపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో మళ్లీ డబుల్ ఇంజన్ సర్కార్ వచ్చిందని... అభివృద్ధికి, చట్టబద్ధ పాలనకు, మహిళలు భయం లేకుండా జీవించడానికి తనది హామీ.. అని చెప్పారు. ఎన్డీయే కూటమిలోకి సీఎం నీతీశ్ కుమార్ తిరిగి రావడాన్ని దృష్టిలో పెట్టుకుని ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని నదియా జిల్లా క్రిషి నగర్‌లో శనివారం నిర్వహించిన మరో ర్యాలీలో ప్రధాని మోదీ మాట్లాడుతూ... టీఎంసీ అంటే తూ.. మై.. ఔర్ కరప్షన్(నువ్వు, నేను, అవినీతి) అంటూ మమత ప్రభుత్వంపై చెణుకులు విసిరారు.

ఎన్డీఏలో చేరిన రాష్ట్రీయ లోక్‌దళ్

న్యూఢిల్లీ, మార్చి 2: రాజకీయ వర్గాలు ఊహించిన మాదిరిగానే రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆర్ఎల్‌డీ) శనివారం ఎన్డీఏ కూటమిలో చేరింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డా సమక్షంలో ఆర్ఎల్‌డీ అధినేత జయంత్ చౌధరి ఈ మేరకు లాంఛనంగా ప్రకటించారు. ఆర్ఎల్‌డీ ఇంతవరకు విపక్షాలకు చెందిన ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉండేది. అయితే దివంగత మాజీ ప్రధాని, తన తాత చౌధరి చరణ్‌సింగ్‌కు మోదీ ప్రభుత్వం భారత రత్న ప్రకటించిన దగ్గర నుంచి జయంత్ వైఖరిలో మార్పు వచ్చింది. 'దిల్ జీత్ లియా మేరా' (నా హృదయాన్ని గెలుచుకున్నారు) అని వ్యాఖ్యానించిన ఆయన బీజేపీకి దగ్గర కావడం ప్రారంభించారు. అనుకున్నట్టుగానే ఎన్డీఏలో చేరారు. ఉత్తరప్రదేశ్ మేలు కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు.

అధికారంలోకి వస్తే చట్టబద్ధ ఎమ్మెస్పీ: రాహుల్

భోపాల్, మార్చి 2: కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే రైతులకు చట్టబద్ధంగా మద్దతు ధర(ఎమ్మెస్పీ) కల్పించేలా హామీని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో చేర్చుతున్నట్టు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ శనివారం పేర్కొన్నారు. రైతులు తమ ఉత్పత్తి, కష్టానికి తగిన ధరను, ఎమ్మెస్పీని మాత్రమే అడుగుతున్నారన్నారు. కానీ పంటలు కోతకు సిద్ధం కాగానే వ్యవసాయ కమోడిటీల ధరలను తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం తన దిగుమతి-ఎగుమతి విధానాన్ని మార్చుతోందని ఆరోపించారు. దీని వల్ల రైతులు తమ ఉత్పత్తిని తక్కువ ధరకు విక్రయించాల్సి వస్తోందని చెప్పారు. కాగా, ఇండియా కూటమి ప్రభుత్వం తొలుత కుల గణన పని చేపడుతుందని పేర్కొన్నారు.

ప్రతి పట్టణంలో అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు

న్యూఢిల్లీ, మార్చి 2: నేషనల్ అర్బన్ కోఆపరేటివ్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్‌యూసీఎఫ్‌డీసీ)ను కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్ షా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతి పట్టణంలోనూ ఒక అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకును ఏర్పాటు చేయాలని ఎన్‌యూసీఎఫ్‌డీసీకి లక్ష్యం నిర్దేశించారు. ఏటీఎం సదుపాయం, క్రెడిట్/డెబిట్ కార్డులు, క్లియరింగ్ వ్యవస్థ, స్టాచుటరీ లిక్విడిటీ రేషియో (ఎస్ఎల్ఆర్) పరిమితి నిర్వహణ, రీఫైనాన్సింగ్ అందించేందుకుగాను అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకులు వాటికవే అప్‌గ్రేడ్ కావాలని ఆయన చెప్పారు. 20 ఏళ్ల తర్వాత ఎన్‌యూసీఎఫ్‌డీసీ ఏర్పాటైందని, ఇప్పుడిది ఎంతో అవసరమని తెలిపారు. దీనికి ఆర్బీఐ అనుమతి లభించడం సంతోషంగా ఉందని,చిన్న బ్యాంకులకు ఎన్‌యూసీఎఫ్‌డీసీ సురక్షా కవచమని పేర్కొన్నారు.

పేలుళ్ల నిందితులను త్వరగా పట్టుకుంటాం

బెంగళూరు/హైదరాబాద్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని రామేశ్వరం కేఫ్‌లో పేలుళ్ల ఘటన నిందితులను సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు సాధ్యమైనంత త్వరలో పట్టుకుంటారని కర్ణాటక సీఎం సిద్దరామయ్య విశ్వాసం వ్యక్తం చేశారు. 'మాస్క్, టోపీ ధరించిన ఒక వ్యక్తి బస్సులో వచ్చి రామేశ్వరం కేఫ్‌లోని కౌంటర్ నుంచి రవ్వ ఇడ్లీ తీసుకుని, అక్కడే కూర్చుండిపోయాడు. తర్వాత అతను టైమర్ సెట్ చేసి వెళ్లిపోయాడు. అదంతా సీసీటీవీలో రికార్డు అయింది' అని చెప్పారు. అయితే, ఘటన వెనుక ఏదైనా సంస్థ హస్తం ఉందోలేదో ఇప్పుడే చెప్పలేమన్నారు. ఈ ఘటనపై ధార్వాడ్, హుబ్బళ్లి, బెంగళూరుల్లో మొత్తం నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని పోలీసు వర్గాలు తెలిపాయి. వైదేహి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ముఖ్యమంత్రి సిద్దరామయ్య శనివారం పరామర్శించారు. కాగా, పేలుళ్ల ఘటనను మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా ఖండించారు. హైదరాబాద్‌లోని రామేశ్వరం కేఫ్‌ను సందర్శించి, సంఘీభావం ప్రకటించారు.

కాంగ్రెస్ వార్‌రూమ్ అడ్రస్ మారింది!

న్యూఢిల్లీ, మార్చి 2: ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ వార్ రూమ్(ప్రధాన కార్యాచరణ వేదిక) మారింది. దాదాపు 18 ఏళ్లుగా సెంట్రల్ ఢిల్లీలో కొనసాగిన ఈ కార్యాలయం ఖాన్ మార్కెట్ పక్కనే ఉన్న భవంతిలోకి మారింది. 2004 లోక్‌సభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఏర్పాటుచేసుకున్న వార్ రూమ్ సెంట్రల్ ఢిల్లీలోని 99 సౌత్ అవెన్యూలో సుదీర్ఘకాలం కొనసాగింది. 99 సౌత్ అవెన్యూలో నివాసం ఉంటున్న రాజ్యసభ సభ్యుడు ప్రదీప్ భట్టాచార్య పదవీకాలం గత ఏడాది ఆగస్టులో పూర్తైంది. దీంతో కొత్త వార్‌రూమ్‌ను కాంగ్రెస్ ఏర్పాటుచేసుకోవాల్సి వచ్చింది. ఈ క్రమంలో ఖాన్ మార్కెట్ ప్రాంతంలోని సుబ్రహ్మణ్య భారతి మార్గ్‌లోని సీ 1/10 భవంతిలోకి తాజాగా మార్చారు. ఇది ప్రస్తుత తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేరు మీద ఉంది. ఎంపీగా ఉన్నప్పుడు ఆయనకు ఈ బంగ్లాను కేటాయించారు. మాజీ ఎంపీలు తమకు కేటాయించిన బంగ్లాను ఖాళీ చేయడానికి కొంత సమయం ఇస్తారు. అందువల్ల సార్వత్రిక ఎన్నికలు అయ్యేవరకు ఈ బంగ్లాలో వార్‌రూమ్ నడిపించే అవకాశం ఉంది.

3 న్యూస్ చానళ్లకు ఎన్‌బీడీఎస్ఏ జరిమానా

న్యూఢిల్లీ, మార్చి 2: విద్వేషాలు, మత కలహాలను ప్రేరేపించేలా కార్యక్రమాలను ప్రసారం చేశారంటూ మూడు న్యూస్ చానళ్లపై న్యూస్ బ్రాడ్‌కాస్టింగ్, డిజిటల్ స్టాండర్డ్స్ అథారిటీ (ఎన్‌బీడీఎస్ఏ) చర్యలు తీసుకుంది. న్యూస్ 18 ఇండియా, టైమ్స్ నౌ నవభారత్, ఆజ్‌తక్ చానళ్లకు జరిమానా విధించడమే కాకుండా ఆయా కార్యక్రమాల వీడియోలను ఆన్‌లైన్ (యూట్యూబ్, వెబ్‌సైట్) నుంచి తొలగించాలని ఆదేశిస్తూ నోటీసులు జారీ చేసింది. శ్రద్ధావాకర్ హత్య కేసును 'లవ్ జిహాద్'గా అభివర్ణిస్తూ మత కలహాలు ప్రేరేపించేలా కార్యక్రమాలను ప్రసారం చేశారంటూ న్యూస్ 18 ఇండియాకు రూ.50 వేల జరిమానా విధించింది. 'లవ్ జిహాద్'పైనే గతేడాది మే 31న టైమ్స్ నౌ నవభారత్‌లో ప్రసారమైన కార్యక్రమానికి సంబంధించి ఆ చానల్‌కు రూ.లక్ష జరిమానా వేసింది. భారత్‌లోని మైనారిటీలపై అమెరికా మాజీ అధ్యక్షుడు ఒబామా చేసిన వ్యాఖ్యలపై ఆజ్‌తక్ నిర్వహించిన చర్చలో వ్యాఖ్యాత సుధీర్‌చౌదరి 'తుక్డే తుక్డే గ్యాంగ్, ఖలిస్థానీ ఇన్ పంజాబ్' పదాలను వాడటంపై ఆ చానల్‌కు రూ.75 వేలు జరిమానాగా విధించింది.

బీజేపీ తొలి జాబితాలో 195 మంది

మోదీ, రాజ్‌నాథ్, అమిత్‌షా సహా 34 మంది కేంద్రమంత్రులు, ఇద్దరు మాజీ సీఎంలకు చోటు

» 16 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల పరిధిలో అభ్యర్థులు ఖరారు

» మోదీ మళ్లీ వారణాసి నుంచి బరిలో

» న్యూఢిల్లీ నుంచి సుష్మాస్వరాజ్ కుమార్తె బాన్సురీ స్వరాజ్‌కు అవకాశం


బాన్సురీకి స్వీట్ తినిపిస్తున్న ఢిల్లీ బీజేపీ నేత హరీశ్

న్యూఢిల్లీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): వచ్చే లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి బీజేపీ ఒకేసారి 195 మంది అభ్యర్థులతో తొలి జాబితాను శనివారం ప్రకటించింది. ప్రధాని మోదీ, రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పాటు మొత్తం 34 మంది కేంద్రమంత్రులు, ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులకు తొలి జాబితాలో చోటు లభించింది. ప్రధాని మోదీ యూపీలోని వారణాసి నుంచి తిరిగి పోటీపడనున్నారు. 16 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల పరిధిలోని 195 నియోజకవర్గాలకు బీజేపీ అభ్యర్థులను ఖరారు చేసింది. ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే 51 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించగా, గుజరాత్, రాజస్థాన్‌లలో 15 మంది చొప్పున, కేరళలో 12 మంది, తెలంగాణలో 9 మంది, అస్సాం, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్‌లలో 11 మంది చొప్పున, ఢిల్లీలో అయిదుగురు, ఉత్తరాఖండ్‌లో ముగ్గురు, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్‌లలో ఇద్దరు చొప్పున, గోవా, త్రిపుర, డయ్యూ డామన్, అండమాన్‌లలో ఒక్కొక్కరు చొప్పున అభ్యర్థులను ఖరారు చేశారు. ఢిల్లీలో ఏకంగా నాలుగు స్థానాలలో సిటింగ్ అభ్యర్థులు రమేశ్ బిధూరి, పర్వేశ్ వర్మ, మీనాక్షి లేఖి, హర్షవర్ధన్‌లను పక్కనపెట్టి ఇతరులకు కేటాయించారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సాధ్వి ప్రగ్యా ఠాకూర్‌ను కూడా పక్కనపెట్టారు. కాగా బీజేపీ దివంగత నాయకురాలు సుష్మా స్వరాజ్ కుమార్తె బాన్సురీ స్వరాజ్‌కు న్యూఢిల్లీ స్థానం నుంచి అవకాశం కల్పించారు. ఆమెకు ఇది తొలి ఎన్నికల సమరం. ప్రస్తుతం ఇక్కడ కేంద్రమంత్రి మీనాక్షిలేఖి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

కోట నుంచి స్పీకర్ ఓం బిర్లా

ప్రధాని మోదీ తిరిగి యూపీలోని వారణాసి నుంచి, రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ లక్నో నుంచి, కేంద్ర హోంమంత్రి అమిత్ షా గుజరాత్‌లోని గాంధీనగర్ నుంచి పోటీ చేయనున్నారు. గత ఎన్నికల్లో అమేథీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ఓడించిన కేంద్రమంత్రి స్మృతి ఇరానీని మళ్లీ అదే స్థానం నుంచి రంగంలోకి దింపారు. కాగా రాజస్థాన్‌కు చెందిన కేంద్రమంత్రుల్లో కార్మిక మంత్రి భూపేందర్ యాదవ్ ఆల్వార్ నుంచి, జలశక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెఖావత్ జోధ్‌పూర్ నుంచి పోటీ చేయనున్నారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా రాజస్థాన్‌లోని కోట నుంచి పోటీ చేస్తారు. సినీ నటి హేమమాలిని మళ్లీ మథుర నుంచి పోటీ చేస్తారు. మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ విదిశ నుంచి, త్రిపుర మాజీ ముఖ్యమంత్రి బిప్లబ్ కుమార్‌దేవ్ త్రిపుర వెస్ట్ నుంచి బరిలో ఉంటారు. కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ తిరువనంతపురం నుంచి, వి.మురళీధర్ అట్టింగల్ నుంచి పోటీ చేయనున్నారు. కేంద్ర మంత్రులు మన్‌సుఖ్ మాండవీయ, శరబానంద సోనోవాల్, కిరణ్ రిజిజు, జ్యోతిరాదిత్య సింధియా, జితేంద్రసింగ్, కిషన్‌రెడ్డి, అర్జున్‌రామ్ మేఘ్‌వాల్, అర్జున్ ముండా తదితరులకు తొలి జాబితాలో చోటు దక్కింది. తొలి జాబితా అభ్యర్థులలో 28 మంది మహిళలు, 47 మంది యువ నేతలు, 27 మంది షెడ్యూల్డు కులాలు, 18 మంది షెడ్యూల్డు జాతులు, 57 మంది ఓబీసీ వర్గాలకు చెందిన వారున్నారు.

మరింత మెజారిటీ సాధిస్తాం

పార్టీ అభ్యర్థుల తొలి జాబితాను బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే ఢిల్లీలో ప్రకటించారు. మోదీ సారథ్యంలో మూడోసారి మరింత అధిక మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తొలి జాబితా ఖరారు కోసం బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ గురువారం రాత్రి ఐదు గంటలకుపైగా సమావేశమై కసరత్తు జరిపింది. ఈ కమిటీలో ప్రధాని మోదీ, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్, అమిత్‌షా సభ్యులుగా ఉన్నారు. తదుపరి జాబితా కోసం కమిటీ వచ్చే వారం సమావేశం కానుంది. ఈసారి ఎన్నికల్లో బీజేపీ సొంతంగా 370 సీట్లను, ఎన్డీఏ పరంగా 400కుపైగా సీట్లను గెలవాలనే లక్ష్యాన్ని మోదీ నిర్దేశించిన విషయం తెలిసిందే.

నన్ను రాజకీయ బాధ్యతల నుంచి తప్పించండి
గౌతమ్ గంభీర్

తనను రాజకీయ బాధ్యతల నుంచి తప్పించాలని మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్ బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను కోరారు. తాను క్రికెట్‌పై మరింత దృష్టి పెట్టాల్సి ఉందని, కొన్ని ఒప్పందాలను పూర్తి చేయాల్సి ఉందని అన్నారు. గంభీర్ ప్రస్తుతం ఈస్ట్ ఢిల్లీ ఎంపీగా ఉన్నారు. అయితే, ఈస్ట్ ఢిల్లీ సహా ఏ స్థానంలోనైనా అభ్యర్థులుగా ప్రకటించే అవకాశం ఉన్న వారి జాబితాలో గంభీర్ పేరు లేదని బీజేపీ వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా, ఝార్ఖండ్‌లోని హజారీబాగ్ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి జయంత్ సిన్హా కూడా తనకు రాబోయే ఎన్నికల్లో టికెట్ ఇవ్వవద్దని బీజేపీ అధిష్ఠానాన్ని కోరారు. పర్యావరణ పరిరక్షణపై ఉద్యమాన్ని కొనసాగించడం కోసం ప్రత్యక్ష ఎన్నికల బరి నుంచి తప్పుకొంటున్నట్లు ఆయన ప్రకటించారు.

నదీగర్భంలో తొలి మెట్రో మార్గం

కోల్‌కతాలోని హుగ్లీ నది అడుగున నిర్మాణం

ఈ నెల 6న ప్రారంభించనున్న మోదీ



కోల్‌కతా, మార్చి 2: దేశంలోనే తొలిసారి నదీగర్భంలో నిర్మించిన మెట్రో మార్గాన్ని ఈ నెల ఆరోతేదీన ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. అతిలోతైన నదిగా పేరు తెచ్చుకున్న కోల్‌కతాలోని హుగ్లీ నదీ గర్భంలో ఈ మార్గం ఏర్పాటుచేశారు. నదీమట్టానికి 32 అడుగుల లోతున, 520 మీటర్ల పొడవునా ఈ నిర్మాణం జరిగింది. హుగ్లీ తూర్పు, పశ్చిమ తీరాల్లో మహాకరణ్, హవ్‌డా రైల్వే స్టేషన్లు నిర్మించారు. ఈ రెండు స్టేషన్లను మెట్రో మార్గం అనుసంధానిస్తుందని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. మెట్రో మార్గం అందుబాటులోకి వస్తే కోల్‌కతాలో టేగోరియా స్టేషన్ నుంచి హుగ్లీ నది అవతలి తీరంలోని హవ్‌డా వరకు సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. అలాగే.. ప్రయాణ దూరం కూడా తగ్గుతుందని తెలిపారు. ప్రస్తుతం కోల్‌కతాలోని గ్రీన్‌లైన్ తూర్పు కోల్‌కతాలోని సెక్టార్ వీ నుంచి పూల్‌బగాన్ వరకు 6.97 కిలోమీటర్ల దూరం పరుచుకొని ఉంది. మెట్రో మార్గం అందుబాటులోకి వస్తే, సెక్టార్ వీ నుంచి హౌరా వరకు అది విస్తరించి.. 27 నిమిషాల్లోనే ఆ దూరాన్ని అధిగమించే వీలు కలుగుతుందని మంత్రి తెలిపారు. కాగా, దాదాపు వెయ్యి అమృత్ భారత్ రైళ్లను రానున్న సంవత్సరాల్లో తయారుచేయనున్నట్టు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. గంటకు 250 కిలోమీటర్లు ప్రయాణించేలా వాటిని సిద్ధంచేస్తున్నాట్టు చెప్పారు.

'అత్యంత పేదరికాన్ని' నిర్మూలించిన భారత్

అమెరికా మేధో సంస్థ బ్రూకింగ్స్ నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ, మార్చి 2: అత్యంత పేదరికాన్ని భారత దేశం అధికారికంగా నిర్మూలించిందని అమెరికాకు చెందిన మేధో సంస్థ బ్రూకింగ్స్ వెల్లడించింది. ప్రధాని మోదీ ప్రభుత్వం పాటించిన బలమైన విధానాలే దీనికి కారణమని పేర్కొంది. బ్రూకింగ్స్ సంస్థ విడుదల చేసిన ఈ నివేదికను ఆర్థికవేత్తలు సుర్జిత్ భల్లా, కరన్ భాసిన్ రూపొందించారు. తీవ్ర పేదరికాన్ని భారత్ అధికారికంగా నిర్మూలించిన విషయాన్ని తలసరి పేదరిక నిష్పత్తిలో గణనీయమైన క్షీణత, గృహ వినియోగంలో స్పష్టమైన పెరుగుదల ధ్రువీకరిస్తున్నాయని ఈ నివేదిక తెలిపింది. 2022-23కి సంబంధించిన అధికారిక వినియోగ వ్యయ గణాంకాలను భారత్ ఇటీవల విడుదల చేసింది. ఇది గత పదేళ్లలో దేశానికి మొదటి అధికారిక సర్వే-ఆధారిత పేదరిక అంచనాల సమాచారం అందిస్తుంది. దీని ప్రకారం 2011-12 నుంచి వాస్తవ తలసరి వినియోగంలో ఏడాదికి 2.9శాతం చొప్పున వృద్ధి నమోదైంది. ఈ సమయానికి పట్టణ వృద్ధి రేటు (2.6%)తో పోలిస్తే గ్రామీణ వృద్ధి రేటు (3.1%) గణనీయంగా పెరిగింది. పట్టణ, గ్రామీణ అసమానతలు అనూహ్యంగా తగ్గుముఖం పట్టాయని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇవి ఆర్థిక వృద్ధి, అసమానతలో భారీ క్షీణత దేశంలో పేదరికాన్ని తొలగించడానికి దోహదపడ్డాయని నివేదిక పేర్కొంది. ప్రపంచ బ్యాంకు అంచనాల కంటే భారత్‌లో పేదల సంఖ్య చాలా తక్కువగా ఉందని తేల్చింది. భారత్‌లో పేదరికం 5 శాతానికి తగ్గిందని ఇటీవల గృహ వినియోగ ప్రకటించింది. కొద్ది రోజుల వ్యవధిలోనే బ్రూకింగ్స్ సంస్థ.. భారత్‌లో దుర్భర పేదరికం అనుభవిస్తున్న వారి సంఖ్య 2% కంటే తక్కువేనని స్పష్టం చేసింది. గ్రామీణ పేదరికం 2.5% ఉండగా, పట్టణ పేదరికం 1 శాతానికి తగ్గిందని పేర్కొంది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న జనాభా నిష్పత్తి (హెచ్‌సీఆర్) 2011-12లో 12.2 శాతం ఉండగా అది 2022-23లో 2 శాతానికి తగ్గింది. గతంలో భారత్ ఈ స్థాయిలో తగ్గింపు సాధించడానికి 30 ఏళ్లు పట్టింది. అయితే ఇప్పుడు కేవలం 11 ఏళ్లలోనే దీన్ని సాధించడం విశేషం. 'సబ్ కా సాథ్- సబ్ కా వికాస్' నినాదంతో లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమవుతున్న మోదీ సర్కారుకు ఈ నివేదిక పెద్ద సానుకూల అంశంగా మారనుంది.

పోలీసు రికార్డులు సాక్ష్యాలా?

» ఎవిడెన్స్ యాక్ట్ అందుకు అనుమతించదు

» గంజాయి పట్టివేత కేసులో తెలంగాణ హైకోర్టు తీర్పును తీవ్రంగా తప్పుబట్టిన సుప్రీంకోర్టు

» నిందితుల విడుదలకు ఆదేశాలు



న్యూఢిల్లీ, మార్చి 2: గంజాయి పట్టివేత కేసులో ఇద్దరు వ్యక్తులకు తెలంగాణ హైకోర్టు విధించిన శిక్షను సుప్రీం కోర్టు కొట్టివేసింది. విచారణ సందర్భంగా హైకోర్టు తీర్పును తీవ్రంగా తప్పుబట్టింది. వీసమెత్తు సాక్ష్యాధారాలు కూడా లేకుండానే నిందితులకు శిక్ష విధించారని, విచారణ కోర్టు వేసిన శిక్షను హైకోర్టు ఏమాత్రం సమీక్షించకుండా యాంత్రికంగా ఆమోదించిందని మండిపడింది. నిందితులకు శిక్ష నుంచి విముక్తి ప్రసాదిస్తూ తీర్పు జారీ చేసింది. కారులో 80 కిలోల గంజాయిని తరలిస్తున్నారన్న ఆరోపణలపై మహమ్మద్ ఖాలిద్‌తోపాటు మరో వ్యక్తిని పోలీసులు 2009లో అరెస్టు చేశారు. 2010లో విచారణ కోర్టు నార్కోటిక్ చట్టం కింద.. నిందితులు నేరానికి పాల్పడ్డారంటూ తీర్పు చెప్పింది. దీనిపై వారు హైకోర్టులో అప్పీల్ చేయగా.. హైకోర్టు 2022 నవంబరులో విచారణ కోర్టు ఇచ్చిన ఆదేశాలనే సమర్థించింది. దీనిపై నిందితులు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ కేసుపై విచారణ జరిపింది. పోలీసు అధికారి రికార్డు చేసిన నిందితుల వాంగ్మూలాన్ని ఎవిడెన్స్ యాక్ట్‌లోని సెక్షన్ 25 ప్రకారం సాక్ష్యంగా అంగీకరించలేమని, ఈ విషయాన్ని విచారణ కోర్టు, హైకోర్టు పూర్తిగా విస్మరించాయని ధర్మాసనం పేర్కొంది. పోలీసులు రికార్డు చేసిన స్టేట్‌మెంట్లను, ఇంటరాగేషన్ నోట్స్‌ను సాక్ష్యంగా ఎలా పరిగణిస్తారని నిలదీసింది. ఈ కేసులో పట్టుబడిన గంజాయిని సరిగా భద్రపరచలేదని, ఫోరెన్సిక్ పరీక్షలనూ సరిగా జరపలేదని ధర్మాసనం పేర్కొంది. 'మిర్చి బస్తాలతో కలిపి గంజాయిని పట్టుకున్నట్లు రికార్డుల్లో ఉంది. కానీ, మిర్చిని వేరు చేసి వాస్తవానికి దొరికిన గంజాయి ఎంత అన్నదానిని సదరు అధికారి లెక్కించనేలేదు. పంచనామాలోనైతే గంజాయితోపాటు మిర్చి కూడా ఉందన్న విషయమే లేదు' అని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. విచారణ కోర్టు, హైకోర్టుల తీర్పులను కొట్టివేస్తూ నిందితులను విడుదల చేయాలని ఆదేశించింది.

ద్విసభ్య ధర్మాసనం తీర్పును ఇద్దరు జడ్జిల బెంచ్ ఎలా కొట్టివేస్తుంది?

బిల్కిస్ కేసు ముద్దాయిల పిటిషన్

న్యూఢిల్లీ, మార్చి 2: తమ శిక్షను తగ్గిస్తూ గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు రద్దు చేయడాన్ని ఇద్దరు ముద్దాయిలు సవాలు చేశారు. దీనిపై మళ్లీ సుప్రీంకోర్టులోనే పిటిషన్ దాఖలు చేశారు. బిల్కిస్‌బానోపై గ్యాంగ్‌రేప్ కేసులో 11 మందికి విధించిన యావజ్జీవ కారాగార శిక్షను గతంలో గుజరాత్ సర్కారు తగ్గించింది. దీనిపై సుప్రీంకోర్టులో వ్యాజ్యం దాఖలు కాగా, రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని కొట్టేసింది. దాంతో ముద్దాయిలంతా మళ్లీ జైలుకు వెళ్లారు. ఈ తీర్పును రాధేశ్యాం భగవాన్ దాస్ షా, రాజుభాయ్ బాబూలాల్ సోని అనే ముద్దాయిలు సవాలు చేశారు. ఇదే అంశంపై సుప్రీంకోర్టులోని ఒక ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును మరో ద్విసభ్య ధర్మాసనం కొట్టివేసినట్టయిందని, ఇది ఎలా సాధ్యమని ప్రశ్నించారు. బిల్కిస్‌బానోపై అత్యాచారం గుజరాత్‌లో చోటుచేసుకోగా, కేసు విచారణ మాత్రం మహారాష్ట్రలో జరిగింది. ఈ నేపథ్యంలో ముద్దాయిలకు శిక్ష తగ్గింపు అధికారం ఏ రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్న ప్రశ్న తలెత్తింది. ఆ అధికారం గుజరాత్ ప్రభుత్వానికే ఉందని జస్టిస్ అజయ్ రస్తోగి, జస్టిస్ విక్రంనాథ్‌ల సుప్రీం ధర్మాసనం తీర్పు చెప్పింది. దీన్ని వ్యతిరేకిస్తూ పిటిషన్ దాఖలు కాగా, ఈ సారి జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం ముద్దాయిలు మళ్లీ జైలుకు వెళ్లాలని ఆదేశాలు ఇచ్చింది.

దేశంపై దాడులకు కుట్ర!

» పీఎఫ్ఐ నేత అబ్దుల్ సలీమ్ అరెస్టు.. ఏపీలో పట్టివేత

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ) కీలక నేత అబ్దుల్ సలీమ్‌ను ఎన్ఐఏ అరెస్టు చేసింది. ఇతను పీఎఫ్ఐకి రాష్ట్ర కార్యదర్శి(ఉత్తర తెలంగాణ)గా పనిచేస్తుండగా.. నిజామాబాద్ పీఎఫ్ఐ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకడు. దేశంలో కుట్రలకు పీఎఫ్ఐ స్కెచ్ వేసిందని ఎన్ఐఏ స్పష్టం చేసింది. తెలంగాణ సహా.. దేశరాజధాని ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, బిహార్ తదితర ప్రాంతాల్లో ఓ వర్గం వారిని టార్గెట్‌గా చేసుకుని దాడులు చేసేందుకు పీఎఫ్ఐ శిక్షణ తరగతులను ప్రారంభించినట్లు ఎన్ఐఏ వివరించింది. ఈ సంస్థపై కేంద్ర హోంశాఖ ఇప్పటికే నిషేధం విధించింది. ఈ క్రమంలోనే 2022లో నిజామాబాద్, హైదరాబాద్, ఏపీలోని పలు ప్రాంతాల్లో ఎన్ఐఏ దాడులు చేసి, పలువురిని అరెస్టు చేసింది. సలీమ్ అప్పటి నుంచి పరారీలో ఉన్నాడు. ఇంతకాలం అజ్ఞాతంలో ఉన్న సలీమ్.. ఆంధ్రప్రదేశ్‌లోని కడపజిల్లా మైదుకూరులో ఉన్నట్లు ఎన్ఐఏ గుర్తించింది. దీంతో అతన్ని శనివారం అరెస్టు చేసి, హైదరాబాద్‌కు తరలించినట్లు ఎన్ఐఏ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. సలీమ్‌పై రూ.2లక్షల రివార్డు ఉంది. సలీమ్ అరెస్టుతో.. ఈ కేసులో అరెస్టుల సంఖ్య 15కు చేరింది. 2022 జూలైలో నిజామాబాద్ పోలీసులు తొలుత కేసు నమోదు చేయగా.. కుట్ర, ఉగ్ర శిక్షణ వంటి చర్యలు, తీవ్రత నేపథ్యంలో ఎన్ఐఏ దర్యాప్తును స్వీకరించింది. ఇదిలా ఉండగా, ఎఫ్ఐ నాయకుడు, మోస్ట్ వాంటెడ్ గ్యాంగ్‌స్టర్ మహమ్మద్ గౌస్ నియాజీని ఎన్ఐఏ దక్షిణాఫ్రికాలో అరెస్టు చేసింది. 2016లో బెంగళూరులో ఆర్ఎస్ఎస్ నాయకుడు రుద్రేశ్ హత్య కేసులో అతడు నిందితునిగా ఉన్నాడు. అప్పటి నుంచి తప్పించుకొని తిరుగుతుండడంతో పట్టుకున్నవారికి రూ.5 లక్షల బహుమతి ఇస్తామని అధికారులు ప్రకటించారు కూడా.

సత్యేందర్ జైన్‌పై సీబీఐ దర్యాప్తునకు అనుమతి



న్యూఢిల్లీ, మార్చి 2: ఆప్ నాయకుడు, ఢిల్లీ మాజీ మంత్రి సత్యేందర్ జైన్‌పై విచారణ జరిపేందుకు సీబీఐకి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా శనివారం అనుమతి ఇచ్చారు. జైన్ హోం మంత్రిగా ఉన్నప్పుడు అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలపై విచారణ జరిపేందుకు ఆమోదం తెలిపారు. జైలులో ఉన్న ప్రముఖ ఖైదీలకు అక్కడ తగిన సౌకర్యాలు కల్పించేందుకు 'ప్రొటక్షన్ మనీ' కింద సొమ్ము వసూలు చేశారన్న ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు చేయనుంది. జైలులో సౌకర్యవంతంగా, ప్రశాంతంగా ఉండేందుకు రూ.10 కోట్లను పలు విడతలుగా ఇచ్చానంటూ ఆర్థిక నేరగాడు సుకేష్ చంద్రశేఖర్ ఆరోపించిన నేపథ్యంలో ఈ దర్యాప్తు జరగనుంది. లెఫ్టినెంట్ గవర్నర్ నిర్ణయాన్ని ఆప్ ఖండించింది. కేవలం ఒక ఆర్థిక నేరగాడు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగానే నిర్ణయం తీసుకోవడాన్ని తప్పు పట్టింది. ఇది చట్టాన్ని అపహాస్యం చేయడమేనని వ్యాఖ్యానించింది.

అత్యాశకు పోతే.. ఉన్నది పోయింది!

» అమెరికాలో ఐదుగురు గుజరాతీ సోదరుల వ్యాపార వివాదం

» హస్తగతం చేసుకొని మిగిలిన వారిని వెళ్లగొట్టిన హరీశ్ జోగానీ

» తప్పుబట్టిన కోర్టు.. సోదరులకు రూ.20 వేల కోట్లు చెల్లించాలని తీర్పు

వాషింగ్టన్, మార్చి 2: ఐదుగురు అన్నదమ్ములు.. వేల కోట్ల వజ్రాల వ్యాపారం దానికి తోడు రియల్ ఎస్టేట్ కంపెనీ.. అందరూ కలిసికట్టుగా నిర్మించుకున్న వ్యాపార సామ్రాజ్యాన్ని ఒక్కడే సొంతం చేసుకోవాలని భావించాడు.. మిగిలిన వారు కోర్టుకెక్కారు.. 21 ఏళ్ల సుదీర్ఘ విచారణ అనంతరం కోర్టు.. అన్నదమ్ములకు వాటాలు పంచి ఇచ్చింది.. సోదరులను మోసగించినందుకు రూ.20 వేల కోట్ల పరిహారం వారికి చెల్లించాలని 'ఆ ఒక్కడికి' షాక్ ఇచ్చే తీర్పునిచ్చింది. గుజరాత్‌కు చెందిన శశికాంత్ జోగానీ 22 ఏళ్ల వయసులో 1969లో అమెరికాలోని కాలిఫోర్నియాకు వచ్చి వజ్రాల వ్యాపారం ప్రారంభించాడు. తర్వాత కాలంలో తన నలుగురు సోదరులు హరీశ్, రాజేష్, శైలేష్, చేతన్‌లను గుజరాత్ నుంచి తీసుకొచ్చి వ్యాపారంలో భాగస్వామ్యం ఇచ్చాడు. వ్యాపారం అమెరికాతోపాటు యూరప్, ఆఫ్రికా, మధ్యప్రాచ్యానికి విస్తరించింది. అయితే తర్వాత, సోదరుల మధ్య ఆస్తి వివాదాలు పెరిగాయి. వ్యాపారం మొత్తాన్ని హరీశ్ జోగానీ హస్తగతం చేసుకున్నాడు. శశికాంత్‌తోపాటు మిగిలిన ముగ్గురినీ కంపెనీ నుంచి తొలగించాడు. దీనిపై 2003లో న్యాయపోరాటం మొదలైంది. 21 ఏళ్లలో ఈ కేసు అనేక మలుపులు తిరిగింది. అప్పీళ్ల మీద అప్పీళ్లు దాఖలయ్యాయి. మొత్తమ్మీద లాస్‌ఏంజెల్స్ సుపీరియర్ కోర్టు దీనిపై తాజాగా తీర్పునిస్తూ.. అన్నదమ్ముల మధ్య వ్యాపార భాగస్వామ్యం నిజమని నిర్ధారిస్తూ.. ఒప్పందాన్ని ఉల్లంఘించినందుకుగాను నలుగురు సోదరులకు హరీశ్ జోగానీ 250 కోట్ల డాలర్ల (దాదాపు రూ.20 వేల కోట్ల) నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది. రియల్ ఎస్టేట్ కంపెనీలో సగం వాటా శశికాంత్‌దేనని, మిగిలిన సగంలో హరీశ్‌కు 24%, రాజేష్‌కు 10%, శైలేష్‌కు 9.5%, చేతన్‌కు 6.5% వాటా ఉంటుందని తీర్పు చెప్పింది.

ఓపీఎస్‌ల క్రమబద్ధీకరణ ఎప్పటికో?

- రెగ్యులరైజేషన్‌కు అడ్డంకిగా గత ప్రభుత్వ సర్క్యులర్
- పనికి తగ్గ వేతనం లేదు.. ఐదారు నెలలుగా పెండింగ్

జనగామ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు (ఓపీఎస్‌లు) రెగ్యులరైజేషన్ కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. 2018 అక్టోబరులో అప్పటి ప్రభుత్వం 9,355 పంచాయతీ కార్యదర్శుల పోస్టులకు పరీక్ష నిర్వహించి ఎంపిక చేసింది. ఇందులో సుమారు 3 వేల మందికి ఇతర ఉద్యోగాలు రావడంతో ఆ ఖాళీల్లో తర్వాత స్థానాల్లో ఉన్న అభ్యర్థులను ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన నియమించారు. 2019లో 2 వేల మందిని ఓపీఎస్ నుంచి జేపీఎస్‌లుగా క్రమబద్ధీకరించిన ప్రభుత్వం మరో 1,094 మందిని విస్మరించింది. దీంతో తమకు సరైన వేతనం రావడం లేదని, సర్వీసు కూడా కోల్పోతున్నామని ఓపీఎస్‌లు ఆవేదన చెందుతున్నారు. తమ సర్వీసు క్రమబద్ధీకరణకు గత ప్రభుత్వం 2019లో ఇచ్చిన సర్క్యులర్ అడ్డంకిగా మారిందని వారు చెబుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి స్పందించి ఆ సర్క్యులర్‌ను రద్దు చేయాలని కోరుతున్నారు.

అరకొర వేతనాలు.. పైగా పెండింగ్

ఓపీఎస్‌లకు అరకొర వేతనాలే దిక్కయ్యాయి. రూ.18,231 వేతనంగా నిర్ధారించగా ఇందులో ఏజెన్సీ కమీషన్, ఈపీఎఫ్, ఈఎస్ఐ, జీఎస్టీ, సర్వీస్ చార్జీలు పోను నెలకు రూ.10,600 నుంచి రూ.15,000 వరకు మాత్రమే వస్తున్నాయని వారు చెబుతున్నారు. ఒక్కో జిల్లాకు ఒక్కో ఏజెన్సీ ఉండగా జిల్లాకో తీరుగా వేతనాలు వస్తున్నాయని అంటున్నారు. కొన్ని జిల్లాల్లో ఐదు నుంచి ఏడు నెలలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. తమతో పాటు రిక్రూట్ అయి రెగ్యులర్ అయిన పంచాయతీ కార్యదర్శులకు రూ.28 వేల వేతనం వస్తోందని వారు చెబుతున్నారు. కొత్త ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నామని, ఇటీవలే పంచాయతీరాజ్ మంత్రి సీతక్కను కలిసి విన్నవించగా సానుకూలంగా స్పందించారని తెలిపారు.

అప్పులు తీర్చలేక రైతు ఆత్మహత్య

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 2: మిర్చి సాగు నష్టాలు మిగల్చడంతో పాటు అప్పులు తీర్చే మార్గం కనిపించక ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలంలో శనివారం జరిగింది. సేవ్యతండాకు చెందిన అంగోత్ అమ్రు (54) తనకున్న రెండెకరాల పొలంలో ఈ ఏడాది మిర్చి సాగు చేశాడు. పెట్టుబడి కోసం రూ.2 లక్షల వరకు అప్పులు చేశాడు. అయితే తెగుళ్ల బెడదతో దిగుబడి సరిగా రాలేదు. మరోవైపు కుమారుడు సురేష్ అనారోగ్యం బారిన పడడంతో చికిత్స కోసం మరో రూ.3 లక్షల వరకు అప్పులు చేశాడు. ఈ తరుణంలో అప్పులు తీర్చే మార్గం లేక జీవితంపై విరక్తితో శనివారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

మాజీ మంత్రి మల్లారెడ్డికి షాక్

- గుండ్లపోచంపల్లిలోని హెచ్ఎండీఏ లేఔట్‌లో అక్రమంగా వేసిన రహదారి తొలగింపు
- 1045 గజాల ఆక్రమణ, అనంతరం తన కళాశాల వరకు రోడ్డు నిర్మాణం
- నాలుగేళ్ల క్రితం అప్పటి ఎంపీ రేవంత్ రెడ్డి ఫిర్యాదు
- అయినా స్పందించని మున్సిపల్ అధికారులు
- ఇటీవల లేఔట్ సొసైటీ సభ్యుల ఫిర్యాదుతో చర్యలు


పార్కు స్థలంలో వేసిన రోడ్డును తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

మేడ్చల్, మార్చి2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డికి గుండ్లపోచంపల్లి మున్సిపల్ అధికారులు షాక్ ఇచ్చారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ పరిధిలోని హెచ్ఎండీఏ లేఔట్ పార్కు స్థలం నుంచి మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల వరకు గతంలో అక్రమంగా నిర్మించిన సీసీ రోడ్డును శనివారం తొలగించారు. సీఎం రేవంత్ రెడ్డి ఎంపీగా ఉన్నప్పుడు ఈ రహదారిపై ఫిర్యాదు చేశారు. కానీ అప్పట్లో అధికారులు స్పందించలేదు. అయితే, సంబంధిత సొసైటీ సభ్యులు ఇటీవల సీఎంవోను ఆశ్రయించారు. దీంతో స్పందించిన అధికారులు విచారణ చేపట్టి రహదారి, రహదారి పరిసరాల్లో నిర్మించిన కట్టడాలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు.

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ సర్వే నెంబర్ 523, 524లో కమలానగర్ పేరిట హెచ్ఎండీఏ లేఔట్ ఏర్పాటు చేశారు. అందులోని దాదాపు మూడు వేల చదరపు గజాల స్థలాన్ని పార్కుకు కేటాయించారు. ఈ స్థలం మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలకు ఆనుకొని ఉంటుంది. దీంతో అప్పట్లో మంత్రిగా ఉన్న మల్లారెడ్డి.. లేఔట్ సొసైటీ సభ్యులను సంప్రదించి 60 అడుగుల రోడ్డు నిర్మాణం కోసం పార్కు స్థలం ఇవ్వాలని అడిగారు. బదులుగా పక్కన ఉన్న సర్వే నెంబర్ 522లోని తన స్థలాన్ని ఇస్తానని ప్రతిపాదించారు. పార్కు మధ్యలో రహదారి నిర్మాణం చేపడితే ఇరువైపులా ఉన్న స్థలం వృథాగా మారి కాలనీకి పార్కు ఉండదనే భావనతో సొసైటీ సభ్యులు ఆ ప్రతిపాదనను తిరస్కరించారు. కానీ, ఇవేవి పట్టించుకోని మల్లారెడ్డి.. ఓ రోజు రాత్రికి రాత్రే తన సొంత ఖర్చులతో పార్కు మధ్య నుంచి 60 అడుగుల వెడల్పు, 90 అడుగుల పొడవున రహదారి నిర్మించారు. అంతేకాక, రోడ్డు కోసం తీసుకున్న 1045 చదరపు గజాలకు బదులుగా సర్వే నెంబర్ 522లోని 1210 చదరపు గజాల స్థలాన్ని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి రిజిస్ట్రేషన్ చేశారు. కానీ, రహదారి నిర్మాణంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ సొసైటీ వాసులు చేసిన ఫిర్యాదులను అప్పట్లో అధికారులు పట్టించుకోలేదు. అప్పట్లో ఎంపీగా ఉన్న రేవంత్‌రెడ్డి దృష్టికి ఈ విషయం రాగా ఆయన ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా నాలుగేళ్లుగా తొక్కిపెట్టారు. సొసైటీ సభ్యులు ఇటీవల సీఎంవోను ఆశ్రయించగా విచారణ చేపట్టిన కలెక్టర్ చర్యలకు ఆదేశించారు. పార్కు స్థలానికి బదులు మల్లారెడ్డి విద్యాసంస్థలు ఇచ్చిన స్థలంతో లేఔట్‌ను రీ మాడిఫికేషన్ చేయాలంటూ గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ చేసిన ప్రతిపాదనను హెచ్ఎండీఏ తిరస్కరించింది. దీంతో మల్లారెడ్డి విద్యాసంస్థలు మున్సిపాలిటీకి చేసిన రిజిస్ట్రేషన్ వృథాగా మారింది.

ఇది ప్రభుత్వ కక్ష సాధింపు: మల్లారెడ్డి

ప్రభుత్వం తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆరోపించారు. అధికారం చేతిలో ఉందని ఏమైనా చేస్తారా ? అని ప్రశ్నించారు. హెచ్ఎండీఏ అనుమతితోనే తాను రోడ్డు వేసినట్లు స్పష్టం చేశారు. అందుకు ప్రత్యామ్నాయంగా మున్సిపాలిటీకి స్థలం ఇచ్చామన్నారు. రోడ్డు తొలగించడంతో దాదాపు 25 వేల మంది విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బందులకు గురవుతారని చెప్పారు.

దారి మళ్లిన రూ.1200 కోట్లు

- ఏప్రిల్ 2019 నుంచి అక్టోబరు 2022 మధ్య మునిసిపాలిటీలకు రావాల్సిన ట్రాన్స్‌ఫర్ డ్యూటీ ఇది
- ఇతర అవసరాలకు మళ్లించిన గత ప్రభుత్వం

హైదరాబాద్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్లు, మునిసిపాలిటీల ప్రధాన ఆదాయ వనరుల్లో రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే స్టాంప్ డ్యూటీ కూడా ఒకటి. రిజిస్ట్రేషన్ శాఖ 7.5 శాతం స్టాంప్ డ్యూటీ వసూలు చేస్తే అందులో మునిసిపాలిటీలకు 1.5 శాతం చెల్లించాలి. ఇలా 2019 ఏప్రిల్ నుంచి 2022 అక్టోబరు వరకు ట్రాన్స్‌ఫర్ డ్యూటీ కింద మునిసిపాలిటీలకు అందాల్సిన రూ.1200 కోట్లను గత ప్రభుత్వం ఇతర అవసరాలకు దారి మళ్లించింది. వాస్తవానికి ఈ మొత్తం నేరుగా ఆయా మున్సిపాలిటీల ఖాతాల్లో జమ కావాలి. దాన్ని మౌలిక వసతుల కల్పనకు వినియోగించాలి. కానీ దారి మళ్లడంతో మునిసిపాలిటీల్లో చిన్న చిన్న పనులు చేసేందుకు కూడా వెనుకాడే పరిస్థితి నెలకొంది. చాలా మునిసిపాలిటీలలో ఆక్రమణకు గురవుతున్న స్థలాలకు కనీసం కంచెలు కూడా వేసుకోలేని దుస్థితి ఉంది. రాష్ట్రంలో సుమారు 2,471 స్థలాలు ఉంటే వాటిలో 1,336 స్థలాలకు రక్షణ చర్యలు లేవని పురపాలక శాఖ నివేదికల్లో పేర్కొన్నారు. 2025 నాటికి పట్టణ జనాభా 50 శాతం అవుతుందని గొప్పగా చెప్పిన గత ప్రభుత్వం మునిసిపాలిటీల ఆదాయ వనరులను దారి మళ్లించి కోలుకోలేని దెబ్బతీసిందనే విమర్శలు ఉన్నాయి. అనేక మునిసిపాలిటీల్లో మౌలిక వసతుల కల్పన కాగితాలకే పరిమితమైంది.

ట్రాన్స్‌కోకు టారిఫ్ సబ్సిడీ విడుదల

- రూ. 953.32 కోట్లకు ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ వర్గాల ప్రజలకు ఉచితంగా, రాయితీతో విద్యుత్‌ను అందిస్తున్న ట్రాన్స్‌కోకు రూ. 953.32 కోట్ల టారిఫ్ సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణలో సుమారు 28 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచితంగా ట్రాన్స్‌కో విద్యుత్ సరఫరా చేస్తోంది. అదేవిధంగా నీటిపారుదల ప్రాజెక్టుల్లోని వివిధ ఎత్తిపోతల పథకాలు, మిషన్ భగీరథ, వాటర్‌బోర్డు పంపులకు కరెంట్ సరఫరాతో పాటు 100 యూనిట్లలోపు గృహ వినియోగదారులకు రాయితీతో విద్యుత్ అందుతోంది. దీంతో ఈ వర్గాల కోసం టారిఫ్ సబ్సిడీని విడుదల చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.



మనుగడ పోరాటంలో లద్దాక్

ఆర్టికల్ 370 అనగానే అందరికీ సాధారణంగా గుర్తొచ్చేది కాశ్మీర్. కాశ్మీర్ చరిత్ర తెలిసి, ప్రజల హక్కులు, జాతుల స్వయం నిర్ణయాధికారం వంటి వాటిని ఎత్తిపట్టేవాళ్లు తప్ప కాశ్మీరేతర భారతీయులలో ఎక్కువ మంది కాశ్మీర్‌కు మాత్రమే ప్రత్యేక ప్రతిపత్తి రాజ్యాంగంలో ఉందనీ, కాబట్టి దానిని రద్దు చేయడం సరియైనదే అనే అభిప్రాయంతోనే ఉన్నారు. రాజ్యాంగంలోని 5, 6 షెడ్యూళ్ల కింద ఆదివాసీ ప్రాంతాలకు, వివిధ అధికరణాల కింద (ఆర్టికల్ 371A నుండి 371H వరకు) ఈశాన్య భారత రాష్ట్రాలకు ప్రత్యేక ప్రతిపత్తి, అధికారాలు ఉన్నాయని చాలా మందికి తెలియదు. 370 అధికరణాన్ని రద్దు చేయడంతో ఈశాన్య రాష్ట్రాలలో కూడా తమ ప్రత్యేక హక్కుల గురించి ఒక అభద్రతా భావం నెలకొన్నది. కాశ్మీర్ ముస్లిం మెజారిటీ ఉన్న రాష్ట్రం కాబట్టి ఆర్టికల్ 370ని రద్దు చేయడం తమ లక్ష్యాల్లో ఒకటని ప్రకటించిన భాజపా 2019 ఆగస్ట్ 5న ఆ అధికరణాన్ని రద్దు చేయడంతో పాటు, దేశంలో మునుపెన్నడూ లేని విధంగా ఒక రాష్ట్రాన్ని దాని హోదా నుండి తగ్గించి రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించింది. జమ్ము–కాశ్మీర్ ఒక కేంద్రపాలిత ప్రాంతం కాగా, కాశ్మీర్ ప్రాంతంలోని కార్గిల్ తదితర ప్రాంతాలను లద్దాక్‌తో కలిపి దీనిని మరో కేంద్రపాలిత ప్రాంతంగా కేంద్ర ప్రభుత్వం విభజించింది.

అప్పటి నుండి కేంద్ర ప్రభుత్వ పాలననే అక్కడ కొనసాగుతున్నది. లద్దాక్ ప్రాంతం ప్రధానంగా (97 శాతం) బౌద్ధ మతాన్ని ఆచరించే బాల్టి, బేడ, బోట్ లేదా బోటో, బ్రోక్పా, ద్రోక్పా లేదా దర్ద్ లేదా షిన్, గార్రా, మోన్, పూరిగ్పా ఆదివాసీ తెగలు ఉన్న ప్రాంతం. ఇక్కడ లేహ్ ప్రాంతంలో తెగల జనాభా 66.8 శాతం కాగా, జంస్కర్ ప్రాంతంలో 99 శాతం దాకా వివిధ తెగలు నివసిస్తాయి. తెగల జీవనం ప్రధానంగా ఉన్న ఇటువంటి ప్రాంతంలో ఆర్టికల్ 370 రద్దుతో వాళ్లకు సంప్రదాయకంగా భూమిపై వస్తూ ఉన్న హక్కులకు హామీ లేకుండా పోయింది. డెబ్బై ఏళ్లుగా వాళ్లకు లేని అభద్రత పెరగసాగింది.

2019 సెప్టెంబర్‌లో ఢిల్లీలో షెడ్యూల్డ్ తెగల జాతీయ కమిషన్ 119వ సమావేశం జరిగింది. అది లద్దాక్ కేంద్రపాలిత ప్రాంతాన్ని భారత రాజ్యాంగంలోని 5వ లేదా 6వ షెడ్యూల్‌లో చేర్చడాన్ని చర్చించింది. దీనితో అక్కడి ప్రజల ఆశలు చిగురించాయి. లద్దాక్ ప్రధానంగా తెగలతో కూడుకొని ఉన్న ప్రాంతమనీ, కేంద్రపాలిత ప్రదేశం కాక ముందు అక్కడి తెగల సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటానికి వారికి కొన్ని వ్యవసాయక హక్కులు, భూ యాజమాన్య హక్కులు ఉన్నాయని గుర్తించింది. అందువల్ల అధికార వికేంద్రీకరణకు, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటానికి, భూ సంబంధిత హక్కులను పరిరక్షించడానికి, ప్రాంతీయ అభివృద్ధిని వేగిరపరచడానికి లద్దాక్‌ను రాజ్యాంగంలోని 6వ షెడ్యూల్‌లో చేర్చాలనే సిఫారసును కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు, కేంద్ర షెడ్యూల్డ్ తెగల వ్యవహారాల శాఖకు పంపించింది. కానీ ఆ తరువాత ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం నుండి ఎటువంటి ప్రయత్నం జరగలేదు.

> **మన దేశంలో ఇప్పుడు గ్రీన్ ఎనర్జీ రంగంలో అతి పెద్ద మదుపుదారులు అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్, అంబానీ రిలయన్స్ ఇండస్ట్రీస్. స్థానిక ప్రజల ప్రమేయం లేకుండా ఈ కంపెనీలకు విచ్చలవిడిగా భూమిని కేటాయించాలంటే 6వ షెడ్యూల్ అడ్డం వస్తుంది. అందుకే కేంద్ర ప్రభుత్వం లద్దాక్‌కు అటువంటి రాజ్యాంగపరమైన రక్షణ కల్పించడానికి సిద్ధం కావడం లేదు.**

తమ హక్కుల పరిరక్షణ కోసం మాజీ పార్లమెంట్ సభ్యుడైన థుప్ స్తాన్ చేవాంగ్ నాయకత్వంలో 2020లో లేహ్ శిఖరాగ్ర సంస్థ (లేహ్ అపెక్స్ బాడీ–లాబ్) ఏర్పడింది. అప్పటి నుండి ఈ సంస్థ లద్దాక్‌ను 6వ షెడ్యూల్ కింద చేర్చాలని డిమాండ్ చేస్తూనే ఉంది. కార్గిల్ ప్రాంతంలో వివిధ రాజకీయ పార్టీలు కలిసి 2020లో కార్గిల్ అభివృద్ధి సంస్థ (కేడీఏ)ను ఏర్పాటు చేసుకున్నాయి. ఈ సంస్థ ఆర్టికల్ 370 రద్దు రాజ్యాంగ వ్యతిరేక చర్య అనీ, కార్గిల్‌ను జమ్ము–కాశ్మీర్‌తో తిరిగి కలపాలనీ డిమాండ్ చేస్తున్నది.

గత రెండు సంవత్సరాలలో కేడీఏ, లాబ్ కలిసి ఉమ్మడిగా ప్రధానంగా నాలుగు డిమాండ్లను చేస్తున్నాయి. లద్దాక్ ప్రాంతానికి రాష్ట్ర హోదా కల్పించడం, దానిని రాజ్యాంగంలోని 6వ షెడ్యూల్‌లో చేర్చడం, స్థానికులకే ఉద్యోగాలను రిజర్వ్ చేస్తూ ఒక పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ఏర్పరచడం, కార్గిల్, లేహ్ ప్రాంతాలకు ఒక్కో పార్లమెంట్ సీటును కేటాయించడం ఆ డిమాండ్లు.

ఈ లోగా కేంద్రప్రభుత్వం హిందీని, సంస్కృతాన్ని, ఏకరూప సంస్కృతిని బలవంతంగా దేశమంతా రుద్దే తన విధానానికి అనుగుణంగా చేపట్టిన కొన్ని చర్యలతో తమ అస్తిత్వం ప్రమాదంలో పడుతున్నదని భావించిన లద్దాక్ ప్రజలు లాబ్, కేడీఏల సంయుక్త నాయకత్వంలో ఫిబ్రవరి 3న లేహ్‌లోని పోలో మైదానంలో 30 వేల మందితో పెద్ద నిరసన సభ జరిపారు. దీనికి నాయకత్వం వహిస్తున్న వాళ్లలో 2018లో రామన్ మెగసెసే అవార్డు గ్రహీత ఐన సోనమ్ వాంగ్ చుక్ (ఈయన జీవితం మీద ఆధారపడినదే త్రీ ఇడియట్స్ సినిమా) కూడా ఉన్నాడు. ఆయన రెండు మూడుసార్లు ఈ డిమాండ్ల కోసం నిరాహార దీక్ష కూడా చేశాడు. మైనస్ 20 డిగ్రీల ఉష్ణోగ్రతతో గడ్డ కట్టించే చలి ఉన్నా లద్దాక్, కార్గిల్ ప్రాంతాలలోని మారుమూల పల్లెల నుండి కూడా ఈ నిరసన సభకు పెద్ద ఎత్తున హాజరయ్యారు. లద్దాక్ చరిత్రలోనే ఇది అతి పెద్ద సభ. అదే సమయంలో కార్గిల్ జిల్లాలో కూడా వేలాది మందితో సభలు జరిగాయి.

గ్రీన్ ఎనర్జీ (పర్యావరణహిత విద్యుచ్ఛక్తి) పేరుతో ఈ మధ్యే సౌర, పవన విద్యుత్తు కోసం 20,000 కోట్ల రూపాయల ప్రాజెక్టును ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం అందుకోసం లద్దాక్‌లో 20వేల ఎకరాలు కేటాయించింది. 2050 వరకు 43.7 లక్షల కోట్ల రూపాయల సౌర, పవన విద్యుచ్ఛక్తి ప్రాజెక్టులు పెరిగే అవకాశం ఉంది అని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ అంచనా వేసింది. లద్దాక్‌లో సౌర రేడియేషన్ చాలా ఎక్కువ కాబట్టి, ఇందులో గణనీయమైన ప్రాజెక్టులు లద్దాక్‌లోనే నెలకొనే అవకాశం ఉంది. మన దేశంలో ఇప్పుడు గ్రీన్ ఎనర్జీ రంగంలో అతి పెద్ద మదుపుదారులు అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్, అంబానీ రిలయన్స్ ఇండస్ట్రీస్. స్థానిక ప్రజల ప్రమేయం లేకుండా ఈ కంపెనీలకు విచ్చలవిడిగా భూమిని కేటాయించాలంటే 6వ షెడ్యూల్ అడ్డం వస్తుంది. అందుకే కేంద్ర ప్రభుత్వం లద్దాక్‌కు అటువంటి రాజ్యాంగపరమైన రక్షణ కల్పించడానికి సిద్ధం కావడం లేదు.

అయితే లద్దాక్‌లో, కార్గిల్‌లో ప్రజల నిరసనలు రోజురోజుకీ పెరుగుతుండడం వల్ల, పార్లమెంటరీ ఎన్నికలు కూడా దగ్గర పడుతుండడం వల్ల కేంద్ర ప్రభుత్వం లాబ్, కేడీఏలతో చర్చలు జరుపుతోంది. ప్రజల నిరసనకు తల ఒగ్గి అక్కడి ప్రజల అత్యంత ప్రజాస్వామిక డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం ఒప్పుకుంటుందా, లద్దాక్ ప్రజల పోరాటం సుదీర్ఘంగా కొనసాగవలసి ఉంటుందా చూడవలసే ఉంది. లద్దాక్‌కు 6వ షెడ్యూల్‌లో చోటు కల్పించినా దానిని నిజాయితీగా గౌరవించి అమలు చేయడం కూడా అంతే ముఖ్యం. ఛత్తీస్‌గఢ్, ఒడిస్సా, ఝార్ఖండ్ తదితర రాష్ట్రాలలో లాగా విచ్చలవిడి ఉల్లంఘనలు జరగకుండా చూడటం కూడా అవసరం. చైనాతో ఉద్రిక్త పరిస్థితులు ఉన్న నేపథ్యంలో లద్దాక్ ప్రజలు ఎల్లప్పుడూ భారతదేశ పక్షానే నిలిచారు. వారిలో భారత ప్రభుత్వం పట్ల అపనమ్మకం ఏర్పడితే అది ఎంత ప్రమాదకరం?

■ ఎన్. రవి

‘అదిగో ద్వారక, ఆలమందలవిగో...!’

ఇటీవల గుజరాత్‌లోని ద్వారక పట్టణంలో కొత్తగా నిర్మాణమైన వివిధ మౌలిక సదుపాయాలను ప్రారంభించడానికి వెళ్లిన సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అక్కడి పంచకుయ్ బీచ్ తీరంలో స్కూబా డైవింగ్ చేశారు. సాగర గర్భంలో ఉన్న శ్రీకృష్ణుడి కర్మభూమి (ల్యాండ్ ఆఫ్ యాక్షన్) అయిన పురాతన ద్వారకను సందర్శించి ప్రార్థనలు చేశారు. ‘సముద్రంలో మునిగి ఉన్న ద్వారకా నగరంలో ప్రార్థన చేయడం దివ్యానుభూతిని కలిగించింది. మహోన్నత ఆధ్యాత్మిక వైభవం, భక్తితో కూడిన పురాతనయుగానికి అనుసంధానితమయ్యాను. భగవాన్ శ్రీకృష్ణుడు మనందరినీ ఆశీర్వదిస్తాడు’ అని సోషల్ మీడియా పోస్ట్‌లో ఆయన పేర్కొన్నారు. అదేరోజు ద్వారక పట్టణంలో బహిరంగసభలో మాట్లాడుతూ ‘నేను సముద్రంలోకి వెళ్లి పురాతన ద్వారకను చూశాను. సముద్రంలో మునిగిపోయిన ద్వారక గురించి పురావస్తు శాస్త్రవేత్తలు చాలా రాశారు. మన గ్రంథాలలో కూడా ద్వారక గురించి చాలా చెప్పబడింది. పురాతన ద్వారక ఒక గొప్ప నగరం. ప్రణాళిక, అభివృద్ధికి మంచి ఉదాహరణ. నేను అక్కడ శ్రీకృష్ణునికి నమస్కరించాను. నాతో నెమలి ఈకలు తీసుకువెళ్లి సమర్పించాను’ అని నరేంద్ర మోదీ అన్నారు.

ఇక నరేంద్రుని వ్యాఖ్యలు, అనుభవాలను అలా ఉంచి అసలు కథా నాయకుడు ‘నల్లనయ్య’ నగర చరిత్రను అన్వేషిద్దాం.

శ్రీకృష్ణుడు, మహాభారతంతో ముడివడివున్న ద్వారకకు హిందూ సంస్కృతిలో ఒక సమున్నత ప్రాధాన్యమున్నది. హిందూ ధర్మ ఏడు పవిత్ర ప్రదేశాలలో ఆ నగరం కూడా ఒకటి. మిగతావి: అయోధ్య, మథుర, హరిద్వార్, కాశీ, కంచి, ఉజ్జయిని. మేనమామ కంసుడిని సంహరించిన తరువాత కృష్ణుడు తన యాదవ తెగ ప్రజలతో సహా ద్వారకకు వెళ్లి, సముద్రం నుంచి 12 యోజనాల భూమిని పునఃసంపాదించుకుని తన రాజ్యాన్ని వ్యవస్థాపించాడని పురాణాలు చెబుతున్నాయి. విశాల ఉద్యానవనాలు, తటాకాలు, సరస్సులు, అందమైన సౌధాలతో ద్వారక వర్థిల్లుతున్నదని విష్ణు పురాణం పేర్కొంది. అయితే కృష్ణుడి మరణానంతరం అది సముద్రంలో మునిగిపోయింది. ఇప్పటి ద్వారక కచ్ సింధుశాఖ అరేబియా సముద్రంలో కలుస్తున్న చోట ఉన్నది. కృష్ణ యాత్రా స్థలాలలో అది కూడా ఒకటి. మిగతావి, బృందావన్, మథుర, గోవర్ధన్, కురుక్షేత్ర, పూరి. కృష్ణుడికి అంకితం చేస్తూ నిర్మించిన పురాతన ద్వారకాధీశ్ ఆలయం నేటి ద్వారకలో ఉన్నది. శ్రీకృష్ణుడి మునిమనవడు వజ్రనాభుడు 2500 సంవత్సరాల క్రితం నిర్మించినట్టుగా చెబుతున్న ఈ ఆలయం కాలం పొడుగునా పలుమార్లు పునర్నవీకరింపబడింది. ముఖ్యంగా 16వ, 19వ శతాబ్దాలలో జరిగిన మార్పులు ఆ ఆలయంపై చెరగని ముద్రలు వేశాయి అని గుజరాత్ పర్యాటక శాఖ వెబ్‌సైట్ పేర్కొంది.

> **మహాభారతంలో ప్రస్తావితమైన ద్వారకా నగర నెలవును కచ్చితంగా గుర్తించేందుకు 20వ శతాబ్ది ఆరంభం నుంచి చరిత్రకారులు, పండితులు ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రయత్నాలన్నీ తొలుత ప్రాచీన సాహిత్య గ్రంథాల ఆధారంగా జరిగాయి. ప్రస్తుతమున్న ద్వారకే శ్రీకృష్ణుడి ద్వారకా నగరమా? లేక సముద్ర గర్భంలో ఉన్న నగరమా? ద్వారక అన్వేషణ 1960వ దశకంలో కొత్త మలుపు తిరిగింది. ప్రాచీన గ్రంథాల ఆధారితంగా కాకుండా పురావస్తు పరిశోధనల ప్రాతిపదికన కృష్ణుడి ద్వారకను గుర్తించే ప్రయత్నాలు ఆరంభమయ్యాయి.**

మహాభారతంలో ప్రస్తావితమైన ద్వారకా నగర నెలవును కచ్చితంగా గుర్తించేందుకు 20వ శతాబ్ది ఆరంభం నుంచి చరిత్రకారులు, పండితులు ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రయత్నాలన్నీ ప్రాచీన సాహిత్య గ్రంథాల ఆధారంగా జరిగాయి. ప్రస్తుతమున్న ద్వారకే శ్రీకృష్ణుడి ద్వారకా, లేక సముద్ర గర్భంలో ఉన్నదే ఆయన ద్వారకా? లేదా చారిత్రక వాస్తవికతను ఎప్పటికీ ధ్రువీకరించ లేని ఒక పౌరాణిక నగరమేనా? బ్రిటిష్ సివిల్ సర్వెంట్, కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి, హిందూ ధర్మ అధ్యయనవేత్త ఎఫ్ఇ పర్గిటర్ 1904లో మార్కండేయ పురాణానికి చేసిన అనువాదంలో మహాభారతంలో ప్రస్తావితమైన ద్వారక నెలవు రైవత పర్వతాలపై ఉన్నదని ప్రప్రథమంగా పేర్కొన్నారు. ప్రస్తుత ద్వారకకు 200 కిలోమీటర్ల దూరంలో జునాగఢ్‌లో ఉన్న గిర్నార్ పర్వతాలే రైవత పర్వతాలని పండితుల అభిప్రాయం. ప్రస్తుత ద్వారక క్రీ.పూ. 1200 సంవత్సరానికి పూర్వపుది కాకపోవచ్చని అనంత్ సదాశివ్ అల్టేకర్ అనే పండితుడు భావించారు. అయితే ప్రాచీన గ్రంథాల్లో ప్రస్తావితమైన ద్వారక సముద్రంలో మునిగిపోయిందనే విషయాన్ని ఆయన అంగీకరించారు. ఎ.డి పుల్సాకర్ అనే మరో పండితుడు 1943లో ‘కృష్ణుడి చరిత్రాత్మకత’ అన్న తన వ్యాసంలో ప్రస్తుత ద్వారక మహాభారతంలో ప్రస్తావితమైన ద్వారకే అని విశ్వసించారు. 1960ల్లో పురావస్తు శాస్త్రవేత్త హెచ్‌డి సంఖాలియా సైతం ఇటువంటి అభిప్రాయాన్నే వ్యక్తం చేశారు. ద్వారక అన్వేషణ 1960వ దశకంలో కొత్త మలుపు తిరిగింది. ప్రాచీన గ్రంథాల ఆధారంగా కాకుండా పురావస్తు పరిశోధనల ప్రాతిపదికన కృష్ణుడి ద్వారకను గుర్తించే ప్రయత్నాలు ఆరంభమయ్యాయి. నిజానికి ఈ ప్రయత్నాలు 1930ల్లోనే హీరానంద్ శాస్త్రి అనే పురావస్తు శాస్త్రవేత్త ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ప్రస్తుత ద్వారక పరిసర ప్రాంతాల్లో పురావస్తు తవ్వకాలు జరిగాయి. అదే సమయంలో సముద్రంలో మునిగిపోయిన ద్వారకపైనా ఊహాగానాలు ఒక నిర్దిష్టతకు చేరుకున్నాయి. దీంతో సముద్రంలో ఆ నగర అవశేషాలను కనుగొనే ప్రయత్నాలూ ప్రారంభమయ్యాయి.

తొలి పురావస్తు తవ్వకాలు 1963లో ద్వారకాధీశ్ ఆలయం పరిసర ప్రాంతాలలో జరిగాయి. ఆ ప్రాంతాల్లో కిక్కిరిసిన జనావాసాలు ఉండడంతో ఆ తవ్వకాలు విస్తృతస్థాయిలో జరగలేదు. గత 2000 సంవత్సరాలుగానే ఆ ప్రాంతాల్లో జనావాసాలు వర్థిల్లుతున్నాయని ఆ తవ్వకాలు నిర్ధారించాయి. 1979లో ఎస్ఆర్ రావు నేతృత్వంలో ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ద్వారకాధీశ్ ఆలయ పరిసరాలలో మరోసారి తవ్వకాలు ఆరంభించింది. ఈ తవ్వకాలపై అధికారిక నివేదిక ప్రచురితం కాలేదు. అయితే ఆ నివేదిక ఆధారంగా ద్వారకాధీశ్ ఆలయ పరిసరాలలో క్రీస్తుపూర్వం రెండో సహస్రాబ్దానికి చెందిన మృణ్మయ పాత్రలు, మూడు ఆలయాలు బయటపడినట్టు ఎఎస్ఐ డైరెక్టర్ జనరల్ వెల్లడించారు. ఈ పరిశోధనలు సముద్ర గర్భిత పురాతన నగరంపై ఆసక్తిని మరింత పెంపొందించింది. ఫలితంగా గోవాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ’ (ఎన్ఐఓ)కు చెందిన మెరైన్ ఆర్కియాలజిస్టులు అరేబియా సముద్రంలో మునిగిపోయిన ప్రాచీన నగరాన్ని కనుగొనేందుకు ప్రయత్నాలు ఆరంభించారు. 1988 నుంచి ఈ పరిశోధకుల బృందంలో ఉన్న వారిలో డాక్టర్ శీల త్రిపాఠి ఒకరు. సముద్ర గర్భంలో తమకు లభ్యమైన వస్తువులను, ద్వారకకు 30 కిలోమీటర్ల పరిధిలో నిర్వహించిన పురావస్తు తవ్వకాలలో బయల్పడిన వస్తువులతో పోల్చిచూస్తే అవి హరప్పన్ నాగరికతా యుగం మలి దశకు (క్రీస్తుపూర్వం 1900 నుంచి 1300 సంవత్సరం వరకు) చెందినవిగా నిర్ధారణ అయిందని త్రిపాఠి తెలిపారు. విశేషమేమిటంటే హరప్పా నాగరికత మలి దశ మహాభారత కాలం నాటిదే అన్న వాస్తవాన్ని అనేకమంది విద్వాంసులు అంగీకరిస్తున్నారు. ప్రస్తుత ద్వారక పరిసర ప్రాంతాలలో లభ్యమైన వస్తువులు, సముద్రగర్భ నగర అవశేషాలలో లభ్యమైన వస్తువులు కార్బన్ డేటింగ్ మొదలైన వైజ్ఞానిక పరీక్షలలో ఒకే కాలానికి చెందినవని రుజువు కావడంతో సముద్రంలో మునిగిపోయిన నగరం కృష్ణుడి ద్వారకే అన్న వాదనకు, దాని చారిత్రిక వాస్తవికతకు బలం చేకూరింది. దీనిని మరింతగా దృఢపరిచేందుకు పరిశోధనలు కొనసాగుతున్నాయి. 1983–90 సంవత్సరాల మధ్య జరిగిన తవ్వకాల్లో ఒక కోట పునాదులు, స్తంభాలు నీటిపారుదల సదుపాయాలు మొదలైనవి బయల్పడ్డాయి.



ప్రస్తుతమున్న ద్వారకకుగానీ, సముద్రంలో మునిగిన ద్వారకకుగానీ కృష్ణుడి రాజ్యంతో ఎటువంటి సంబంధం లేదని అభిప్రాయపడిన చరిత్రకారులూ పలువురు ఉన్నారు. వీరిలో డిడి కోశాంబి ప్రముఖుడు. మహాభారతంలో ప్రస్తావితమైన ద్వారక ఆఫ్ఘానిస్తాన్‌లో ఉండవచ్చని కోశాంబి అభిప్రాయం. ఆ దేశంలో దారవాజ్ అనే ప్రదేశాన్ని ఆయన ఎత్తి చూపారు.

సంస్కృతంలో ద్వారక అంటే ద్వారం (గేట్) అని అర్థం. పశ్చిమాసియాతో భారత్ వ్యాపార వాణిజ్యాలకు ద్వారక ఒక ప్రముఖ కేంద్రంగా ఉండేది. గల్ఫ్ ప్రాంతాల సాగర వనరులను తమ వాణిజ్యానికి భారతీయ వ్యాపారులు బాగా ఉపయోగించుకునేవారు. సముద్రంలో మునిగిపోయిన ద్వారకలో లభ్యమైన వివిధ పురావస్తు సాక్ష్యాధారాల ప్రకారం ఆ ద్వారక ఒక నగర రాజ్యమని పురావస్తు శాస్త్రవేత్త ఎస్ఆర్ రావు తెలిపారు. ఈ నగర రాజ్యం క్రీస్తు పూర్వం 1500 సంవత్సరం నాటిదై ఉండవచ్చన్నది ఆయన అభిప్రాయం. భూమి మీద, సముద్రంలోను ద్వారకకు సంబంధించిన పురావస్తు తవ్వకాలలో బయల్పడిన వస్తువులు, కట్టడాలకు ప్రాచీన గ్రంథాలలో ప్రస్తావితమైన వాటితో సంబంధం ఉన్నదని తెలుపుతూ ఈ ఆవిష్కరణ కృష్ణుడి ద్వారకను ఒక కట్టుకథ నుంచి ఒక చారిత్రక వాస్తవంగా మార్చివేసిందని ఎస్ఆర్ రావు వ్యాఖ్యానించారు.

> **బ్రిటిష్ సివిల్ సర్వెంట్, హిందూ ధర్మ అధ్యయనవేత్త ఎఫ్ఇ పర్గిటర్ 1904లో మార్కండేయ పురాణానికి చేసిన అనువాదంలో మహాభారతంలో ప్రస్తావితమైన ద్వారక నెలవు రైవత పర్వతాలపై ఉన్నదని ప్రప్రథమంగా పేర్కొన్నారు. ప్రస్తుత ద్వారకకు 200 కిలోమీటర్ల దూరంలో జునాగఢ్‌లో ఉన్న గిర్నార్ పర్వతాలే రైవత పర్వతాలని పండితుల అభిప్రాయం. ప్రస్తుత ద్వారక క్రీస్తుపూర్వం 1200 సంవత్సరానికి ముందునాటిది కాకపోవచ్చని అనంత్ సదాశివ్ అల్టేకర్ భావించారు.**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్ఫూర్తితో సముద్రాంతర్గత ద్వారకా నగరాన్ని చూడాలన్న ఆసక్తి సామాన్య ప్రజలకు కూడా కలగడం సహజం. అరేబియా సముద్రం మింగివేసిన ద్వారకా నగరం ఎంత పెద్దది, మునిగిపోయిన ఆ నగరంలోని కట్టడాలు ఇంకా అలానే ఉన్నాయా? సముద్ర గర్భంలో మునిగిపోయిన ద్వారక నగరాన్ని పర్యాటకులు సందర్శించేందుకు వీలుగా గుజరాత్ ప్రభుత్వం ఒక సబ్‌మెరైన్ నిర్వహణకు శ్రీకారం చుట్టిన నేపథ్యంలో, అనేక మంది ప్రజల ఆకాంక్ష ఫలించే రోజు త్వరలోనే రానుంది.

• కార్తికేయ రావు



తెలంగాణ సినిమా అభివృద్ధి ఇలా...!

ఏయే రంగాలలో తెలంగాణ ప్రజలు వెనకబడి ఉన్నరో, ఆయా రంగాలను అభివృద్ధిపరుచుకోడానికే తెలంగాణ తెచ్చుకున్నది. రాష్ట్రం సిద్ధించిన తర్వాత సినిమా రంగం పూర్తిగా విస్మరించబడింది. సుమారు ఒక దశాబ్దపు బీఆర్ఎస్ పాలనలో ఈ రంగానికి ఒరిగిందేమీ లేదు. ఇప్పుడు ఏర్పడ్డ కొత్త ప్రభుత్వమైనా ఈ రంగంపై దృష్టి సారించాలి. తెలంగాణ సినిమా పరిశ్రమ అభివృద్ధి కోసం తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ, తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిఎఫ్‌డిసి)లకు సినిమా పాలసీ రూపకల్పనపై కొన్ని ముఖ్యమైన సూచనలు చేయదలుచుకున్నాను.

కళాకారులకు, సాంకేతిక నిపుణులకు 24 క్రాఫ్ట్‌లో శిక్షణ, సినిమా బిజినెస్‌లో రాణించడానికి ఫిలిం ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్ కోర్సులు ప్రవేశపెట్టాలి. వాటికి ఎంట్రెన్స్ టెస్ట్ పెట్టి విద్యార్థులను సెలెక్ట్ చేయాలి. కోర్సు పూర్తయ్యాక ప్రాజెక్టు వర్క్ చేసుకోవడానికి కావలసిన సదుపాయాలు ప్రభుత్వం సమకూర్చాలి.

సినిమా ప్రొడక్షన్‌పై ఆసక్తి చూపే వ్యాపారవేత్తలకు సినిమా నిర్మాణంపై అవగాహన కోసం అనుభవం ఉన్న నిర్మాతలచే వర్క్‌షాప్స్ నిర్వహించాలి. టిఎఫ్‌డిసి ఒక కమిటీ ఏర్పాటు చేసి, తెలంగాణ ప్రాంతంలో సంస్కృతి సంప్రదాయాలు, జీవన విధానాలు, చరిత్రను, కథాంశంగా పెట్టుకొని ఈ ప్రాంతానికి చెందిన కళాకారులు, సాంకేతిక నిపుణులు, నిర్మాతలు కలిసికట్టుగా నిర్మించబోయే ప్రాజెక్టు రిపోర్ట్‌తో పాటు కథ విని, సెలెక్ట్ చేసిన సినిమాకు రూ.25 లక్షల నుంచి 50 లక్షల వరకు సబ్సిడీ ఇవ్వాలి. పన్ను మినహాయింపు నివ్వాలి. లోకేషన్స్ ఫ్రీగా ఇవ్వాలి, లేదా ఎన్ఎఫ్‌డిసి లాగా టిఎఫ్‌డిసి కో ప్రొడక్షన్ చేయాలి. అప్పుడే తెలంగాణ కళాకారులకు, సాంకేతిక నిపుణులకు అవకాశాలు దొరుకుతాయి. సినిమాలు నిర్మించడానికి నిర్మాతలు ముందుకు వస్తారు. తెలంగాణ సంస్కృతి వెండితెరపై ఆవిష్కృతమవుతుంది. టిఎఫ్‌డిసి సినిమా నిర్మాణానికి కావలసిన కెమెరాలు, ఎడిటింగ్ సూట్లు, రికార్డింగ్ థియేటర్లు, తక్కువ ధరలకు సమకూర్చి ప్రోత్సహించాలి.

టిఎఫ్‌డిసి సెలెక్ట్ చేసిన సినిమాకు ప్రతి థియేటర్లో రెండు షోలు తప్పనిసరిగా కేటాయించాలి. టిఎఫ్‌డిసి డిజిటల్ స్క్రీనింగ్ ఫెసిలిటీ ప్రారంభిస్తే ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. సెలెక్టెడ్ సినిమాలకు టిఎఫ్‌డిసి నామినల్ రేట్లు కలెక్ట్ చేసినా, ఇతర కమర్షియల్ సినిమాల ద్వారా ఎక్కువ ఆదాయం వస్తుంది. ఏ సినిమాలకైతే టిఎఫ్‌డిసి కో ప్రొడక్షన్ చేస్తుందో, లాభాల్లో సముచిత వాటా కూడా దానికి దక్కుతుంది. ఇలా వచ్చిన ఆదాయంతో, తెలంగాణ సినిమా పరిశ్రమ స్థాపన, అభివృద్ధి సునాయాసమవుతుంది.

తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాదీ ఉర్దూ... అనగా దక్కని ఉర్దూలో కూడా సినిమాలు నిర్మాణమవుతున్నాయి. అలాంటి సినిమాలకు కూడా పైన తెలిపిన రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వాలి. అప్పుడు భోజ్‌పురి లాగా దక్కని ఫిలిం ఇండస్ట్రీ కూడా తెలంగాణలో అభివృద్ధి చెందుతుంది. దక్కని సినిమాలు దేశ విదేశాల్లో కూడా విడుదలవుతాయి. కొంతకాలం తర్వాత ఇప్పటికే ఉన్న తెలుగు సినిమా ఇండస్ట్రీకి దీటుగా తెలంగాణ దక్కని ఇండస్ట్రీలు కూడా అభివృద్ధి చెందుతాయి. టిఎఫ్‌డిసి– ఇలాంటి సినిమాలను ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్స్‌కి, నేషనల్ అవార్డ్స్‌కి పంపించాలి. ప్రతి సంవత్సరం రాష్ట్ర అవార్డులు ఇచ్చి ప్రోత్సహించాలి. ఇటువంటి సినిమాల టెలివిజన్ రైట్స్ టిఎఫ్‌డిసి కొనుగోలు చేసి ప్రభుత్వ టెలివిజన్‌లో ప్రసారం చేసి ఆదాయం పెంచుకోవాలి.

మునుపటి లాగా స్టూడియోలు, మినీ థియేటర్స్ కట్టుకోవడానికి స్థలాలతో పాటు రుణ సౌకర్యం కల్పించాలి. ఇప్పుడు హైదరాబాద్‌లో భూముల ధరలు బాగా పెరిగిపోయాయి గనుక, సినిమా రంగంలో స్థిరపడే కళాకారులకు, సాంకేతిక నిపుణులకు ఇళ్లు కట్టుకోవడానికి శివార్లలో స్థలాన్ని కేటాయించాలి. ప్రతి మండలానికి ఒక మినీ థియేటర్ ప్రభుత్వం స్వయంగా గాని, ఆసక్తి ఉన్నవారికి తక్కువ ధరకు భూమిని, రుణ సౌకర్యాన్ని కల్పించి గాని ప్రోత్సహించాలి. ఆర్టీసీ బస్టాండ్‌ల పైన కూడా కట్టవచ్చు. లేదా ఇప్పుడు పడావుగా ఉన్న రైతు వేదికలను, మినీ థియేటర్లుగా మారిస్తే బాగుంటుంది. ప్రేక్షకులకు తక్కువ ధరకే టికెట్ల రేట్లు పెడితే, ఎక్కువ మంది సినిమాలను థియేటర్లలోనే ఆస్వాదిస్తారు.

ఈ సూచనలను ప్రభుత్వం స్వీకరించి తెలంగాణ సినిమా పాలసీని రూపొందిస్తే, ఇక్కడి కళాకారులకు, సాంకేతిక నిపుణులకు ఉపాధి కల్పించగలుగుతారు. నిర్మాణం ఎంత పెరిగితే ప్రభుత్వానికి అంత ఆదాయం వస్తుంది. సమాంతర ప్రత్యామ్నాయ తెలంగాణ సినిమా పరిశ్రమ స్థాపితమై అభివృద్ధి చెందుతుంది. ఎన్నెన్నో త్యాగాలతో, బలిదానాలతో సాధించుకున్న తెలంగాణకు సార్థకత దక్కుతుంది.

○ సయ్యద్ రఫీ
చిత్ర దర్శకుడు

చరిత్రను ఇకనైనా చక్కదిద్దుకోవాలి!

> **అలెగ్జాండర్ దండయాత్రా కాలంలో భారతదేశంలో ఆంధ్రరాజులలో చివరివాడు చంద్రశ్రీరాజు. అతడు మైనరు. అతనికి రక్షకులు మంత్రి–సేనాపతులు చంద్రగుప్త సముద్రగుప్తులు. ఈ చంద్రగుప్తుడే మౌర్యచంద్రగుప్తుడని పాశ్చాత్యులు రాశారు. భారతీయ చరిత్రకారులు వారిని అనుసరించారు. చంద్రగుప్త మౌర్యునికి చంద్రశ్రీ చంద్రగుప్తునికి మధ్యలో 48 మంది పాలకులు ఉన్నారు. వీరిద్దరినీ ఒకరిగా చెప్పడం వలన ఆ 48 మంది పాలనాకాలం భారతదేశ చరిత్రలో అదృశ్యమయింది. ఇలా చరిత్రలో ఎన్నో అసంగత విషయాలు కనబడతాయి.**

మన విద్యాలయాలలో బోధిస్తున్న భారతదేశ చరిత్ర చదివితే ‘హిందువులు ఎప్పుడు ఎవరితో పోరాడి ఎలా పరాజితులయ్యారనే విషయం ప్రాధాన్యం వహిస్తుంది. మహారాష్ట్ర సామ్రాజ్యం నెలకొల్పిన శివాజీ మహారాజును ఔరంగజేబు ‘కొండ ఎలుక’ అన్నాడని రాస్తారు. కానీ ఛత్రపతి శివాజీ గురించి చదివితే ఒళ్లు పులకరిస్తుంది. ఆ విషయాలేవీ ఈ చరిత్ర పుస్తకాలలో కనబడవు. దక్షిణ భారత సామ్రాజ్యాన్ని ఏలిన శ్రీకృష్ణదేవరాయల పాలనలో పన్నులు అధికంగా ఉన్నాయని చరిత్ర పుస్తకాల్లో ఉంది. ఆ మహారాజు చరిత్ర, చేసిన భాషాసేవ, సంస్కృతి, పోషణ వేరే పుస్తకాల్లో చదవవలసిందే.

శకపురుషుడు విక్రమాదిత్యుడు. ఆయన చేసిన ఘనకార్యం కాళిదాస మహాకవి జ్యోతిర్విద్యాభరణమనే శాస్త్రగ్రంథంలో చెప్పాడు. విక్రమార్క మహారాజు సభలో శ్రీ శుకువు, సువాక్కు, వరరుచి, మణి అంగుదత్తుడు, విష్ణువు, త్రిలోచనుడు, ఘటకర్పరుడు, అమరసింహుడు, సత్యుడు, వరాహమిహిరుడు, శ్రుతసేనుడు, బాదరాయణుడు, మణిత్థుడు, కుమారసింహుడు, కాళిదాసు మొదలైన కవి పండితులున్నారు. వీరు వేరు వేరు శాస్త్రాలలో దిగ్గజాల వంటివారు. ఆ మహారాజును జైన కవులు ప్రశంసించిన శ్లోకాలు లభిస్తున్నాయి. పైన పేర్కొన్న వారిలో తొమ్మిది మందిని నవరత్నాలంటారు. ఆ చక్రవర్తికి 800 మంది సామంతులున్నారు. ఆయనకు 3 కోట్ల పదాతులు, 24,300 ఏనుగులు, పదివేల గుర్రాలు, పదివేల రథాలు సైన్యం ఉండేది. విక్రమార్కుడు 99,999 శకులను సంహరించి కలియుగంలో విక్రమశకం స్థాపించాడు. ఈ విక్రమార్కుడు ద్రవిడ దేశాన్ని, గాంధార దేశాన్ని, వంగ దేశాన్ని, గౌడ దేశాన్ని గుజరాత్‌ను, ధారా రాజ్యాన్ని, కాంభోజ దేశాన్ని కూడా జయించాడు. హిమాలయంపైన ఉండే జయింపశక్యం కాని దుర్గాలను జయించి ఆ రాజ్యాలను ఆ ప్రభువులకే ఇచ్చివేశాడు. ఆయన రాజధాని ఉజ్జయిని. రుక్మ దేశానికి అధిపతి అయిన శకేశ్వరుణ్ణి జయించి ఉజ్జయినికి తీసుకువచ్చి, ఊరేగించి వదిలిపెట్టాడు. (శకేశ్వరుడంటే హిమాలయాలకు ఆవల ఉన్న శకుల రాజు.) విక్రమార్కుని దేశం మాళవ దేశం. కలియుగాది నుంచి 3068వ సంవత్సరంలో ఈ గ్రంథం రాశానని కాళిదాస మహాకవి చెప్పాడు. ఇది ఈ విక్రమార్కుని కాలం. విదేశీయులను కూడా జయించడం వలన ఉత్తరాదిన ఇప్పటికీ విక్రమ సంవత్ అంటే విక్రమ శకం వాడుతున్నారు. ఈ విక్రమార్కుని గురించి భారతదేశ చరిత్రలో ఇతని పేరు చంద్రగుప్తుడని, ఇతనికి విక్రమాదిత్యుడనే బిరుదం ఉందని రాశారు. ఇతడు క్రీ.శ. 388–409 మధ్య శకులను ఓడించాడని రాశారు. కాలం సుమారు 400 సంవత్సరాలు మారిపోయింది.

శ్రీరామునిది ఇక్ష్వాకు వంశం. ఇక్ష్వాకువు నుండి శ్రీరాముని వరకు 65 తరాల పరిపాలకులున్నారు. వీరిలో అయోధ్యను నిర్మించిన ఇక్ష్వాకువు, మహాత్మాగాంధీ సత్యాగ్రహబుద్ధికి కారణమయిన సత్యహరిశ్చంద్రుడు, సముద్రానికి సాగరమనే పేరు రావడానికి కారణమయిన సగరపుత్రులు, గంగకు భాగీరథి అనే పేరు కలిగించిన భగీరథుడు ఉన్నారు. కాళిదాస మహాకవి ఈ వంశంలో కొందరి చరిత్రలు రఘువంశమనే పేరుతో రాశాడు.

“మొహంజోదారో నాగరికత వారు మత చిహ్నాల్ని వదల లేదు, వారి మతం తెలియదు’ అని రొమెల్లా థాపర్ రాశారు. నేనా నాగరికత అవశేషాలను పరిశీలించాను. దానిలో ఆమె చెప్పిన మూడు తలల పశుపతి దేవునికి మూడు తలలు, రెండు కొమ్ములు లేవు. అది వేదం, శివాష్టోత్తరం మొదలయినవి వర్ణించిన రుద్ర రూపం. రుద్రుని తలపై చంద్రుడు, గంగ, పాము, పక్కన ప్రణవ చిత్రం మొదలైనవి ఉన్నాయి. ఆ అవశేషాలలో స్వస్తికం, శివావతార చిత్రాలు కూడా ఉన్నాయి. వీటిపై వ్యాసాలు రాసి ప్రచురించాను.

ఇపుడు చరిత్ర పాఠాల్లో శ్రీమద్రామాయణం, మహాభారతం చేర్చే ప్రయత్నం జరుగుతోంది. 75 సంవత్సరాల వెనుక జరుగవలసిన పని ఇది. అభినందించదగినది. కాని శ్రీరామునికి, యుధిష్ఠిరునికి మధ్య ఉన్న రాజుల విషయం, యుధిష్ఠిరునికి చంద్రశ్రీ చంద్రగుప్తునికి మధ్య ఉన్న పరిపాలకుల విషయం కూడా చేరిస్తేనే దేశ చరిత్రకు సరియైన ఆకృతి వస్తుంది. ఋషభదేవుని కుమారుడు భరతుని పేర భారతవర్షమేర్పడింది. అంతకు ముందు దీనిని అజనాభమనేవారు. అంగ, వంగ, కళింగ, పౌండ్ర, ఆంధ్ర, ద్రవిడ దేశాలకు ఆ పేర్లు ఎలా వచ్చాయో తెలియాలి. చారిత్రక పురుషుడు శ్రీకాకుళాంధ్ర విష్ణువు. ఆయన చరిత్రకు త్రిలింగ అనే పదానికి సంబంధం ఉంది. త్రిలింగ పదం నుండి తెలుగు పదం వచ్చిందనడానికి చాలా ఆధారాలున్నాయి.



శ్రీరాముని తరువాత ఆ వంశం వారు 30 మంది ఉన్నారు. వారిలో చివరివాడు బృహద్బలుడు అర్జునుని కుమారుడైన అభిమన్యువు చేతిలో మరణించాడు. రామాయణానికి భారతానికి మధ్య ఉండే పరిపాలకుల చరిత్ర చేరితే ఈ రెంటికీ మధ్య ఉన్న అగాధం పూడుతుంది. ఇక్ష్వాకువు కుమారుడు నిమి. అతని కొడుకు మిథి. అతడే మిథిలా నగరం నిర్మించాడు. అది జనక మహారాజు రాజధాని. వీరి వంశంలో సుశ్రుతుడున్నాడు. ఇతడు గొప్ప వైద్యుడు కావచ్చు. చంద్రవంశంలో మొదటి రాజు పురూరవుడు. అతని చరిత్రను కాళిదాస మహాకవి విక్రమౌర్వశీయ నాటకంగా రాశాడు. పురూరవుని వంశంలో ఆనర్తుని పేరుతో ఆనర్త దేశం ఉండేది. ఇది రుక్మిణి తండ్రి భీష్మకుని దేశం. ఇతని కుమారుడు రేవతుడు. సముద్రతీరంలో కుశస్థలి అనే నగరం నిర్మించాడు. అది సముద్రంలో మునిగింది. తరువాత సముద్రం వెనక్కు వెళ్ళింది. ఆ నేల మీద శ్రీకృష్ణుడు ద్వారక నిర్మింపజేశాడు. శ్రీకృష్ణుని అవసాన కాలంలో ఈ నగరాన్ని సముద్రం మళ్లీ ముంచేసింది. ఎస్.ఆర్.రావు ద్వారక దగ్గర సముద్రంలో పరిశోధిస్తే ద్వారక అవశేషాలు లభించడమే కాక దాని కింద మరో నగరం కూడా ఉండేదని ఆధారాలు లభించాయి. చంద్రవంశంలో వాడు భరత చక్రవర్తి. కిరాతులను, హూణులను, యవనులను, కంకులను, ఖశులను, శకులను జయించాడు. ఇతని పేరుమీద భారతదేశమనే పేరు వచ్చిందని చెప్తారు. ఈ వంశంలో హస్తి అనే రాజు హస్తినానగరం నిర్మించాడు.

యుధిష్ఠిరుని నుంచి చంద్రగుప్తుని వరకు ఉండే పరిపాలకుల పేర్లు, వంశాల పేర్లు కూడా చరిత్రలో చేరాలి. యుధిష్ఠిరుని కాలం వాడు జరాసంధుడు. ఇతని తండ్రి బృహద్రథుడు. ఇతని నుండి 107 మంది పరిపాలకుల పేర్లు, 30 గణాల పాలకుల పేర్లు లభిస్తున్నాయి. వీరి పాలనా కాలాలు కూడా ఉన్నాయి. వీరిలో అజాతశత్రువు పేరు బుద్ధ జాతకాలలో కనబడుతుంది. బృహద్రథ వంశం, ప్రద్యోత వంశం, శిశునాభ వంశం, మౌర్య చంద్రగుప్త వంశం పాలించిన తరువాత పుష్యమిత్రుని కుమారుడు అగ్నిమిత్రుడు పాలించాడు. ఇతని చరిత్రను కాళిదాసు మాళవికాగ్నిమిత్రం నాటకంగా రచించాడు. ఈ కోణంలో చూస్తే కాళిదాసు చారిత్రక నాటకాలను, చారిత్రక కావ్యాన్ని రచించాడని అవగతమవుతుంది. అగ్నిమిత్రునిది శుంగవంశం. వీరి తరువాత ఆంధ్రరాజులు పాలించారు. వీరిలో శాతకర్ణి, హాలాహలుడు (హాలుడు–ఇతడు గాథాసప్తశతి సంకలనం చేసినవాడు.) శాతకర్ణి, శివస్కంధుడు, యజ్ఞశ్రీ, చంద్రశ్రీ పేర్లు చరిత్ర పుస్తకాల్లో కనబడతాయి. మాక్స్‌ముల్లర్ మొదలయిన పాశ్చాత్యుల చేతివాటం వల్ల వీరందరు కొన్ని వందల సంవత్సరాలు ముందరకు వచ్చేశారు. కాని అతి ప్రాచీనమయిన పరాశరుని విష్ణుపురాణం ప్రకారం వీరి తర్వాత చాలా మంది పాలకులుగా వచ్చారు. వారిలో ఆంధ్రభృత్యులు, యవనులు మొదలయినవారు చాలా మంది ఉన్నారు.

అలెగ్జాండర్ దండయాత్రా కాలంలో భారతదేశంలో ఆంధ్రరాజులలో చివరివాడు చంద్రశ్రీరాజు. అతడు మైనరు. అతనికి రక్షకులు మంత్రి సేనాపతులు చంద్రగుప్త సముద్రగుప్తులు. ఈ చంద్రగుప్తుడే మౌర్యచంద్రగుప్తుడని పాశ్చాత్యులు రాశారు. భారతీయ చరిత్రకారులు వారిని అనుసరించారు. చంద్రగుప్త మౌర్యునికి చంద్రశ్రీ చంద్రగుప్తునికి మధ్యలో 48 మంది పాలకులు ఉన్నారు. వీరిద్దరినీ ఒకరిగా చెప్పడం వలన ఆ 48 మంది పాలనా కాలం భారతదేశ చరిత్రలో అదృశ్యమయింది. ఈ తప్పును ట్రాయి పండితుడు మాక్స్‌ముల్లర్‌కు చెప్పాడు. కాని అతడు సవరించలేదు. తరువాత కుప్పయ్య అనే ఆంధ్ర పండితుడు తప్పును ఎత్తిచూపాడు. ఆ తరువాత కోట వెంకటాచలం ఈ పొరపాటును నిరూపించారు. అయినా భారతదేశ చరిత్రలో ఇప్పటివరకు దీనిని సరిచేయలేదు.

సాంచీ స్తూపం మీద లక్ష్మీదేవికి ఏనుగులు అభిషేకం చేస్తున్న సన్నివేశం ఉంది. ఈ సన్నివేశం ఋగ్వేదానికి చెందిన శ్రీసూక్తం ధ్యాన శ్లోకంలో ఉంది. దాన్ని డిడి కోశాంబి మాయాదేవి చిత్రం అని చెప్పారు. మాయాదేవికి ఏనుగులు కలలో కనబడ్డాయి తప్ప ఆమెకు ఏనుగులు స్నానం చేయించిన సన్నివేశం బుద్ధ చరిత్రలో కనబడదు. మాయాదేవికి ఏనుగులు కలలో కనబడిన దృశ్యంతో ఒక శిల్పం వేరే ఉంది.

ఇలా చరిత్రలో ఎన్నో అసంగత విషయాలు కనబడతాయి. చరిత్ర చదివితే దేశభక్తి కలగాలి తప్ప, చదివినవారు దేశాన్ని ముక్కలు చేస్తాం అనకూడదు. సత్యమయిన ఉదాత్తమైన దేశభక్తిని కలిగించే భారతదేశ చరిత్ర వెలువడాలని కోరుకుందాం.

◆ డాక్టర్ చిఱ్ఱావూరి శివరామకృష్ణశర్మ

ఓరుగల్లు పౌరుషాల గడ్డ

- నన్ను మొదటి నుంచి గుండెల్లో పెట్టుకున్నారు..
- భీమా సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హీరో గోపీచంద్

హనుమకొండ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఓరుగల్లు ప్రజలను తానెప్పుడూ మరిచిపోలేనని ప్రముఖ హీరో గోపీచంద్ అన్నారు. వర్షం సినిమా ఇక్కడ నిర్మాణమైనప్పుడు ఏర్పడిన పరిచయం.. ఇప్పుడు భీమా సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ ఫంక్షన్‌తో మరోసారి కలుసుకొనే అవకాశం కలిగిందని అన్నారు. ఆయన నటించిన భీమా సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ శనివారం హనుమకొండ కాకతీయ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో సందడిగా సాగింది. ఈ సందర్భంగా గోపీచంద్ మాట్లాడుతూ.. ఓరుగల్లు పౌరుషానికి గడ్డ అని ప్రశంసించారు. వరంగల్ ప్రజలు చాలా ఏళ్లుగా తనను గుండెల్లో పెట్టుకొని తన ప్రతీ సినిమాను ఆదరిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. నాడు భద్రన్నగా నేడు భీమాగా మీ ముందుకు వచ్చానని అన్నారు. ఎంతో కష్టపడి తీసిన భీమా చిత్రాన్ని విజయవంతం చేస్తారన్న విశ్వాసాన్ని ప్రకటించారు.



ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో అభివాదం చేస్తున్న హీరో గోపీచంద్

హీరోయిన్ మాళవికి శర్మ మాట్లాడుతూ.. చారిత్రాత్మకమైన వరంగల్ నగరానికి రావడం మరిచిపోలేని అనుభూతిని మిగిల్చిందన్నారు. దర్శకుడు హర్ష మాట్లాడుతూ.. చాలా ఏళ్ల తర్వాత పవర్ పోలీసు ఆఫీసర్‌గా గోపీచంద్ చేసిన నటన హైలెట్ అన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్య మాట్లాడుతూ.. గోపీచంద్ ఒక గొప్ప నటుడని, పలు చిత్రాల్లో ఆయన నటించిన పాత్రలు ప్రేక్షకుల గుండెల్లో చిరకాలం నిలిచి ఉంటాయన్నారు. చమ్మక్ చంద్ర, రచ్చ రవి తదితర నటులు మాట్లాడారు. ప్రముఖ యాంకర్ సుమ ఈవెంట్‌కు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. చిత్ర నిర్మాత రాధామోహన్, మ్యూజిక్ డైరెక్టర్ రవి బస్రూర్ చిత్ర బృందంలోని ఇతరులు కార్యక్రమానికి హాజరయ్యారు.

భద్రకాళి గుడిలో పూజలు

హీరో గోపీచంద్ తొలుత వరంగల్‌లోని చారిత్రకంగా సుప్రసిద్ధమైన భద్రకాళి దేవాలయాన్ని సందర్శించారు. ఆలయ అర్చకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో గోపీచంద్‌తో పాటు భీమా చిత్ర బృందం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు గోపీచంద్‌కు ఆశీర్వచనం చేశారు. తీర్థ ప్రసాదాలను అందచేశారు.

డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్



అందరూ ఇన్‌చార్జ్‌లే..

ఆరు జిల్లాలకు లేని పూర్తిస్థాయి డీఈవోలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో విద్యాశాఖ పరిస్థితి అత్యంత అధ్వాన్నంగా ఉంది. అస్తవ్యస్థ పరిస్థితి నెలకొన్నది. విద్యార్థులను విద్యావంతులుగా, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత కలిగిన విద్యాశాఖకే దిక్కులేని పరిస్థితి. చాలా ఏళ్లుగా రెగ్యులర్ అధికారులు లేక ఇన్‌చార్జిలతోనే కూనారిల్లుతున్న ఈ శాఖలో పరిపాలన కొరవడి, పర్యవేక్షణ కుంటుపడి పూర్తిగా గాడి తప్పింది. ఏం జరుగుతున్నదో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఏ ప్రభుత్వ శాఖలోనైనా కీలక పదవుల్లో ఒకరిద్దరు ఇన్‌చార్జిలు ఉంటారు. అదేమిటోగానీ.. విద్యాశాఖలో మాత్రం అంతా ఇన్‌చార్జిలే రాజ్యమేలుతున్నారు. పైగా ఒక్కొక్కరికి రెండు మూడు బాధ్యతలు ఉన్నాయి. వీరంతా అసలు ఉద్యోగం వదిలేసి కొసరు కొలువుల్లో కొనసాగుతున్నారు. ఫలితంగా విద్యాప్రమాణాలు పడిపోతున్నాయి. విద్యార్థుల ఉత్తీర్ణత శాతం అంతకంతకూ పడిపోతోంది. గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో చదువులు సట్టుబండలయ్యాయి. బళ్లు కడకండ్ల పాలయ్యాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో విద్యా శాఖ దుస్థితిపై ప్రత్యేక కథనం..

- డిప్యూటీ డీఈవోలు అసలే లేరు
- రెగ్యులర్ ఎంఈవో ఒక్కరే..
- అన్ని మండలాలకు ఇన్‌చార్జ్‌లే దిక్కు
- 70 శాతం స్కూళ్ల హెచ్‌ఎంలూ వారే
- ఉమ్మడి జిల్లాలో 2,500 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ
- కుంటుపడుతున్న చదువులు.. గాడితప్పిన విద్యాశాఖ

హనుమకొండ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యాశాఖ ఇన్‌చార్జ్‌ల పాలనలోనే కొనసాగుతోంది. డీఈవోలు, ఎంఈవోలు, ఆఖరికి హెచ్‌ఎంలు కూడా ఇన్‌చార్జ్‌లే ఉన్నారు. డిప్యూటీ డీఈవోలు అసలే లేరు. డైట్ కాలేజీకి కూడా పూర్తికాలపు ప్రిన్సిపాల్ లేడు. బీఈడీ కాలేజీకి ప్రిన్సిపాల్ ఉన్నా ఆయనకు అదనపు బాధ్యతను అంటగట్టారు. దీనితో ఉన్నవారిపై అదనపు పనిభారం పడి పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. దీనితో ప్రభుత్వపాఠశాలల్లో ఉపాధ్యాయులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. చదువులు చెప్పే గురువులు లేక విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోగా సర్కార్ బళ్లు క్రమంగా మూతపడుతున్నాయి.

ఉపాధ్యాయుల కొరత

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2500 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 5.50లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 90 శాతం పాఠశాలలకు రెగ్యులర్ హెడ్‌మాస్టర్లు లేరు. పాఠశాలల్లో పని చేసే సీనియర్ అధ్యాపకులకే హెడ్‌మాస్టర్‌గా ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించారు. దీనితో వారు ఎప్పు డు వస్తారో ? ఎప్పుడు పోతారో తెలియని పరిస్థితి. మరో వైపు ఉమ్మడి జిల్లాలోని సర్కార్ బళ్లను ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. 2500లకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉపాధ్యాయుల నియామకానికి పదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం డీఎస్‌సీని నిర్వహిం చలేదు. ఇటీవల డీఎస్‌సీ నిర్వహణకు నోటిఫికేషన్ జారీ చేసినా అందులో ఉమ్మడి జిల్లాలో చూపిన టీచర్ పోస్టులు 560 మాత్రమే. టీఎస్‌పీఎస్‌సీ పరీక్షా పత్రాల లీకేజీతో ఈ నియామక ప్రక్రియ కూడా అటకెక్కింది. గత అనేక సంవత్సరాలుగా ఉపాధ్యాయులకు పదోన్న తులు లేవు. ఉమ్మడి జిల్లాలో విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం తగ్గుతుండడానికి, సర్కార్ బళ్ల మూతబడానికి ఇది కారణమౌతోంది.

ఇన్‌చార్జ్ డీఈవోలు

- హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు రెగ్యులర్ జిల్లా విద్యాశాఖాధికారులు (డీఈవో)లు చాలా కాలం నుంచి లేరు.
- హనుమకొండ జిల్లాకు ప్రస్తుతం డీఈవో ఉన్న అబ్దుల్‌హై ఇన్‌చార్జే. వాస్తవంగా ఆయన బీఈడీ కాలేజీలో లెక్చరర్. ఆ కాలేజీకి ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. దీనితో పాటు ఆయనకు డీఈవో బాధ్యతలను కూడా అప్పగించారు.
- వరంగల్ జిల్లాకు కూడా రెగ్యులర్ డీఈవో లేదు. ఇన్‌చార్జ్ డీఈవోతోనే నాలుగేళ్లుగా నెట్టుకువస్తున్నారు. ఆరు జిల్లాల్లో ఒకే ఒక్క డిప్యూటీ డీఈవోగా ఉన్న వాసంతిని వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ డీఈవోగా కొనసాగుతున్నారు.
- జనగామ డీఈవో రాము ఇన్‌చార్జే. ఆయన రెగ్యులర్ పోస్టు విద్యాశాఖ (హైదరాబాద్)లో అడిషనల్ డైరెక్టర్. రెండేళ్ల కిందట జనగామ డీఈవోగా కూడా అదనపు బాధ్యతలు అంటగట్టారు. దీంతో ఆయన జోడుగుర్రాల స్వారీ చేస్తున్నారు. ఇక్కడ ఒక రోజు, అక్కడ ఒక రోజు విధులు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌కే ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారు.
- మహబూబాబాద్ జిల్లాకు కూడా ఇన్‌చార్జ్ డీఈవోనే. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అదనపు డైరెక్టర్ అయిన రామారావుకు ఇక్కడ ఇన్‌చార్జ్ డీఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఏడాదిగా ఆయన అక్కడా.. ఇక్కడా రెండు పడవలపై కాళ్లుపెట్టి ఏదో విధంగా నెట్టుకువస్తున్నారు.
- ములుగు జిల్లాకు కూడా ఇన్‌చార్జ్ డీఈవోనే దిక్కయ్యారు. మంచిర్యాల జిల్లాలో ఏడీగా పనిచేస్తున్న పాణికి ఇక్కడ విద్యాశాఖ బాధ్యతలు అప్పగించారు.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు కూడా ఇన్‌చార్జ్ డీఈవోనే కొనసాగుతున్నారు. అడిషనల్ డైరెక్టర్ అయిన రాంకుమార్ ఈ అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

డిప్యూటీ డీవోలు లేరు..

డీఈవోలుసరే ఎలాగూ లేరు. కనీసం డిప్యూటీ డీఈవోలు అయిన ఉన్నారా.. అంటే ఒక్కరు కూడా లేరు. ఉన్న ఒక్క డిప్యూటీ డీఈవో వాసంతికి డీఈవోగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంతో ఉమ్మడి జిల్లాలో ఒక్కరు కూడా లేకుండాపోయారు. ఇదివరకు వరంగల్, జనగామ, మహబూబాద్ డివిజన్లకు ఒక్కొక్కరు చొప్పున డిప్యూటీ డీఈవోలు ఉండేవారు. వారంతా రిటైర్ అయ్యారు. వారి స్థానంలో కొత్తవారేవరూ రాలేదు. ఆ పోస్టులన్నీ అలాగే ఖాళీగా ఉండిపోయాయి.

ఒకే ఒక్క ఎంఈవో

ఉమ్మడి జిల్లా పరిధిలో 75 మండలాలుండగా మండలానికో విద్యాశాఖాధికారి (ఎంఈవో) విధిగా ఉండాలి. కానీ ప్రస్తుతం ఒకే ఒక్క ఎంఈవో

మిగతా 7వ పేజీలో..

ఐదుగురు ఏసీపీల బదిలీ

హనుమకొండ క్రైం, మార్చి 2: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఐదుగురు ఏసీపీలకు బదిలీ, పోస్టింగ్‌లు ఇస్తూ రాష్ట్ర డీజీపీ రవిగుప్తా శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 45 మందికి స్థానచలనం కాగా, కమిషనరేట్ పరిధిలో ఐదుగురు బదిలీఅయ్యారు. బదిలీ, పోస్టింగ్ పొందిన వారు ఒకటి, రెండు రోజుల్లో విధుల్లో చేరాలని డీజీపీ ఆదేశాలు జారీ చేశారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ ఐన ప్రదేశం
ఎస్. శ్రీనివాస్	స్టేషన్‌ఘన్‌పూర్	డీజీపీ అటాచ్
సి. సతీష్‌బాబు	మామునూరు	డీజీపీ అటాచ్
ఆర్. భీంశర్మ	సిరిసిల్ల	స్టేషన్ ఘన్‌పూర్
బి. తిరుపతి	ఇంటెలిజెన్స్	మామునూరు
బి. మల్లయ్య	సీసీఎస్ వరంగల్	డీజీపీ అటాచ్

హిమాన్సీకి దుద్దిళ్ల శ్రీపాద స్మారక అవార్డు



అవార్డు అందుకుంటున్న హిమాన్సీ

హనుమకొండ కల్చరల్, మార్చి 2: హనుమకొండ అడ్వకేట్స్ కాలనీకి చెందిన ప్రఖ్యాత కూచిపూడి నృత్య జాతీయ కళాకారిణి కాట్రగడ్డ హిమాన్సీకి శనివారం రాత్రి రవీంద్రభారతిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ఘనసత్కారం జరిగింది. మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు 87వ జయంతి వేడుకల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా హిమాన్సీకి ఈ అరుదైన పురస్కారం లభించింది.

దేశానికే ప్రమాదకరంగా మారిన బీజేపీ

- యూపీఏ హయాంలో నిష్పక్షపాతంగా రాష్ట్రాల అభివృద్ధి
- బీజేపీకి బానిసగా బీఆర్‌ఎస్.. వీఆర్‌ఎస్ తీసుకున్నట్లే..
- తెలంగాణ పార్లమెంట్ ఎన్నికల మీడియా ఇన్‌చార్జి సుజాతా పాల్



మాట్లాడుతున్న ఏఐసీసీ అధికార ప్రతినిధి సుజాత పాల్

హనుమకొండ సిటీ, మార్చి 2: భారతీయ జనతా పార్టీ వైఖరి దేశానికే ప్రమాదకరంగా మారిందని ఏఐసీసీ అధికార ప్రతినిధి, తెలంగాణ పార్లమెంట్ ఎన్నికల మీడియా ఇన్‌చార్జి సుజాత పాల్ ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ హయాంలో కేంద్ర ప్రభు త్వతీరు ప్రజాస్వామ్య ఫలాలను హరించివేస్తోందని ఆరోపించారు. శనివారం హనుమకొండలోని డీసీసీ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ ఓబీసీ సెల్ నేషనల్ కో-ఆర్డి నేటర్, వరంగల్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి కత్తి వెంకటస్వామితో కలిసి మాట్లాడారు. అధికారం కోసం ప్రజల మధ్య విద్వేషాలను బీజేపీ రెచ్చగొడుతోందని ఆరోపించారు. బీజేపీ ద్వేషపూరిత పాలనకు చరమ గీతం పాడడమే లక్ష్యంగా కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ పోరాడుతున్నట్లు చెప్పారు. రాహుల్‌ను చూసి మోదీ భయపడుతున్నారని చెప్పారు. యూపీఏ హయాంలో రాష్ట్రాల్లో అభి వృద్ధి నిష్పక్షపాతంగా జరిగిందన్నారు. బీజేపీ అధికారంలోలేని రాష్ట్రాలపై మోదీ వివక్ష చూపుతున్నారని ఆరోపించారు.

యూపీఏ హయాంలోనే కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీకి అంకురార్పణ జరిగిందని సుజాతపాల్ వెల్లడించారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ఈ ప్రాజెక్టు తమిళనాడుకు తరలిందని ఆరోపించారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ఊసేలేదని, దీనిపై బీజేపీ ప్రతినిధులు నోరు విప్పాలని డిమాండ్ చేశారు. వరంగల్ పార్లమెంట్ సభ్యుడు పసునూరి దయాకర్‌ను ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆరే అవమానిం చడం దురదృష్టకరమన్నారు. ఒక కార్యక్రమంలో కేటీఆర్ భోజనం చేస్తుంటే ఆయన వెనకాలే పసునూరి నిలబడి ఉన్నారని చెప్పుకొచ్చారు. బీఆర్‌ఎస్‌లో ఇంకా నియంతృత్వ ఏకపక్ష నాయకత్వమే రాజ్యమేలుతోందని దుయ్యబట్టారు. రైతులకు వ్యతిరేకంగా నల్లచట్టాలను బీజేపీ రూ పొందించినప్పుడు బీఆర్‌ఎస్ మద్దతు ఇచ్చిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో రెండు పార్టీలకు గుణపాఠం చెప్పాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు కాలం చెల్లిందని ఆపార్టీ వీఆర్‌ఎస్ తీసుకున్నట్లేనని విమర్శించారు.

హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం వాళ్ల అయ్య జాగీరా అంటూ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్ష రూపాయలకు గజం చొప్పున ధర పలికే బాలసముద్రంలో నిబంధనలకు పక్కన పెట్టి బీఆర్‌ఎస్ కార్యాలయాన్ని నిర్మించుకు న్నారని మండిపడ్డారు. అది కారాన్ని విచ్చలవిడిగా దుర్వినియోగం చేశారన్నారు. కాంగ్రెస్ కార్యాలయం కోసం స్థలం కావాలని కోరితే బీఆర్‌ఎస్ ప్రభుత్వం స్పందించలేదన్నారు. తన క్యాంపు కార్యాలయం పక్కనే ఉన్న బీఆర్‌ఎస్ కార్యాలయాన్ని తరలించాల్సిందేనని రాజేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం పక్కనే పార్టీ కార్యాలయం ఉండడం నిబంధనలకు విరుద్ధమన్నారు. పదేళ్ల పాలనలో బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులు దోచుకుతిన్నారని ఆరోపించారు. అభి వృద్ధి పనుల పేరిట ప్రజల సొమ్మును స్వాహా చేశారని, జీడబ్ల్యుఎంసీలో అక్రమాలను వెలికి తీస్తామని రాజేందర్‌రెడ్డి వెల్లడించారు. నగరానికి ముంపు సమస్య లేకుండా అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ తోట వెంకన్నతో పాటు బంక సరళ, జన్ను పరంజ్యోతి, డాక్టర్ పెరుమాండ్ల రామక్రిష్ణ, బంక సంపత్ యాదవ్, తాడిశెట్టి విద్యాసాగర్, చీకటి ఆనంద్, కుమార్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కమలంలో వీడని ఉత్కంఠ



- తొలి జాబితాలో ఓరుగల్లుకు దక్కని చోటు
- పార్లమెంట్ ఆశావహుల్లో టెన్షన్
- పార్టీలో చేరే వారి కోసమే వేచిచూస్తోందని ప్రచారం

వరంగల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ త్వరలోనే వస్తుం దన్న వార్తల నేపథ్యంలో బీజేపీ శనివారం తన అభ్యర్థుల తొలిజాబితాను విడుదల చేసింది. అం దులో వరంగల్, మహబూబాబాద్ ఎంపీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయకపోవడంతో కమలం టికెట్ ఆశిస్తున్న నేతల్లో ఉత్కంఠ పెరు గుతోంది. దేశవ్యాప్తంగా 195మంది మందితో జాబితాను ప్రకటించగా.. అందులో రాష్ట్రంలో 9స్థానాలకు అభ్యర్థుల పేర్లను వెల్లడించింది. అయితే ఉమ్మడి వరంగల్‌లోని రెండు స్థానాలను పెండింగ్‌లో పెట్టడంతో టికెట్ ఎవరికి అనే చర్చ జరుగుతుంది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నుంచి వచ్చే నేతల కోసమే పెండింగ్‌లో పెట్టారా? లేదంటే రాజకీయ, కుల సమీకరణల కోసం జాబితాలో చోటు దక్కలేదా అనేది చర్చనీయాంశంగా మారింది.

తొలి విడతలో నిరాశే

తొలిజాబితాలో రాష్ట్రంలోని ముగ్గు రు సిట్టింగ్ ఎంపీలతో పాటు మరో ఆరుగురికి కొత్తగా అవకాశం కల్పించిన అధిష్ఠానం వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించలేదు. ఇప్పటికే వరంగల్ ఎంపీ స్థానం నుంచి డజను మంది కి పైగా నేతలు టికెట్ రేసులో ఉన్నారు. అయితే ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణమాదిగను వరం గల్ నుంచి పోటీ చేయించా లని సూచించినట్టు ప్రచారం జరిగింది. అయితే ఎన్నికల్లో పోటీకి మంద కృష్ణ సుముఖంగా లేరని, మాజీ పోలీసు అధికారి కృష్ణప్రసాద్ పోటీ చేయబోతున్నారని ప్రచారం జరిగింది. వీరితో పాటు కీలక మైన నేతలు పలువురు టికెట్ కోసం అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నారు. తొలి విడతలోనే వరంగల్ పార్లమెంట్‌పై అధిష్ఠానం తేలుస్తుందని భావించినా కాషాయ నేతలకు నిరాశే మిగిల్చింది. అలాగే మానుకోట అభ్యర్థిని కూడా బీజేపీ పెండింగ్‌లో పెట్టింది. బీజేపీ రాష్ట్ర నాయకులు హుస్సేన్ నాయక్, యాపసీతయ్యల్లో ఒకరికి టికెట్ ఖాయంగా బీజేపీ శ్రేణులు భావించాయి.

రాష్ట్రంలో ఆదిలాబాద్, మహబూబాబాద్ ఎంపీ సీట్లే ఎస్టీలకు రిజర్వు అయ్యాయి. ఆదిలాబాద్ నుంచి ఆదివాసీలకు టికెట్ ఇస్తే, మహబూబాబాద్‌లో లంబాడా సామాజిక వర్గం నుంచి టికెట్ ఇస్తారనే చర్చ జరిగింది. అయితే ఆదిలాబాద్ బీజేపీ సిట్టింగ్ స్థానమైన ప్పటికి తొలిజాబితాలో అభ్యర్థిని ప్రకటిం చలేదు. దీంతో ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి తెలితేనే మహబూబాబాద్ సీటుపై ఎవరికి అనేది స్పష్టత వస్తుందని బీజేపీ శ్రేణులు భావిస్తున్నాయి.

ప్యారాచూట్ నేతల కోసమేనా..?


తొలి జాబితాలో వరంగల్, మహబూ బాబాద్ ఎంపీ అభ్యర్థులను బీజేపీ ప్రకటించ కపోవడానికి మరో కారణం కూడా ఉందన్న చర్చ జరుగుతోంది. ఇటీవల బీజేపీలో చేరిన బీఆర్‌ఎస్‌కు చెందిన జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్‌కు, నాగర్‌కర్నూలు ఎంపీ రాములు కుమారుడు భరత్‌కు సీట్లు ఖరారయయ్యా యి. దీంతో వరంగల్ నుంచి పోటీ చేయాలని బీఆర్‌ఎస్‌కు చెందిన ఓ మాజీ ఎమ్మెల్యేపై బీజేపీ నేతలు ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. బీఆర్‌ఎస్‌ను వీడిన తరువాత బీజేపీలో టికెట్ ఇవ్వకపోతే ఏలా అనే ప్రశ్నలు ఆ మాజీ ఎమ్మెల్యే నుంచి బీజేపీ నేతలకు ఎదరయ్యాయి. దీంతో పార్టీలో చేరిన వారికి అధిష్ఠా నం టికెట్ ఇచ్చిందని.. జహీరాబాద్, నాగర్ కర్నూలు ఉదాంతాన్ని చూపెడుతూ.. ఓ బీఆర్‌ఎస్ నేతను బీజేపీలో చేర్చుకుని టికెట్ ఇస్తారనే ప్రచారం కూడా జరుగుతుంది. అలాగే మానుకోట నుంచి కూడా ఓ మాజీ ఎంపీతో పాటు కాంగ్రెస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే కూడా గోడ దూకేందుకు సిద్ధంగా ఉన్నారనే ప్రచారం ఉంది. వీరితో చర్చలు చివరి దశలో ఉండటంతో తొలి జాబితాలో అభ్యర్థిని ఖరారు చేయలేదని సమాచారం. మొత్తానికి ప్యారాచూట్ నేతల కోసం అధిష్ఠానం ఎదురుచూస్తుందనే ప్రచారంతో టికెట్ కోసం ఎన్నో ఆశలతో ఉన్న నేతల్లో ఉత్కంఠ నెలకొంది.











యూబీఐ రిటేల్ - ఎక్స్‌పో ప్రారంభం


మాట్లాడుతున్న పాలగుల సత్యం

వడ్డెపల్లి, మార్చి 2: హనుమకొండ బాలసముద్రంలోని హయగ్రీవాచారి (కుడా) గ్రౌండ్‌లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ)వరంగల్ రీజియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రిటేల్ - ఎక్స్‌పోను యూబీఐ రీజినల్ హెడ్ పాలగుల సత్యం శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకింగ్ రంగంలో అతి తక్కువ వడ్డీతో గృహ, వాహన, విద్యా రుణాలను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో 14పైగా కార్లకు సంబంధించిన కంపెనీలు, 30కి పైగా బిల్డర్లు, సోలార్‌కు సంబంధించిన సప్లయర్లు పాల్గొన్నారు. రుణాలు పొందిన వారికి పాలగుల సత్యం మంజూరు పత్రాలను అందజేశారు. యూబీఐ అధికారులు నాంపెల్లి శ్రీనివాస్, రంగయ్యనాయుడు, సర్వేష్,నాగార్జు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ రూరల్, మార్చి 2: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే గ్రూప్- 1 పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ఎంపివి.ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7వ తేదీలోగా తమ దరఖాస్తులను హనుమకొండ లష్కర్ బజార్‌లోని స్టడీ సర్కిల్ నేరుగా అందజేయాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 0870-2571192, 040-24071178, 040-27077929లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఉపాధి కార్యాలయంలో 6న జాబ్ మేళా

హనుమకొండ రూరల్, మార్చి 2: ఈ నెల 6వ తేదీన హనుమకొండ ములుగురోడ్‌లోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.మల్లయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గూగుల్ పే, వరంగల్ హనుమకొండ కంపెనీలో 40 ఉద్యోగాల ఎంపికకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ చదివిన 18 నుంచి 25 యేళ్ల వయస్సుగల నిరుద్యోగ యువకులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో ఉపాధి కల్పన కార్యాలయానికి ఉదయం 11గంటల వరకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 98488 95937 సంప్రదించాలని తెలిపారు.











జాతీయ స్థాయి టెన్నిస్ క్రీడా పోటీల ప్రారంభ సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ రామన్

సందడిగా జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు

10 రాష్ట్రాల నుంచి 200 క్రీడాకారులు హాజరు

ఈనెల 8 వరకు పండుగ వాతావరణంలో క్రీడలు

హనుమకొండ స్పోర్ట్స్, మార్చి 2: ఆల్ ఇండియా టెన్నిస్ అసోసియేషన్ ఆదేశాల మేరకు వరంగల్ ఉమ్మడి జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఓపెన్ టూ ఆల్ మెన్ టెన్నిస్ టోర్నమెంట్ సందడిగా ప్రారంభమయ్యాయి. హనుమకొండ సుబేదారిలో వరంగల్ ఆఫీసర్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు శనివారం తెలంగాణ రాష్ట్ర టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఆర్ రామన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు స్నేహపూర్వక సంబంధాలు పెంపొందిస్తాయన్నారు. హనుమకొండ వేదికగా జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు నిర్వహించడం అభినందనీయన్నారు.

వరంగల్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ కోశాధికారి, క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి ఎం.రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. ఓపెన్ టూ ఆల్ మెన్ విభాగంలో నిర్వహించనున్న టెన్నిస్ పోటీల్లో 10 రాష్ట్రాల నుంచి 70 సింగిల్స్ జట్లు, 33 డబుల్స్ విభాగాల్లో క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. సింగిల్స్, డబుల్స్ విభాగంలో ఈనెల 8 వరకు నాకౌట్ పద్ధతిన పోటీలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ విభాగాల్లో గెలిచిన క్రీడాకారులకు రూ.లక్ష పారితోషికాన్ని అందించనున్నట్లు తెలిపారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులకు భోజన, వసతి సౌకర్యాలను కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఆఫీసర్స్ క్లబ్ అధ్యక్షుడు ప్రభాకర్‌రావు, కార్యదర్శి ఏపీ ఎలమురుగు, వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణరెడ్డి, వరంగల్ ఆఫీసర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి రవిందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి కన్నారెడ్డితో పాటు కోచ్‌లు, టెక్నికల్ అఫీషియల్స్ తదితరులు పాల్గొన్నారు.

ఇంతింతై.. కళలకు సొంతమై!

● స్వర్ణోత్సవ సంబరాలకు భారతీయ నాటక కళా సమితి సిద్ధం ● నేటినుంచి 8 తేదీ వరకు ఉభయ రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు

వర్ధన్నపేట, మార్చి 2: భారతీయ నాటక కళా సమితిలో స్వర్ణోత్సవ సందడి నెలకొంది. శివరాత్రి పండుగను పురస్కరించుకుని ఐదు రోజుల పాటు జరిగే కార్యక్రమాలు ప్రజలకు ఎంతో అలరించనున్నాయి. నాటి కళలకు వేదికగా వర్ధన్నపేట భారతీయ నాటక కళాసమితి నిలువగా, అర్ధ శతాబ్దంలోకి అడుగు పెట్టడం కళాసమితి సభ్యులకు ఆనందాన్ని తెస్తోంది. నిర్వాహకుల అంకిత భావం, కళల పట్ల వారికి ఉన్న ఆరాధనతో భారతీయ నాటక కళా సమితి కళాభిమానుల మనసులను దోచుకుంటోంది. ఒకే మాట, ఒకే బాటగా భారతీయ నాటక కళా సమితి 49 వసంతాలు పూర్తి చేసుకోనుంది. రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొంది నాటక రంగానికి చేస్తున్న సేవలతో అందరి అభిమానాలు చూరగొంటోంది. 1974లో వర్ధన్నపేట మండలం ఇల్లందలో దివంగత ఈగ శ్రీహరి, వడ్లకొండ వెంకటయ్య, వేముల ఆంజనేయులు, మల్లూరి రంగయ్య, పోశాల సూర్యనారాయణ, దివంగత సిరివోలు వెంకట్రామరావు, వనం లక్ష్మీకాంతరావు, వడ్లకొండ ఎల్లగౌడ్ తదితరులు భారతీయ నాటక కళాసమితికి బీజం వేశారు.

అల్లూరి స్ఫూర్తితో..

1980లో వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద నుంచి ఆనాటి తాలుకా కేంద్రమైన వర్ధన్నపేటకు మారింది. ప్రారంభంలో అనేక ఒడిదుడుకులకు లోనైనా కమిటీ సభ్యులు లక్ష్యసాధనే ధ్యేయంగా భావించి అప్పట్లో నిర్దిష్టమైన స్థలం, ప్రత్యేక వేదికంటూ లేకపోవడంతో నాటిక పోటీలకు తీవ్ర అవరోధాలు ఏర్పడేవి. ఈ ఇబ్బందులను శాశ్వతంగా అధిగమించాలనే దృఢ సంకల్పం వారిలో పెరిగింది. వడ్లకొండ ఎల్లగౌడ్ దర్శకత్వంలో స్థానిక కళాకారులతో అల్లూరి సీతారామరాజు నాటికను ప్రదర్శించి దాతల ద్వారా విరాళాలు సేకరించారు. అలా అల్లూరి సీతారామరాజు నాటక ప్రదర్శనతో సేకరించిన డబ్బుతో స్థల సేకరణ చేయాలనే ఆలోచన కలిగింది.

ఐదు రోజుల పాటు..

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించే నాటక పోటీలు పట్టణంలో ఐదు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ నెల 3 నుంచి 8వ తేదీ వరకు నాటక పోటీల షెడ్యూల్‌ను ప్రకటించగా, ఐదు రోజులు పూర్తి నాటికలు వేసి, శివరాత్రిన ఇతర కార్యక్రమాలు, బహుమతుల ప్రదానం చేస్తారు. 3న మొదటి ప్రదర్శన తెలుగు కళాసమితి, విశాఖపట్నం వారి ఆధ్వర్యంలో నిశ్శబ్దమా.. నీ ఖరీదెంత, కళానికేతన్, వీరన్నపాలెం వారి ఆధ్వర్యంలో రాజుగారి గోచి, 4న కళాంజలి హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో రైలే రాజు, చైతన్య కళాభారతి కరీంనగర్ వారి ఆధ్వర్యంలో స్వప్నం రాల్చిన అమృతం, 5న సిరిసిరిమువ్వ కల్చరల్ అసోయేషన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో హక్కు, మురళీ కళానిలయం హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో అవ్వా అప్పచ్చి, 6న గోవాడ క్రియేషన్స్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో మూల్యం, మైత్రి కళానిలయం విజయవాడ వారి ఆధ్వర్యంలో బంధం, 7న అభినయ ఆర్ట్స్ గుంటూరి వారి ఆధ్వర్యంలో ఇంద్రప్రస్థం, శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరి వారి ఆధ్వర్యంలో కౌసల్యా సుప్రజా రామా, 8న శివరాత్రి పండుగ సందర్భంగా పలు కల్చరర్ ప్రోగ్రామ్స్, విజేతలకు బహుమతుల ప్రదానం చేస్తారు.

కలగానే జాతీయస్థాయి పోటీలు

గతంలో నాటిక కళా సమితి కమిటీ సభ్యులు ఎంతో కృషిచేసి నాటకాలను రాష్ట్రస్థాయికి చేరేలా కృషిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కళాకారులతో పాటు తమిళనాడు, చెన్నై రాష్ట్రాలకు చెందిన కళాకారులను తీసుకువచ్చి నాటికలు ప్రదర్శింప చేశారు. సినీ రంగంలో మంచి స్థానాల్లో ఉన్న క్యారెక్టర్ ఆర్టిస్టులను సైతం తీసుకువచ్చారు. కానీ, ప్రస్తుతం హైదరాబాద్ నుంచి మాత్రమే ఎక్కువ శాతం నాటికలు ప్రదర్శించే వారు వస్తున్నారు. దీంతో భారతీయ నాటిక పోటీలు ఇంకా రాష్ట్రస్థాయిలో ఉండిపోయాయి. ఇక జాతీయస్థాయిలో పోటీలు కలగానే మిగిలిపోయే అవకాశాలు ఉన్నాయా అంటూ ప్రేక్షకులు చర్చించుకుంటున్నారు. దీనికి గతంలో విమర్శలు రావడంతో ఇప్పటి ఆహ్వాన పత్రికలో ఉభయ తెలుగు రాష్ట్రాలస్థాయి పోటీలని ముద్రించి చేతులు దులుపుకున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సైతం కళా సమితి ముందుకు వెళ్తే ఆదరణ బాగుంటుందని సూచిస్తున్నారు.

కమిటీలో సమన్వయ లోపం

భారతీయ నాటిక కళా సమితి కమిటీ సభ్యుల మధ్య సమన్వయం లోపించింది. గత నెల రోజుల నుంచి కార్యక్రమాలపై సమావేశాలు ఏర్పాటు చేసుకున్నప్పటికీ దాతలకు, ప్రజా ప్రతినిధులకు ఆహ్వాన పత్రికలు అందించడంలో విఫలమయ్యారు. ఈ నెల 3వ తేది నుంచి కార్యక్రమాలు ప్రారంభమవుతుండగా, రాత్రి వరకు ఆహ్వాన పత్రికలు పంచుతునే ఉండడం పట్ల విమర్శలకు గురవుతున్నారు. ఆహ్వాన పత్రికలో పలువురి పేర్లను సైతం తప్పుగా ముద్రించడం పట్ల దాతలు అసహనానికి గురయ్యారు. ఇక ఈ సారి భారీగానే విరాళాలు వసూలు చేసినట్లు తెలుస్తోంది?. మూలధన ఏర్పాటులో భాగంగా దాదాపు రూ.25 లక్షల వరకు కొత్తగా విరాళాలు సేకరించగా, ఆహ్వాన పత్రిక అడ్వటైజ్‌మెంట్ల ద్వారా రూ.3లక్షల వరకు సేకరించారు. గతేడాది కమిటీ సభ్యుల మధ్య విరాళాల సేకరణ, ఖర్చుల పద్దుల్లో కొంత పంచాయతీ ఏర్పడగా అంతర్గతంగా పరిష్కరించుకున్నారు. గతేడాది కార్యక్రమాల్లో స్టేజీ మీదకు పిలిచే సందర్భంలోనూ అతిథులు కమిటీ సభ్యులకు చివాట్లు పెట్టారు. మళ్లీ ఇవన్నీ పునరావృతం కాకుండా సభ్యులు చూసుకుంటూ సమన్వయంగా పని చేయాలని ప్రేక్షకులు ఆశిస్తున్నారు.



వర్ధన్నపేటలో భారతీయ నాటక కళాసమితి ఆడిటోరియంలో సాగుతున్న పనులు

పార్కింగ్‌కు అడ్డాగా కళా సమితి ప్రాంగణం

గతంలో శివరాత్రి సందర్భంగా నాటికల కోసం ఆడిటోరియాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ప్రభుత్వ నిధులతో సైతం భారీగా షెడ్డు వేసి పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఫంక్షన్లు చేసుకునేందుకు మినీ ఫంక్షన్ హాల్‌గా వినియోగిస్తామని తెలిపారు. కార్యక్రమాలు ముగియగానే ఎక్కడి వారు అక్కడికి వెళ్లిపోవడంతో కళా ప్రాంగణం అసాంఘిక శక్తులకు అడ్డాగా మారుతోంది. దీనికి తోడు పక్కనే సినియా థియేటర్ ఉండడంతో ఎంచక్కా ఆ యాజమాన్యం సినిమాలకు వచ్చే ప్రేక్షకుల వాహనాలు ప్రాంగణంలో ఉంచి పార్కింగ్ ఫీజులను వసూలు చేసుకుంటున్నారు. ఇవన్నీ స్థానికంగా ఉన్న కమిటీ సభ్యులకు తెలిసినప్పటికీ వాటిపై దృష్టి సారించడంలేదు. నాటిక పోటీలు జరిగినప్పుడు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్న కమిటీ సభ్యులు కళలను ఆదరిస్తున్న ప్రజలకు పరోక్షంగా కళా ప్రాంగణం సహాయ పడే విధంగా చేయాలని కోరుతున్నారు.

నాటి కళలను కాపాడుకుంటాం : పెద్దూరి సంజీవరావు, కల్చరర్ సెక్రటరీ

నాటి కళలను కాపాడుకోవాలనే లక్ష్యంతో భారతీయ నాటకాలను క్రమం తప్పకుండా చేస్తున్నాం. దివంగత ఈగ శ్రీహరి ఆశయాలను కొనసాగించడంతో పాటు కళాసమితిని స్థాపించిన ప్రతీ ఒక్కరి నిబద్ధతను ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్తున్నాం. కమిటీ సహాయ సహకారాలు, ప్రజల పూర్తి సహకారం, ప్రజా ప్రతినిధుల ప్రోత్సాహంతో మరింత విజయవంతంగా నాటిక ప్రదర్శనలు పూర్తి చేస్తాం.

అందరూ ఇన్‌చార్జ్‌లే..

(5వ పేజీ తరువాయి)

ఉన్నారు. ఆయన హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలంలో పని చేస్తున్న రవీందర్. మిగతా మండలాల్లో సుదీర్ఘంగా సీనియర్ హెడ్‌మాస్టర్లే ఇన్‌చార్జ్‌లుగా కొనసాగుతున్నారు. సీనియర్ హెడ్‌మాస్టర్లకే ఈ బాధ్యతలు అప్పగించారు. వారు తమ రెగ్యులర్ హెచ్‌ఎం బాధ్యతలు చూసుకుంటూనే ఇటు ఎంఈవో విధులను కూడా నిర్వహించడానికి సతమతమవుతున్నారు. ఈ క్రమంలో దేనికీ న్యాయం చేయలేకపోతున్నారు. గతంలో ప్రతీ మండలానికి ఒక ఎంఈవో ఉండేవారు. అనేక మంది రిటైర్ కావడం, కొందరు మృతి చెందడం, ఎంఈవోలుగా పదోన్నతులు లేకపోవడం, కొత్త నియామకాలు చేపట్టకపోవడం తదితర కారణాల వల్ల అసలు ఎంఈవోలే లేకుండా పోయారు. మండల పరిధిలోని ప్రభుత్వ యాజమాన్యంలోని పాఠశాలలను సమర్థవంతంగా నిర్వహించడంలో ఎంఈవోలదే కీలక భూమిక. పూర్తికాలపు ఎంఈవోలే లేకపోవడంతో సర్కార్ బళ్ల తీరు రాజు లేని రాజ్యం అయింది.

హెడ్‌మాస్టర్లు

ఏ పాఠశాల అయినా సక్రమంగా నడవాలన్నా, విద్యార్థుల చదువులు సక్కగా సాగాలన్నా, మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నా హెడ్‌మాస్టర్లే కీలకం. ఉపాధ్యాయులను నియంత్రణలో పెట్టి విద్యాబోధన సరిగా జరిగేట్టు చూసే బాధ్యత హెచ్‌ఎంలది. అటువంటి వారే ఇన్‌చార్జిలుగా ఉంటే ఇక బడులు నడిచేదెలా? సదువులు సాగెదెలా? అని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

ప్రిన్సిపాళ్లూ ఇన్‌చార్జిలే..


ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చే బీఈడీ, డైట్ కళాశాలలకు సైతం పూర్తి కాలపు ప్రిన్సిపాళ్లు లేరు. హనుమకొండలోని డైట్ కళాశాలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా నారాయణరెడ్డి ఉన్నారు. ఆయనకు యాదాద్రి జిల్లా ఇన్‌చార్జి డీఈవోగా కూడా అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. రెండు బాధ్యతలను ఆయన చూసుకోలేక సతమతమవుతున్నారు. ఇక్కడ కొద్ది రోజులు, అక్కడ కొద్ది రోజులు విధులు నిర్వహిస్తూ ఏదో విధంగా నెట్టుకువస్తున్నారు. హనుమకొండలోని బీఈడీ కాలేజీకి రెగ్యులర్ ప్రిన్సిపాల్ లేరు. ఇదే కాలేజీలో లెక్చరర్ అయిన అబ్దుల్‌హై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్నారు. అంతటితో సరిపోదన్నట్టు హనుమండ జిల్లా ఇన్‌చార్జి డీఈవోగా కూడా అదనపు బాధ్యతలను అప్పగించారు.

కొరవడిన పర్యవేక్షణ

ఇన్‌చార్జి డీఈవోలు, ఎంఈవోల కారణంగా ప్రభుత్వ పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడింది. దీంతో ఉపాధ్యాయులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సమయ పాలన పాటించకపోవడం, తర్వాత పాఠశాలలకు వచ్చాక సంతకాలు పెట్టడం, విధి నిర్వహణ సమయంలో వ్యక్తిగత పనులపై బయట తిరగడం, ఉపాధ్యాయుల మధ్య విభేదాలు వంటివి చోటుచేసుకుంటున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఉపాధ్యాయులతో బోధనేతర పనులు చేయించొద్దని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నా కొందరు ఇన్‌చార్జి ఎంఈవోలు పనిభారం పేరుతో పలువురు ఉపాధ్యాయులను ఆఫీసు పనుల కోసం కార్యాలయాలకు రప్పించుకుంటున్నారని తెలుస్తోంది. ఇదే అలుసుగా మరికొందరు ఉపాధ్యాయులు ఆఫీసు పని పేరు చెప్పుకొని సొంత పనులు చేసుకుంటున్నారని సమాచారం. దీంతో విద్యార్థులకు బోధన సరిగా అందడం లేదు. డీఈవోలు, ఎంఈవోలు అంతా ఇన్‌చార్జిలు కావడంతో విధుల నిర్వహణలో జవాబుదారీతనం కొరవడుతోంది. ఒకటికన్నా మించి అదనపు బాధ్యతలను అప్పగించడంవల్ల వారు దేనికీ న్యాయం చేయలేకపోతున్నారు. ఫలితంగా పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడుతోంది. విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయి.

మూడోరోజు మేడారం హుండీల లెక్కింపు

ఆదాయం రూ 3.46 కోట్లు



హనుమకొండ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని టిటిడీ కళ్యాణ మండపంలో మేడారం హుండీల లెక్కింపు కొనసాగుతోంది. శనివారం మూడోరోజు 112 హుండీలను లెక్కించగా రూ 3,46,61,000 ఆదాయం సమకూరినట్టు మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ఈవో రాజేంద్రం తెలిపారు. దీంతో మూడు రోజులుగా నిర్వహించిన హుండీ లెక్కింపుతో మొత్తం రూ.9,60,36,000 సమకూరింది. మొత్తం 317 హుండీలను లెక్కిం చడం పూర్తయింది. మొదటి రోజు రూ.3,15,40,000, రెండోరోజు రూ. 2,98,35,000 కోట్లు ఆదాయం సమకూరింది. ఇంకా 201 హుండీలను లెక్కిం చాల్సి ఉంది. వచ్చే రెండు రోజుల్లో వీటిని లెక్కించడం పూర్తి చేస్తారు. మేడారం జాతరలో మొత్తం 518 హుండీలను ఏర్పాటు చేశారు. వీటిలో ఇనుప హుండీలు 482, క్లాత్ హుండీలు 34, బియ్యం హుండీలు. లెక్కించిన హుండీ ఆదాయాన్ని వెంట వెంటనే బ్యాంకులో జమ చేస్తున్నారు. హుండీల్లో ఇండియన్ కరెన్సీతో పాటు విదేశీ కరెన్సీ పెద్ద మొత్తంలో బయటపడుతోంది. దీనితో పాటు వెండి, బంగారు కానుకలు కూడా కంటపడుతున్నాయి. నాణాలు, బియ్యం పెద్దమొత్తంలో పోగవుతున్నాయి. నాణాలను చివరి రోజున తూకం వేయడం ద్వారా లెక్కిస్తారు. బియ్యాన్ని బస్తాల్లో నింపు నిలువ చేస్తున్నారు. లెక్కింపు కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక యంత్రం వల్ల హుండీల లెక్కింపు త్వరితగతిన సాగుతోంది.

కేడీసీలో ముగిసిన రెండు రోజుల జాతీయ సదస్సు

కేయూ క్యాంపస్, మార్చి 2: హనుమకొండ కేడీసీలో రెండు రోజులుగా కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం నేతృత్వంలో 'ఫింటెక్ ది ఇంక్లూజివ్ స్ట్రాటజీ ఫర్ ఫైనాన్షియల్ లిటరసీ' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఆస్ట్రేలియాలోని సెయింట్ కిట్స్ వర్సిటీ మేనేజ్‌మెంట్ విభాగం ప్రొఫెసర్ వెంకట్రావ్ హాజరై 'సాంకేతిక పరిజ్ఞానం- సెక్యూరిటీ సవాళ్లు, పరిష్కార మార్గాలు' అనే అంశంపై మాట్లాడారు. ముగింపు సదస్సులో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి హాజరై మాట్లాడారు. వడ్డెపల్లి పింగళి కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బత్తిని చంద్రమౌళి, కళాశాల విద్య మాజీ అకాడమిక్ గైడెన్స్ ఆఫీసర్‌చ డాక్టర్ డీటీ చారి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజిరెడ్డి , వైస్ ప్రిన్సిపాల్ మల్లయ్య, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ బి.రమేశ్, వినోద్‌రావు, పావని, సుజాతచ ఝాన్సీ రాణి, అయేషా, రాజీరు, నవీన్, బాలచందర్, స్వర్ణలత, సునీతరాణి తదితరులు పాల్గొన్నారు.

స్వరాష్ట్రంలోనే మానవ, పౌర హక్కులకు భంగం



తెలంగాణ పీపుల్స్ జాక్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ హరగోపాల్

మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

కాళోజీ జంక్షన్, మార్చి 2: రాష్ట్రంలో దశాబ్దకాలంగా పౌర హక్కులకు, మానవ హక్కులకు భంగం కలిగిందని తెలంగాణ పీపుల్స్ జాక్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో శుక్రవారం ముఖ్యమంత్రితో జరిగిన చర్చల సారాంశాన్ని ఆయన వివరించారు. తెలంగాణ ప్రజలు ఆకలినైనా భరిస్తారు కానీ.. ఆత్మగౌరవానికి భంగం కలిగితే ఊరుకోరని అన్నారు. ఉపా చట్టాన్ని దేశంలోనే తెలంగాణలో ఎక్కువగా ఉపయోగించారని 250 మందికి పైగా చట్టం కింద కేసులు నమోదు చేశారని అన్నారు. రాష్ట్రంలో విద్యారంగం పూర్తిగా విధ్వంసమైందని ముఖ్యమంత్రికి వివరించగా ప్రతీ యూనివర్సిటీ అభివృద్ధికి రూ. 100 కోట్లు కేటాయిస్తానని విద్యా కమిషన్ వేస్తానని చెప్పినట్లు హరగోపాల్ తెలిపారు. రైతాంగం ఎదుర్కొంటున్న సంక్షోభం నివారణకు రైతుకమిషన్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారని అన్నారు. పౌర సమాజంతో చర్చలు జరుగాలని అమరుల బంధు మిత్రుల సంఘం సమావేశంలో పోలీసులు జోక్యం చేసుకోక పోవడం రాష్ట్రంలో ప్రజాస్వామ్యం పునరుద్ధరణ జరిగిందనడానికి నిదర్శనమన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ప్లానింగ్ బోర్డును నిష్ణాతులతో ఏర్పాటు చేయాలని రాజకీయ పునరావాసం కోసం ప్లానింగ్ బోర్డు సభ్యులుగా నియమించవద్దని ముఖ్యమంత్రికి ఆయన సూచించారు.

పీపుల్స్ జాక్ స్టీరింగ్ కమిటీ సభ్యుడు కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వ యూనివర్సిటీలను బలోపేతం చేయాలని, నిరుపేద విద్యార్థులు మాత్రమే వాటిలో చదువుకుంటారని అన్నారు. విద్యార్థుల సంక్షేమం కోసం ఇవ్వాల్సిన రాయితీలు కూడా సకాలంలో ప్రభుత్వం అందించాలని కోరారు. పీపుల్స్ జాక్ కో కన్వీనర్ రవిచంద్ర మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలల నిర్వహణ తీరును సీఎం దృష్టికి తీసుకుపోగా గురుకుల పాఠశాలలను కులాల వారిగా కాకుండా అన్ని కులాల విద్యార్థులు ఒకేచోట విద్యనభ్యసించేలా చర్యలు చేపట్టాలని ఆలోచిస్తున్నట్లు ముఖ్యమంత్రి తమకు తెలిపినట్లు ఆయన వివరించారు.

నల్ల చట్టాలను రద్దు చేయాలి..

వడ్డెపల్లి, మార్చి 2: ప్రజాస్వామ్య దేశంలో ప్రజల హక్కుల కోసం రాజ్యాంగం పరిధిలో పోరాటం చేస్తున్న ప్రజా ఉద్యమకారులపై పెట్టిన నల్ల చట్టాలన్నింటినీ రద్దు చేయాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర నేత ప్రొఫెసర్ హరగోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఉమ్మడి వరంగల్ జిల్లా హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విప్లవోద్యమంపై నిషేధం ఎత్తివేయాలని అమరుల బంధు మిత్రుల సంఘం ఆధ్వర్యంలో 'అజ్ఞాత మహిళా అమరుల స్మృతిలో..' సదస్సును నిర్వహించారు. అమరుల బంధు మిత్రుల సంఘం రాష్ట్ర నాయకురాలు భవాని అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. పాలన విధానాన్ని ప్రశ్నించే రచయితలు, మేధావులు, జర్నలిస్టులపై దారుణమైన ఉపాలాంటి చట్టాలను ప్రయోగించడం సరికాదన్నారు. రాజ్యంలో మార్పు రావాలని, పౌర సంఘాలకు స్వేచ్ఛాయుతమైన వాతావరణాన్ని కల్పించాలని అన్నారు. వ్యవసాయ రంగంలో తమ హక్కుల కోసం ఉద్యమించే రైతులను దేశ ద్రోహులుగా చిత్రీకరించడం రాజ్యానికి తగదని హితవు పలికారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ రంగంలోకి మార్చే ప్రయత్నాన్ని రాజ్యం విరమించుకోవాలని హెచ్చరించారు. బ్యాంకుల నుంచి రుణాల పేరిట కోట్ల రూపాయలు దోచుకుని వెళ్లే బడా బాబులను దేశ భక్తులుగా ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

సాహిత్య విమర్శకురాలు ప్రొఫెసర్ కాత్యాయనీ విద్మహే మాట్లాడుతూ.. విప్లవోద్యమ అమరులను తలచుకోవడం ఉత్తమ సంప్రదాయమని, వియుక్క కథలను తెలుగు సమాజాన్ని ప్రభావితం చేయగలవని అన్నారు. అజ్ఞాత రచయిత్రులు రాసిన వియుక్క (ఆదివాసీ భాషలో వేగుచుక్క)కథల పుస్తకాలను హరగోపాల్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. తొలుత అమరుల స్తూపావిష్కరణ సబిత చేయగా ఆట పాటలతో అమరులకు నివాళులర్పించారు.సదస్సులో అమరుల బంధు మిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అంజమ్మ, ప్రధాన కార్యదర్శి పద్మకుమారి, విరసం అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ, వీక్షణం ఎడిటర్ ఎన్. వేణుగోపాల్, ప్రజా సంఘాల నాయకులు పాణి, బి. అనురాధ, సంధ్య, సత్య, రమక్క, ఉషా, రేణుక,శాంత, భవాని, హుస్సేన్, తంగెళ్ల సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఏర్పాట్లు పకడ్బందిగా ఉండాలి

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), మార్చి 2: వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలోని ఆలయాల్లో శివరాత్రి ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. శనివారం హనుమకొండలోని బల్దియా ప్రధాన కార్యాలయంలో ఆమె అధికారులతో ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. నగర పరిధిలోని 70 ఆలయాల్లో భక్తుల సౌకర్యార్థం విద్యుత్, తాగునీరు తదితర ఏర్పాట్లు చేయాలని సూచించారు.

రిజిస్ట్రార్ చాంబర్‌లో పార్టుటైమ్ అధ్యాపకుల బైఠాయింపు

కేయూ క్యాంపస్, మార్చి 2: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం కేయూ రిజిస్ట్రార్ చాంబర్‌లో పార్టుటైమ్ అధ్యాపకులు నిరసనలు చేపట్టారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డికి తమ సమస్యలను విన్నవించారు. పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తమకు పీరియడ్‌కు రూ వెయ్యికి పెంచాలని, అర్హతలు కల్గిన వారికీ కాంట్రాక్టు అధ్యాపకులుగా అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్‌తో చర్చించి పార్టుటైం అధ్యాపకుల సమస్యలను పరిష్కరిస్తామని రిజిస్ట్రార్ మల్లారెడ్డి హామీ ఇచ్చినట్లు పార్టుటైం అధ్యాపకుల సంఘం నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలోపార్టుటైం అధ్యాపకుల సంఘం నాయకులు, పార్టుటైం అధ్యాపకులు పాల్గొన్నారు.

కేయూలో రెండు రోజుల ఇంజనీరింగ్ ఫెస్టివల్

కేయూ క్యాంపస్, మార్చి 2: ఈ నెల 6, 7 తేదీల్లో కేయూ మహిళ ఇంజనీరింగ్ కళాశాల నేతృత్వంలో రెండురోజులపాటు ఇంజనీరింగ్ టెక్నికల్ ఫెస్టివల్ రూబీజెస్ట్-24 నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మంచాల సదానందం తెలిపారు. ఫెస్టివల్‌కు సంబంధించిన పోస్టర్‌ను శనివారం కేయూ క్యాంపస్‌లోని వీసీ లాడ్జ్‌లో వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ఆవిష్కరించారు. రెండు రోజుల పాటు జరిగే సదస్సుల్లో ఇంజనీరంగ్‌లో వస్తున్న మార్పులు, టెక్నికల్ ప్రజంటేషన్, పోస్టర్ ప్రజంటేషన్, ఇంజనీరింగ్ అంశాలపై అనుభవజ్ఞులతో చర్చలు, ఇష్టాగోష్ఠులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెండో రోజు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు, విద్యార్థులతో ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు పోటీలు ఏర్పాటు చేశారు. మరిన్ని వివరాలకు కేయూ వెబ్‌సైట్ https://kakatiya.ac.in/లో చూడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, ఒప్పంద అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధులకు డే కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలి

హనుమకొండ సిటీ, మార్చి 2: వయో వృద్ధుల కోసం డే కేర్ సెంటర్లు, విశ్రాంతి కేంద్రాలు విరివిగా ఏర్పాటు చేయాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని కలిసి శాలువాతో సన్మానించారు. ఈసందర్భంగా పలు అంశాలపై విజ్ఞప్తి చేశారు. కాళోజీ కళాక్షేత్రాన్ని త్వరగా పూర్తి చేయాలని, హంటర్‌రోడ్డులోని రీజినల్ సైన్స్ సెంటర్‌ను పూర్తిస్థాయిలో విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని, శిల్పారామం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలనే తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు తేరాల యుగంధర్, కార్యదర్శి చిదురాల సత్యనారాయణ పాల్గొన్నారు.

హరితకాకతీయలో అగ్నిప్రమాదం

హనుమకొండ క్రైం, మార్చి 2: హరిత కాకతీయ హోటల్‌లో శనివారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. కిచెన్‌లో నుంచి ఒక్కసారిగా మంటలు ఎగిసి పడడంతో అక్కడ పనిచేస్తున్న సిబ్బంది ఉలిక్కిపడ్డారు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి నాగరాజు, హరిత కాకతీయ హోటల్ సిబ్బంది తెలిసిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. శనివారం హరిత కాకతీయలో ఎవరి పనుల్లో వారు నిమగ్నమయ్యారు. వంట గదిలోని స్మోక్ డక్ట్‌ని శుభ్రం చేస్తున్న క్రమంలో అనుకోకుండా బోయర్ ఆన్ అయ్యింది. ఈ క్రమంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుందని వెల్లడించారు. వెంటనే అగ్నిమాపక శాఖకు ఫోన్ ద్వారా సమాచారం అందడంతో అక్కడికి చేరుకుని నీటిలో మంటలను పూర్తిగా ఆర్పివేసి అదుపులోకి తీసుకున్నారు. ఎవరికి ఎలాంటి గాయాలు, ప్రాణనష్టం జరుగలేదు. ఆస్తినష్టం కూడా జరగలేదని నాగరాజు తెలిపారు. మంటలను ఆర్పిన వారిలో ఫైర్ సిబ్బంది జనార్దన్, వెంకటేశ్వర్లు, రూప్‌సింగ్, ఎమ్డీ యాకూబ్, రహీమ్‌లు ఉన్నారు.

టీజీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడికి సన్మానం

హనుమకొండ రూరల్, మార్చి 2: టీజీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఎన్నమనేని జగన్‌మోహన్‌రావుకు శనివారం హనుమకొండలోని టీజీవో భవన్‌లో ఆత్మీయ అభినందన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రావును శాలువా కప్పి గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీజీవో వరంగల్ జిల్లా అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, అంజాద్ అలీ, సామ్యూల్, డాక్టర్ ప్రవీణ్ కుమార్, ఫణికుమార్, ఆంజనేయులు, రఫీ, దామోదరస్వామి, రామిరెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

హనుమకొండ రూరల్, మార్చి 2: జాతీయ పల్స్‌పోలియో కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ రాధిక గుప్తా సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో ఈ నెల 3వ తేదీన (ఆదివారం) నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమ బ్యానర్, పోస్టర్‌లను ఆవిష్కరించి మాట్లాడారు. 0-5 సంవత్సరాలలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ట్రైయినీ ఐపీఎస్ శుభం నాగరాలే, డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.సాంబశివరావు, జిల్లా ఇన్‌చార్జి ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ వాణిశ్రీ, జిల్లా వ్యాక్సిన్ మేనేజర్ అనిశెట్టి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ అకడమిక్ డీన్‌గా హన్మంతు

కేయూ క్యాంపస్, మార్చి 2: కేయూ అకడమిక్ ఆడిట్ డీన్‌గా కేయూ కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ జి.హన్మంతు శనివారం బాధ్యతలు చేపట్టారు. శనివారం కేయూ అకడమిక్ డీన్ కార్యాలయంలో ఇప్పటివరకు డీన్‌గా కొనసాగిన డాక్టర్ జి.షమిత వద్ద నుంచి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా హన్మంతును క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బానోతు సురేశ్‌లాల్, ఏఆర్ హబీబ్, ఆర్‌సీ అభినందించారు.

బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వానికి మాజీ కార్పొరేటర్ రాజీనామా

మడికొండ, మార్చి 2: కాజీపేట మండలం కడిపికొండకు చెందిన మాజీ కార్పొరేటర్ బస్కె శ్రీలేఖ - క్రిష్ణ దంపతులు బీఆర్‌ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వాకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. 2016లో జీడబ్ల్యూఎంసీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొంది టీఆర్‌ఎస్‌లో చేరి పార్టీకి ప్రాతినిధ్యం వహించినట్లు పేర్కొన్నారు. కాగా పార్టీలో తమకు సరైన ప్రాధాన్యత, గుర్తింపు లభించకపోవడంతో అందులో ఇమడలేక పార్టీని వీడుతున్నట్లు వారు స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం తమ రాజీనామా పత్రాన్ని మెయిల్‌లో పార్టీ అధినేత కేసీఆర్‌కు పంపినట్లు వారు తెలిపారు.

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం

ఐనవోలు, మార్చి 2: కరీంనగర్ బీజేపీ ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ పార్టీకి చెందిన గౌడ నాయకులు శనివారం ఐనవోలులో దహనం చేశారు. గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు నకరకంటి మోహన్‌గౌడ్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సమ్మెట మహేందర్‌గౌడ్, అరెల్లి రామ్‌గౌడ్, సత్యంగౌడ్, గడ్డం శ్రీనివాస్‌గౌడ్‌లు ఈ సందర్భంగా మాట్లాడుతూ గౌడ బిడ్డ రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబాన్ని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ రాజకీయలబ్ధి కోసం విమర్శించడం సిగ్గుచేటన్నారు. గౌడ బిడ్డల ఆత్మగౌరవం దెబ్బతినేలా ఎవరు వాఖ్యానించినా సహించేదిలేదన్నారు. బండి సంజయ్ వెంటనే మంత్రి కుటుంబానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో నాయకులు కత్తి దేవేందర్‌గౌడ్, తాళ్లపల్లి వెంకన్నగౌడ్, బండి సంపత్‌గౌడ్, బొల్లేపల్లి సంపత్‌గౌడ్, చీకటి శ్రీనివాస్‌గౌడ్, మదూరి రాజ్‌గౌడ్, రాజుగౌడ్, రంగు శ్రీనివాస్‌గౌడ్, రవి గౌడ్, మోడెం రాజుగౌడ్, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగులతో పుట్టినరోజు జరుపుకోవడం ఆనందంగా ఉంది

సుబేదారి, మార్చి 2: దివ్యాంగుల మధ్య పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందని బీజేపీ తెలంగాణ అధికార ప్రతినిధి, మాజీ డీజీపీ కృష్ణ ప్రసాద్ అన్నారు. ఆయన జన్మదిన వేడుకలు హన్మకొండ బాలసముద్రంలోని మల్లికాంబ మనో వికాస కేంద్రంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులైన పిల్లలతో కలిసి కృష్ణప్రసాద్ కేక్ కట్ చేశారు. అనంతరం మానసిక దివ్యాంగులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా పిల్లలకు వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకురాలు బండా రామలీల, బండా సదానందం, కోడం కళ్యాణ్, రాధికారెడ్డి, మల్లికాంబ సిబ్బంది పాల్గొన్నారు.

నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆవిర్భావం

హనుమకొండ, మార్చి 2: ఇటీవల రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన తెలంగాణ నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ వరంగల్ జిల్లాలో పనిచేస్తున్న నర్సింగ్ సిబ్బందితో నూతన కమిటీని శనివారం ఏర్పాటు చేసుకున్నారు. వరంగల్ జిల్లా అధ్యక్షులుగా కె.సుధామణి, ప్రధాన కార్యదర్శిగా ఇ.సంపూర్ణ, కోశాధికారిగా టి.స్వరూపరాణి, ఉపాధ్యక్షులుగా సీహెచ్.ప్రమీల, వి.కవిత, ఎస్.ఉమ, ఎన్.లక్ష్మీకాంతం, ఇ.విష్ణుకుమార్, ఎన్.అనిల్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్.రమాదేవి, కె.పుష్పవతి, ఆర్.సుభాషిణిలను ఎన్నుకున్నారు. ఈ కమిటీని రాష్ట్రశాఖ ఆమోదం తెలిపిందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రవికిరణ్, ప్రధాన కార్యదర్శి శివసాయికృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.సుజీవన్ తెలిపారు.

సైబర్ నేరస్తుల చేతివాటం

ఆన్‌లైన్‌లో పలువురి డబ్బులు స్వాహా

హనుమకొండ క్రైం, మార్చి 2: హనుమకొండ పోలీసు స్టేషన్ పరిధిలో సైబర్ నేరస్తులు చేతివాటం ప్రదర్శించారు. కమిషనరేట్ పరిధిలో పలు పోలీసు స్టేషన్‌లలో సైబర్ నేరాలు చోటు చేసుకుని బాధితులు పెద్ద ఎత్తున డబ్బులు పోగొట్టుకోగా హనుమకొండ పీఎస్ పరిధిలో ఒకే రోజు ముగ్గురు వ్యక్తుల నుంచి గుర్తుతెలియని సైబర్ నేరస్తులు డబ్బులు కాజేశారు. దీంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. శనివారం జరిగిన పలు సైబర్ నేరాలపై పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

న్యూ రాయపురలో..

న్యూరాయపురకు చెందిన సఫత్ ఆరిఫా అనే మహిళ ఆన్‌లైన్‌లో డిజైనర్ లెహంగా అనే యాప్‌లో కొన్ని వస్తువులు ఆర్డర్ చేసింది. వారం కిందట ఈ- కర్ట్ ద్వారా ఓపార్సిల్ వచ్చింది. వస్తువులు నాసిరకంగా ఉన్నాయని, తిరిగి పంపించాలని చెప్పడంలో తెచ్చిన వస్తువులు తీసుకుని తిరిగి వెళ్లిపోయాడు. మర్నాడు వస్తువుల డబ్బులు కావాలంటే ఒక ఓటీపీ చెప్పాలని సూచించారు. చెప్పడంలో ముందుగా ఆమె బ్యాంకు నుంచి రూ.5వేలు డ్రా చేసినట్టు మెసేజ్ వచ్చింది. ఇదేమిటని అడుగగా ప్రాసెస్ అవుతోంది.. తిరిగి మరో ఓటీపీ చెప్పాలని కోరడంతో మరో రూ.5వేలు డ్రా అయ్యాయి. మొత్తంగా రూ.20వేలు మోసపోయింది. తర్వాత వారు సైట్ పనిచేయకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

రూ.2.85లక్షలు స్వాహా..

హనుమకొండ గుడిబండల్ ప్రాంతానికి చెందిన గోరంట్ల భరత్ అనే వ్యక్తికి గుర్తు తెలియని ఒక వ్యక్తి ఫోన్ చేయడంతో స్పందించాడు. తమ బ్యాంకులో డబ్బులు డిపాజిట్ చేస్తే ప్రతీ రోజు 5 శాతం అధిక వడ్డీ ఇస్తామని చెప్పడంతో నమ్మిపోయి విడతల వారిగా రూ.2.85లక్షలు వారి బ్యాంకుకు ట్రాన్స్‌ఫర్ చేశాడు. మర్నాడు డబ్బులు వడ్డీ ఎప్పుడు ఇస్తారు? అని కోరడంతో వారు డబ్బులు ఇవ్వకుండా వాయిదా వేస్తూ దాటవేస్తూ వచ్చారు. కొద్ది రోజుల తర్వాత వారి ఫోన్ పని చేయక పోవడంతో మోసపోయానని తెలిసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

వ్యవసాయ పరికరాల పేరుతో..

వ్యవసాయ పరికరాలు ఆన్‌లైన్‌లో తక్కువ ధరకు దొరుకుతాయని మోసం చేసిన ఘటన హనుమకొండ కొత్తూరు జెండాలో చోటు చేసుకుంది. కొత్తూరు జెండాకు చెందిన దొగ్గెల తిరుపతి అనే వ్యక్తి గూగుల్‌లో ఫార్మింగ్ అప్లికేషన్‌లో సెర్చ్ చేసి వ్యవసాయ పరికరాలపై వివరాలను తెలుసుకున్నాడు. తక్కువ ధరకు వస్తున్న వ్యవసాయ పరికరాలను కొనుగోలు చేసేందుకు విడతల వారిగా రూ. 39 వేలు పంపించాడు. కొద్ది రోజుల తర్వాత వ్యవసాయ పరికరాలు రాకపోవడంతో పాటు వారి ఫోన్ పని చేయకుండా పోయింది. దీంతో మోసపోయినట్టు తెలిసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

శ్రీపాదరావు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తారు..

శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్



శ్రీపాదరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బండా ప్రకాశ్, నాయిని రాజేందర్‌రెడ్డి, ఇతర అధికారులు

హనుమకొండ రూరల్, మార్చి 2: ఎన్నో పదవులు నిర్వర్తించి ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించిన మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు ఎప్పటికీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తారని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని స మావేశపు మందిరంలో మాజీ స్పీకర్ శ్రీపా దరావు జయంతిని వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపాదరావు చిత్రపటానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి డాక్ట ర్ బండా ప్రకాశ్ పూలమాలలు వేసి ఘనంగా నివా ళులర్పించారు. అనంతరం అదనపు కలెక్టర్ రాధికా గుప్తా అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బండా ప్రకాశ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా నియోజక వర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంతోపాటు ప్రజ లకు అనేక సేవలు అందించారని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శాసనసభ స్పీకర్‌గా పని చేయడం గొప్ప విషయమని, శాసనసభను నడిపించడంలో స్పీకర్‌గా శ్రీపాదరావు హుందాగా వ్యవహరించేవారని పేర్కొన్నారు. శ్రీపాదరావుకు ఉమ్మడి వరంగల్ జిల్లాతో అనుబంధం ఉందని, గతంలో ఆయనతో కలిసి కొన్నిసార్లు పనిచేసే అవకాశం కలిగిందని బండా ప్రకాశ్ గుర్తు చేశారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. దుద్దిళ్ల శ్రీపాదరావు సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టి ఎన్నో పదవులు చేపట్టి ఆదర్శప్రాయం గా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ట్రైయినీ ఐపీఎస్ శుభం నాగరాలే, డీఆర్ఓ వైవి గణేష్, డీఆర్‌డీవో నాగపద్మజ, జిల్లా అగ్నిమాపక అధికారి భగవాన్ రెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు, డీఎస్ఓ వసంతలక్ష్మీ, అగ్రికల్చర్ జేడీ రవీందర్‌సింగ్, బీసీ వెల్ఫేర్ డీడీ రాంరెడ్డి, గంగు ఉపేంద్ర శర్మ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వైభవంగా శివరాత్రి వేడుకలు నిర్వహించాలి

పోస్టర్ ఆవిష్కరణలో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

హనుమకొండ, మార్చి 2: వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో మహాశివరాత్రి వేడుకలను ఈనెల 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. దీనికి నగరంలోని మునిసిపల్, పోలీస్, ఆర్అండ్‌బీ, పురావస్తు, దేవాదాయశాఖలు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. శనివారం ఆలయ ప్రాంగణం లోని కుడా గార్డెన్స్‌లో మహాశివరాత్రి వేడుకల ప్రచార వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. స్థానిక కార్పొరేటర్ తోట వెంకన్న, దాత గుజ్జ సంపత్ రావు, ఏసీపీ దేవేందర్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ, ఈవో వెంకటయ్య తదితరుల సమక్షంలో ఆయన ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం మీడియాలో మాట్లాడారు. ఈనెల 8న జరిగే మహాశివ రాత్రి వేడుకలను లక్షలాదిగా భక్తులు తెల్లవారు జామునుంచే తరలివస్తున్నందన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ మాట్లాడుతూ.. 8వ తేదీ శివరాత్రి రుద్రేశ్వర కల్యాణం, 9న నాగబెల్లి, 10న అన్నపూజ, 11వ తేదీన చందనోత్సవం, ఆకుపూజ, మహా పూర్ణాహుతి నిర్వహిస్తామన్నారు. స్వామివారి కల్యాణంలో రూ.వేయి116లు చెల్లించి భక్తులు ఎవరైనా పాల్గొనవచ్చని ఆయన సూచించారు. జాగరణ ఉండే భక్తుల కోసం ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేయాలి

హనుమకొండ రూరల్ : ఈ నెల 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ రాధిక గుప్తా అధి కారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా మాట్లాడుతూ.. మహాశివరాత్రిని పురస్కరించుకొని వేయిస్తంభాల దేవాలయం, మడికొండలోని శ్రీ మెట్టు రామలింగేశ్వరస్వామి దేవాలయాల్లో ఏర్పాట్లను సమన్వయంతో పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ట్రైయినీ ఐపీఎస్ శుభం నాగరాలే, డీఆర్ఓ వైవి. గణేష్, వేయిస్తంభాల దేవాలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ, మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయ అర్చకులు అభిలాష్, విష్ణు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అవినాష్ కళాశాలపై పీడీఎస్‌యూ నాయకుల ఫిర్యాదు

కేయూ క్యాంపస్, మార్చి 2: హనుమకొండలో అనుమతి లేకుండా నడుస్తున్న అవినాష్ జూనియర్, డిగ్రీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డికి పీడీఎస్‌యూ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు ఎం.వెంకట్‌రెడ్డి, బి.సంతోష్, రంజిత్, మహేశ్, పవన్, రవితేజ, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మగడ్డలో తండ్రీ కొడుకులపై దాడి

హనుమకొండ క్రైం, మార్చి 2: టీ డబ్బులు అడిగినందుకు హనుమకొండ పెద్దమ్మగడ్డలో తండ్రీకొడుకులపై ఒకరు దాడి చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దమ్మగడ్డకు చెందిన దుంపెల్లి ఐలయ్య టీ తాగేందుకు శనివారం రోడ్డు మీదకు వెళ్లాడు. ఇనుముల బాబు అనే వ్యక్తి ఐలయ్యకు ఎదురుగా వెళ్లి టీ డబ్బులు కావాలని కోరాడు. డబ్బులు లేవని చెప్పడంతో దాడికి దిగాడు. ఇదేమిటని ఐలయ్య కుమారుడు రమేష్ వెళ్లగా రమేష్‌ను కూడా ఇటుకలతో దాడి చేశాడు. తండ్రీ కొడుకులు రక్తం దుస్తులతో పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఇద్దరిపై దాడికి పాల్పడిన బాబుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఓడిపోయిన క్రీడాకారులు నిరాశ చెందొద్దు

సుబేదారి, మార్చి 2: ఓడిపోయిన క్రీడాకారులు నిరాశ చెందొద్దని, రాబోయే క్రీడా పోటీల్లో మళ్లీ ఆత్మవిశ్వాసంతో ఆడి గెలవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా క్రీడాకారులకు సూచించారు. సుబేదారిలోని ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాల మైదానంలో వారం రోజులుగా జరుగుతున్న రాము స్మారక క్రికెట్ టోర్నమెంట్ పోటీలు శనివారం ముగిశాయి. ఫైనల్ మ్యాచ్ వరంగల్‌కు చెందిన తోట లయన్స్, కాజీపేట దర్గాకు చెందిన బీబీ-11 జట్ల మధ్య జరిగింది. హోరాహోరీగా జరిగిన ఈ మ్యాచ్‌లో తోట లయన్స్‌పై బీబీ-11 జట్టు 5 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఫైనల్ మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్ క్రీడాకారులకు ట్రోఫీలు అందజేశారు. అనంతరం జిల్లా క్రికెట్ సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి, టోర్నమెంట్ నిర్వాహకులు మార్నేని ఉదయభానురావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి, మాజీ ప్రిన్సిపాల్ బన్న ఐలయ్య, విద్యావేత్త జన్ను పరంజ్యోతి, ఉద్యోగ సంఘాల నాయకుడు జగన్‌మోహన్‌రావు, సీనియర్ రంజీ క్రీడాకారుడు జయచందర్, తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ తాళ్లపెల్లి జైపాల్, టోర్నమెంట్ ఆర్గనైజర్లు, బండారి ప్రభాకర్, మట్టెడ కుమార్, సుమన్, సదానందం యాదవ్, వెంకట్, డీఎస్ఓ కోచ్ అఫ్జల్, క్రాంతిలు పాల్గొన్నారు.

ఏకశిల హైస్కూల్‌లో ఫుడ్ ఫెస్టివల్



ఫుడ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న విద్యార్థులు

హనుమకొండ రూరల్, మార్చి 2: హనుమకొండ కేయూసీ రోడ్‌లోని ఏకశిల హైస్కూల్‌లో ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ పండగలకు సంబంధించిన ఆహార పదార్థాలు పులిహోర, దద్దోజనం, కేసరి, సేమియా, పరమాన్నం, బక్ష్యాలు, గారెలు, లడ్డూలు, మిల్లెట్స్ కేక్‌తోపాటు వివిధ రకాల పిండి వంటలు తల్లిదండ్రుల సహకారంతో తయారు చేసుకొచ్చారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. మారుతున్న జీవన విధానంలో ఆహారపు అలవాట్లలో కూడా చాలా మార్పులు వచ్చాయన్నారు. మన సాంప్రదాయ వంటకాల్లో అనేక రహస్యాలు దాగున్నాయని, పూర్వం పెద్దలు ఎంతు వయస్సు వచ్చినా ఆరోగ్యంగా ఉండేవారని తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏకశిల డైరెక్టర్ బేతి కొండల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బేతి శైలజారెడ్డి, ఉపాధ్యాయులు స్వప్న, స్వాతి, కల్పన, జ్యోతి, మమత, వేణుగోపాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి మిల్క్ యూనియన్లు ఏర్పాటు చేయాలి

హనుమకొండ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): విజయ డైయిరీ అభివృద్ధికి పాడి రైతుల భాగస్వామ్యంతో జిల్లా స్థాయి మిల్క్ యూనియన్లు ఏర్పాటు చేయాలని విజయ కాకతీయ పాడి రైతుల సంక్షేమ సంఘం పాడిపారిశ్రామికాభివృద్ధి సహకార సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్‌కు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శనివారం వరంగల్ మిల్క్ షెడ్ డిప్యూటీ డైరెక్టర్ విజయ్ ద్వారా సంఘం నాయకులు ఒక వినతి పత్రాన్ని పంపించారు. తెలంగాణ రాష్ట్ర పాడిపారిశ్రమ సమాఖ్య (విజయ డైయిరీ) సహకార రంగంలో పాడి రైతుల భాగస్వామ్యంతో ఏర్పాటైందని, కానీ క్షేత్ర స్థాయిలో డైయిరీ నిర్వహణలో వారి భాగస్వామ్యం లేనందువల్ల ఆశించిన మేర విజయ డైయిరీ అభివృద్ధి చెందడం లేదని విజయ కాకతీయ పాడి రైతుల సంఘం అధ్యక్షుడు ఇరుకు దేవేందర్ రావు, ఉపాధ్యక్షుడు ఎస్.రత్నాకర్‌రావు, కార్యదర్శి రాసాల నర్సయ్యతో పాటు పలువురు పాడి రైతుల సంఘం ప్రతినిధులు ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. అంతకు ముందు హనుమకొండలోని విజయడైరీ మిల్క్‌షెడ్‌లో విజయ డైయిరీ డిప్యూటీ డైరెక్టర్ విజయ్‌తో పాడి రైతు సంఘాల నాయకులు సమావేశం అయ్యారు. పాడి రైతుల సమస్యలపై చర్చించారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని డిడి విజయ్ హామీ ఇచ్చారు.

7 రోజుల శిక్షణ తరగతులు ప్రారంభం

ఐనవోలు, మార్చి 2: మహిళా రైతులు పండిచిన కూరగాయాలను సోలార్ డ్రైయింగ్ సాంకేతికతతో (సౌరశక్తితో ఎండబెట్టి) విదేశాలకు ఎగుమతి చేసి మంచి లాభాలు పొందవచ్చని నాబార్డు డీడీఎం చంద్రశేఖర్ సూచించారు. నాబార్డు సహకారంతో సహాయ సోషల్ సర్వీస్ సేవా సొసైటీ ఆధ్వర్యంలో ఎల్ఈడీపీ కార్యక్రమంలో భాగంగా ఎస్‌హెచ్‌జీ మహిళా రైతులకు సోలార్ డ్రైయింగ్ సాంకేతికతతో కూరగాయాలు విదేశాలకు ఎగుమతి చేసే విధానంపై 7 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని శనివారం రాంనగర్ రైతు వేదికలో ప్రారంభించారు. కక్కిరాలపల్లి, రానంగర్, పెరుమాండ్లగూడెం, గర్మిళ్లపల్లి గ్రామాలకు చెందిన 120 మంది మహిళా రైతులు 4 గ్రూపులుగా శిక్షణ పొందనున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హజరైన డీడీఎం మాట్లాడుతూ.. కూరగాయాలు పండించే రైతులు కొన్ని సందర్భాల్లో మార్కెట్‌లో సరైన ధర లభించనప్పుడు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఆ నష్టాలను అధిగమించేందుకు పండించిన టమాట, బెండ, వంకాయ, కాకర, మునక్కాయ, కరివేపాకు, నిమ్మ, మామిడి తదితర రకాలను సోలార్ డ్రైయర్‌లో పెట్టి 1-2 రోజులలో పూర్తిగా డ్రై చేసి విదేశాలకు ఎగుమతి చేస్తే అధిక లాభాలు లభిస్తాయని తెలిపారు. దీనికి కరెంట్ ఖర్చు లేదని ఈ సాంకేతికతను మహిళా రైతులకు నేర్పించిన అనంతరం వారు స్వతహాగా చేసుకునేందుకు రుణసౌకర్యంపై ఎండబెట్టే డ్రైయర్‌లను ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెలి శ్రీరాములు, ఏడీఏ దామోదర్ రెడ్డి, ఉద్యానశాఖ అధికారి మానస, ఏవో కవిత, ఐనవోలు రైతు ఉత్పత్తి దారుల సంఘం డైరక్టర్లు భిక్షపతి, యాకుబ్, మోహన్, సొసైటీ కార్యదర్శి విజయ్‌కుమార్, సిబ్బంది కరుణ, సంపత్‌కుమార్‌లు పాల్గొన్నారు.

9వ తేదీలోగా ధరణి పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

హనుమకొండ రూరల్, మార్చి 2: ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి తహసీల్దార్లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ చాంబర్‌లో జిల్లాలోని తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై గ్రామాల్లో ప్రత్యేక బృందాలు సర్వే చేస్తున్నాయని తెలిపారు. ఈ నెల 9వ తేదీ వరకు ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో పరకాల ఆర్డీవో నారాయణ, వివిధ మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌గా వెంకట్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా ఎ.వెంకట్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ యన సూర్యాపేట నుంచి బదిలీపై హనుమకొండ జిల్లాకు వచ్చారు. ప్రస్తుతం ఇక్కడ అదనపు కలెక్టర్‌గా పనిచేసిన మహేందర్‌జీ ములుగు జిల్లాకు బదిలీపై వెళ్లారు. కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ కార్యాలయంలో వెంకట్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

మాదిగలకు అన్ని పార్టీలు ఎంపీ టికెట్ ఇవ్వాలి

సుబేదారి, మార్చి2: రాబోయే ఎంపీ ఎన్నికలలో వరంగల్ ఎంపీ టికెట్‌ను అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకు కేటాయించాలని ఎమ్మెస్పీ జాతీయ అధికార ప్రతినిధి మంద కుమార్ మాదిగ కోరారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని దీన్‌దయాల్‌నగర్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మంద కుమార్ మాదిగ మాట్లాడారు. వరంగల్ ఎంపీ స్థానంలో మాదిగలు ఎక్కువగా ఉన్నారని, మాదిగలకు టికెట్ ఇస్తే ఘన విజయం సాధిస్తారన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాదిగలను మోసం చేసిందని, కాంగ్రెస్ పార్టీ మాదిగల ప్రాధాన్యం తగ్గిస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు సుకుమార్, ఎమ్మెస్పీ నాయకులు సూరన్న, ఎంఆర్‌పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు దినేష్, సురేందర్, శివ, కిరణ్, పున్నం చందర్, దిలిప్ తదితరులు పాల్గొన్నారు.

సండే సెలబ్రిటీ



వెన్నెల కిషోర్... ఈ పేరు వినబడగానే వెటకారం కళ్లముందు కనిపిస్తుంది. సాధారణంగా మీడియాకు దూరంగా ఉండే కిషోర్... 'నేను చాలా ప్రైవేట్ పర్సన్‌ని' అంటారు. 'నేను రైటర్‌పై ఆధారపడ్డ యాక్టర్‌ని. నా అంతట నేను కామెడీ సృష్టించలేను' అనే వెన్నెల కిషోర్ నటించిన 'చారి 116' ఇటీవల విడుదలయింది. ఈ సందర్భంగా ఆయన 'నవ్య'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ.

కామెడీ చాలా సీరియస్ విషయం

అమెరికా అలా వెళ్లా...

మాది కామారెడ్డి. నాన్న స్కూలు టీచర్. నేను ఏడో తరగతి చదువుతున్నప్పుడే రిటైరైపోయారు. అంటే మాకు ఎంత గ్యాప్ ఉందో అర్థం చేసుకోవచ్చు. నలుగురు అక్కల తర్వాత పదేళ్లకు నేను పుట్టా. అందువల్ల అమ్మ అమ్మమ్మలాగ.. అక్క అమ్మలాగ కనిపించేది. దాంతో అక్కల పట్ల గౌరవం ఎక్కువగా ఉండేది. ఇక చదువంటారా... ముందు ఎంపీసీ తీసుకున్నా. ఏడాది చదివి వదిలేశా. ఆ తర్వాత బైపీసీ తీసుకుని రెండేళ్లు చదివా. ఎంసెట్ రాదనిపించింది. బీకాం చేశా. ఆ తర్వాత అమెరికాకు వెళ్లాలనిపించింది. కానీ అమెరికాకు వెళ్లాలంటే 16 ఏళ్ల చదువు కావాలి. నాలాంటివాళ్ల కోసమే అన్నట్లు అప్పట్లో ఒక ఏడాది కోర్సు ఉండేది. ఆ తర్వాత దాన్ని బ్యాన్ చేశారు. ఆ కోర్సు చేసేసి అమెరికా వెళ్లి చదువుకొని.. ఉద్యోగం తెచ్చుకున్నా.

పక్కా తెలంగాణ...

నేను పుట్టి పెరిగింది కామారెడ్డిలో. అంటే పక్కా తెలంగాణవాడిని. 'బిందాస్' సినిమా దాకా నాకు విపరీతమైన తెలంగాణ యాస ఉండేది. డైలాగ్‌లు చెప్పటం కూడా కష్టంగానే ఉండేది. 'దూకుడు'లో శ్రీను వైట్ల నాకు ఒక భిన్నమైన పాత్ర ఇచ్చారు. మొదట చేయలేననుకున్నా. కానీ శ్రీను వైట్ల గారి ట్రైనింగ్‌లో చేసేశా. ఇప్పుడు నా యాస చూసి మా అక్కావాళ్లు... 'ఒరేయ్.. అసలు నువ్వు ఏం మాట్లాడుతున్నావ్' అంటూ ఉంటారు. ఇప్పుడు నేను తెలంగాణ వాడినని చెప్పినా ఎవరూ నమ్మరు. మీకో ఆసక్తికరమైన సంఘటన చెబుతా. 'జాతిరత్నాలు' తీసిన అనుదీప్ అసిస్టెంట్ ఒకరు సినిమా చేయాలనుకున్నాడు. నా దగ్గరకు వచ్చి... 'సార్.. ఇది ఒక ఛాలెంజింగ్ రోల్. సినిమా మొత్తం తెలంగాణ యాసలోనే మాట్లాడాలి' అన్నాడు. నాది పక్కా తెలంగాణ అని చెబితే షాక్ అయ్యాడు.

రెన్యూవల్ చేసుకోవాలి...

వెబ్ సిరీస్‌లు.. ఓటీటీ సినిమాలవల్ల ప్రస్తుతం కమేడియన్స్‌కు చాలా బాగుంది. అందరికీ అవకాశాలు ఉన్నాయి. అయితే కాసినోలో పోకర్ మాదిరిగా అదృష్టం కూడా కలిసిరావాలి. మేమందరం ప్రతి ఏడాది ప్రేక్షకులకు గుర్తిండిపోయే ఒక సినిమా ఇవ్వాలి. బస్ పాస్‌ల మాదిరిగా మా కెరీర్‌లు రెన్యూవల్ చేయించుకోవాలి. లేకపోతే ప్రేక్షకులు మమ్మల్ని మర్చిపోతారు.

బెస్ట్ కాంప్లిమెంట్...

'గీతగోవిందం' సినిమా తర్వాత మహేష్ గారు.. 'కిషోర్ ఈజ్ వెరీ ఎంటర్‌టైనింగ్' అని ఒక ట్వీట్ పెట్టారు. అలాగే ఒక సభలో చిరంజీవిగారు... 'కిషోర్ మొహంలో ఒక వెటకారం ఉంటుంది' అన్నారు. ఈ రెండూ మర్చిపోలేని ప్రశంసలు.

కామెడీని సృష్టించటం చాలా సీరియస్ విషయమా?

అవును. నేను కామెడీని కూడా సీరియస్ సీన్ లాగానే తీసుకుంటా. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. నేను రైటర్‌పై ఆధారపడ్డ యాక్టర్‌ని. సీన్‌లో ఏం చేయాలనే విషయం కనీసం 50 శాతమైన రైటర్ నుంచి రావాలి. నా అంతట నేను కామెడీని సృష్టించలేదు. బ్రహ్మానందంగారు.. ఆలీగారు.. సునీల్‌గారు.. తాజాగా సత్యలాంటి కమేడియన్స్ వేరు. వాళ్లు ఇతరులను బాగా ఇమిటేట్ చేస్తారు. కానీ నేను అలా కాదు. టైమింగ్ మీద ఆధారపడ్డ నటుడిని.

కిషోర్... 'వెన్నెల' కిషోర్ కావటం వెనకున్న కథేమిటి?

ఈ క్రెడిటంతా దర్శకుడు దేవ కట్టకు చెందుతుంది. 'వెన్నెల' సినిమాకు నేను సహ రచయితను. అమెరికాలో షూటింగ్. ఆ సినిమాలో నేను



వేసిన పాత్ర శివారెడ్డిగారు వేయాలి. కానీ ఆయనకు వీసా రిజెక్ట్ అయింది. అప్పటికే సీనియర్ యాక్టర్స్ అందరూ డేట్‌లు ఇచ్చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో నేను నటించా. వాస్తవానికి నటన నా గోల్ కాదు. ఆ సమయంలో నేను ఒక విధమైన రెక్లెస్‌గా ఉండేవాడిని. చేస్తే పోయిందేమీ లేదనుకున్నా. ఆ సినిమాలో పాత్ర కూడా రెక్లెస్‌గా ఉంటుంది. అందువల్ల బాగా నప్పింది. ఆ తర్వాత 'ఇందుమతి, బిందాస్' వంటి చిత్రాలు మంచి పేరు తెచ్చాయి. 'దూకుడు' తర్వాత ఉద్యోగం మానేసి నటనలో స్థిరపడిపోయా!

మీరు డైరక్టర్‌లను పూర్తిగా ఫాలో అయిపోతారా?

అవును. యాక్టర్ సీను గురించి ఆలోచిస్తాడు. డైరక్టర్ మొత్తం సినిమా గురించి ఆలోచిస్తాడు. నేను ప్రేక్షకుల కోసం నటించను. షూటింగ్ పూర్తయిన తర్వాత రషస్ చూసి డైరక్టర్ సంతృప్తి చెందాడా? లేదా అని మాత్రమే ఆలోచిస్తా. కిషోర్ బాగా చేశాడన్నా.. ఓవర్ యాక్షన్ చేశాడన్నా... అన్ని కామెంట్స్ డైరక్టర్‌కే చెందుతాయి. 'గీతగోవిందం'లో అందరికీ కాళ్లు మొక్కే క్యారక్టర్ నాకు ముందు పెద్దగా నచ్చలేదు. కానీ ఆ క్యారెక్టర్ పెద్ద హిట్ అయింది.

ఒకప్పుడు కామెడీ ట్రాక్‌లు ఉండేవి. ఇప్పుడు ఉండటం లేదు కదా..!

ఇప్పుడు ప్రేక్షకులు కమేడియన్స్‌ను కేవలం హాస్యం పడించేవారుగా మాత్రమే చూడటం లేదు. వాళ్లు కథను ముందుకు తీసుకువెళ్లటంలో ఒక భాగం కావాలి. హీరోయిన్ బ్రదర్ కావచ్చు.. విలన్ పక్కన ఉండే చెంచా కావచ్చు. కానీ వాళ్ల కథ ముందుకు సాగటంలో ముఖ్యపాత్ర వహించాలి. ప్రేక్షకులు ఎప్పటికప్పుడు మారిపోతూ ఉంటారు. వారికి తగ్గట్టుగా కామెడీ ట్రాక్‌లు కూడా మారాలి. ఉదాహరణకు ఒక వ్యక్తిని బకరా చేయటం ఒకప్పుడు ఫ్యాషన్. సాధారణంగా ఈ పాత్రలు బ్రహ్మానందంగారు వేసేవారు. ప్రేక్షకులు విసిగిపోయారు. 'లక్ష్యం' తర్వాత బకరా క్యారెక్టర్లు హిట్ కావటం మానేసాయి. దీనితో రైటర్లు రాయటం మానేశారు. ఇలాగే ఎన్నారై పెళ్లికొడుకులు. ఈ ట్రాక్ కూడా ఈమధ్య కాలంలో కనిపించటంలేదు.

ఒక కమేడియన్‌కు ఏం కావాలి?

నా ఉద్దేశంలో టైమింగ్ చాలా ముఖ్యం. నేను నా డైలాగ్స్ మాత్రమే కాదు... ఇతరుల డైలాగ్స్ కూడా వింటాను. దీనివల్ల సీన్ చేసేటప్పుడు ఏదైనా గ్యాప్ వస్తే... దానిని పూరించటానికి వీలవుతుంది.

మీరు హీరో పాత్రలు వేయాలని ఎప్పుడూ అనుకోలేదా?

లేదు. ఎప్పుడూ నన్ను ఎవరైనా వెటకారం చేయాలి. నేను వేరేవాళ్లనైనా వెటకారం చేయాలి. భగ్నప్రేమికుల పాత్రలు.. అమ్మాయిల వెనక తిరిగే పాత్రలు నేను చేయలేను.

> **రైటర్స్ కనుమరుగవుతున్నారు**
> నేను రైటర్స్‌ను నమ్ముకున్నవాడిని. నా ఉద్దేశంలో మంచి రైటర్స్ కనుమరుగవుతున్నారు. మన ఇండస్ట్రీకి మరింత మంది రైటర్స్ అవసరం.

మీరు మీడియాలో ఎక్కువగా కనిపించరు...

నేను చాలా ప్రైవేట్ వ్యక్తిని. నా వ్యక్తిగత వివరాలు అందరితోనూ పంచుకోవటం నాకు ఇష్టం ఉండదు. విజయోత్సవ సభలకు కూడా వెళ్లను. దీనికి ఒక కారణం ఉంది. సాధారణంగా ఇలాంటి సభలకు కమేడియన్లను ఎందుకు పిలుస్తారంటే... వాళ్లు కొద్దిసేపు ప్రేక్షకులకు అలరిస్తారని. పైన చెప్పినట్లు నా అంతట నేను కామెడీ పండించలేను. ఎందుకంటే నేను స్టాండప్ కమేడియన్‌ను కాదు. బ్రహ్మానందంగారు, ఆలీగారు, బ్రహ్మాజీగారు తమ స్పీచ్‌ల ద్వారా కూడా ప్రేక్షకులను రంజిపచేయగలరు. నేను అలాంటి నటుడిని కాను. మొదట్లో ఒకటి రెండు ఫంక్షన్స్‌కు వెళ్లా. నాకు తత్వం బోధపడింది. ఇక్కడ మీకో సంఘటన చెబుతా. ఒక ప్రీరిలీజ్ ఫంక్షన్‌కు పేరు మోసిన కమేడియన్‌ను పిలిచారు. ఆయన తన స్పీచ్ మొదలుపెట్టాడు. 'హీరో గారి కళ్లు చూస్తే చాలు... ఆయన కమిట్‌మెంట్ అర్థమవుతుంది'... లాంటి మాటలతో స్పీచ్ దంచుతున్నాడు. కింద కూర్చుని ఉన్న ప్రొడ్యూసర్ పైకి వచ్చి మైకు లాక్కొని... 'నువ్వు కమేడియన్‌లా మాట్లాడు. హీరోలా మాట్లాడకు' అన్నాడు. ఇలాంటి సంఘటనలు మనకు జరగకుండా ఉండాలంటే మనకు తెలియని విషయాలలో తల దూర్చకూడదు.

> **అందరూ కలిసి**
> మేము మొత్తం 12 మంది కమేడియన్స్ ప్రతి నెలా రెండో శనివారం రాత్రి లేదా ఆదివారం కలుస్తాం. షూటింగ్‌లు.. పాత్రల గురించి తప్ప మిగిలిన విషయాలన్నీ మాట్లాడుకుంటాం. ఒక విధంగా ఇది మాకు డిటాక్స్ లాంటిది.

మీరు సోషల్ మీడియాలో కూడా ఎక్కువగా కనిపించరు..!

ఇన్‌స్టాలో మాత్రమే ఉన్నా. ఒకప్పుడు సోషల్ మీడియాలో యాక్టివ్‌గానే ఉండేవాడిని. రోజుకు ఏడెనిమిది గంటలు ఫోన్ మీదే గడిపేవాడిని. దీనివల్ల ఒక ప్రమాదం ఉంది. ఉదాహరణకు కమేడియన్ సత్య... అని సెర్చ్ మొదలుపెట్టి... సత్య నాదెళ్ల వివరాలు తెలుసుకొని... ఆయన తినే చిరుధాన్యాల మీద పరిశోధన చేసి... ఇలా ఒక దానివెనక మరొకటి చూసుకుంటూ వెళ్లిపోతాం. ఈ విషయాన్ని గ్రహించిన తర్వాత ఫోన్ చూడటం మానేశా. ఈమధ్య రెండు రోజులు ఇంట్లో ఫోన్ వదిలేసి వెళ్లిపోయా.

మీరు విమర్శలను సహృదయంతో తీసుకొంటారా?

విమర్శలు నన్ను పెద్దగా బాధించవు. వాటిని పట్టించుకోను. అదే సమయంలో వాటిలో ఏదైనా



నిజం ఉందా అనే విషయాన్ని గమనించి, గుణపాఠం నేర్చుకుంటా. నేను వచ్చిన కొత్తల్లో సోషల్ మీడియాలో... 'మీరు చాలా వేగంగా మాట్లాడతారు' అనే విమర్శ ఎక్కువగా వినిపించేది. నాకు నిజమేననిపించింది. ఆ తర్వాత రోజూ తెలుగు పేపర్ గట్టిగా చదివేవాడిని. కొన్ని మంత్రాలు ఉచ్చరించేవాడిని. అలా నా తీరు మార్చుకున్నా. టాలీవుడ్‌లో ఎక్కువ మంది విమర్శలను తీసుకోలేరు. చిన్న మాట అన్నా హర్ట్ అవుతారు. నేను అలా కాదు.

• సీవీఎల్ఎన్ ప్రసాద్



అలనాటి కథ

నిజాం నుంచి ప్రశంస

ఒకప్పుడు జ్ఞాన్‌బాగ్ ప్యాలెస్ సిరిసంపదలతో తులతూగుతూ ఉండేది. 300 ఎకరాల్లో ఈ ప్యాలెస్‌ను మా పూర్వీకుడు రాజా జ్ఞాన్‌గిర్ నిర్మించారు. ఈ ప్యాలెస్‌లో అణువణువు నాకు తెలుసు. వాటితో నాకు అనేక జ్ఞాపకాలు ముడిపడి ఉన్నాయి. వాటిలో నిజాంను కలవటం ఒక అపురూపమైన జ్ఞాపకం. మా కుటుంబానికి ఆసఫ్‌జాహీ వంశ రాజులకు మధ్య మంచి స్నేహసంబంధాలు ఉండేవి. నిజాం సైన్యంలోని ఐదు వేల మంది మా అధీనంలో ఉండేవారు. అందువల్ల వారి వద్ద మాకు ప్రాధాన్యత ఉండేది. ఆ రోజుల్లో మహారాజులకు కూడా నిజాం దర్శనం అరుదుగా లభించేది. చాలా మంది నిజాంను చూడటమే గొప్పగా భావించేవారు. అలాంటి కాలంలో- నిజాంను కలవటం- ఆ తర్వాత మా నాన్నకు రాసిన లేఖలో నన్ను ఆయన- "మోస్ట్ హ్యాండ్సమ్ డాటర్" అని సంబోధించటం ఇంకా గుర్తున్నాయి.

నా చిన్నతనం ఒక అద్భుతమైన రంగుల కల. ఇంటి చుట్టూ గుర్రాల మీద.. ఒంటెల మీద.. ఏనుగుల మీద సవారీ చేయటం.. ఉదయాన్నే లేచి నాన్నతో పాటు కాస్‌కంట్రీ రైడ్స్ వెళ్లటం.. ఇవన్నీ అందమైన అనుభవాలు. ఆ సమయంలో నా అంగరక్షకుడి పేరు ఇబ్రహీంఖాన్. ఆరడుగుల మనిషి. నేను ఎక్కడికి వెళ్లినా నా వెంటే ఉండేవాడు. నా చిన్నప్పటి ఫోటోలలో కూడా నా వెనకే అతను కనిపిస్తాడు. మహబూబియా కాలేజీలో చదివే రోజుల్లో కూడా- నాతో పాటే వచ్చేవాడు. ఇక మా ప్యాలెస్‌లో సంక్రాంతి వచ్చిందంటే సందడి మొదలయ్యేది. పిల్లలందరం పతంగులు ఎగరవేసేవాళ్లం. నాకు 13 ఏళ్ల వయస్సులో అనుకుంటా- సంక్రాంతి పండుగ రోజు నేను మా తమ్ముడు పతంగులు ఎగరవేస్తున్నాం. ఇంతలో మా యూరోపియన్ ఆయా వచ్చి- "రాజావారు మిమల్ని 11 గంటలకు బిలియర్డ్స్ రూమ్‌కు రమ్మన్నారు" అని చెప్పింది. మాకు ఒకటే టెన్షన్. ఏదైనా తప్పు చేస్తే తప్ప నాన్న దగ్గర నుంచి పిలుపురాదు. నాన్న ఎక్కడున్నారని దొంగతనంగా తొంగిచూశాం. నవాబ్ ఖుస్రూజంగ్‌తో బ్రేక్‌ఫాస్ట్ చేస్తున్నారు. ఇద్దరు నవ్వుతూ మాట్లాడుకుంటున్నారు. అంటే సీరియస్ విషయం కాదని తేలిపోయింది. కానీ మనసులో ఇంకా ఏదో సంశయం. సమయం గడిచింది. ఠంచనుగా 11 గంటలకు పిల్లలం ముగ్గురం- బిలియర్డ్స్ రూమ్‌కు వెళ్లాం. నాన్న- నవాబ్ అహ్మద్‌బేగ్‌తో కలిసి రూంలోకి వచ్చారు. ఆయన పర్సనల్ సెక్రటరీ డీవేటియా బంగారు పాన్దాన్ డబ్బా ఆయన ముందు పెట్టారు. నాన్న ఒక పాన్ తీసుకుంటూ- "రేపు దారుపిషా (కింగ్‌కోఠి ప్యాలెస్)లో మనం నిజాంను కలవబోతున్నాం" అని చెప్పారు. మాకు ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. బయటకు వచ్చేసిన తర్వాత డీవేటియా మాకు కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు చెప్పారు. వాటిలో మొదటిది- నిజాంను నేరుగా కళ్లెత్తి చూడకూడదు. రెండోది- ఆయన అడిగితే కానీ సమాధానం చెప్పకూడదు. వీటితో పాటుగా నిజాంకు ఫర్షీ ఆదాబ్ ఎలా చెప్పాలో కూడా నేర్పించారు. (నడుం సగం దాకా వంచి ఏడు సార్లు ఆదాబ్ చేయటాన్ని ఫర్షీ ఆదాబ్ అంటారు). ఆ రోజంతా నాకు అనేక ఆలోచనలు. నేను అప్పటి దాకా నిజాంను చూడలేదు. కానీ ఆయన పెయింటింగ్ మా డ్రాయింగ్‌రూమ్‌లో ఉండేది. దాన్ని చూస్తూ పెరిగాను. టైం మ్యాగ్‌జైన్‌పై నిజాం కవర్ ఫోటో వచ్చింది. అది కూడా నాకు గుర్తుంది. 'నిజాం అలాగే ఉంటారా? నాతో మాట్లాడతారా?'- ఇలా ఎన్నో ఆలోచనలు. అమ్మ ఆ రోజు రాత్రి మా చేత రిహార్సల్స్ చేయించింది.



మా మర్నాడు అమ్మ షిఫాన్ చీర, నాన్నమ్మకు చెందిన పది క్యారెట్ల కేటియర్ డైమండ్ రింగ్స్. చేతికి డైమండ్ గాజులు, ఉంగరాలు పెట్టుకున్నా. తమ్ముళ్లు కూడా నాన్నలాగానే వజ్రాల నగలు పెట్టుకున్నారు. రోల్స్ రాయిల్స్‌లో నాన్న, మేము ముగ్గురం.. రెండో కారులో నాన్న సెక్రటరీ డీవేటియా, ఇతర సేవలకులు బయలు దేరాం. కారు పర్దా గేటు దాకా మాత్రమే వెళ్తుంది. అక్కడ నుంచి అందరూ నడిచే వెళ్లాలి. కారు గేటు దగ్గరకు చేరుకున్న తర్వాత నాన్న- "మీరు కూడా నిజాంకు నజర్ ఇవ్వాలి" అని గుర్తు చేశారు. మేము గేటు లోపలికి ప్రవేశించాం. లోపల పెద్ద మైదానంలా ఉంది. ఒక వైపు వరుసగా కార్లు ఉన్నారు. వాటికి పసుపు నెంబర్ పేట్లు మెరుస్తున్నాయి. మరో వైపు ఆసిఫ్ జాహీల జెండా ఠీవీగా ఎగురుతోంది. నా కళ్లు నిజాం కోసం వెతుకుతున్నాయి. కొద్దిగా ముందుకు వెళ్లాం. అక్కడ టెంట్ వేసి ఉన్న ఎత్తైన ప్లాట్‌ఫాం కనిపించింది. దాని మీద ఒక సన్నని వ్యక్తి రూమీ టోపీ పెట్టుకొని నిలబడి మా వైపే చూస్తున్నాడు. ఆయన మొహంలో గర్వం తొణికిసలాడుతోంది. కంఠంలో రాజసం ఉంది. నాన్న ఆయన దగ్గరకు వెళ్లి- ఫర్షీ ఆదాబ్ చేశారు. మేమందరం కూడా ఆయనను అనుకరించాం. నాన్న- ఒక తెల్ల రుమాలులో పదకొండు అష్రఫీలు(బంగారు నాణేలు).. ఒక హాలీ రూపాయి (వెండి నాణెం) ఉంచిన నజర్‌ను నిజాం ముందు ఉంచి స్వీకరించమని కోరారు. మేము ఒక అష్రఫీ.. ఐదు హాలీ రూపాయలులు ఉన్న రుమాలును నిజాంకు సమర్పించాం. ఆయన వాటిని తీసుకొని- ఒక సంచిలో బంగారు నాణేలు, మరో సంచిలో వెండి నాణేలు వేశారు. మేమందరం తల వంచుకొని నేల కేసే చూస్తున్నాం. నాకు తలెత్తి నిజాం వైపు చూడాలని కోరిక పెరిగిపోతోంది. పిల్లలమందరం దొంగ చూపులు చూడటానికి ప్రయత్నిస్తున్నాం. నిజాం మా నాన్నతో- "వీరు నీ సంతానమా?" అని అడిగారు. "జీ సర్కార్. ఈ ఇద్దరూ నా కుమారులు. ఆమె నా పెద్ద కుమార్తె ఇందిర. చిన్న కుమార్తె రేణుక చిన్న పిల్ల. అందుకని తీసుకురాలేదు" అని నాన్న సమాధానమిచ్చారు. నిజాం నా వైపు తిరిగి - "స్కూలుకు వెళ్తున్నామా?" అని అడిగారు. నా గొంతు తడిఆరిపోయింది. "జీ యువర్ హైనెస్" అని సమాధానమిచ్చా. "బొంబాయిలోనా.. ఇక్కడా?" అని సంభాషణ పొడిగించారు. "బొంబాయిలో ఉండేవాళ్లం.. ఇప్పుడు మహబూబియా కాలేజీలో చేరాను" అని సమాధానమిచ్చా. "నీకు హైదరాబాద్ ఇష్టమేనా? చదువులో బొంబాయికి... ఇక్కడికి ఏదైనా తేడా ఉందా?" అని వేరే ప్రశ్న సంధించారు. అప్పటికి నాకు కొద్దిగా ధైర్యం వచ్చింది. కొద్దిగా తలెత్తి- "నాకు హైదరాబాద్ అంటే చాలా ఇష్టం. కొత్తగా వచ్చాను కదా.. మహబూబియాలో చదువుకోవటం వేరేగా ఉంది" అని సమాధానమిచ్చా. "ఏ క్లాసు చదువుతున్నావు" అని నిజాం అడిగారు. "జూనియర్ క్రేంబ్రిడ్జి చదువుతున్నా" అన్నా. "మంచిది.. మంచిది.. అమ్మాయిలకు చదువు చాలా ముఖ్యం" అన్నారు. నాకు ఆయన అలా అనటం చాలా ఆశ్చర్యమేసింది. నిజాం నాన్న వైపు తిరిగి- "బొంబాయి నుంచి మీరంతా ఎప్పుడు వచ్చారు?" అని అడిగారు. "సర్కార్.. రెండు నెలల క్రితం మేము హైదరాబాద్ వచ్చాం" అని నాన్న సమాధానమిచ్చారు. నాన్న ఇక సంభాషణ పూర్తయిందని తెలుసుకొని- సెక్రటరీ దివేటియాకు - నిజాం కోసం తెచ్చిన బహుమతిని తెమ్మని సంకేతమిచ్చారు. దివేటియా మరకత మణులతో పొదిగిన పాన్దాన్‌ను నాన్నకు తెచ్చి ఇచ్చారు. దానిని నాన్న నిజాం ముందు ఉంచి- "సర్కార్.. దీనిని ప్రత్యేకంగా మీ కోసం చేయించాను.. స్వీకరించండి" అన్నారు. నిజాం ముఖంలో చిరునవ్వు వచ్చింది. పాన్దాన్‌ను తెరిచి- దానిలోని బంగారు సుపారీ, ఎలకులు, లవంగాలు, దస్తార్‌లను ముట్టుకొని చూశారు. "దీన్ని ఎక్కడ చేయించావు?" అని అడిగారు. "బెంగుళూరులో..సర్కార్.." అని నాన్న సమాధానమిచ్చారు. "ఇది నాకు నచ్చింది. జూబ్లీ హాల్లో పెడతాను" అని నిజాం అన్నారు. ఆ మాటలు వినగానే నిజాం వెనక నిలబడి ఉన్న ఏడీసీ ముందుకు వచ్చి పాన్దాన్‌ను తీసుకున్నాడు. ఆ లోపులో నిజాం దృష్టి నాన్న వేలికి ఉన్న మరకత ఉంగరంపై పడింది. దానివైపే రెండు, మూడుసార్లు చూశారు. ఆ తర్వాత చప్పట్లు కొట్టగానే- దూరంగా ఉన్న నిజాం కుమార్తె రాణీ షెహజాదీ- ఒక సాధారణ చైనా కప్పును తీసుకువచ్చారు. నిజాంకు చార్మినార్ సిగరెట్లు తాగే అలవాటు ఉంది. సిగరెట్టు బూడిదను వేయటానికేమో అనుకున్నా. రాణీ ఆయన దగ్గరకు వచ్చిన వెంటనే- మేము మరోసారి ఫార్షీ ఆదాబ్ చేసి వెనక్కి నడుస్తూ వచ్చేసాం. (నిజాంకు సందర్శకులు తమ వీపును చూపించకూడదు. వెనక్కి నడుచుకుంటూ వెళ్లాలి).

ఆ మర్నాడు మాకు కింగ్‌కోఠి నుంచి ఒక లేఖ వచ్చింది. దానిలో తనను కలిసినందుకు.. యువర్ హ్యాండ్సమ్ డాటర్ ను తీసుకువచ్చినందుకు కృతజ్ఞతలు అని ఉంది. సాధారణంగా మగవారిని ఉద్దేశించినప్పుడు మాత్రమే హ్యాండ్సమ్ అంటారు. నిజాం నన్ను అలా ఎందుకు ప్రస్తావించారో ఇప్పటికీ నాకు తెలియదు. అంతే కాదు.. నాకు ఇతరుల నుంచి దక్కిన తొలి ప్రశంస అది. అది కూడా నిజాం నుంచి.. అందుకే ఆ జ్ఞాపకాలు ఇప్పటికీ గుర్తుండిపోయాయి.

• ప్రిన్సెస్ ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్

ఇమ్యూనిటీని పెంచే బెర్రీస్

చూడటానికి అందంగా, కలర్‌ఫుల్‌గా కనిపించే పండ్లు స్ట్రాబెర్రీస్. బెర్రీస్ అని పిలుస్తారు. న్యూట్రీన్ల పవర్ హౌస్ అయిన బెర్రీస్ వల్ల కలిగే ఉపయోగాలివి.

- హార్ట్‌షేప్‌లో ఉండే ఈ బెర్రీస్ తింటే గుండెకూ మంచిదే. రక్తప్రసరణ సాఫీగా ఉండేట్లు, ప్లేట్‌లేట్స్ సంఖ్య తగ్గకుండా కాపాడతాయి. రక్తపోటును అదుపులో ఉంటే గుణం వీటికి ఉంది. ఇందువల్ల గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయివి.
- మధుమేహగ్రస్తులూ వీటిని తినొచ్చు. ఎలాంటి ఇబ్బంది కలిగించవు.
- విటమిన్-సి ఉండే ఈ పండ్లను తరచుగా తినటం వల్ల క్యాన్సర్ కణాలు వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయి.
- ముఖ్యంగా నారింజ కంటే ఎక్కువగా విటమిన్-సి కలిగి ఉండటం వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుంది. దీనివల్ల ఇన్‌ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉండదు.
- వీటిలో యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలం. మెదడులో ఉండే కణాలను ఫ్రీరాడికల్స్ బారిన పడకుండా కాపాడతాయివి. దీని వల్ల మెదడు ఆరోగ్యంగా ఉంటుంది.
- నొప్పులు, ఆర్థరైటిస్ లాంటి సమస్యలుంటే తగ్గిపోతాయి.



'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/kBxfVw0లో చదవండి.

నవ్య 'దృశ్యం పేజీ' లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/qelHJre లో చదవండి.



ఈ విజయం.. ఊహించనిది

'కష్టే ఫలి' అన్నారు. అందుకే జయాపజయాలతో సంబంధం లేకుండా తన కష్టాన్ని నమ్ముకొని ముందుకు వెళుతున్నారు మేధా శంకర్. 'ట్వల్త్ ఫెయిల్' చిత్రంతో అనూహ్య విజయాన్ని అందుకున్న ఈ తార... ఇప్పుడు నవతరం నాయికగా జనహృదయాలలో స్థానం సంపాదించుకున్నారు.

కేవలం ఒకే ఒక్క సినిమాతో మేధా శంకర్ జీవితం రాత్రికి రాత్రే మారిపోయింది. సెలబ్రిటీ అయింది. అవును మరి! మొన్నీ మధ్య వచ్చిన 'ట్వెల్త్ ఫెయిల్'తో ఆమె జాతకమే మారిపోయింది. యువతకు క్రష్‌గా మారింది. మంచి నటిగా పేరు తెచ్చుకుంది. 'ఇలాంటి క్రేజ్ ఎన్నడూ ఊహించలేదు. ఇదో కలలా వచ్చిందేమో' అంటుంది మేధా.

సోషల్ మీడియాలో క్రేజ్..

గతేడాది అక్టోబర్‌లో ఆమె గురించి చాలా మందికి తెలీదు. '12 ఫెయిల్' సినిమా రిలీజ్ కాగానే మేధా పేరు మార్మోగిపోయింది. నిజ జీవితం (ముంబై కేడర్‌కు చెందిన అసిస్టెంట్ కమీషనర్ మనోజ్ శర్మ) ఆధారంగా విధు వినోద్ చోప్రా తెరకెక్కించిన ఈ సినిమాలో క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్, అభినయం ప్రేక్షకులను కట్టేసింది. ఈ చిన్న సినిమా బాక్సాఫీస్ వద్ద డెబ్బయ్ కోట్ల రూపాయల దాకా వసూలు చేసింది. ఓటీటీలోనూ సూపర్ హిట్ అయింది. దీంతో ఈమెకు ఇన్‌స్టాలో అమాంతం క్రేజ్ పెరిగిపోయింది. ప్రస్తుతం 2.2 మిలియన్ల మంది ఆమె ఇన్‌స్టాను ఫాలో అవుతున్నారు. ఐఎమ్‌డీబీ బెస్ట్ యాక్ట్రెస్‌గా ఎంపికైంది. మేధాకు యాడ్స్‌తో పాటు సినిమాలు క్యూ కట్టాయి. అలా ఫెయిల్ క్యాప్షన్ మూవీతో ఆమెకు సక్సెస్ వరించింది.

అలా సినిమాల్లోకి...

నోయిడాలో ఈమె పుట్టి పెరిగింది. సంగీతమంటే ఆమెకు చిన్నప్పటి నుంచీ మక్కువే. హిందూస్థానీ సంగీతంలో శిక్షణ తీసుకుంది. మంచి స్వరం ఉంది. హార్మోనియం, కీబోర్డు, సితార్‌లను ప్లే చేస్తుంది. ఫ్యాషన్ మేనేజ్‌మెంట్ కోర్సు చదివింది. మోడలింగ్‌లో రాణించింది. ఆ సమయంలో మెయిన్ టార్గెట్ సినిమాల్లో నటించాలని. అయితే అంత సులువుగా అవకాశాలు రాలేదు. నటనమీద ఉండే ఆసక్తితో 'విత్ యు ఫర్ యువర్ ఆల్వేస్' అనే షార్ట్‌ఫిల్మ్‌లో నటించింది. ఆ తర్వాత 'బీచమ్ హౌస్' 'దిల్ బేకరార్' సిరీస్‌లతో మంచి పేరు తెచ్చుకుంది. అలా ఆమెకు 'శాదిస్తాన్' అనే చిత్రంలో నటించే అవకాశం దక్కింది. 'మాక్స్ మిన్ అండ్ మ్యూజికీ' చిత్రంతో యూత్‌లో క్రేజ్ సంపాదించింది. ఆ తర్వాత 'ట్వెల్త్ ఫెయిల్'లో అవకాశం వచ్చింది. ప్రూవ్ చేసుకున్నా. వాస్తవానికి అప్పటికే మూడు పెద్ద చిత్రాల్లో అవకాశాలొచ్చాయి. అయితే.. నా బదులు వేరే వాళ్లను రీప్లేస్ చేశారు. ఏనాడైనా సరే మంచి సినిమా రాదా? అవకాశం దొరక్కపోదా? అనే పాజిటివ్‌నెస్‌తో ముందుకు అడుగులేశా. అప్పుడలా లేకుంటే.. ఈ విజయం వచ్చేది కాదు!

ఆ రోజులను మర్చిపోలేను...



ఒకప్పుడు డాక్టర్ కావాలని అనుకునేదాన్ని. మెరిట్ విద్యార్థిని అయినప్పటికీ వైద్య విద్య అభ్యసించటం కష్టమే అనిపించింది. ఆర్ట్ వైపే వెళ్లాలని అనుకున్నా. ఇప్పుడయితే లక్షల రూపాయలు వస్తున్నాయి. అయితే కరోనా టైంలో ఇలా లేదు. ఆ సమయంలో.. నా అకౌంట్‌లో ఒక రోజు కేవలం 257 రూపాయలు మాత్రమే ఉన్నాయి. అయినా భయపడలేదు. ఆ రోజులు మర్చిపోలేను. 'హృతిక్ రోషన్, దీపికా పదుకోన్, అలియా భట్‌లకు అభిమానిని. వారి స్క్రీన్ ప్రజెన్స్ బావుంది. స్ట్రాంగ్ పర్సన్స్. అందుకే స్ఫూర్తిగా నిలుస్తారు నాలాంటి వారికి. ఓటీటీల వల్ల నా లాంటి వారికి మంచి ఆదరణ దక్కింది. సినిమాలైనా, వెబ్ సిరీస్‌లయినా పట్టింపులేదు. పదికాలాల పాటు నిలబడే చిత్రాల్లో నటించాలన్నదే నా కల' అంటుంది మేధా శంకర్.

ముంబై పారిశ్రామికవేత్తతో వరలక్ష్మి శరత్‌కుమార్ నిశ్చితార్థం



ప్రముఖ సినీ నటి వరలక్ష్మి శరత్‌కుమార్ ముంబైకు చెందిన పారిశ్రామికవేత్త నికోలయ్ సచ్‌దేవ్‌ను పెళ్లి చేసుకోనున్నారు. వీరిద్దరి నిశ్చితార్థం శుక్రవారం ముంబై నగరంలో ఇరు కుటుంబాల సమక్షంలో జరిగింది. వివాహం ఈ ఏడాదిలోపు జరుగనుందని, త్వరలోనే వివాహ తేదీని వెల్లడిస్తామని వరలక్ష్మి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, వీరిద్దరూ 14 ఏళ్ళుగా స్నేహితులుగా కొనసాగుతున్నారు. ఎట్టకేలకు త్వరలోనే ఓ ఇంటివారు కాబోతున్నారు. ఈ నిశ్చితార్థంలో సినీ నటుడు శరత్ కుమార్, ఆయన సతీమణి రాధిక శరత్ కుమార్‌తో పాటు వరుడు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కాగా, వరలక్ష్మి శరత్ కుమార్ ఇటు తెలుగు, అటు తమిళ చిత్రసీమల్లో మంచి గుర్తింపుతో పాటు వరుస అవకాశాలు దక్కించుకుంటూ సినీ కెరీర్‌ను కొనసాగిస్తున్న విషయం తెలిసిందే.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

విదేశాల్లోనూ హను-మాన్‌ను విడుదల చేస్తున్నాం



యువ కథానాయకుడు తేజ సజ్జా హీరోగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో కె.నిరంజన్‌రెడ్డి నిర్మించిన 'హను-మాన్' చిత్రం సంక్రాంతి సందర్భంగా విడుదలై విజయవంతంగా 50 రోజులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన వేడుకలో దర్శకుడు మాట్లాడుతూ '50 రోజుల పండగ చూసి చాలా రోజులైంది. అది మా సినిమాకు జరగడం ఆనందంగా ఉంది. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి రాబోయే చిత్రాలకు ఈ చిత్ర విజయం పునాది వేసింది. విదేశాల్లోనూ ఈ సినిమాను విడుదల చేస్తున్నాం. 'జై హనుమాన్' వర్క్ మొదలైంది. 'హను-మాన్'లో చివరి ఐదు నిముషాలు ఎలా అందరికీ నచ్చాయో 'జై హనుమాన్' కూడా అలాగే ఉండబోతోంది' అన్నారు. ప్రేక్షకుల వల్లే ఇంత అద్భుత విజయం సాధ్యమైందని హీరో తేజ చెప్పారు. 150 థియేటర్లలో 50 రోజులు ఆడడం సాధారణ విషయం కాదని, అందరూ అంకిత భావంతో పని చేయడం వల్లే ఇది సాధ్యమైందని నిర్మాత నిరంజన్‌రెడ్డి చెప్పారు.

మేం ఆశించిన హిట్ వచ్చింది



'సినిమా మొదలు పెట్టినప్పుడు బాగా వస్తే చాలు అనుకున్నాం. తర్వాత ప్రమోషనల్ మెటీరియల్ ప్రేక్షకులకు రీచ్ అయితే అదే పదివేలు అనుకున్నాం. అన్నింటికి మించి ఒక మంచి హిట్ కొడితే బావుంటుందనే కోరిక మనసులో ఉండేది. అది ఇప్పుడు తీరినందుకు ఆనందంగా ఉంది' అన్నారు శివ కందుకూరి. ఆయన హీరోగా నటించిన 'భూతద్దం భాస్కర్ నారాయణ' శుక్రవారం విడుదలై విజయం సాధించడంతో శనివారం సక్సెస్ మీట్ నిర్వహించారు. సినిమా చూసి ఆడియన్స్ బాగా ఎంజాయ్ చేస్తున్నారని శివ చెప్పారు. తాము ఊహించిన దానికంటే అద్భుతమైన రెస్పాన్స్ వచ్చిందని హీరోయిన్ రాశీ సింగ్ తెలిపారు. నిర్మాతలు స్నేహాల్ శశిధర్ మాట్లాడుతూ 'ప్రతి షోకీ ఆదరణ పెరుగుతోంది. ఇంత మంచి విజయం అందించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు' అని చెప్పారు

మైనస్ 30 డిగ్రీల్లో షూటింగ్ చేశాం

విశ్వక్ సేన్



'ఈ సినిమా షూటింగ్ ప్రతి రోజూ సవాలే. మైనస్ 30 డిగ్రీల్లో వర్క్ చేశాం. కాళ్లు చేతులు గడ్డ కట్టేవి. ఇప్పుడు అది తలుచుకుంటే ఇంత రిస్క్ చేశామా అనిపిస్తుంది. ఇప్పుడు చేయమంటే మాత్రం చేయను' అన్నారు హీరో విశ్వక్ సేన్. ఆయన నటించిన 'గామి' చిత్రం ఈ నెల ఎనిమిదిన విడుదల కానుంది.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ' లుక్ విషయంలో చాలా కేర్ తీసుకున్నాం. అఘోరా పాత్ర కోసం దర్శకుడు విద్యాధర్ ఎంతో రిసెర్చ్ చేశారు. మూడేళ్ల ముందుగానే ప్రీ ప్రొడక్షన్ వర్క్ చేశారు. కుంభమేళాలో కొన్ని లక్షల మంది అఘోరాలు ఉంటారు. నేనూ వాళ్లతో కలసిపోయేవాడిని. నా స్టయిల్‌లో ఎక్స్‌ప్లోర్ చేసుకుంటూ వెళ్లా' అని ఆయన చెప్పారు.

దర్శకుడు విద్యాధర్ తను నటించిన 'వెళ్లిపోమాకే' సినిమా చూసి తన దగ్గరకు వచ్చాడని చెబుతూ 'ఈ కథను సినిమాగా మలచడానికి ఐదేళ్లు పడుతుందని నాకు ముందే తెలుసు. ఒక వేళ ఏడాదిలో తీయాలనుకుంటే రూ వంద కోట్లు కావాలి. వారణాసి, కుంభమేళలో గొరిల్లా షూటింగ్ చేశాం. అలా బడ్జెట్ కలసి వచ్చింది. సమయమే దీనికి పెట్టుబడి. ఇప్పటివరకూ ఎవరూ తీయని చిత్రమిది' అని విశ్వక్ సేన్ చెప్పారు. ఈ సినిమాకు తను పారితోషికం తీసుకోకుండా పని చేసినట్లు ఆయన చెప్పారు. మొత్తం 70 రోజులు పని చేసినట్లు తెలిపారు. హీరోయిన్ చాందిని కూడా చాలా కష్టపడిందని చెప్పారు. వీసీఎక్స్ ఫార్మెట్‌లో 'గామి' చిత్రాన్ని విడుదల చేస్తున్నామనీ, తెలుగులో ఈ ఫార్మెట్‌లో వస్తున్న తొలి చిత్రమని ఆయన తెలిపారు.

ప్రత్యేక ట్రేడింగ్ సెషన్‌లో సరికొత్త రికార్డు స్థాయికి సూచీలు

ముంబై: స్టాక్ మార్కెట్లో శనివారం నిర్వహించిన ప్రత్యేక ట్రేడింగ్ సెషన్‌లో ప్రామాణిక సూచీలు సరికొత్త శిఖరాలకు చేరుకున్నాయి. ఒక దశలో సెన్సెక్స్ 249.35 పాయింట్ల వృద్ధితో 73,994.70 వద్ద, నిఫ్టీ 80.8 పాయింట్ల పెరుగుదలతో 22,419.55 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేశాయి. చివరకు సెన్సెక్స్ 60.80 పాయింట్ల లాభంతో 73,806.15 వద్ద, నిఫ్టీ 39.65 పాయింట్ల లాభంతో 22,378.40 వద్ద క్లోజయ్యాయి. సూచీలకు సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయిలు కూడా ఇవే. భారీ అంతరాయాలు లేదా వైఫల్యాలను ఎదుర్కొనే విషయంలో తమ సంసిద్ధతను పరీక్షించుకునేందుకు బీఎస్ఈ, సెన్సెక్స్ ఈక్విటీ, ఈక్విటీ డెరివేటివ్ సెగ్మెంట్లలో ఈ ప్రత్యేక ట్రేడింగ్‌ను నిర్వహించాయి.

సరుకు రవాణాలో విశాఖ పోర్టు రికార్డు

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టు సరుకు రవాణాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియక ముందే రికార్డు సాధించింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 73.73 మిలియన్ టన్నుల సరకును రవాణా చేసి రికార్డు నమోదు చేసింది. పోర్టు చరిత్రలో ఇదే అత్యధిక సరుకు రవాణా. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) ముగియడానికి ఇంకో నెల రోజులు ఉండగానే పోర్టు గత ఆర్థిక సంవత్సర రికార్డును అధిగమించింది. ఫిబ్రవరితో ముగిసిన కాలానికి 73.78 మిలియన్ టన్నుల సరుకును పోర్టు రవాణా చేసింది.



ప్రవాస టెకీలు చలో భారత్!

స్వదేశంలో ఉద్యోగావకాశాలపై క్రమంగా పెరుగుతున్న ఆసక్తి

న్యూఢిల్లీ: అమెరికా, యూరప్, తదితర దేశాల్లో పనిచేస్తున్న భారత టెకీల్లో స్వదేశంలో ఉద్యోగావకాశాలపై ఆసక్తి పెరుగుతున్నదని రిక్రూటింగ్, స్టాఫింగ్ సేవల రంగ ప్రతినిధులు అంటున్నారు. భారత్‌లో ఉద్యోగావకాశాల కోసం తమను సంప్రదిస్తున్న ప్రవాస టెకీల సంఖ్య గడిచిన కొద్ది నెలల్లో గణనీయంగా పెరిగిందని వారన్నారు. ప్రముఖ జాబ్ పోర్టళ్లతో పాటు లింక్డ్‌ఇన్ నుంచి తన స్టాఫింగ్ కంపెనీ సేకరించిన డేటాను బట్టి చూస్తే, ప్రస్తుతం దేశీయ జాబ్ మార్కెట్లో 38,000 మంది ప్రవాస టెకీలు ఉద్యోగాల కోసం చూస్తున్నారని.. క్రితం నెలతో పోలిస్తే వీరి సంఖ్య రెట్టింపైందని ఎక్స్‌ఫెనో సహ-వ్యవస్థాపకుడు అనిల్ ఏతనూరు అన్నారు. ఏడాది క్రితం 65,000 స్థాయిలో ఉన్న వీరి సంఖ్య ఆ తర్వాత గణనీయంగా తగ్గినప్పటికీ, మళ్లీ కొద్ది నెలలుగా క్రమంగా పెరుగుతూ వస్తోందన్నారు.

స్వదేశానికి తిరిగి వచ్చే ఆలోచనలో ఉన్న ప్రవాస టెకీల నుంచి ఎంక్వైరీలు 15-30 శాతం పెరిగాయన్నారు. అందులో ఐటీ, కన్సల్టింగ్ సేవలు, ఇంజనీరింగ్ రంగాలకు చెందినవారే అధికమని ఆయన పేర్కొన్నారు. నిర్మాణం, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాలకు చెందిన వారు కూడా ఉన్నారన్నారు. అమెరికాలో పనిచేస్తున్న భారత ఐటీ నిపుణుల నుంచి స్వదేశంలో ఉద్యోగం కోసం దరఖాస్తులు 15 శాతం పెరిగాయని ఎగ్జిక్యూటివ్ సెర్చ్ అండ్ రిక్రూట్‌మెంట్ సర్వీసెస్ కంపెనీ మైకేల్ పేజ్ ఇండియా తెలిపింది. భారత్‌లో ఆధునిక సాంకేతికత ఆధారిత ప్రాజెక్టులు పెరగడం, ప్రస్తుత మందగమనం భారత్ కంటే అమెరికాపై అధిక ప్రభావం చూపుతున్న నేపథ్యంలో మన ఐటీ నిపుణులు స్వదేశానికి తిరిగి వచ్చేందుకు ఇదే మంచి సమయమని మైకేల్ పేజ్ ఇండియా రీజినల్ డైరెక్టర్ ప్రన్షు ఉపాధ్యాయ్ అన్నారు. ముఖ్యంగా ఏదైనా ప్రొడక్ట్ లేదా ఇంజనీరింగ్ విభాగానికి అధిపతిగా పనిచేస్తున్నవారు, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్లకు తిరిగి స్వదేశంలో స్థిరపడేందుకు మంచి అవకాశమన్నారు. అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు వెళ్లిన భారతీయ విద్యార్థుల్లోనూ కొందరు అక్కడ ఉద్యోగావకాశాలు లేకపోవడంతో స్వదేశానికి తిరిగి వచ్చేయాలనుకుంటున్నారని కెరీర్‌నెట్ సహ వ్యవస్థాపకులు అన్షుమన్ దాస్ అన్నారు.

కారణాలు..

- ప్రపంచ ఐటీ రంగం మందగమనంలోకి జారుకున్నప్పటికీ అమెరికా, ఐరోపాతో పోలిస్తే భారత ఐటీ రంగంలోనే పరిస్థితులు మెరుగ్గా ఉన్నాయి.
- విదేశీ టెక్నాలజీ మార్కెట్లో పెరిగిన అనిశ్చితి, బడా కంపెనీల్లో భారీ సంఖ్యలో తీసివేతలు, బాగా తగ్గిన కొత్త నియామకాలతో పాటు జీవన వ్యయం అనూహ్యంగా పెరగడం కూడా ప్రవాస టెకీలకు ఇబ్బందికరంగా మారింది.
- కొన్ని దేశాలు మాంద్యం ముప్పును ఎదుర్కొంటున్నాయి. దాంతో ఆ మార్కెట్లు మరింత గడ్డు పరిస్థితులను ఎదుర్కొనే అవకాశం ఉంది.
- భారత జీడీపీ జోరందుకుంది. విదేశాల్లో కంటే దేశీ ఐటీ రంగంలోనే ఉద్యోగావకాశాలు ఎక్కువగా కన్పిస్తున్నాయి. పైగా, భారత మార్కెట్లో సీనియర్ టెకీలకు ఆకర్షణీయ వేతన ప్యాకేజీలు లభిస్తున్నాయి.
- ఇండియాలో కార్యకలాపాలు సాగిస్తున్న ఎంఎన్‌సీల్లో కీలక పదవులకు ఆఫర్ చేస్తున్న ప్యాకేజీలు.. అమెరికాలో లభిస్తున్న వేతనానికి దరిదాపుల్లో ఉంటుండటం కూడా మరో కారణం.

యాప్ ద్వారా షాపింగ్‌కే మొగ్గు



60% ఆన్‌లైన్ కొనుగోలుదారుల ప్రాధాన్యమిదే..

పీడబ్ల్యూసీ ఇండియా నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: దేశీయ ఆన్‌లైన్ కొనుగోలుదారుల్లో 60 శాతం మంది వెబ్‌సైట్ కంటే యాప్ ద్వారా కొనుగోలుకే మొగ్గుచూపుతున్నట్లు పీడబ్ల్యూసీ ఇండియా తాజా సర్వే రిపోర్టు వెల్లడించింది. సులువైన నావిగేషన్, యూజర్ ఫ్రెండ్లీ ఇంటర్‌ఫేస్, స్థానిక భాషలో సమాచారం వంటి అంశాలు యాప్‌లకు ప్రాధాన్యం పెంచే అంశాలని నివేదిక పేర్కొంది. బయట షాపుల్లో కంటే చౌకగా లభిస్తుండటం, సౌలభ్యం కారణంగా నగరవాసులు ఆన్‌లైన్ షాపింగ్‌ను ఎంచుకుంటుండగా.. దేశంలోని మిగతా ప్రాంతాల వినియోగదారులు పరిమిత ఉత్పత్తుల లభ్యత, షాపుల్లో స్టాక్ అందుబాటులో లేకపోవడం వంటి కారణాల వల్ల ఈ-కామర్స్ పోర్టళ్ల వైపు మళ్లుతున్నారని నివేదిక తెలిపింది. గడిచిన కొన్నేళ్లలో 12.5 కోట్ల మంది భారతీయులు ఆన్‌లైన్ షాపింగ్ సేవలను ఉపయోగించుకున్నారని, అందులో గణనీయ వాటా ద్వితీయ, తృతీయ, నాలుగో శ్రేణి ప్రాంతాలకు చెందినవారేనట. దేశవ్యాప్తంగా 2,100 మందిని సర్వే చేయడంతో పాటు ఇండస్ట్రీ భాగస్వాములు, నిపుణులతో 100 ఇంటర్వ్యూలు, 400 ముఖాముఖి ఇంటర్వ్యూల ద్వారా సేకరించిన సమాచారం ఆధారంగా ఈ నివేదికను రూపొందించినట్లు పీడబ్ల్యూసీ ఇండియా తెలిపింది. మరిన్ని ముఖ్యాంశాలు..

- ఈ-కామర్స్ రంగ తదుపరి దశ వృద్ధిలో ద్వితీయ, తృతీయ, నాలుగో శ్రేణి ప్రాంతాల వినియోగదారులే కీలక పాత్ర పోషించనున్నారు.
- ఆన్‌లైన్‌లో ఉత్పత్తుల ఎంపికలో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా సైట్లు కీలకంగా మారుతున్నాయి. 62 శాతం మంది ఆన్‌లైన్ షాపర్లు సోషల్ మీడియా సైట్లలో కన్పించి, నచ్చిన ఉత్పత్తులనే ఈ-కామర్స్ సైట్ల ద్వారా కొనుగోలు చేస్తున్నారు.
- చెల్లింపుల విషయానికొస్తే, యూపీఐ, క్యాష్ ఆన్ డెలివరీ ప్రాధాన్య మార్గాలుగా ఉన్నాయి.

జీఎస్‌టీ అప్పీలు దాఖలు చేయటం ఎలా..?



ఇదీ GST

రాంబాబు గొండాల

జీఎస్‌టీకి సంబంధించి ఏవేనీ ఉల్లంఘనలకు పాల్పడినట్లు భావిస్తే డిపార్ట్‌మెంట్ ఒక వ్యక్తికి లేదా వ్యాపార సంస్థకు ముందుగా ఒక నోటీస్ పంపిస్తుంది. ఈ నోటీస్ అనేది ట్యాక్స్‌కు సంబంధించినదై ఉండవచ్చు లేదా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ), రిఫండ్, వడ్డీ లేదా ఇతర కారణాలైనా అయి ఉండవచ్చు. నోటీస్‌లోని అభియోగాలు, దానికి సంబంధించి సదరు వ్యక్తి లేదా సంస్థ ఇచ్చిన జవాబులను, సంబంధిత ఆధారాలను బట్టి ఒక ఆర్డర్ ఇవ్వటం జరుగుతుంది. ఈ ఆర్డర్ లేదా నిర్ణయం తనకు అనుకూలంగా లేదని భావిస్తే ఆ వ్యక్తి లేదా సంస్థ ఆ ఆర్డర్ మీద అప్పీల్ చేసుకోవచ్చు. సాధారణ భాషలో చెప్పాలంటే ఇది దిగువ కోర్టు ఇచ్చిన ఆర్డర్‌కు వ్యతిరేకంగా ఎగువ కోర్టుకు వెళ్లినట్లు. అప్పీల్ దాఖలు చేయటానికి నిర్దిష్ట నియమ నిబంధనలు ఉన్నాయి. అవి పాటించకపోతే అప్పీల్ స్వీకరణ తీసుకోబడదు. అలాంటప్పుడు తనకు అనుకూలంగా వాదనలు ఉన్నప్పటికీ, అప్పీల్ ప్రాథమిక దశలోనే తిరస్కరణకు గురి కావటం జరుగుతుంది. కాబట్టి అప్పీల్ దాఖలు చేసే వ్యక్తులు ఆయా నియమ నిబంధనలను సరిగ్గా తెలుసుకుని ఉండాలి. వీటికి సంబంధించి కొన్ని ముఖ్య నియమ నిబంధనలు ఉన్నాయి.

మొదటిది.. అప్పీల్ దాఖలు చేయటమనేది నిర్ణీత గడువులోపు జరగాలి. తాను ఏ ఆర్డర్ లేదా నిర్ణయానికి వ్యతిరేకంగా అప్పీల్ దాఖలు చేస్తున్నాడో ఆ ఆర్డర్ లేదా నిర్ణయం తనకు అందిన దగ్గర నుంచి మూడు నెలల లోపు సంబంధిత అప్పిలేట్ అథారిటీ వద్ద దాఖలు చేయాలి. ఏదేనీ అనివార్య కారణాలతో మూడు నెలల లోపు దాఖలు చేయలేకపోతే తగు కారణాలు చూపటం ద్వారా అప్పిలేట్ అథారిటీ నుంచి అదనంగా ఒక నెల గడువు పొందవచ్చు. అయితే కారణాలు సహేతుకంగా అనిపించకపోతే ఈ అభ్యర్థనను తిరస్కరించే అధికారం అప్పిలేట్ అథారిటీకి ఉంటుంది.

మరొక ముఖ్యమైన విషయం ప్రీ డిపాజిట్ చెల్లించటం. దీనికోసం ముందుగా ఏ ఆర్డర్ మీద అప్పీల్ చేస్తున్నాడో, ఆ ఆర్డర్‌కు సంబంధించి తాను ఆమోదించే విషయాలు అంటే అడ్మిట్ చేసే విషయాలు, విభేదించే విషయాలు అంటే డిస్ప్యూట్ చేసే విషయాలు విడివిడిగా చూపాలి. తాను అడ్మిట్ చేసే వాటికి సంబంధించిన మొత్తం అంటే పన్ను, వడ్డీ, పెనాల్టీ మొదలైనవి మొత్తంగా చెల్లించాలి. విభేదించే వాటిలో పన్ను మీద మాత్రం 10 శాతం చెల్లించాలి. దీనిని ఒక ఉదాహరణ ద్వారా తెలుసుకుందాం.

ఒక వ్యాపార సంస్థకు వ్యతిరేకంగా ఒక ఆర్డర్ ఇవ్వటం జరిగింది. ఇందులో ఒక రూ.లక్ష ట్యాక్స్, మరొక రూ.లక్ష పెనాల్టీతో పాటుగా వడ్డీ కూడా డిమాండ్ చేయటం జరిగిందనుకుందాం. ఇందులో రూ.40,000కు సంబంధించి ట్యాక్స్ దానికి సంబంధించిన పెనాల్టీ, వడ్డీకి సంబంధించి తాను ఆమోదిస్తున్నాడు. మిగతా రూ.60,000కు సంబంధించిన ట్యాక్స్, పెనాల్టీ, వడ్డీ మీద తాను అప్పీల్ చేస్తున్నాడనుకుంటే.. ముందుగా తాను ఆమోదించే మొత్తాన్ని ట్యాక్స్, పెనాల్టీ, వడ్డీతో సహా చెల్లించటంతో పాటుగా తాను అప్పీల్ చేసుకునే రూ.60,000 లలో 10 శాతం అంటే రూ.6,000 ప్రీ డిపాజిట్‌గా చెల్లించాలి. ఇక్కడ చాలా మంది పొరపాటు పడే అంశం ఏమిటంటే డిస్ప్యూట్ చేసే పన్నులో 10 శాతం కడితే ప్రీ డిపాజిట్ కింద సరిపోతుందనుకుంటారు. కానీ, ఆ మొత్తంతో పాటుగా తాము అడ్మిట్ చేసే అంశాల మొత్తాన్ని చెల్లించాలనే విషయాన్ని విస్మరిస్తుంటారు. ఇంకా వివరంగా చెప్పాలంటే ప్రీ డిపాజిట్‌గా చెల్లించే 10 శాతం తాను ఆమోదించని అంశాల్లో కేవలం పన్ను మీద చెల్లిస్తే సరిపోతుంది. అదే ఆమోదించే అంశాలకు సంబంధించి మాత్రం మొత్తం చెల్లించాలి. అందుకే అప్పీల్ కోసం వాడే నిర్ణీత ఫారమ్ (జీఎస్‌టీ ఏపీఎల్ 01)లో మొత్తం ఆర్డర్‌కు సంబంధించిన పన్ను, వడ్డీ, పెనాల్టీ, ఫైన్ మొదలగు వివరాలతో పాటుగా వీటిలో అడ్మిట్ చేసే అంశాలు, డిస్ప్యూట్ చేసే అంశాలు వివరంగా చూపి తగు మొత్తాలను విధిగా చెల్లించాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

ఓఎన్‌జీసీ కేజీ బేసిన్ ప్రాజెక్ట్ నుంచి క్రూడాయిల్ సరఫరా షురూ

తొలి ట్యాంకర్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జీసీకి చెందిన కృష్ణా-గోదావరి (కేజీ) డీప్ వాటర్ ప్రాజెక్ట్ నుంచి క్రూడాయిల్‌ను రవాణా చేస్తున్న స్వర్ణ సింధు ట్యాంకర్‌ను ప్రధాని నరేంద్ర మోదీ లాంఛనంగా ప్రారంభించారు. శనివారం నాడు బిహార్‌లోని బెగుసరాయ్ నుంచి ప్రధాని మోదీ దేశవ్యాప్తంగా మొత్తం రూ.1.62 లక్షల కోట్ల విలువైన చమురు, సహజ వాయువు ప్రాజెక్టులను లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ ప్రాజెక్టులు బిహార్, హరియాణా, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, పంజాబ్, కర్ణాటక రాష్ట్రాల్లో ఉన్నాయి. ఇందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్ కేజీ బేసిన్‌లో ఓఎన్‌జీసీ చెందిన కేజీ-డీడబ్ల్యూఎన్-98/2 క్షేత్రం నుంచి వెలికి తీసిన చమురును రవాణా చేసే ట్యాంకర్‌ను ప్రారంభించారు. ఈ ఏడాది జనవరిలో ఓఎన్‌జీసీ ఈ క్షేత్రంలో ఉత్పత్తిని ప్రారంభించింది. ఫ్లోటింగ్ ప్రొడక్షన్, స్టోరేజ్ ఆఫ్‌లోడింగ్ (ఎఫ్‌పీఎస్ఓ) ద్వారా ప్రస్తుతం రోజుకు 12,000 నుంచి 12,500 బ్యారళ్ల క్రూడాయిల్‌ను ఉత్పత్తి చేస్తోంది. ఇక్కడ ఉత్పత్తి చేసే ముడి చమురు కీలక స్థాయి చేరుకోగానే దాన్ని నౌకలోకి తరలించి రిఫైనరీకి చేరుస్తోంది. కాగా ప్రధాని మోదీ విశాఖపట్నంలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ)కి శంకుస్థాపన చేశారు. అలాగే కృష్ణా గోదావరి నాగాయలంక ఎస్ఈఎల్‌పీ క్షేత్రంలో ఫేజ్-2 డెవలప్‌మెంట్‌ను ప్రధాని జాతికి అంకితం చేశారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (సెక్ 100 గుడ్లు)



2వ తేదీ		విజయవాడ	463
హైదరాబాద్	463	విశాఖపట్నం	500
3వ తేదీ		వరంగల్	465
చిత్తూరు	523		
గోదావరి	463	దజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	126	గోదావరి	134
వరంగల్	126	విజయవాడ	134
కరీంనగర్	126	గుంటూరు	134
మహబూబ్‌నగర్	126	ఒంగోలు	134
కర్నూలు	126	చిత్తూరు	135
విశాఖపట్నం	127		

పారిస్ బెర్త్‌పై హుస్సామ్ గురి

నేటి నుంచి వరల్డ్ క్వాలిఫికేషన్ టోర్నీ



బుస్తో అర్సిజియో (ఇటలీ): పారిస్ ఒలింపిక్స్ బెర్తే లక్ష్యంగా తెలుగు బాక్సర్ హుస్సాముద్దీన్ (57 కిలోలు).. వరల్డ్ క్వాలిఫికేషన్ బాక్సింగ్ టోర్నీ బరిలోకి దిగనున్నాడు. ఆదివారం ఇక్కడ మొదలయ్యే ఈ టోర్నమెంట్‌లో హుస్సామ్‌తో పాటు భారత్‌కు చెందిన మొత్తం 9 మంది బాక్సర్లు అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఈ టోర్నీ నుంచి 49 ఒలింపిక్ బెర్త్‌లు అందుబాటులో ఉండగా.. సెమీస్ చేరితే చాలు పారిస్ టికెట్ ఖరారవుతుంది. రెండుసార్లు కామన్వెల్త్ కాంస్య పతక విజేత హుస్సామ్.. మోకాలి ఆపరేషన్ తర్వాత తొలిసారి రింగ్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నాడు. మిగతా బాక్సర్లలో శివ థాపా, దీపక్ బోరియా, నిషాంత్ దేవ్‌పై భారీ అంచనాలున్నాయి.

ప్లేఆఫ్స్ నుంచి హైదరాబాద్ అవుట్

చెన్నై: ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లో హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టు ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది. శనివారం హోరాహోరీగా జరిగిన లీగ్ మ్యాచ్‌లో కాలికట్ హీరోస్ జట్టు 15-13, 18-16, 16-14తో వరుస సెట్లలో హైదరాబాద్‌ను ఓడించింది. ఈ విజయంతో కాలికట్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకోగా, హైదరాబాద్ నాకౌట్ రేసు నుంచి తప్పుకుంది. ఈ సీజన్‌లో హైదరాబాద్ ఇప్పటివరకు ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో ఒకే ఒక మ్యాచ్ గెలిచింది.



ఆనందంలో అమ్మానాన్నతో..

జురెల్

న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టులో భారత జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు అందుకొన్నాడు. అయితే, తనకు లభించిన 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'ను ధ్రువ్ తన తల్లిదండ్రులతో పంచుకొన్నాడు. నాన్న నేమ్ చంద్, తల్లి రజనీతో కలసి ఉన్న ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేసిన జురెల్.. 'తన జీవితంలో నిజమైన ఎంవీపీలు (మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్లు) వీరే' అని ఫొటో కింద రాశాడు.

హైహై ముంబై

ఆర్‌సీబీపై 7 వికెట్ల తేడాతో విజయం

సత్తా చాటిన కెర్, బ్రంట్, పూజ

మహిళల ప్రీమియర్ లీగ్



అమెలియా కెర్ (40 నాటౌట్)



బ్రంట్ (2/27)

సంక్షిప్త స్కోర్లు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు: 20 ఓవర్లలో 131/6. (ఎలిస్ పెర్రీ 44 నాటౌట్, వేర్‌హమ్ 27; పూజా వస్ర్తాకర్ 2/14, సివర్ బ్రంట్ 2/27).
ముంబై ఇండియన్స్: 15.1 ఓవర్లలో 133/3. (అమెలియా కెర్ 40 నాటౌట్, యాస్తిక 31, బ్రంట్ 27, హేలీ మాథ్యూస్ 26; శ్రేయాంక పాటిల్ 1/15, సోఫీ డివైన్ 1/16).

నేటి మ్యాచ్
గుజరాత్ X ఢిల్లీ
రాత్రి 7.30 గం. నుంచి

బెంగళూరు: సొంత మైదానంలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) నుంచి మరోసారి పేలవ ప్రదర్శన ఎదురు కాగా.. అటు ముంబై ఇండియన్స్ మాత్రం ఆల్‌రౌండ్‌షోతో చెలరేగింది. ఫలితంగా శనివారం జరిగిన మహిళల ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. నాలుగు మ్యాచ్‌లు.. మూడు విజయాలు.. ఆరు పాయింట్లతో పట్టికలో ముంబై టాప్‌లో కొనసాగుతోంది. మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 6 వికెట్లకు 131 పరుగులే చేసింది. వీరి ఇన్నింగ్స్‌లో స్టార్ బ్యాటర్లు విఫలమయ్యారు. ముంబై బౌలర్లు నాట్ సివర్ బ్రంట్ (2/27), పూజా వస్ర్తాకర్ పొదుపైన బౌలింగ్‌తో పాటు వరుస విరామాల్లో వికెట్లు తీశారు. ఎలిస్ పెర్రీ (38 బంతుల్లో 5 ఫోర్లతో 44 నాటౌట్) ఆట మాత్రమే హైలైట్‌గా నిలిచింది. పవర్‌ప్లేలోపు 33 పరుగులకే కెప్టెన్ స్మృతీ మంధాన (9), సోఫీ డివైన్ (9), సబ్బినేని మేఘన (11) పెవిలియన్‌కు చేరారు. అటు రిచా ఘోష్ (7), మోలినెక్స్ (12)ను పూజా వస్ర్తాకర్ అవుట్ చేయడంతో ఆర్‌సీబీ 71/5 స్కోరుతో దయనీయంగా కనిపించింది. వంద పరుగులు కూడా కష్టమే అనుకున్న స్థితిలో పెర్రీ నిలకడ జట్టును ఆదుకుంది. జార్జియా వేర్‌హమ్ (27)తో కలిసి పెర్రీ ఆరో వికెట్‌కు 52 పరుగులు జోడించడంతో ఆర్‌సీబీ ఓ మాదిరి స్కోరైనా చేయగలిగింది. ముంబై మిగతా బౌలర్లలో ఇస్సీ వాంగ్, సైకా ఇషాక్ చెరో వికెట్ తీశారు.

జోరుగా...: స్వల్ప ఛేదనను ముంబై తుఫాను వేగంతో ఆరంభించింది. క్రీజులోకి వచ్చిన ప్రతీ బ్యాటర్ బ్యాట్‌కు పనిచెప్పడంతో 15.1 ఓవర్లలో 133/3 స్కోరు చేసి సునాయాసంగా నెగ్గింది. అమెలియా కెర్ (24 బంతుల్లో 7 ఫోర్లతో 40 నాటౌట్) అదరగొట్టింది. అంతకుముందు ఓపెనర్ యాస్తిక భాటియా (15 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 31) రెండో ఓవర్‌లోనే 6,4తో కదం తొక్కింది. తర్వాతి ఓవర్‌లోనూ యాస్తిక సిక్సర్ బాదగా.. మరో ఓపెనర్ హేలీ మాథ్యూస్ (26) సైతం రెండు ఫోర్లు సాధించడంతో 16 పరుగులు వచ్చాయి. వీరి దూకుడుతో ఓవర్‌కు 12 పరుగుల రన్‌రేట్‌తో స్కోరు దూసుకెళ్లింది. అయితే నాలుగో ఓవర్‌లో యాస్తికను డివైన్ అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 23 బంతుల్లో 45 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కాసేపటికే మాథ్యూస్‌ను శ్రేయాంక అవుట్ చేయగా, కెర్ మరింత ధాటిగా ఆడింది. చకచకా ఫోర్లు బాదేస్తూ లక్ష్యాన్ని వేగంగా తగ్గించడంతో మరో 29 బంతులుండగానే మ్యాచ్ ముగిసింది. అమెలియా కెర్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచింది.

తుషార్, శార్దూల్ కూల్చేశారు

- తమిళనాడు 146 ఆలౌట్
- ముంబై 45/2
- రంజీ సెమీస్



తుషార్ దేశ్‌పాండే (3/24)

ముంబై: పేసర్లు తుషార్ దేశ్‌పాండే (3/24), శార్దూల్ ఠాకూర్ (2/48) విజృంభించడంతో.. ముంబైతో శనివారం ఆరంభమైన రంజీ సెమీస్‌లో తమిళనాడు తడబడింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న తమిళనాడు తొలి ఇన్నింగ్స్‌లో 146 పరుగులకే కుప్పకూలింది. టాపార్డర్ బ్యాటర్లు సాయి సుదర్శన్ (0), నారాయణ్ జగదీశన్ (4), ప్రదోష్ రంజన్ పాల్ (8), కెప్టెన్ సాయి కిషోర్ (1) స్వల్ప స్కోరుకే వెనుదిరిగారు. 17/4తో పీకల్లోతు కష్టాల్లోపడ్డ తమిళనాడును విజయ్ శంకర్ (44), వాషింగ్టన్ సుందర్ (43) ఆరో వికెట్‌కు 48 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. ఇక శంకర్ అవుట్‌తో తమిళనాడు పతనం వేగంగా జరిగిపోయింది. అనంతరం మొదటి ఇన్నింగ్స్ బరిలోకి దిగిన ముంబై తొలిరోజు ఆట ముగిసేసరికి 45/2 స్కోరు చేసింది. ముషీర్ ఖాన్ (24), మోహిత్ అవస్థీ (1) క్రీజులో ఉన్నారు. ఓపెనర్లు పృథ్వీ షా (5), భూపేన్ లాల్వాణి (15) తక్కువ స్కోర్లకే అవుటయ్యారు.

అవేశ్ అదుర్స్.. విదర్భ 170



అవేశ్ ఖాన్ (4/49)

పేసర్ అవేశ్ ఖాన్ (4/49) నిప్పులు చెరగడంతో.. విదర్భతో జరుగుతున్న రెండో సెమీస్ మ్యాచ్‌లో తొలిరోజు మధ్యప్రదేశ్‌దే పైచేయిగా నిలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న విదర్భ మొదటి ఇన్నింగ్స్‌లో 170 పరుగులకు కుప్పకూలింది. కరుణ్ నాయర్ (63) అర్ధ శతకం సాధించగా.. అథర్వ (39) పర్వాలేదనిపించాడు. వెంకటేష్ అయ్యర్, కుల్వంత్ కేజ్రోలియా చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ బరిలోకి దిగిన మధ్యప్రదేశ్ మొదటి రోజు ఆఖరికి 47/1 స్కోరు చేసింది. హిమాన్షు మంత్రి (26), హర్ష్ గావ్లీ (10) క్రీజులో ఉన్నారు.



అర్జున్ రెండో గెలుపు

షెన్‌జెన్ (చైనా): తెలుగు గ్రాండ్‌మాస్టర్ ఇరిగేసి అర్జున్ షెన్‌జెన్ మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో రెండో విజయాన్ని నమోదు చేశాడు. శనివారం ముగిసిన మూడో రౌండ్లో నెదర్లాండ్స్ గ్రాండ్‌మాస్టర్ అనీష్ గిరిపై అర్జున్ గెలుపొందాడు. ఈ రౌండ్ తర్వాత అర్జున్ 2 పాయింట్లతో నాలుగో స్థానంలో కొనసాగుతున్నాడు. ఈ టోర్నీలో మరో నాలుగు రౌండ్లు మిగిలున్నాయి.

కివీస్ విజయ లక్ష్యం 369

ప్రస్తుతం 111/3
ఆసీస్‌తో తొలి టెస్టు

వెల్లింగ్టన్: ఆస్ట్రేలియాతో జరుగుతున్న తొలి టెస్టులో న్యూజిలాండ్‌కు 369 పరుగుల భారీ లక్ష్యం ఎదురైంది. ఈ ఛేదనలో కివీస్ శనివారం ఆట ముగిసేసరికి రెండో ఇన్నింగ్స్‌లో 3 వికెట్లకు 111 పరుగులు చేసింది. క్రీజులో రచిన్ (56), మిచెల్ (12) ఉన్నారు. లియోన్‌కు రెండు వికెట్లు పడగొట్టాడు. ఆటకు ఇంకా రెండు రోజుల సమయం ఉండగా, కివీస్ విజయానికి 258 పరుగుల దూరంలో ఉంది. అంతకుముందు స్పష్టమైన ఆధిక్యంతో దూసుకెళుతున్న ఆసీస్‌ను మూడో రోజున కివీస్ కట్టడి చేసింది. స్పిన్నర్ గ్లెన్ ఫిలిప్స్ (5/45) విజృంభించడంతో రెండో ఇన్నింగ్స్‌లో కంగారూలు 164 పరుగులకే పరిమితమయ్యారు. 2008 తర్వాత స్వదేశంలో కివీస్ స్పిన్నర్‌కు ఐదు వికెట్లు దక్కడం ఇదే తొలిసారి. బ్యాటింగ్‌లో లియోన్ (41), గ్రీన్ (39) మాత్రమే రాణించారు. హెన్రీకి 3, సౌథీకి 2 వికెట్లు దక్కాయి.

కమిన్స్‌కు సన్‌రైజర్స్ పగ్గాలు?




హైదరాబాద్: సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఈ ఐపీఎల్ సీజన్‌కు కొత్త కెప్టెన్‌తో బరిలోకి దిగనున్నట్టు తెలుస్తోంది. ఇప్పటిదాకా సారథిగా వ్యవహరించిన మార్‌క్రమ్‌కు ఉద్వాసన పలికి అతని స్థానంలో ఆస్ట్రేలియా స్టార్ ప్యాట్ కమిన్స్‌కు పగ్గాలు అప్పగిస్తారని సమాచారం. రికార్డుస్థాయిలో రూ. 20.50 కోట్లు వెచ్చించి వేలంలో కమ్మిన్స్‌ను సన్‌రైజర్స్ కొనుగోలు చేసుకున్న సంగతి తెలిసిందే. గతేడాది కమిన్స్ సారథ్యంలోనే ఆస్ట్రేలియా వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌తో పాటు వన్డే వరల్డ్‌కప్‌ను గెలుచుకుంది. ఈ అనుభవం దృష్ట్యా కమిన్స్‌ను కెప్టెన్‌గా నియమించాలని ఫ్రాంచైజీ నిర్ణయించిందనీ, ఒకట్రెండు రోజుల్లో అధికారిక ప్రకటన వెలువడనుందని సన్‌రైజర్స్ వర్గాలు తెలిపాయి. నిరుడు మార్‌క్రమ్ కెప్టెన్సీలో సన్‌రైజర్స్ 14 మ్యాచుల్లో 4 మాత్రమే గెలవడం గమనార్హం.

జెస్విన్‌కు నిరాశ

గ్లాస్గో: ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రాణించడంలో భారత లాంగ్ జంపర్ జెస్విన్ ఆల్డ్రిన్ విఫలమయ్యాడు. జాతీయ రికార్డు గ్రహీతైన జెస్విన్ లాంగ్ జంప్‌లో 7.69 మీటర్ల దూరం లంఘించి 13వ స్థానంలో నిలిచాడు. గతేడాది ప్రపంచ టోర్నీలో ఏకంగా 8.42 మీటర్ల ప్రదర్శనతో అదరగొట్టిన 22 ఏళ్ల జెస్విన్.. ఇక్కడ మాత్రం పూర్తిగా నిరాశపరిచాడు.

వెర్‌స్టాపెన్‌దే బహ్రెయిన్ గ్రాండ్ ప్రీ



సాఖిర్ (బహ్రెయిన్): ఫార్ములావన్ చాంపియన్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ ఈ సీజన్‌ను తనదైన శైలిలో ప్రారంభించాడు. ఈ రెడ్ బుల్ డ్రైవర్ సీజన్ మొదటి ఎఫ్1 రేసు బహ్రెయిన్ గ్రాండ్ ప్రీలో చాంపియన్‌గా నిలిచాడు. శనివారం జరిగిన ఫైనల్ రేసును వెర్‌స్టాపెన్ అగ్రస్థానంతో ముగించాడు. రెడ్‌బుల్‌కే చెందిన సెర్జియో పెరెజ్ రెండు, ఫెరారీ డ్రైవర్ కార్లోస్ సెయింజ్ మూడు స్థానాలతో పోడియం ఫినిష్ చేశారు. వరుసగా ఎనిమిదో రేసు నెగ్గిన వెర్‌స్టాపెన్‌కు కెరీర్‌లో ఇది 55వ విజయం.



మైనారిటీ కార్పొరేషన్, ఉర్దూ అకాడమీ, క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్లుగా నియమితులైన ఒబెదుల్లా కొత్వాల్, తాహెర్‌బిన్ అందాని, దీపక్‌జాన్ శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తమను చైర్మన్లుగా నియమించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి వారు ధన్యవాదాలు తెలిపారు.

కాళేశ్వరం నష్టానికి కేసీఆరే బాధ్యుడు: దుద్దిళ్ల

మంథని, మార్చి 2: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం దెబ్బతినడంతో జరిగిన భారీ ఆర్థిక నష్టానికి బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రజలకు సమాధానం చెప్పాలని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. శనివారం పెద్దపల్లి జిల్లా మంథనిలో మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి ఉత్సవంలో మంత్రి పాల్గొన్నారు. శ్రీపాద విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం మంథనిలోని సత్యసాయినగర్‌లో గృహజ్యోతి అమలు కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారు లక్ష్మికి జీరో విద్యుత్ బిల్లును శ్రీధర్‌బాబు అందజేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ అధికారంలో ఉండగా మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతు కోసం ఎందుకు చర్యలు చేపట్టలేదో కేటీఆర్ ప్రజలకు చెప్పాలన్నారు. నాడు రక్షణ విస్మరించి, నేడు రాజకీయంగా తమ ప్రభుత్వంపై బురద జల్లేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు వెళ్లడాన్ని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ప్రాజెక్టు సందర్శన సందర్భంగా కనీసం భూనిర్వాసితుల సమస్యలపై మాట్లాడకపోవడం విచారకరమన్నారు.

పేస్కేల్ పెంచాలి, పదోన్నతులు కల్పించాలి

- సర్కారుకు ల్యాబ్ టెక్నీషియన్స్ వినతి

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సర్కారీ దవాఖానాల్లో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ల(ఎల్టీ) పేస్కేల్ పెంచాలని, పదోన్నతులు కల్పించాలని ఎల్టీలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శనివారం రాష్ట్ర పీఆర్సీ కమిటీ చైర్మన్ ఎన్.శివశంకర్‌ను తెలంగాణ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ ప్రతినిధులు కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఎల్టీ గ్రేడ్ 2 అపాయింట్‌మెంట్ దగ్గర్నుంచి పదోన్నతుల చానల్ లేకపోవడంతో ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్ 2గానే పదవీ విరమణ చేయాల్సి వస్తోందని పేర్కొన్నారు. ప్రమోషన్ చానల్ లేనందున తమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని అందులో తెలిపారు. ఎల్టీ పేస్కేల్‌లో ఆ నష్టాన్ని భర్తీ చేసేలా పేస్కేల్‌ను పెంచాల్సిందిగా కోరారు. ఎల్టీల వినతిని సర్కారు దృష్టికి తీసుకెళ్తానని పీఆర్సీ కమిటీ చైర్మన్ వారికి తెలియజేశారు. ఆయనను కలిసిన వారిలో టీఎంఎల్టీఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ నిజాముద్దీన్, జనరల్ సెక్రటరీ లాలు లాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ అఫ్తాబ్ తదితరులున్నారు.

కేసీఆర్‌ను కలసిన ఎంపీ వద్దిరాజు

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి):బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు రాజ్యసభ సభ్యునిగా తిరిగి అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కుటుంబ సమేతంగా వెళ్లి కేసీఆర్ ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజుకు కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు బీఆర్ఎస్ నేత, రాజ్యసభ సభ్యుడు దీవకొండ దామోదర్‌రావు మాతృమూర్తి అండాళమ్మ మృతికి కేసీఆర్ సంతాపం వ్యక్తం చేశారు.

ఈబీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేయండి

- సీఎంకు ఈబీసీ సంక్షేమ సంఘం వినతి

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అగ్రవర్ణ పేదల అభ్యున్నతి కోసం ఈబీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఈబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వల్లపురెడ్డి రవీందర్ రెడ్డి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సచివాలయంలో సీఎంని శనివారం కలిసి ఈమేరకు వినతి పత్రం అందజేశారు. తెలంగాణలోని అగ్రకులాల్లో 80 శాతం మంది పేదరికంలో ఉన్నారని వివరించారు. అగ్రకులాల విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల వల్ల ఉన్నత విద్య చదవలేకపోతున్నారని, ఉపాధి అవకాశాలకు నోచుకోవడం లేదని వివరించారు. మిగిలిన కులాలకు సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను ఈబీసీ కార్పొరేషన్ పెట్టి అగ్రవర్ణ పేదల కోసం కూడా అమలు చేయాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు.

'ఫసల్ బీమా'లో చేరితే రైతులకు ప్రయోజనం

- రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో రాష్ట్ర ప్రభుత్వం చేరడం వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి తెలిపారు. ఫసల్ బీమా యోజన పథకంలో చేరాలని సీఎం నిర్ణయం తీసుకోవడం పట్ల శనివారం ఆయన హర్షం వ్యక్తం చేశారు. అతివృష్టి, అనావృష్టి వల్ల పంటలకు నష్టం జరిగితే ఈ పథకం ద్వారా రైతులకు నష్ట పరిహారం అందే వీలుంటుందన్నారు. 2020 నుంచి గత బీఆర్ఎస్ ప్రభుత్వం పంటలకు కనీస ప్రీమియాన్ని చెల్లించకుండా రైతులకు తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు.

'భువనగిరి' టికెట్ ఇస్తే గెలుస్తా: చనగాని

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి నుంచి పోటీ చేయడానికి తనకు అవకాశం కల్పించాలని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ గౌడ్ కాంగ్రెస్ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. సుమారు రెండు దశాబ్దాలుగా ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థి నేతగా రాజీలేని పోరాటం చేస్తున్నానని.. పదేళ్లుగా కాంగ్రెస్‌లో క్రియాశీల పాత్ర పోషిస్తున్నానని తెలిపారు. తనకు భువనగిరి టికెట్ ఇస్తే భారీ మెజారిటీతో విజయం సాధిస్తానన్నారు. భువనగిరి సెగ్మెంట్‌లో కేవలం గౌడ కమ్యూనిటీ ఓటర్లే 4 లక్షలకు పైగా ఉన్నారని, టికెటిస్తే లక్ష ఓట్ల మెజారిటీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.

మహాబలిపురం తీరంలో ఐదుగురి గల్లంతు

- ఒకరి మృతదేహం లభ్యం.. మరో నలుగురి కోసం గాలింపు
- అందరూ ఏపీలోని అనంత, చిత్తూరు వాసులే

చెన్నై(ఆంధ్రజ్యోతి)/యాడికి/పలమనేరు, మార్చి 2: విద్యార్థుల విహార యాత్రలో 'అల'జడి రేగింది. సముద్రంలో ఉవ్వెత్తున ఎగసిపడిన రాకాసి అలలు ఒక విద్యార్థిని బలి తీసుకున్నాయి. భారీ అలల తాకిడికి మరో నలుగురు విద్యార్థులు గల్లంతయ్యారు. వీరి జాడ కోసం సహాయక బృందాలు గాలిస్తున్నాయి. ఈ ఘటన తమిళనాడులోని మహాబలిపురం తీరంలో చోటు చేసుకుంది. బాధితులంతా ఏపీలోని అనంతపురం, చిత్తూరు జిల్లాలకు చెందినవారే. పోలీసుల కథనం మేరకు... అనంతపురం జిల్లా యాడికి మండలం బోయరెడ్డిపల్లి వద్ద ఉన్న పెన్నా కాలేజ్ ఆఫ్ సిమెంట్ సైన్సెస్‌లో డిప్లొమా ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు 26 మంది తొమ్మిది రోజుల విహారయాత్ర నిమిత్తం శుక్రవారం రాత్రి బయలుదేరారు. వీరు శనివారం ఉదయం మహాబలిపురం చేరుకున్నారు. అందరూ కలిసి బీచ్‌లో గ్రూప్ ఫొటో తీసుకున్నారు. అనంతరం కొందరు సముద్ర స్నానానికి వెళ్లారు. అలాగే చిత్తూరు జిల్లా పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ(డెయిరీ సైన్స్) చదువుతున్న 18మంది విద్యార్థులు శుక్రవారం రాత్రి ఒక మినీ బస్సులో బయల్దేరి మహాబలిపురానికి విహారయాత్రకు వచ్చారు. శనివారం ఉదయం వీరు కూడా సముద్ర స్నానానికి వెళ్లారు. రెండు జిల్లాల విద్యార్థులు వేర్వేరుగా సముద్రంలోకి దిగారు. అదే సమయంలో భారీగా అలలు రావడంతో ఈతకు వెళ్లినవారిలో తొమ్మిది మంది విద్యార్థులు కొట్టుకుపోయారు. అక్కడే ఉన్న స్థానిక జాలరులు వారిని రక్షించేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. అందులో నలుగురిని మాత్రమే కాపాడగలిగారు. ఆ తర్వాత కొంతసేపటికి విజయ్‌కుమార్(19) మృతదేహం తీరానికి కొట్టుకొచ్చింది. పెద్దిరాజు(21), శేషారెడ్డి(21), మౌనిష్(19), ప్రభు(18) అలల తాకిడికి గల్లంతయ్యారు. ఈ నలుగురి కోసం సహాయక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి.

ఎస్సీ సంక్షేమ శాఖ కమిషనర్‌గా ఎన్.శ్రీధర్

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా ఎన్.శ్రీధర్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన ఇదే శాఖకు ముఖ్య కార్యదర్శిగా వ్యవహరిస్తుండగా.. కమిషనర్‌గా అదనపు బాధ్యతలు చేపడతారు. ఇప్పటి వరకు ఎస్సీ సంక్షేమ శాఖ కమిషనర్‌గా పనిచేసిన రాహుల్ బొజ్జాను ప్రభుత్వం రిలీవ్ చేస్తూ.. భూసేకరణ, పునరావాసం(ఆర్‌అండ్‌ఆర్, ఎల్ఏ) విభాగానికి బదిలీ చేసింది. ఆ స్థానంలో ఉన్న స్మిత సబర్వాల్‌ను రిలీవ్ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఆ స్కైవేల కోసం బీఆర్ఎస్ పోరాటం

- పదేళ్ల మా కష్టానికి ఫలితం దక్కింది
- రక్షణ శాఖ భూములివ్వడం హర్షణీయం
- నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలి: కేటీఆర్



హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): "ఒకటి కాదు రెండు కాదు.. అధికారంలోకి వచ్చిన క్షణం నుంచి పదేళ్ల పాటు ప్రజల ట్రాఫిక్ కష్టాలు తీర్చేందుకు బీఆర్ఎస్ చేసిన సుదీర్ఘ పోరాటం ఫలించడం సంతోషంగా ఉంది. హైదరాబాద్-కరీంనగర్, హైదరాబాద్-నాగ్‌పూర్ జాతీయ రహదారుల మీదుగా ఎలివేటెడ్ కారిడార్ల (స్కైవేల) నిర్మాణానికి రక్షణ శాఖ భూములు ఇవ్వడానికి కేంద్రం ఆమోదం తెలపడం హర్షణీయం. ఇది ముమ్మాటికీ బీఆర్ఎస్ సాధించిన విజయం" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత ఏడాది జూలై 31న జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలోనూ బీఆర్ఎస్ ప్రభుత్వం వీటిపై నిర్ణయం తీసుకుందని, దానికి అనుగుణంగా కేంద్రం ఆమోదం తెలపడం హర్షించదగ్గ పరిణామన్నారు. గతంలోనే రక్షణశాఖ తమ ఆధీనంలోని 33 ఎకరాలను కేటాయించిందని, ఇప్పుడు మరో 150 ఎకరాలను రాష్ట్రానికి అప్పగించేందుకు ముందుకు రావడంతో స్కైవేల నిర్మాణానికి ఉన్న అన్ని అడ్డంకులు తొలగిపోయాయని వెల్లడించారు. గతంలో ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ప్రతి సందర్భంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌తోపాటు.. తాను, ఇతర మంత్రులు, ఎంపీలు ఢిల్లీ పెద్దలను కలిసి వినతి పత్రాలు అందజేశామని, ప్రతి సందర్భంలో వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు పోరాటం చేసిందని, ఇందులో భాగస్వాములైన అధికారులకు, యంత్రాంగానికి కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. ఏ ఒక్కరి వల్లో ఇది సాధ్యం కాలేదని, ఇది సమష్టి విజయమని స్పష్టం చేశారు. తమ పాలనలో మెరుపు వేగంతో నిర్మించిన ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌ల వల్ల హైదరాబాద్ మహానగరంలో ట్రాఫిక్ సమస్యలు శాశ్వతంగా తీరిపోయాయని పేర్కొన్నారు. ఇక కొత్త స్కైవేల నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చేపట్టాలని కోరారు. ఇన్నాళ్లకు తమ పోరాటాన్ని గుర్తించి కేంద్ర ప్రభుత్వం దిగొచ్చిందని, ఈ సందర్భంగా కేంద్ర పెద్దలకు కేటీఆర్ తెలంగాణ ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.

మల్కాజిగిరి ఈటలకే

మాజీ మంత్రిని లోక్‌సభ అభ్యర్థిగా ప్రకటించిన బీజేపీ.. 9 మందితో తొలి జాబితా

న్యూఢిల్లీ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి ఈటల రాజేందర్‌ను మల్కాజిగిరి లోక్‌సభ అభ్యర్థిగా బీజేపీ ప్రకటించింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కీలకంగా వ్యవహరించిన ఆయనకు తొలి జాబితాలోనే టికెట్ ఇచ్చింది. స్థానికుడికే టికెట్ కేటాయించాలని నియోజకవర్గ నేతలు కోరినప్పటికీ ఈటల వైపే అధిష్ఠానం మొగ్గుచూపింది. శనివారం ఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావడే 195 స్థానాలకు అభ్యర్థుల పేర్లను వెల్లడించగా.. ఇందులో తెలంగాణలోని 9 సీట్లు ఉన్నాయి. రాష్ట్రంలో మొత్తం 17 లోక్‌సభ సీట్లకు గాను బీజేపీకి నలుగురు ఎంపీలున్నారు. వీరిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి (సికింద్రాబాద్), జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ (కరీంనగర్), ధర్మపురి అర్వింద్ (నిజామాబాద్)లకు మళ్లీ టికెట్ దక్కింది. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు పేరు లేదు. ఊహించినట్లే చేవెళ్ల, భువనగిరిలలో మాజీ ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్‌కు అవకాశం దక్కింది. హైదరాబాద్ సీటుకు విరించి ఆస్పత్రుల చైర్‌పర్సన్ డాక్టర్ కొంపెల్ల మాధవీ లతను ప్రకటించారు. కాగా, బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్‌కు ఒక్క రోజులోనే టికెట్ లభించింది. రెండు రోజుల కిందట తండ్రితో కలిసి కాషాయ జెండా కప్పుకొన్న ఎంపీ పి.రాములు కుమారుడు భరత్‌ప్రసాద్‌ను నాగర్‌కర్నూల్‌లో పోటీకి నిలిపారు. ఈ జాబితాలోని 9 మందిలో బీసీలు ఐదుగురు కాగా, ఇద్దరు రెడ్డిలు, మాదిగ, బ్రాహ్మణ అభ్యర్థులు ఒక్కొక్కరు ఉన్నారు. కాగా, ఒకరే పోటీకి ఉన్న, బలమైన అభ్యర్థులున్న సీట్లకు తొలి జాబితాలో చోటిచ్చారు. మరింత స్పష్టత వచ్చిన తర్వాత వారం, పది రోజుల్లో మిగిలిన సీట్లకూ పేర్లు వెల్లడించనున్నట్లు తెలుస్తోంది.



అభిమానులతో బండి సంజయ్ సంబురాలు

బాపూరావుకు తప్పని నిరీక్షణ

బాపూరావు పేరు తొలి జాబితాలో లేకపోవడం బీజేపీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. గురువారం అర్ధరాత్రి వరకు కొనసాగిన పార్టీ ఎన్నికల కమిటీ సమావేశంలో టికెట్ దాదాపు ఖరారైందని పార్టీ నాయకులు ప్రచారం చేశారు. మలి జాబితాలోనైనా అవకాశం దక్కుతుందా?లేదా? అన్నది చర్చగా మారింది. బాపూరావు బదులు ఆదిలాబాద్ లోక్‌సభ పరిధిలోని పార్టీ ఎమ్మెల్యేలు మరొకరిని సూచిస్తున్నట్లు ప్రచారంలో ఉంది. మాజీ ఎంపీలు గోడం నగేశ్, రాథోడ్ రమేశ్ విస్తృత ప్రయత్నాలు చేస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మహబూబ్‌నగర్ అభ్యర్థిని కూడా తొలి జాబితాలోనే ప్రకటిస్తారని అనుకున్నా జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి పట్టుదలతో ఉండడంతో పెండింగ్‌లో పెట్టారు.

బలమైనవారి కోసం అన్వేషణ

కాంగ్రెస్ కంచుకోటలు ఖమ్మం, నల్లగొండ నుంచి బలమైన అభ్యర్థులను నిలబెట్టే ఆలోచనలో బీజేపీ ఉంది. అవసరమైతే ఇతర పార్టీలోని గట్టి వారిని చేర్చుకోవాలని చూస్తున్నట్లు తెలిసింది. మెదక్‌లో మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌తో పాటు మరో ఇద్దరు టికెట్ ఆశిస్తున్నారు. పెద్దపల్లి (ఎస్సీ)లోనూ దళితుల్లో బలమైన నేతను దింపాలని యోచిస్తోంది. మహబూబాబాద్‌లో కాంగ్రెస్ నుంచి కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్ పోటీ చేస్తారనే ప్రచారం జరుగుతుంది. ఈ నేపథ్యంలో అక్కడ లంబాడీ నేత కోసం అన్వేషిస్తోంది. ఎస్సీ వర్గీకరణ చేస్తామని ప్రధాని మోదీ ప్రకటించిన నేపథ్యంలో వరంగల్ నుంచి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగను నిలుపుతారనే ప్రచారం బీజేపీ వర్గాల్లో బలంగా వినిపించింది. ఈ స్థానానికి మాజీ ఐపీఎస్ అధికారి కృష్ణప్రసాద్, సీనియర్ నేతలు చింతా సాంబమూర్తి, శ్రీధర్ పోటీ పడుతున్నారు.

హైదరాబాద్‌లో తొలిసారి మహిళ

మజ్లిస్‌కు పెట్టని కోట హైదరాబాద్ నుంచి బీజేపీ తొలిసారిగా మహిళా నేత డాక్టర్ మాధవీలతను దింపింది. రెండుసార్లు పోటీచేసిన భగవంత్ రావుకు అవకాశం దక్కలేదు. హైదరాబాద్ లోక్‌సభ పరిధిలో, ముఖ్యంగా పాతబస్తీలో మాధవీలత ఏడేళ్లుగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. హిందువులను సామాజికంగా, రాజకీయంగా ఏకం చేసే కార్యక్రమాలు చేపట్టారు. నిజాం కళాశాలలో డిగ్రీ, ఉస్మానియా వర్సిటీలో పీజీ చదివారు. భరత నాట్య కళాకారిణిగా వందల ప్రదర్శనలు ఇచ్చారు. లతామా ఫౌండేషన్ చైర్‌పర్సన్‌గా ఉన్నారు. కాగా, బీజేపీ భువనగిరి టికెట్ లభించిన బూర నర్సయ్యగౌడ్ 2014లో బీఆర్ఎస్ నుంచి గెలిచి 2019లో ఓడిపోయారు. 65వ పుట్టిన రోజు జరుపుకొంటున్న శనివారమే అభ్యర్థిత్వం ఖరారు కావడం విశేషం. మరోవైపు పెద్దపల్లి స్థానాన్ని నేతకాని సామాజిక వర్గానికి చెందిన తనకు కేటాయించాలని బీజేపీ అధిష్ఠానానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ విజ్ఞప్తి చేశారు. తెలంగాణ భవన్‌లో మాట్లాడుతూ.. పెద్దపల్లి పరిధిలో మూడు లక్షల మంది ఓటర్లు నేతకాని వర్గానికి చెందినవారు ఉన్నారని పేర్కొన్నారు.

మరో ముగ్గురు బీఆర్ఎస్ ఎంపీలూ జంప్?

(మొదటి పేజీ తరువాయి)

మంతనాలు జరుపుతున్నారని తెలిసింది. వారం, పది రోజుల్లో వీరి చేరికపై స్పష్టత రానుందని బీజేపీ ముఖ్య నాయకుడు ఒకరు వెల్లడించారు. ఈ ఎంపీల్లో ఒకరి స్థానానికి బీజేపీ శనివారం అభ్యర్థిని వెల్లడించింది. దీంతో ఆయన వేరే జిల్లాలోని నియోజకవర్గం నుంచి బరిలో దిగే అవకాశమూ ఉన్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్‌కు బలమున్న సీటులో క్రితంసారి బీఆర్ఎస్ తరఫున గెలిచిన ఎంపీ కూడా బీజేపీ వైపు చూస్తున్నట్లు చెబుతున్నారు. ఈ సీటుకు బీజేపీ తొలి జాబితాలో అభ్యర్థులను ప్రకటించలేదు. కాగా, 2019 ఎన్నికల్లో బీఆర్ఎస్ 9లోక్‌సభ సీట్లలో గెలిచింది. వీరిలో ఎంపీలు బీబీ పాటిల్ (జహీరాబాద్), పి.రాములు (నాగర్‌కర్నూల్) రెండు రోజుల వ్యవధిలో బీజేపీలో చేరారు. తొలి జాబితాలోనే పాటిల్‌కు టికెట్ రాగా, నాగర్‌కర్నూల్‌లో రాములు తనయుడు భరత్‌ను నిలిపారు.

వరంగల్, నల్లగొండలో మాజీ ఎమ్మెల్యేలు..

వరంగల్, నల్లగొండ లోక్‌సభ స్థానాలకు బీఆర్ఎస్‌కు చెందిన ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలతో బీజేపీ ముఖ్య నేతలు చర్చిస్తున్నట్లు సమాచారం. తనయుడికి టికెట్ కోసం బీఆర్ఎస్ మాజీ మంత్రి ఒకరు కూడా టచ్‌లోకి వెళ్లినట్లు తెలిసింది. అయితే, తొలి జాబితాలో ఆ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిని ప్రకటించింది. ఈ నేపథ్యంలో తండ్రీకొడుకుల వైఖరి ఎలా ఉండబోతోందన్నది ఆసక్తికరంగా మారింది.

11 నుంచి 'సాహిత్య' ఉత్సవాలు

న్యూఢిల్లీ, మార్చి 2: కేంద్ర సాహిత్య అకాడమీ నిర్వహించే వార్షిక సాహిత్యోత్సవాలు ఈ నెల 11 నుంచి 16 వరకు ఆరు రోజుల పాటు ఢిల్లీలో జరగనున్నాయి. అకాడమీని నెలకొల్పి 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కార్యదర్శి కె.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలిసారిగా దివ్యాంగ రచయితలు పాల్గొంటారని వెల్లడించారు. 170 భాషలకు చెందిన 1100 మందికి పైగా రచయిలు హాజరవుతారని, వీరి కోసం 190 సదస్సులు నిర్వహిస్తారని వివరించారు. ప్రఖ్యాత రచయిత గుల్జార్ వార్షిక ప్రసంగాన్ని ఇవ్వనున్నారు. ఈ నెల 12న సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీతలను సన్మానిస్తారు.

మా నినాదం.. మరోసారి మోదీ సర్కార్

- సంక్షేమం, యువత, రైతులు, మహిళా అభ్యున్నతే ఎజెండా
- 4, 5 తేదీల్లో మోదీ టూర్.. రేవంత్ పాల్గొంటారని ఆశిస్తున్నాం
- పార్టీ నేతలు నమో యాప్ ద్వారా మాత్రమే విరాళాలివ్వాలి: కిషన్‌రెడ్డి



హైదరాబాద్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో తమ ప్రధాన నినాదం 'మరోసారి మోదీ సర్కార్' అని.. మెజారిటీ స్థానాల్లో తాము విజయం సాధించనున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర పర్యాటక మంత్రి కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో అత్యధిక సీట్లు సాధించి మోదీ ప్రభుత్వంలో భాగస్వామి అయ్యేలా చేపట్టిన విజయసంకల్ప యాత్రకు రాష్ట్రవ్యాప్తంగా మంచి స్పందన వస్తోందన్నారు. దేశ ప్రగతి, మారుమూల ప్రాంతాలకూ సంక్షేమ పథకాలు చేరుతున్న తీరుతో బీజేపీ జెండాను చూడగానే ప్రజలు స్వచ్ఛందంగా.. 'ఇదే మన మోదీ గ్యారంటీ' అంటున్నారని వివరించారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వికసిత్ భారత్ సంకల్ప పత్రాన్ని కిషన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. వచ్చే 25 ఏళ్ల అభివృద్ధి లక్ష్యంగా మేనిఫెస్టోలు రూపొందిస్తున్నామని, దేశవ్యాప్తంగా అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ నెల 15వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. గరీబ్ కల్యాణ్, యువత, అగ్రికల్చర్, నారీ శక్తి.. (జీవైఏఎన్)ఎజెండాతో బీజేపీ ఎన్నికలకు వెళ్తోందన్నారు. వందేళ్ల స్వాతంత్ర్య వేడుకలను జరుపుకొనే 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడం లక్ష్యమని వివరించారు. ప్రధాని ఈ నెల 4, 5 తేదీల్లో తెలంగాణకు రానున్నారని.. మొత్తం రూ.15,718 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జరిగే అధికారిక కార్యక్రమాలకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకావాలని కోరుకుంటున్నామని చెప్పారు. ప్రధాని రాష్ట్రానికి వచ్చిన సందర్భంలో ప్రొటోకాల్ ప్రకారం స్వాగతం పలికే సంప్రదాయాన్ని మాజీ సీఎం కేసీఆర్ తుంగలో తొక్కారని మండిపడ్డారు.

నమో యాప్ ద్వారా స్వయంగా విరాళం

'నమో' యాప్ ద్వారా మాత్రమే విరాళాలు అందివ్వాలని పార్టీ నేతలకు కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా.. యాప్ ద్వారా మీడియా సమావేశంలోనే ఆయన విరాళం పంపించారు. సంక్షేమం, నీతివంతమైన పాలన కోసం అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలిపి సాయం అందించాలని కోరారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో దాదాపు 170 ఎకరాల రక్షణ శాఖ భూముల బదిలీ విషయంలో నెలకొన్న సమస్యను కేంద్రం పరిష్కరించిందని కిషన్‌రెడ్డి చెప్పారు.

ఏపీ సచివాలయం తాకట్టు!

జగన్ సర్కారు మరో దా'రుణం'.. 370 కోట్ల కోసం హెచ్‌డీఎఫ్‌సీకి రాసిచ్చేశారు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)



మూడు రాజధానులంటూ మూడు ముక్కలాటకు తెరలేపి... రాష్ట్రాన్ని ఒక్క రాజధాని కూడా లేకుండా చేసి... చివరికి ఉన్న రాజధాని అమరావతిలోని రాష్ట్ర సచివాలయాన్ని కూడా తాకట్టు పెట్టేశారు. అడ్డగోలుగా తెస్తున్న అప్పులు చాలక... చివరికి రాష్ట్ర సచివాలయాన్నే తాకట్టుకు రాసిచ్చి రూ.370 కోట్ల అప్పు తెచ్చుకున్నారు. రాష్ట్ర విభజన తర్వాత కొత్త రాజధాని నిర్మాణంలో భాగంగా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.700 కోట్ల వ్యయంతో నిర్మించిన భవన సముదాయాన్ని కూడా అప్పుల కోసం వాడుకున్నారు. రాష్ట్ర బడ్జెట్ రూ.2.86 లక్షల కోట్లు. కానీ, కేవలం రూ.370 కోట్ల కోసం నవ్యాంధ్ర ఆత్మ గౌరవ ప్రతీక, ప్రభుత్వ కార్యకలాపాలకు ప్రధాన వేదిక అయిన సచివాలయాన్ని తాకట్టు పెట్టడం జగన్ సర్కారు దా'రుణ' దాహానికి నిదర్శనం. సచివాలయంలో ఐదు బ్లాకులు (భవంతులు) ఉన్నాయి. శాసన సభ, శాసనమండలి భవనాలు విడిగా ఉన్నాయి. ప్రస్తుతం సచివాలయంలోని ఐదు బ్లాకులు తాకట్టు పెట్టినట్లు తెలుస్తోంది. అప్పు కోసం తొలుత ఐసీఐసీఐ బ్యాంకును ఆశ్రయించినట్లు సమాచారం. 'కుదరదు' అని ఐసీఐసీఐ తేల్చడంతో, హెచ్‌డీఎఫ్‌సీకి వెళ్లారు. 'ఊరికే కాగితాలు చూపిస్తే సరిపోదు. సచివాలయ భవనాలను తాకట్టు రిజిస్ట్రేషన్ చేసిస్తే.. మొత్తం నిర్మాణ వ్యయంలో సగం అప్పుగా ఇస్తాం' అని హెచ్‌డీఎఫ్‌సీ అధికారులు స్పష్టం చేశారు. దీంతో... గుట్టు చప్పుడు కాకుండా సచివాలయ భవనాలను హెచ్‌డీఎఫ్‌సీకి తాకట్టు రిజిస్ట్రేషన్ చేసిచ్చేశారు.

త్వరలో ఆ భవనాలూ...

జగన్ అధికారంలోకి రాగానే అమరావతిని అటకెక్కించిన సంగతి తెలిసిందే. చివరికి... 90 శాతం పూర్తయిన అఖిలభారత సర్వీసు అధికారులు, ఉద్యోగుల భవన సముదాయాలను కూడా గాలికి వదిలేశారు. కానీ... ఇటీవల ఆ భవనాల్లో అధికారాలు నివసిస్తున్నారని, సీఆర్డీయేకు రూ.70 కోట్లు అద్దె కూడా చెల్లించామంటూ జీవో విడుదల చేశారు. నిర్మాణం పూర్తికాని భవనాల్లో నివాసంఉండటమేంటి.. దానికి అద్దె చెల్లించడమేమిటనే అనుమానాలు అప్పట్లోనే తలెత్తాయి. నిర్ణీత గడువులోగా నిర్మాణాలు పూర్తికాకపోతే తీసుకున్న అప్పు మొత్తం తిరిగి చెల్లించాలనే షరతుతో రుణం సేకరించి ఈ ప్రాజెక్టు మొదలుపెట్టారు. మొత్తం అప్పు కట్టలేక, అవి పూర్తయినట్లుగా తప్పుడు జీవోలు సృష్టించారని అప్పుడు భావించారు. కానీ, ఇప్పుడు అసలు విషయం బయటపడింది. ఈ భవనాలను కూడా తాకట్టు పెట్టి అప్పు తెచ్చేందుకే 'అద్దె' నాటకం ఆడినట్లు తెలుస్తోంది. సచివాలయ భవనాల తాకట్టు అనంతరమే... అధికారుల భవన సముదాయాలనూ తాకట్టు పెట్టి అప్పు తెచ్చే ప్రక్రియ మొదలైనట్లు సమాచారం.

'ఎడారి'లో నేడు కాసుల వేట!

చంద్రబాబు హయాంలో సచివాలయం, అసెంబ్లీ నిర్మించి 2017లో ప్రారంభించారు. 2019లో హైకోర్టు భవనం పూర్తి చేశారు. ఐఏఎస్, ఐపీఎస్ క్వార్టర్ల నిర్మాణం 90 శాతం పూర్తయింది. మిగతా ఉద్యోగుల క్వార్టర్లు 75 శాతం పూర్తయ్యాయి. శాశ్వత సచివాలయ భవనాలు, జడ్జీల క్వార్టర్లు నిర్మాణ దశలో ఉన్నాయి. ఇంత జరిగినా... 'అమరావతిలో ఒక్క ఇటుక కూడా పడలేదు. అది ఎడారి, శ్మశానం' అని వైసీపీ పెద్దలు దుష్ప్రచారం చేశారు. అధికారంలోకి రాగానే.. అమరావతిని అటకెక్కించి, అక్కడి భూములు, నిర్మాణాలతో అప్పులు తెచ్చుకునే పనిలో పడ్డారు. దొండపాడు, పిచ్చుకలపాలెం వద్ద భూములను ఎకరం రూ.4 కోట్ల చొప్పున విక్రయించాలని ప్రయత్నించారు. కానీ, అప్పటికే మూడు రాజధానుల వ్యవహారం బయటికి రావడంతో, స్థిరమైన విధానాలు లేని జగన్ సర్కారును ఎవరూ నమ్మలేదు. తర్వాత రాజధాని రైతులు కోర్టును ఆశ్రయించి భూముల విక్రయాన్ని అడ్డుకున్నారు. దీంతో 'తాకట్టు' పెట్టయినా సొమ్ములు తెచ్చుకునే పనిలో పడ్డారు.

డబ్బుల్లేక ఆల్బెండజోల్ బంద్?

- ప్రభుత్వం బకాయిలు తీర్చకపోవడంతో మాత్రల సరఫరా చేయలేమన్న ఏజెన్సీలు
- రాష్ట్రంలో ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడిన నులిపురుగుల నివారణ దినోత్సవం



హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం (ఎన్‌డీడీ) రాష్ట్రంలో వాయిదా పడుతూ వస్తోంది. దీనికి బడ్జెట్ లేకపోవడమే కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పిల్లల్లో నులిపురుగుల నివారణ కోసం ఎన్‌డీడీని ఏటా రెండుసార్లు నిర్వహించాలి. ఈ ఏడాది ఫిబ్రవరి 10న జరగాల్సి ఉండగా వాయిదా పడింది. అందుకు ప్రధాన కారణం ఆల్బెండజోల్ మాత్రల సరఫరా లేకపోవడమేనని తెలుస్తోంది. వీటిని తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీఎస్ఎంఎస్ఐడీసీ) కొనుగోలు చేస్తుంటుంది. అయితే ఆ సంస్థ ఔషధ సరఫరాదారులకు కోట్లలో బకాయిలు చెల్లించాల్సి ఉంది. గత ప్రభుత్వం సకాలంలో వారికి బిల్లులు చెల్లించలేదు. దాంతో వారు సరఫరా నిలిపివేశారు. ఓ ప్రముఖ సర్జికల్ కంపెనీ అయితే ఐదారు నెలల క్రితమే లేఖ రాసింది. కోట్లలో బిల్లులు పెండింగ్ ఉండటం వల్ల సర్జికల్ ఐటెమ్స్ సరఫరా చేయలేమని తేల్చి చెప్పింది. ప్రస్తుతం టీఎస్ఎంఎస్ఐడీసీకి ఆల్బెండజోల్ మాత్రలతో పాటు ఇతర ఔషధాలు సరఫరా చేసే ఏజెన్సీలదీ దాదాపు ఇదే పరిస్థితి. సకాలంలో ఆల్బెండజోల్ మాత్రల సేకరణ జరగకపోవడంతో ఎన్‌డీడీని వాయిదా వేసినట్లు తెలుస్తోంది. వాస్తవానికి ప్రతీ ఆరు మాసాలకొకమారు ఎన్‌డీడీని విధిగా నిర్వహించి, పిల్లల కడుపులో నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వాల్సి ఉంది. రాష్ట్రంలో గతేడాది జూలైలో ఎన్‌డీడీ నిర్వహించారు. నులిపురుగులను నివారించకుంటే పిల్లల్లో పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా రక్తహీనత, పోషకాహార లోపం, మానసిక, శారీరక ఆరోగ్యం దెబ్బతినడం లాంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. అందుకే ఏటా దేశవ్యాప్తంగా ఎన్‌డీడీ కార్యక్రమం చేపడుతున్నారు. ఆల్బెండజోల్ మాత్రలను 1-19 ఏళ్ల పిల్లలందరికీ ఇవ్వాలి. తెలంగాణలో సుమారు కోటిమంది ఆ వయసు పిల్లలు ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 61 లక్షల మంది, ప్రైవేటు స్కూళ్లలో 35.75 లక్షలు మంది ఉండగా, పాఠశాలకు వెళ్లని వారి సంఖ్య 3.25 లక్షలు ఉన్నట్లు వైద్య ఆరోగ్య శాఖ గణాంకాలు చెబుతున్నాయి.

ఓఆర్ఆర్-ఆర్ఆర్ఆర్ మధ్యలో.. ఐటీ, టెక్స్‌టైల్, గ్రానైట్ క్లస్టర్లు

» కొత్త ఇండస్ట్రీ పార్కుల ఏర్పాటుకు ప్రణాళికలు : భట్టి విక్రమార్క



హైదరాబాద్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్(ఓఆర్ఆర్), రీజనల్ రింగ్ రోడ్(ఆర్ఆర్ఆర్) మధ్యలో ఐటీ, టెక్స్‌టైల్, గ్రానైట్ క్లస్టర్లను ఏర్పాటు చేయబోతున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. నూతన క్లస్టర్ల ఏర్పాటుతో పారిశ్రామికాభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని, పెట్టుబడులు పెరుగుతాయని పేర్కొన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్రంలో కావాల్సినంత భూమి అందుబాటులో ఉందని, పెట్టుబడులకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. శనివారం నగరంలో జరిగిన భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) వార్షిక సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం అందిస్తోందని, కొత్త ఇండస్ట్రీ పార్కుల ఏర్పాటుకు ప్రణాళికలను సిద్ధం చేస్తోందని తెలిపారు. హైదరాబాద్ శివార్లలో గత ప్రభుత్వం 30 వేల ఎకరాల్లో ఫార్మాసిటీని ఒకేచోట ఏర్పాటు చేయడానికి తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేసి 3 వేల ఎకరాల్లో అనేక చోట్ల ఫార్మా విలేజ్‌లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. డెయిరీ పరిశ్రమతో పాటు వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మహిళా పారిశ్రామికవేత్తలకూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తోందన్నారు.

భారీ రిజర్వాయర్లపై 800 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లు

» లోయర్ మానేరు డ్యాంపై 300 మెగావాట్లు.. మల్లన్నసాగర్‌పై 500 మెగావాట్ల ప్లాంట్లు: సింగరేణి సీఎండీ

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో త్వరలో భారీ జలాశయాలపై సుమారు 800 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్టు సింగరేణి ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం పేర్కొన్నారు. శనివారం సింగరేణి భవన్‌లో ఆయన సింగరేణి విద్యుత్ విభాగంపై సమీక్ష నిర్వహించారు. భారీ జలాశయాలైన లోయర్ మానేరు డ్యాం(ఎల్ఎండీ)పై 300 మెగావాట్లు, మల్లన్న సాగర్ జలాశయంపై 500 మెగావాట్ల సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోనున్నామన్నారు. ఎల్ఎండీపై సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధంగా ఉందని, మల్లన్న సాగర్ జలాశయంపై 250 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండు ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు డీపీఆర్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

టీఎస్ఆర్టీసీకి జాతీయస్థాయిలో 5 అవార్డులు

టీఎస్ఆర్టీసీ అయిదు జాతీయ స్థాయి అవార్డులకు ఎంపికైంది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అండర్‌టేకింగ్స్ (ఏఎస్ఆర్‌టీయూ) ప్రతి ఏటా అందించే ప్రతిష్ఠాత్మక అవార్డుల్లో అయిదు నేషనల్ బస్ ట్రాన్స్‌పోర్ట్ ఎక్స్‌లెన్స్ అవార్డులను టీఎస్ఆర్టీసీకి అందించనున్నట్లు శనివారం ప్రకటించింది. 2022-23 గాను రహదారి భద్రత, ఇంధన సామర్థ్యం తదితర విభాగాల్లో అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తున్న సంస్థగా టీఎస్ఆర్టీసీని గుర్తించి ఈ పురస్కారాలకు ఎంపిక చేసింది. రహదారి భద్రత, ఇంధన సామర్థ్య నిర్వహణ, సాంకేతికత ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలు, సిబ్బంది సంక్షేమం విభాగాల్లో ప్రథమ బహుమతికి టీఎస్ఆర్టీసీ ఎంపికైంది. అర్బన్ విభాగంలో ద్వితీయ బహుమతి గెలుచుకుంది. న్యూఢిల్లీలో ఈ నెల 15న ఏర్పాటు చేసే కార్యక్రమంలో టీఎస్ఆర్టీసీ ఉన్నతాధికారులకు అవార్డులను అందుకోనున్నారు. టీఎస్ఆర్టీసీకి జాతీయ స్థాయిలో అయిదు అవార్డులు రావడం పట్ల రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. అవార్డులను గెలుచుకోవడంతో టీఎస్ఆర్టీసీ దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ పేర్కొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి: టీఎంయూ

ఆర్టీసీలో కార్మికులకు 2013 పీఆర్‌సీ బకాయిల బాండ్లు, ఇతర బకాయిలను విడుదల చేయాలని తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ) ప్రతినిధులు కోరారు. శనివారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. దీర్ఘకాలంగా ఉన్న ఆర్టీసీ కార్మికుల డిమాండ్లు, విలీనం తేదీ అంశాలపై తక్షణం ఆదేశాలు ఇవ్వాలని టీఎంయూ ప్రధాన కార్యదర్శి అశ్వత్థామ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ అంశాన్ని సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్తానని మంత్రి హామీ ఇచ్చారని అశ్వత్థామ రెడ్డితెలిపారు.

జాతర్ల పదకోశాన్ని వెలువరించడం ప్రశంసనీయం

» పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో జాతరలు, పండుగల సందర్భాలలో ప్రజలు మాట్లాడే భాషకు అర్థాలు తెలియజేసే పదకోశాన్ని తెలంగాణ సాహిత్య అకాడమీ ముద్రించడం అభినందనీయమని పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్ అన్నారు. శనివారం రవీంద్ర భారతిలో తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రచురించిన 'తెలంగాణ సాంస్కృతిక పదకోశం' అనే నిఘంటువును శైలజారామయ్యర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణలో గ్రామదేవతలకు, ఇంటి దేవతలకు, వన దేవతలకు ఎక్కువగా మొక్కులు చెల్లించుకుంటారని తెలిపారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన జాతర్లకు సంబంధించిన సాంస్కృతిక పద కోశాన్ని వెలువరించడం ప్రశంసనీయమన్నారు. రాబోయే తరానికి ఇది ఎంతో ఉపయోగంగా ఉంటుందని పేర్కొన్నారు. రచయితలను, గ్రంథ సంపాదకులను, అకాడమీ కార్యదర్శి బాలాచారిని అభినందించారు.

ఉద్యాన అధికారుల ఫలితాల విడుదల

ఉద్యానశాఖ అధికారుల పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల ప్రాథమిక జాబితాను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) శనివారం విడుదల చేసింది. 2022 డిసెంబరు 12న ఈ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదలైంది. తాజాగా విడుదలైన ఫలితాల కోసం అభ్యర్థులు కమిషన్ వెబ్‌సైట్ (http://www.tspsc.gov.in)ను సందర్శించవచ్చని కమిషన్ కార్యదర్శి ఓ ప్రకటనలో సూచించారు.

మేడిగడ్డ పునరుద్ధరణపై పాత పాటే

» ఒప్పందం చేసుకుంటేనే పనులు చేపడతామని, బకాయిలన్నీ చెల్లించాలని నిర్మాణ సంస్థ లేఖ

» ఈఆర్‌టీ ఫలితాలు ఇవ్వడానికి కూడా నిరాకరణ

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ/మరమ్మతుల వ్యవహారం మళ్లీ మొదటికొచ్చింది. బ్యారేజీని పునరుద్ధరించాలంటే మళ్లీ ఒప్పందం చేసుకోవాల్సిందేనని నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ తేల్చిచెప్పింది. బ్యారేజీలోని ఏడో బ్లాకుపై ఎలక్ట్రో రెసిస్టివిటీ టెస్టులు (ఈఆర్‌టీలు) జనవరి 4 నుంచి 9వ తేదీ మధ్య జరిగాయి. దాని ఫలితాలు ఇవ్వడానికి కూడా నిర్మాణ సంస్థ నిరాకరించింది. బ్యారేజీ నిర్మాణం కోసం 2016 ఆగస్టు 26న ఒప్పందం జరిగిందని, నీటిపారుదల శాఖ ఇచ్చిన ఆదేశాలు, డిజైన్లు, డ్రాయింగ్‌ల ఆధారంగా నిర్మాణం చేపట్టామని, 2020 జూన్ 29 నుంచి బ్యారేజీ డిఫెక్ట్ లయబిలిటీ కాలం మొదలై 2022 జూన్ 29 నాటికి (రెండేళ్లు) పూర్తయిందని, 2021 మార్చి 15న బ్యారేజీ పనులు పూర్తయినట్లు సంబంధిత అధికారులు సర్టిఫికెట్ ఇచ్చారని ఎల్ అండ్ టీ ఇదివరకే గుర్తు చేసింది. కాఫర్ డ్యామ్ కట్టాలంటే రూ.55.75 కోట్లు అవుతుందని, ఆ మేరకు ఒప్పందం చేసుకుంటేనే పనులు చేస్తామని స్పష్టం చేసింది. ఇక పెండింగ్ బిల్లుతో పాటు బ్యాంకు గ్యారంటీల కింద రూ.456.07 కోట్లు విడుదల చేయాలని కూడా ఇదివరకే ప్రభుత్వాన్ని కోరింది. మేడిగడ్డ పునరుద్ధరణ/మరమ్మతులు చేపట్టాలంటే దానికన్నా ముందు కాఫర్ డ్యామ్‌ను బ్యారేజీ ఎగువ, దిగువ భాగంలో కట్టాల్సి ఉంది. దీని నిర్మాణానికే రెండు నెలల దాకా పట్టనుంది. ఈలోగా జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) కూడా బ్యారేజీని పరిశీలించి, నివేదిక ఇస్తే పునరుద్ధరణ పనులు జరగాల్సి ఉంటుంది. అయితే ఏటా జూన్‌లోనే గోదావరికి వరదలు ప్రారంభమవుతాయి. జూలైలో వరద తీవ్రస్థాయికి చేరుతుంది. ఈలోగా మరమ్మతులు, పునరుద్ధరణ చేయకపోతే బ్యారేజీకి జరగరాని నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయనే ఆందోళనలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఎన్‌డీఎస్ఏ కమిటీ నివేదికే పునరుద్ధరణ/మరమ్మతులకు ప్రామాణికం కానుంది. అయితే ఈ పనులు చేపట్టడానికి నిర్మాణ సంస్థ నిరాకరిస్తుండటంతో ప్రభుత్వం మరో సంస్థకు బాధ్యతలు అప్పగించే అవకాశాలు లేకపోలేదని సమాచారం.

ట్యాంక్‌బండ్‌పై పీవీ విగ్రహం

కొమురంభీం, చాకలి ఐలమ్మ, సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్, జైపాల్‌రెడ్డి, శ్రీపాదరావువి కూడా

» దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన



దుద్దిళ్ల శ్రీపాదరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్

రవీంద్రభారతి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కొమురంభీం, చాకలి ఐలమ్మ, సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్, పీవీ నరసింహారావు, జైపాల్‌రెడ్డి, శ్రీపాదరావు వంటి తెలంగాణకు చెందిన మహనీయుల విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇందుకోసం త్వరలోనే మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో శనివారం జరిగిన దుద్దిళ్ల శ్రీపాదరావు 87వ జయంతి వేడుకలకు రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క కూడా పాల్గొని శ్రీపాదరావు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశం రాజకీయ, ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పుడు ప్రధానిగా ఎనలేని సేవలందించిన పీవీ నరసింహారావు శిష్యుడిగా వచ్చిన శ్రీపాదరావు అదే స్ఫూర్తిని కొనసాగించారని కొనియాడారు. నాడు స్పీకర్‌గా శ్రీపాదరావు పేరును ప్రతిపాదించినప్పుడు అప్పటి ప్రధాన ప్రతిపక్ష నేత ఎన్టీఆర్ తొలి సంతకం చేశారని తెలిపారు. శ్రీపాదరావు స్పీకర్‌గా శాసనసభను సమర్థంగా నిర్వహించేవారన్నారు. ప్రజాసమస్యల పరిష్కారంలో తనదైన పాత్ర పోషించిన శ్రీపాదరావు జీవితం ఆదర్శప్రాయమని కొనియాడారు. తండ్రి వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న తనయుడు శ్రీధర్‌బాబు మేనేజ్‌మెంట్ కోటా అయినప్పటికీ మెరిట్ స్టూడెంట్‌గా నిరూపించుకున్నారని ప్రశంసించారు. భవిష్యత్ తరాలకు మన మహనీయుల స్ఫూర్తిని అందించడమే లక్ష్యంగా ట్యాంక్‌బండ్‌పై విగ్రహాల ఏర్పాటుకు కృషి చేస్తానని సీఎం స్పష్టం చేశారు. శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. శ్రీపాదరావు జీవితం స్ఫూర్తిదాయకం అన్నారు. అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. శ్రీపాదరావు స్పీకర్‌గా పనిచేసినప్పుడు శాసనసభ నిర్మాణాత్మక చర్చావేదికగా నిలిచిందని గుర్తుచేశారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రజాసమస్యలపై పోరాటం చేసిన శ్రీపాదరావు జయంతిని అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. శాసనసభకు నిండుతనం తీసుకొచ్చిన మహనీయుడు శ్రీపాదరావు అని మంత్రులు పొన్నం, పొంగులేటి, సీతక్క కొనియాడారు. చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీపాదరావుతో కలిసి ప్రజాసమస్యలపై పోరాటం చేశామని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఐఏఎస్ బాలలత, డా.నరేంద్రకుమార్, పూర్ణమాలావత్, హిమాన్షిలను ముఖ్యమంత్రి చేతుల మీదుగా సత్కరించారు.

అంగన్‌వాడీల్లో ప్రీప్రైమరీ విద్య

ఆరేళ్లలోపు చిన్నారులకు అందించేలా ఏర్పాట్లు

» సాధ్యాసాధ్యాలను పరిశీలించండి: సీఎం

» గర్భిణులు, పిల్లలకు పక్కా పౌష్టికాహారం

» సీసీ కెమెరా సహా బయోమెట్రిక్ హాజరు

» ట్రాన్స్‌జెండర్ల సంక్షేమానికి ప్రత్యేక విధానం: సీఎం రేవంత్



సీఎంకు మొక్కను అందిస్తున్న మహిళా, శిశు, దివ్యాంగుల, వృద్ధుల సంక్షేమశాఖ అధికారిణి

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్లలోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ప్రీప్రైమరీ విద్యను అందించేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను చూడముచ్చటగా తీర్చిదిద్దాలని, రాష్ట్రమంతటా ఒకే డిజైన్‌లో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సుమారుగా 12,315 అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, వాటన్నింటికీ సొంత భవనాలు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం నిధులను జోడించి, మొదటి ప్రాధాన్యంగా ఆ భవనాలను నిర్మిస్తామని స్పష్టం చేశారు. సచివాలయంలో మహిళా, శిశు సంక్షేమం, దివ్యాంగుల శాఖపై సీఎం రేవంత్‌రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. పౌష్టికాహార లోపం, రక్తహీనత వంటి కారణాలతో రాష్ట్రంలోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అనారోగ్యానికి గురవుతున్నారంటూ ఎన్‌హెచ్‌ఎఫ్ఎస్ వెల్లడించిన గణాంకాలు ఆందోళనకరంగా ఉన్నాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అసలైన లబ్ధిదారులకు ఆహారం అందుతుందా? లేదా? అనే అంశాన్ని అధికారులు పక్కాగా పర్యవేక్షించాలని సూచించారు. రాష్ట్రంలోని 35వేల అంగన్‌వాడీల్లో సీసీ కెమెరాలతోపాటు గర్భిణులు, బాలింతలు, చిన్నారుల హాజరును పరిశీలించేందుకు బయోమెట్రిక్ యంత్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆడిటింగ్‌కు వీలుగా అన్ని రికార్డులను డిజిటల్ రూపంలో భద్రపర్చాలని చెప్పారు. జీహెచ్ఎంసీ పరిధిలో జనాభాకు సరిపడే కేంద్రాలు లేనందున మొబైల్ అంగన్‌వాడీలను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ఇందుకు సంబంధించి ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విధివిధానాలను అధ్యయనం చేసి పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టాలన్నారు. పాఠశాల స్థాయినుంచే శానిటరీ న్యాప్కిన్స్ వినియోగంపై బాలికలకు అవగాహన కల్పించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళలతోనే శానిటరీ న్యాప్కిన్స్‌ను తయారు చేయించాలని, అందుకు అవసరమైన యూనిట్లను నెలకొల్పాలని ఆదేశించారు. దివ్యాంగులకు రిజర్వేషన్లను పక్కాగా అమలు చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. చట్ట ప్రకారం ఉద్యోగాల్లో 4%, విద్యలో 5%, అన్ని పథకాల్లో 5% రిజర్వేషన్లు అమలు చేయాల్సి ఉందని అధికారులు చెప్పగా.. సంబంధిత ఫైలును వెంటనే సిద్ధం చేసి తనకు పంపించాలని సూచించారు. రాష్ట్రంలో మరిన్ని వృద్ధాశ్రమాల ఏర్పాటుకు కార్పొరేట్ సంస్థల సహకారం తీసుకోవాలన్నారు. ట్రాన్స్‌జెండర్లకు వైద్య సదుపాయాలు అందుబాటులో లేవని, అన్ని టీచింగ్ ఆస్పత్రుల్లో వారికి వైద్యం అం దించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు వర్తింపజేయడంతోపాటు వారి సంక్షేమానికి ప్రత్యేక విధానాన్ని రూపొందిచాలన్నారు. సమీక్షలో మంత్రి సీతక్క, సీఎస్ శాంతికుమారి, మహిళా, శిశుసంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి వాకాటి కరుణ, మాతా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ పాల్గొన్నారు.

మరో 5,278 మందికి ఉద్యోగ నియామక పత్రాలు

రేపు సీఎం చేతుల మీదుగా అందజేత

రాష్ట్రంలో మరో 5వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ కానున్నాయి. సోమవారం సాయంత్రం ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్ రెడ్డి ఆయా ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందించనున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. సంక్షేమ గురుకులాల్లో ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్ (టీజీటీ), డిగ్రీ, జూనియర్ లెక్చరర్ కలిపి 4,638 పోస్టులు, పోలీస్ శాఖలో వివిధ విభాగాల్లో 565, వైద్యశాఖలోని వివిధ విభాగాల్లో 75 పోస్టులు కలిపి మొత్తం 5,278 పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందించనున్నారు. సీఎం చేతుల మీదుగా నియామక పత్రాల అందజేత కార్యక్రమం ఉంటుందని గురుకులాల్లో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ రిక్రూట్‌మెంట్ బోర్డు సమాచారం పంపుతోంది.



ఇంటికి శ్రీకారం!

(మొదటిపేజీ తరువాయి)

రూపొందించాలని స్పష్టం చేశారు. ఇంటి నిర్మాణాలను పర్యవేక్షించే బాధ్యతలను జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో వివిధ శాఖల్లో ఉన్న ఇంజినీరింగ్ విభాగాలకు అప్పగించాలని.. గూడు లేని పేదల సొంతింటి కలను దశల వారీగా నెరవేర్చడమే తమ సంకల్పమని సీఎం పేర్కొన్నారు. తొలి దశలో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు ఇవ్వాలని గతంలో నిర్ణయించిన విషయం తెలిసిందే. స్థలం లేని అర్హులైన పేదలకు స్థలమిచ్చి రూ.5 లక్షలు, స్థలం ఉన్నవారికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించాలని భావిస్తున్నట్లు తెలిసింది.

ప్రజా పాలన దరఖాస్తులకు తొలి ప్రాధాన్యం

ఇందిరమ్మ ఇంటి కోసం ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న అర్హులకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణంలో చేసిన తప్పులు ఈసారి జరగకుండా చూడాలని అప్రమత్తం చేశారు. సొంత జాగాలో కట్టుకునే వారికి ఉపయోగపడేలా వివిధ నమూనాలు, డిజైన్లను తయారుచేయాలని ముఖ్యమంత్రి సూచించారు. లబ్ధిదారులు వారి ఇష్టప్రకారమే నిర్మాణం చేసుకున్నప్పటికీ వంట గది, టాయ్‌లెట్ తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. కాగా, ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పేర్కొన్న ఆరు హామీల్లో నాలుగింటి అమలును ఇప్పటికే ప్రారంభించారు. ఇళ్ల నిర్మాణ పథకానికీ శ్రీకారం చుడితే ఐదో హామీనీ పట్టాలెక్కించినట్లు అవుతుంది. సమీక్షలో మంత్రులు పొంగులేటి, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్అండ్‌బీ ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, గృహ నిర్మాణ శాఖ అధికారులు ఈశ్వరయ్య బలరాం పాల్గొన్నారు.

'కాళేశ్వరం'పై తీన్‌మార్!

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి ఎన్.ఉత్తమ్ ఆమోదించిన తర్వాత దీనిని హైకోర్టుకు సమర్పించనున్నారు. వాస్తవానికి కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో జరిగిన అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని తొలుత ప్రభుత్వం భావించింది. ఆ మేరకు హైకోర్టుకు లేఖ రాసింది. అయితే, సిట్టింగ్ జడ్జిని ఇవ్వడానికి నిరాకరించిన హైకోర్టు.. మాజీ జడ్జిని సమకూర్చేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో కాళేశ్వరంపై విచారణకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. గత ఏడాది అక్టోబరు 21న మేడిగడ్డ బ్యారేజీ కుంగిన విషయం విదితమే. ఆ మరుసటి రోజే అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో సీపేజీలు బయటపడ్డాయి. కాళేశ్వరంలోని అన్ని కాంపోనెంట్లు కలుపుకొని రూ.46వేల కోట్ల దాకా అవినీతి/నిధుల దుబారా జరిగిందని కాగ్ ఇప్పటికే ఓ నివేదికను అందించింది. డిజైనింగ్, నిర్మాణం, క్వాలిటీ కంట్రోల్‌లో లోపాలు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌లో వైఫల్యాలే మేడిగడ్డ బ్యారేజీ కుంగడానికి కారణాలని జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ వెల్లడించింది. నిర్మాణ అంచనాలను పెంచడమే కాకుండా, నిర్మించిన తర్వాత కనీస నిర్వహణను పట్టించుకోలేదని మధ్యంతర నివేదికలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పేర్కొంది. తాజాగా కాళేశ్వరం అవినీతిలో 33 మంది అధికారుల పాత్ర ఉందని తేలింది. ఈ మేరకు ఆయా నివేదికల ఆధారంగా విచారణ విధివిధానాలను సిద్ధం చేశారు. విచారణ ప్రక్రియను నిర్ణీత వ్యవధిలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం కోరనుంది. ఇందులోభాగంగా మాజీ సీఎం కేసీఆర్‌తోపాటు అప్పట్లో నీటి పారుదల శాఖ మంత్రిగా పని చేసిన హరీశ్, పలువురు అధికారులను విచారణకు పిలిచే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది.

పాలమూరు నుంచి పోరు షురూ!

6న బహిరంగ సభలో రేవంత్ ఎన్నికల శంఖారావం .. సీఎంను కలిసిన పలువురు ఎమ్మెల్యేలు..

» కేటీఆర్.. ఏ ముఖం పెట్టుకొని మేడిగడ్డకు వెళ్లావ్?: ఆది శ్రీనివాస్

» లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా రాదు: యెన్నం



సివిల్ సొసైటీ సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ

హైదరాబాద్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ పట్టణంలో ఈ నెల 6న నిర్వహించే పాలమూరు ప్రజాదీవెన సభలో టీపీసీసీ చీఫ్, సీఎం రేవంత్‌రెడ్డి లోక్‌సభ ఎన్నికల శంఖారావాన్ని పూరించనున్నారు. సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి చేపట్టిన పాలమూరు న్యాయ యాత్ర ముగింపు సందర్భంగా మహబూబ్‌నగర్‌లోని ఎంవీఎస్ కాలేజీ గ్రౌండ్స్‌లో పాలమూరు ప్రజాదీవెన సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ హాజరుకానున్నారు. ఇదే విషయమై శనివారం రేవంత్‌ను ఆయన నివాసంలో వంశీచంద్‌రెడ్డి, పార్టీ ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, వాకిటి శ్రీహరి, మైనారిటీ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ కలిశారు. సభకు ముఖ్య అతిథిగా హాజరు కావాలంటూ కోరారు. ఇప్పటికే మహబూబ్‌నగర్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా వంశీచంద్‌రెడ్డి పేరును రేవంత్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఈ సభ.. రాష్ట్రంలో ఎన్నికల వేడిని పుట్టించనుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఏ ముఖం పెట్టుకుని మేడిగడ్డకు వెళ్లారంటూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఫైర్ అయ్యారు. అసెంబ్లీ మీడియా హాల్లో ఆయన మాట్లాడారు. మేడిగడ్డ పర్యటనకు వెళ్లిన కేటీఆర్.. కుంగిన పిల్లర్ల ముందు ఫొటో దిగి ట్విటర్‌లో పెడితే బాగుండేదని వ్యాఖ్యానించారు. యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. 60 మంది జోకర్లు విహార యాత్రకు వెళ్లినట్లుగా బీఆర్ఎస్ నేతల మేడిగడ్డ టూర్ ఉందని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా రాదని జోస్యం చెప్పారు.

విద్య, ఆరోగ్య రక్షణ ద్వారానే రాష్ట్రాభివృద్ధి

ప్రజాస్వామ్యం వర్ధిల్లినప్పుడే ప్రజా సమస్యలు పరిష్కరించబడతాయని, విద్య, ఆరోగ్య రక్షణ ద్వారానే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ అన్నారు. నియంతృత్వంతో ప్రజలకు మేలు జరగబోదని.. స్వేచ్ఛాయుత ప్రజాస్వామ్యం మాత్రమే న్యాయం చేకూరుస్తుందని చెప్పారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోని గాంధీ సెంటినరీ హాల్లో శనివారం కాంగ్రెస్ వార్ రూమ్ ఆధ్వర్యంలో 'ప్రజలు ప్రభుత్వం నుంచి ఏమి ఆశిస్తున్నారు?' అన్న అంశంపై జరిగిన సదస్సులో ఆమె ప్రసంగించారు. టీపీసీసీ నేతలు పవన్ మల్లాది, రియాజ్, పలు ప్రజా సంఘాలు, విద్యార్థి నేతలు ఇందులో పాల్గొన్నారు. కేసీఆర్ మెడకు కాళేశ్వరం ఉచ్చు బిగుస్తోందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ అన్నారు.

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించండి..

దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం తాము రూపొందించిన మ్యానిఫెస్టోను ప్రభుత్వం చేత అమలు చేయించాలని జాతీయ దివ్యాంగుల నెట్‌వర్క్ టీపీసీసీని కోరింది. గాంధీభవన్‌లో ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరిలను కలిసిన జాతీయ దివ్యాంగుల నెట్‌వర్క్ కన్వీనర్ అర్మాన్ అలీ ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. దీనిపై మహేశ్ గౌడ్ స్పందిస్తూ.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఇటు మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతిని సందర్భంగా ఇందిరాభవన్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.

రాష్ట్రానికి ఐఐహెచ్‌టీ

ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ఏర్పాటుకు కేంద్రం ఆమోదం

» సీఎం రేవంత్, మంత్రి తుమ్మల చేసిన విజ్ఞప్తులకు స్పందన

» తెలంగాణ చేనేతకు అంతర్జాతీయ ఖ్యాతి: మంత్రి తుమ్మల



కేంద్ర జౌళిశాఖ కార్యదర్శి రచనా షాకు వినతిపత్రం ఇస్తున్న మంత్రి తుమ్మల (ఫైల్)

హైదరాబాద్, మార్చి2 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 'ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ)' విద్యాసంస్థ రాష్ట్రానికి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఐఐహెచ్‌టీని మంజూరు చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఐఐహెచ్‌టీ ద్వారా చేనేత రంగంలో పరిశోధనలు పెరుగుతాయి. అలాగే చేనేత కార్మికులకు ప్రత్యేక కోర్సులు అందించడంతో వారికి ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 10 ఐఐహెచ్‌టీలు మాత్రమే ఉన్నాయి. ఇందులో ఆరు కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో ఉండగా, నాలుగు రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఉన్నాయి. తెలంగాణకు కేటాయించింది రాష్ట్రానికి సంబంధించినదే. విద్యాసంస్థ ఏర్పాటు, నిర్వహణ, సిబ్బంది నియామకం అంతా రాష్ట్రం చేతుల్లోనే ఉంటుంది. రాష్ట్రంలో ఏర్పాటుకానున్న విద్యాసంస్థకు కావాల్సిన సహకారాన్ని వారాణసీలోని ఐఐటిహెచ్ అందించనుంది. అయితే, వన్‌టైం సపోర్ట్ కింద కేంద్రం సహకారం ఇస్తుంది. చేనేత రంగంలో టెక్స్‌టైల్ డిజైనింగ్, అప్పరల్స్ డిజైనింగ్, మార్కెటింగ్, ఇంటర్నేషనల్ ట్రేడ్ కోర్సుల కోసం ప్రస్తుతం రాష్ట్ర విద్యార్థులు ఏపీ, ఒడిసాలోని ఐఐహెచ్‌టీలకు వెళ్లేవారు. రాష్ట్రంలో ఐఐహెచ్‌టీ ఏర్పాటైతే ఆయా కోర్సులు ఇక్కడే అందుబాటులోకి వస్తాయి. ఈ రంగంలో పరిశ్రమలు పెరిగి ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. రాష్ట్రానికి ఐఐహెచ్‌టీ కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డి గత ఢిల్లీ పర్యటనలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు వినతి పత్రం అందజేశారు. ఇటీవల రాష్ట్రానికి వచ్చిన కేంద్ర జౌళి శాఖ కార్యదర్శి రచన షాకు జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కూడా వినతి పత్రం ఇచ్చారు. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి ఐఐహెచ్‌టీ కేటాయించడంపై మంత్రి తుమ్మల హర్షం వ్యక్తం చేశారు. ఈ రంగంలో నైపుణ్యత కలిగిన మానవ వనరులు, పరిశ్రమలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర చేనేత పరిశ్రమ ఖ్యాతి అంతర్జాతీయ స్థాయికి చేరేందుకు ఐఐహెచ్‌టీ దోహదపడుతుందన్నారు. కాగా, ఐఐహెచ్‌టీ తొలి బ్యాచ్ 75 మందితో ప్రారంభించే అవకాశాలున్నాయని రాష్ట్ర హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్ శాఖ డైరెక్టర్ డాక్టర్ అలగు వర్షిణి పేర్కొన్నారు. కాగా, తెలంగాణలోని ఆయిల్‌పామ్ రైతుల ప్రయోజనాల కోసం పామాయిల్ గెలలకు లాభదాయకమైన ధరలను ప్రకటించాలని కోరుతూ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వానికి శనివారం లేఖ రాశారు. కనీసం టన్నుకు రూ.18వేలు ఉండే విధంగా వెంటనే తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నేడు పల్స్‌పోలియో



హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమం జరగనుంది. ఇందుకుగాను అన్ని ఏర్పాట్లను వైద్య ఆరోగ్యశాఖ పూర్తి చేసింది. అప్పుడే పుట్టిన శిశువుల నుంచి ఐదేళ్ల చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయనున్నారు. తెలంగాణలో 40,57,320 మంది ఆ వయసు చిన్నారులున్నారు. వారందరి కోసం 50.30 లక్షల పోలియో డోసులను వైద్యశాఖ సిద్ధం చేసింది. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలియో చుక్కల కార్యక్రమం జరగనుంది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 22,445 పోలియో బూత్‌లను ఏర్పాటు చేశారు. అలాగే 910 మొబైల్ బృందాలను కూడా వైద్యశాఖ అందుబాటులో ఉంచింది. 2245 మంది రూట్ సూపర్‌వైజర్‌ను రంగంలోకి దించింది. రాష్ట్రవ్యాప్తంగా 8754 మంది ఏఎన్ఎంలు 28,160 మంది ఆశా కార్యకర్తలు, 35,700 మంది అంగన్వాడీ కార్యకర్తలు ఇందులో పాల్గొంటున్నారు. అలాగే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సంబంధిత విభాగాలను వైద్యశాఖ భాగస్వామ్యం చేసింది. మహిళా శిశు సంక్షేమం, పురపాలకశాఖ, విద్య, పంచాయతీరాజ్, ఐకేపీ, డిఫెన్స్, నేవీ, ఆర్టీసీ విభాగాల సాయాన్ని తీసుకోనుంది. ఆదివారం పోలియో చుక్కలు మిస్ అయిన వారిని గుర్తించి.. సోమ, మంగళవారాల్లో వారికి వేస్తారు. హైదరాబాద్‌లో మాత్రం మిస్ అయిన చిన్నారుల కోసం మార్చి 6న పోలియో చుక్కలు వేస్తామని వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆర్వీకర్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలియోరహిత సమాజమే లక్ష్యంగా పనిజేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రధానంగా హైరిస్క్ గ్రూపులు నివసించే మురికివాడలు, యాచకులు, సంచార జాతులు, ఇటుకబట్టీ తయారీ కేంద్రాలు, భవన నిర్మాణ ప్రాంతాలు, వ్యవసాయ కుటుంబాలుండే ప్రాంతాలు, కొత్తగా నిర్మిస్తున్న కాలనీలపై ఎక్కువగా దృష్టిసారించనున్నారు. కాగా, రాష్ట్రంలో 2007లో చివరిసారిగా పోలియో కేసును సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో గుర్తించారు.

భూదాన భూముల్లో కాలనాగులు

(మొదటి పేజీ తరువాయి)

ఉంది. ఇందులో 29.27 ఎకరాల భూమిని గతంలో భూ యజమానులు రాజనగరి మల్లారెడ్డి, మరో ఏడుగురు భూదానం చేశారు. భూదాన బోర్డులో వీటికి సంబంధించిన వివరాలన్నీ ఉన్నాయి. కొన్నాళ్లపాటు ఎవరూ ఈ భూముల జోలికి రాలేదు. కానీ, హైదరాబాద్ శివార్లలో భూముల ధరలు పెరగడంతో కొందరి కళ్లు వీటిపై పడ్డాయి. 2000 సంవత్సరం తరువాత ఇందులో క్రయ విక్రయాలు మొదలయ్యాయి. దీనిపై భూదాన బోర్డు అభ్యంతరం తెలుపుతూ అప్పటి సీసీఎల్ఏకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఈ భూములన్నింటినీ విభజన చేసి 22ఏ కింద నిషేధిత జాబితాలో చేర్చారు. కానీ, తరువాతి కాలంలో ఈ భూముల సంరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోకపోవడంతో బడా వ్యక్తులంతా వీటిపై పడ్డారు. అధికారులను లొంగదీసుకుని, అప్పటికే భూమి స్వాధీనంలో ఉన్నవారిని ధరణి పేరుతో భయపెట్టి, అక్కడి నుంచి వెళ్లగొట్టి అత్యంత విలువైన భూములను దొడ్డిదారిన సొంతం చేసుకున్నారు. ప్రధానంగా ధరణి వచ్చిన తరువాతే ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. దాదాపు రూ.2 వేల కోట్ల విలువ చేసే 29.27 ఎకరాల భూములు పెద్దల పేరుమీదికి మారిపోయాయి. దొడ్డిదారిన భూదాన భూములను చేజిక్కించుకున్న వారిలో బోయినపల్లి శ్రీనివాసరావు ఉన్న విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' ఇప్పటికే వెలుగులోకి తీసుకురాగా.. తాజాగా ఆ పార్టీ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేరు కూడా బయటపడింది. రాజేశ్వర్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల పేరుమీద నాలుగెకరాల భూములు ఉన్నట్లు వెల్లడైంది. మరో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కూడా తన బినామీల పేరిట భూదాన భూములను రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తేలింది.

అప్పట్లోనే అమ్మకాలకు యత్నం..

వాస్తవానికి 2006 జూన్ 12న భూదాన బోర్డు 186, 187, 188, 189 సర్వే నంబర్లలోని 29.27 ఎకరాల భూమిని 60 మందికి పంపిణీ చేసింది. వీరంతా భూమిలేని పేదలంటూ ఒక్కొక్కరికి 20 గుంటల చొప్పున 60 మందికి పట్టాలు ఇచ్చింది. కానీ, ఇందులో అప్పటి భూదాన బోర్డు కార్యవర్గ సభ్యుల సమీప బంధువులు, వారి వద్ద పనిచేసే వారే ఉన్నారు. తరువాత.. ఈ భూమికి పట్టాలు పొందినవారు భూ



మార్పిడి కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీనికి అప్పటి రాజేంద్రనగర్ ఆర్డీవో ఆమోదం తెలుపుతూ 2007 ఫిబ్రవరి 15న ప్రొసీడింగ్స్ జారీ చేశారు. తరువాత వీరంతా కలిసి ఈ భూములను అమ్మేందుకు అప్పటి భూదాన బోర్డు సభ్యుడికి 2007 నవంబరు 5న జీపీఏ చేశారు. దీంతో ఆ బోర్డు సభ్యుడు మొత్తం 29.27 ఎకరాలను ఓ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీకి ఇచ్చేందుకు ప్రయత్నించాడు. అయితే ఈ విషయం బయటకు పొక్కడంతో వెంటనే రెవెన్యూ అధికారులు విచారణ జరిపి దొడ్డిదారిన జరుగుతున్న విక్రయాలను అడ్డుకున్నారు. అంతేకాకుండా.. 60 మందికి ఇచ్చిన పట్టాలను కూడా రద్దు చేశారు. కానీ, ఆ తరువాత భూదాన భూములను గాలికి వదిలేయడంతో వాటిని ఎవరికి ఇష్టం వచ్చినట్లు వాళ్లు అమ్మేసుకుంటూ వచ్చారు. దీంతో క్రయ విక్రయాలను అడ్డుకునేందుకు కొందరు.. అధికారులకు ఫిర్యాదు చేశారు. 2007లో అప్పటి జాయింట్ కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశారు. దాంతో భూదాన భూములను 22ఏ నిషేధిత జాబితాలో పెట్టారు. మరికొందరు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేయడంతో.. ఆ భూముల్లో క్రయ విక్రయాలు జరపొద్దంటూ రెవెన్యూ అధికారులకు కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టులో ఇంకా వివాదాలు నడుస్తున్నా భూదాన భూములు దొడ్డిదారిన చేతులు మారుతూనే వస్తున్నాయి. ఈ భూములు ఉన్న సర్వే నంబర్లలో ఇప్పటివరకు కొన్ని వందల రిజిస్ట్రేషన్లు జరిగాయి. బడా వ్యక్తులంతా అధికార, అంగబలంతో రూ.వందల కోట్ల విలువైన భూములను స్వాహా చేశారు. వీరికి రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు సహకరించారు.

2021లో మరోసారి నిషేధిత జాబితాలో..

వట్టినాగులపల్లిలోని సర్వే నంబర్లు 186, 187, 188, 189లోని 29.27 ఎకరాల భూదాన భూముల క్రయ విక్రయాలను నిలిపివేస్తూ 2021 జూన్ 10న జిల్లా కలెక్టర్ మరోసారి 22ఏ కింద నిషేధిత జాబితాలో పెట్టారు. సర్వే నంబరు 186ఏలో 0.30 ఎకరాలు, 186ఏఏలో 1.00 ఎకరా, 186ఇలో 1.00 ఎకరా., 186ఆఆలో 3.00 ఎకరాలు, 186యూలో 2.03 ఎకరాలు, 186యూయూ1లో 2.09 ఎకరాలు, 187లో 4.18 ఎకరాలు, 188లో 8.16 ఎకరాలు, 189ఏలో 3.15 ఎకరాలు, 189ఇ2లో 3.15 ఎకరాలు ఈ నిషేధిత జాబితాలో ఉన్నాయి. రిజిస్ట్రేషన్ శాఖ వద్ద ఈ జాబితా ఉన్నప్పటికీ ధరణి ద్వారా రిజిస్ట్రేషన్ చేసే తహసీల్దార్ కార్యాలయంలో ఇవేమీ పట్టించుకోకుండానే భూముల రిజిస్ట్రేషన్ జరిగింది. మరోవైపు 187, 188 సర్వే నంబర్లలోని భూదాన భూముల విషయంలో కొందరు హైకోర్టులో రిట్ పిటిషన్ (34504/2023) దాఖలు చేశారు. దొడ్డిదారిన అమ్మిన భూముల క్రయ విక్రయాలు నిలిపి వేయాలని కోరారు. దీంతో అప్పటివరకు జరిగిన విక్రయాలు నిలిపివేయాలని, తదుపరి కూడా ఎలాంటి రిజిస్ట్రేషన్లు జరగకుండా చర్యలు తీసుకోవాలని గతేడాది డిసెంబరు 21న హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. అయితే ఈ ఆదేశాల తరువాత పక్క సర్వే నంబర్లలోని భూదాన భూములకు రిజిస్ట్రేషన్లు చేసి పట్టాదారు పాస్‌బుక్‌లు జారీ చేశారు. ఇలా బోయినపల్లి శ్రీనివాస్‌రావుకు భూదాన భూములతోపాటు సాఫ్ట్‌వేర్ ఎంప్లాయీస్ హౌసింగ్ సొసైటీ భూములు 8.07 ఎకరాలను రిజిస్ట్రేషన్ చేయడం గమనార్హం.

'ధరణి బూచితో భూముల స్వాహా'పై ప్రభుత్వం విచారణ జరిపించాలి

- 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం అక్షర సత్యం
- వినోద్‌కుమార్ కుటుంబ సభ్యులు భూముల్ని కాజేశారు: సంజయ్



జమ్మికుంట, మార్చి 2: రంగారెడ్డి జిల్లాలోని వట్టినాగులపల్లిలో భూదాన్ భూముల పేరుతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల భూమిని బీఆర్ఎస్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ సోదరుడు లాగేసుకున్న ఘటనపై ప్రభుత్వం విచారణ జరిపించాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ కోరారు. 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన 'ధరణి బూచితో భూమి స్వాహా' కథనం అక్షర సత్యమన్నారు. ప్రజాహిత యాత్రలో భాగంగా శనివారం కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం శాయంపేట గ్రామంలో సంజయ్ విలేకరులతో మాట్లాడారు. రూ.500 కోట్ల విలువ చేసే భూముల్ని వినోద్‌కుమార్ కుటుంబ సభ్యులు, కేసీఆర్ కుటుంబ సభ్యులు కాజేశారని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన అన్ని ఆధారాలను 'ఆంధ్రజ్యోతి' బయట పెట్టిందన్నారు. ధరణి కేసీఆర్ కుటుంబానికి మాత్రమే ఉపయోగపడిందని, భూములను మింగడం కోసమే ధరణిని తెచ్చారని ఆరోపించారు. భూదాన్ భూములపై తాను 15 రోజుల నుంచి ఆధారాలు సేకరిస్తున్నానని, ఈ క్రమంలోనే కుంభకోణాన్ని 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టడం సంతోషంగా ఉందని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కాంప్రమైజ్ పొలిటికల్ గేమ్ ఆడుతున్నాయని సంజయ్ ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో అక్రమాలు జరిగినట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కాగ్, విజిలెన్స్ సంస్థలు తేల్చినా చర్యలెందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం కోరితే కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరిపించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా బీజేపీకి 350 ఎంపీ సీట్లు వస్తాయని, తెలంగాణలో 17 సీట్లనూ గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్ నుంచి కరీంనగర్, రామగుండం రహదారిపై ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్రం రక్షణ భూములు ఇవ్వడం హర్షణీయమన్నారు.

బీఆర్ఎస్ పాలనలో పంచాయతీలు నిర్వీర్యం

- స్థానిక సంస్థల బలోపేతానికి రాజీవ్ కృషి: పొన్నం

హైదరాబాద్/శంషాబాద్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని, దివంగత రాజీవ్‌గాంధీ స్థానిక సంస్థలను పటిష్ఠం చేసేందుకు కృషి చేశారని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యమైందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్థానిక సంస్థలకు ప్రతి ఐదేళ్లకోసారి తప్పకుండా ఎన్నికలు జరగాలని 73, 74 రాజ్యాంగ సవరణ చట్టాలను తీసుకొచ్చేందుకు కృషి చేసిన గొప్ప మహనీయుడు రాజీవ్‌గాంధీ అని ఆయన కొనియాడారు. స్థానిక సంస్థలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించిన రాజీవ్‌గాంధీ చిరస్మరణీయుడని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ప్రశంసించారు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

వట్టినాగులపల్లి భూముల స్వాహాపై విచారణ

- విచారణకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశం
- కలెక్టర్‌ను కలిసిన హౌసింగ్ సొసైటీ సభ్యులు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

హైదరాబాద్ నగరంలో అత్యంత విలువైన వట్టినాగులపల్లి భూదాన భూములు, సాఫ్ట్‌వేర్ హౌసింగ్ సొసైటీ భూములను అధికార బలంతో బడా వ్యక్తులు కాజేసిన వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించారు. దీనిపై ఆరా తీసి.. సమగ్ర విచారణకు ఆదేశించారు. వట్టినాగులపల్లిలో సాఫ్ట్‌వేర్ అసోసియేట్స్ మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి చెందిన భూములతోపాటు భూదాన భూములను స్వాహా చేసిన వైనంపై 'ఆంధ్రజ్యోతి' శనివారం 'ధరణి బూచితో భూమి స్వాహా' శీర్షికన కథనాన్ని ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ కథనం రాష్ట్ర వాప్తంగా కలకలం రేకెత్తించింది. దీంతో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక శనివారం సంబంధిత అధికారులను పిలిచి మాట్లాడారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములను రిజిస్ట్రేషన్ చేసి పట్టాదారు పాస్‌బుక్‌లు జారీ చేయడంపై ఆరా తీశారు. స్థానిక రెవెన్యూ అధికారులతోపాటు జిల్లా కోఆపరేటివ్ అధికారి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ భూముల వ్యవహారంపై సమగ్ర నివేదిక అందించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. మరోవైపు సాఫ్ట్‌వేర్ అసోసియేట్స్ మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సభ్యులు జిల్లా కలెక్టర్ శశాంకను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. 22 ఏళ్ల కిందట విప్రో ఉద్యోగులంతా కలిసి 8.07 ఎకరాల భూములు కొనుగోలు చేశామని, వీటిని రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నామని తెలిపారు. అయితే సొసైటీ అధ్యక్షుడు, మరికొందరు కలిసి మోసం చేసి తమ భూములను కొల్లగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు.

యూరిన్ టెస్ట్‌లో..
డైరెక్టర్ క్రిష్‌కు క్లీన్‌చిట్

- ఇంకా అందాల్సిన రక్త పరీక్షల రిపోర్టులు
- గోవా డ్రగ్స్ డీలర్లతో మిర్జా బేగ్‌కు లింకులు
- అతని స్నాప్‌చాట్‌లో కస్టమర్ల గుట్టు



హైదరాబాద్ సిటీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాడిసన్ హోటల్‌లో డ్రగ్స్ పార్టీ కేసులో సినీ దర్శకుడు క్రిష్‌కు యూరిన్ టెస్ట్‌లో క్లీన్‌చిట్ వచ్చింది. శుక్రవారం క్రిష్ గచ్చిబౌలి పోలీసుల ఎదుట విచారణకు హాజరైన విషయం తెలిసిందే.! మాదాపూర్ డీసీపీ ఆయనను విచారించారు. ఆ తర్వాత క్రిష్‌కు డ్రగ్స్ పరీక్షలు నిర్వహించాల్సిందిగా డీసీపీ ఆదేశించారు. దీంతో పోలీసులు ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మూత్రపరీక్ష, నగరంలోని ఓ ప్రముఖ ఆస్పత్రిలో రక్తపరీక్షలు నిర్వహించారు. యూరిన్ పరీక్షలో 'డ్రగ్స్ నెగటివ్'గా తేలినట్లు పోలీసులు తెలిపారు. రక్తపరీక్షల నివేదిక ఇంకా రావాల్సి ఉందని వివరించారు. ఒకట్రెండు రోజుల్లో ఆ రిపోర్టులు వస్తాయని చెప్పారు. కాగా.. ఈ కేసు దర్యాప్తులో గచ్చిబౌలి పోలీసులు పురోగతిని సాధించారు. డ్రగ్స్ మూలాలను ప్రాథమికంగా గుర్తించారు. మిర్జా వహీద్ బేగ్ ప్రధాన డ్రగ్స్ సప్లయర్‌గా.. అతని నుంచి అబ్బాస్, వివేకానంద డ్రైవర్ ద్వారా రాడిసన్ హోటల్‌కు డ్రగ్స్ చేరినట్లు నిర్ధారించారు. వివేకానందకు-మిర్జాకు మధ్య అబ్బాస్ వారధిగా పనిచేసినట్లు తేల్చారు. మిర్జాకు గోవాలో ఉన్న డ్రగ్స్ డీలర్లతో నేరుగా సంబంధాలున్నాయని, రహ్మాన్ అనే వ్యక్తి ద్వారా అతను గోవా నుంచి మత్తుపదార్థాలను తెప్పించేవాడని దర్యాప్తు అధికారులు తెలిపారు. గోవా డీలర్లతో మిర్జా స్నాప్‌చాట్ ద్వారా ఆర్డరిచ్చేవాడని, నగరంలోని తన కస్టమర్లతోనూ ఈ యాప్ ద్వారానే సంప్రదింపులు జరిపేవాడని వెల్లడించారు. ఇతను ఎక్కడా పోలీసులకు చిక్కకుండా హైదరాబాద్‌లో తన నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నట్లు చెప్పారు. "ఒకరికి తెలియకుండా మరొకరి ద్వారా.. ఓ చైన్ సిస్టమ్ మాదిరిగా డ్రగ్స్ సరఫరా చేయడం మిర్జా శైలి. అతని స్నాప్‌చాట్‌ను విశ్లేషిస్తే.. నగరంలోని కస్టమర్ల వివరాలు తెలుస్తాయి. అతను వివేకానంద పార్టీలకు 10 సార్లు డ్రగ్స్‌ను సరఫరా చేసినట్లు గుర్తించాం" అని వివరించారు. కాగా.. మిర్జాబేగ్ అరెస్టు సందర్భంగా పోలీసులు అతని వద్ద 4 గ్రాముల కొకైన్‌ను సీజ్ చేశారు. మరోవైపు రాడిసన్ హోటల్ యాజమాన్యం, ఆపరేషన్స్ మేనేజర్‌పై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణకు హాజరు కావాలని ఆదేశిస్తూ నోటీసులు జారీ చేశారు.

చుట్టపు చూపుగా ఆస్పత్రికి!

ఆదిలాబాద్ జిల్లాలోని ఓ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ఏ రోజూ సమయానికి రారు. ఉదయం పదకొండు తర్వాతే ఆయన డ్యూటీకి వస్తారు. మధ్యాహ్నం రెండు కాకముందే వెళ్లిపోతారు. ఆ పీహెచ్‌సీలో సీసీ కెమెరాలు పని చేయడం లేదు. సీసీ కెమెరాల వైర్లను కావాలనే తొలగించినట్లు కనిపిస్తోంది.

యాదాద్రి జిల్లాలోని కొండమడుగు పీహెచ్‌సీ వైద్యుడు ఏ రోజూ టైమ్‌కు రావడం లేదు. ఇంకా చెప్పాలంటే రెండు రోజులకోసారి డ్యూటీకి వస్తారు. వచ్చినా కేవలం రెండు గంటలే ఉంటున్నారు. రోజురోజు విడిచి రోజు డాక్టర్ డ్యూటీకి వస్తుండటంతో అక్కడి ప్రజలు పీహెచ్‌సీకి రావడమే మానేశారు.

- పీహెచ్‌సీల్లో వైద్యుల ఇష్టారాజ్యం
- సమయపాలన పాటించకుండా నిర్లక్ష్యం
- విధులు నిర్వర్తించేది కేవలం 2-3 గంటలే
- సీసీ కెమెరాలున్నా పని చేయని వైనం
- వైద్యశాఖ అధికారుల పర్యవేక్షణ కరువు



రాష్ట్రవ్యాప్తంగా మెజారిటీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఇలాంటి పరిస్థితులే ఉన్నాయి. పీహెచ్‌సీల్లో వైద్యులు సమయపాలన పాటించడం లేదు. ఏదో చుట్టపు చూపుగా ఇలా వచ్చి అలా వెళ్లే వారే తప్ప.. నిర్ణీత సమయం డ్యూటీ చేసే డాక్టర్లే కనిపించడం లేదు. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలో 636 గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 232 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం 12 గంటలపాటు పనిచేసే పీహెచ్‌సీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు, 24 గంటలపాటు పనిచేసే పీహెచ్‌సీల్లో షిఫ్టుల వారీగా రాత్రి, పగలు వైద్యులు పని జేయాలి. కానీ, రాష్ట్ర వ్యాప్తంగా ఏ పీహెచ్‌సీలోనూ అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. మెజారిటీ పీహెచ్‌సీల్లో ఉదయం 11 తర్వాతే వైద్యులు విధులకు హాజరవుతున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకే తిరిగి వెళ్లిపోతున్నారు. కొందరు వైద్యులైతే రోజు విడిచి రోజు పీహెచ్‌సీకి వస్తున్నారు. పీహెచ్‌సీలకు వెళ్తే వైద్యులు ఉంటారన్న గ్యారెంటీ లేకపోవడంతో ప్రజలు అనివార్యంగా ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. గత మూడు, నాలుగు నెలలుగా పీహెచ్‌సీల్లో వైద్య సేవలు మరింత దిగజారాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

80% పీహెచ్‌సీల్లో సీసీ కెమెరాలు బంద్

గత ప్రభుత్వ హయాంలో ప్రతి పీహెచ్‌సీలో మూడు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటన్నింటినీ హైదరాబాద్‌లోని ప్రజారోగ్య సంచాలకుల కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు. అన్ని పీహెచ్‌లను ఇక్కడి నుంచే పర్యవేక్షించేవారు. దీంతో డాక్టర్లు, నర్సులు గైర్హాజరైతే వెంటనే తెలిసిపోయేది. సదరు డాక్టర్లకు వెంటనే నోటీసులు ఇచ్చే వారు. ఇలాంటి నిఘా వ్యవస్థ.. ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. 80 శాతం పీహెచ్‌సీల్లో ప్రస్తుతం సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. ఆస్పత్రిలో సీసీ కెమెరాలు పని చేస్తున్నాయా? లేదా? అని అడిగే వారే కరువయ్యారని ఓ జిల్లాకు చెందిన పీహెచ్‌సీ వైద్యుడు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఉదాహరణకు భద్రాద్రి జిల్లాలో 29 పీహెచ్‌సీలు ఉంటే.. 20 చోట్ల, యాదాద్రి జిల్లాలో 19 పీహెచ్‌సీలు ఉంటే..13 చోట్ల సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. కొన్ని చోట్ల డాక్టర్లు, సిబ్బంది కుమ్మక్కై సీసీ కెమెరాల కనెక్షన్స్ తొలగిస్తున్నారు. మరికొన్ని చోట్ల ఇంటర్నెట్ రావడం లేదని చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 80శాతం పీహెచ్‌సీల్లో కెమెరాలు రోజూ ఆఫ్‌లైన్‌లోనే ఉంటున్నాయి. దీనిపై ఎవ్వరరికీ పట్టింపులేకుండాపోయిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

350 మెడికల్ ఆఫీసర్ పోస్టులు ఖాళీ

రాష్ట్రంలోని అన్ని పీహెచ్‌సీల్లో కలిపి 350 మెడికల్ ఆఫీసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో వంద చోట్ల కాంట్రాక్టు వైద్యులతో పని చేయిస్తున్నారు. నిజానికి ప్రతీ పీహెచ్‌సీలోనూ ఇద్దరు వైద్యులు ఉండాల్సి ఉన్నా.. ఒక్కరితోనే నెట్టుకొస్తున్నారు. ఇటీవల కొందరు కాంట్రాక్టు, రెగ్యులర్ ఎంబీబీఎస్ వైద్యులకు పీజీ సీట్లు రావడం, డిప్యూటేషన్లను రద్దు చేయడం వంటి కారణాలతో పీహెచ్‌సీల్లో ఆ ఒక్క డాక్టర్ కూడా కనిపించడం లేదు. దీనికితోడు తాజాగా రెగ్యులర్ నియామకాలు చేపట్టడంతో పీహెచ్‌సీల్లో పని చేస్తే కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు కూడా వెళ్లిపోయారు. అటు వైద్యులు లేక, ఇటు స్టాఫ్‌నర్సులు తగినంత మంది లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, హైదరాబాద్

గొర్రెల కేసు.. ముగిసిన నిందితుల కస్టడీ

- విచారణలో కీలక వివరాలు సేకరించిన ఏసీబీ అధికారులు

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : గొర్రెల పంపిణీ పథకం కుంభకోణంలో అరెస్టు అయిన నలుగురు నిందితుల మూడు రోజుల ఏసీబీ కస్టడీ ముగిసింది. జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్న ధర్మపురి రవి, ఆదిత్య కేశవ సాయి, పి. రఘుపతి రెడ్డి, గణేష్‌ను కోర్టు అనుమతితో గురు, శుక్ర, శనివారాల్లో ఏసీబీ ప్రశ్నించింది. కస్టడీ గడువు ముగియడంతో వారిని శనివారం సాయంత్రం తిరిగి చంచల్‌గూడ కేంద్ర కారాగారానికి తరలించింది. విచారణలో భాగంగా నిందితులు నుంచి అధికారులు కీలక సమాచారం రాబట్టారు. రూ. 2.10 కోట్ల నిధుల గోల్‌మాల్‌తో పాటు, పథకం అమలులో వ్యవస్థాగత లోపాలపై కూడా ఏసీబీ ఆరా తీసింది. నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో ప్రతీ దశలో ఎవరెవరి ప్రమేయం ఉందనే సమాచారాన్ని అధికారులు రాబట్టారు. ఈ కుంభకోణంలో పలువురు ఉన్నతస్థాయి అధికారులు, రాజకీయ నాయకుల ప్రమేయం కూడా ఉన్నట్టు గుర్తించారు. ఆయా వ్యక్తులందరికీ విచారణ నిమిత్తం నోటీసులు జారీ చేసేందుకు ఏసీబీ రంగం సిద్ధం చేస్తోంది. కాగా, ప్రభుత్వ పథకం అమలుకు గొర్రెలు కొనుగోలు చేసి సరఫరా చేసేందుకు థర్డ్ పార్టీగా వ్యవహరించిన లోలోనా సంస్థ యజమాని సయ్యద్ మొహిదొద్దీన్‌పై ఏసీబీ దృష్టి సారించింది. మొహిదొద్దీన్ ఆయన కుమారుడు సౌదీకి పరారైనట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. వారిని స్వదేశానికి రప్పించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. వారిద్దరినీ విచారిస్తే ఈ కేసులో మరి కొందరు ప్రముఖుల పేర్లు బహిర్గతం అయ్యే అవకాశం ఉంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
నవ్య
దృశ్యం
ఆదివారం
3 మార్చి 2024



పుష్ప-2 అంచనాలకు మించి ఉంటుంది

నేషనల్ క్రష్‌గా పేరున్న రష్మికా మందన్నాకు అంతర్జాతీయంగానూ ఫాలోయింగ్ మామూలుగా లేదు. ఈ ముద్దుగుమ్మ ఇటీవలే జపాన్‌లోని క్రంచీ రోల్ యానిమే అవార్డ్స్‌కు హాజరయ్యింది. అక్కడ ఆమెకు అభిమానుల నుంచి ఓ రేంజ్‌లో ఆదరణ లభించింది. జపనీయుల ఆదరాభిమానాలతో పాటూ భారతదేశం నుంచి ఈ వేడుకకు హాజరయిన సెలబ్రిటీగా 'శ్రీవల్లి' విశేష ఖ్యాతితో పాటు అరుదైన రికార్డు సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా, తన నెక్ట్స్ ప్రాజెక్ట్ గురించి మీడియాతో కొన్ని ఆసక్తికర విషయాలు పంచుకుంది.

పుష్ప-2లో అత్యుత్తమ నటన

పుష్ప-2లో తాను పుష్పరాజ్‌కు భార్యగా కనిపిస్తానని, తన పాత్ర బాధ్యత మరింతగా పెరిగిందని తెలిపిందీ ఈ కన్నడ కస్తూరి. పార్ట్-1 కంటే ఇందులో మరింత డ్రామా, పాత్రల మధ్య బలమైన సంఘర్షణ ఉంటాయని వివరించింది. వీటితో పాటూ మొదటి భాగాన్ని మించిన మాస్ మసాలా ఇందులో ఉందని తెలిపింది. దర్శకుడు సుకుమార్‌తో మళ్లీ పనిచేయడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పింది మూడేళ్ల తర్వాత మళ్లీ 'పుష్ప' చిత్ర యూనిట్‌ను కలుసుకోవడం సొంత ఇంటి సభ్యులను కలుసుకున్న అనుభూతి కలిగిందని హర్షం వ్యక్తం చేసింది. ఈ సీక్వెల్‌పై ఎన్నో అంచనాలు ఉన్నాయని, అందుకే 'తగ్గేదేలా' అంటూ చిత్ర బృందం అహర్నిశలు శ్రమిస్తోందని వివరించిందీ నటి. పుష్ప-2 షూటింగ్ సమయంలో తన అత్యుత్తమ నటన బయటికొచ్చిందని, తన కెరీర్‌లోనే 'శ్రీవల్లి' పాత్ర ప్రత్యేకంగా మిగిలిపోతుందని విశ్వాసం వ్యక్తం చేసింది. అందరి అంచనాలను మించేలా తెరకెక్కుతోన్న పుష్ప-2 కోసం అభిమానులతో పాటూ తానూ ఆతృతగా ఎదురుచూస్తున్నానందీ క్యూట్ బ్యూటీ

చెప్పాలనిపించే విషయం ఉండాలి

సినిమాలు ఎంచుకునేటప్పుడు తన పాత్ర ప్రాధాన్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానంటోంది రష్మిక. కథల ఎంపికలో ఆచితూచి అడుగులు వేస్తూ కొన్ని నియమాలు పాటిస్తానంటోంది. తాను ఎంపిక చేసుకున్న కథల్లో తనకు చెప్పాలనిపించే విషయం ఏదో ఒకటి ఉండాలని, అలాగే, తన పాత్ర ద్వారా వీలైనంత సందేశం ఇవ్వగలిగేలా ప్రయత్నం చేస్తానంటోంది. అందుకే మహిళా ప్రాధాన్యమున్న 'రెయిన్ బో', 'గర్ల్ ఫ్రెండ్' చిత్రాల్లో నటిస్తున్నానని వివరించిందీ అమ్మడు. అయితే ప్రతీ చిత్రం ద్వారా సందేశాన్ని చెప్పలేమని, తనను ఎక్సయిట్ చేసిన పాత్రలు వింటే వెంటనే ఒప్పేసుకుంటా అంది.

మరిన్ని రొమాంటిక్ చిత్రాల్లో నటించాలనుంది

జీవితంలో ఒక్కో దశలో ఒకలా ఆలోచిస్తామని, ఈ మార్పు పాత్రల ఎంపికపైనా ప్రభావం చూపిస్తుందని ఈ కన్నడ భామ తెలిపింది. ఈ మధ్య యాక్షన్ ఓరియెంటెడ్ సినిమాల్లో ఎక్కువగా నటించానని, అందుకే ప్రస్తుతం తనకు మరిన్ని రొమాంటిక్ చిత్రాల్లో నటించాలనుందని, అటువంటి స్క్రిప్టులే తన ముందుకు రావాలని కోరుకుంటున్నానని రష్మిక చెప్పింది.





శ్రీరామ నవమికి ప్రకటిస్తారట!

దర్శకుడు నితిశ్ తివారీ రూపొందించే రామాయణం సినిమా షూటింగ్‌కు కౌంట్ డౌన్ మొదలైంది. రణబీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా, యశ్ రావణుడిగా నటించే ఈ భారీ ప్రతిష్ఠాత్మక చిత్రం షూటింగ్ త్వరలోనే మొదలవుతుంది. రెండు భాగాలుగా ఈ చిత్రం తయారవుతోంది. ఎటువంటి వివాదాలకు తావు లేకుండా రామాయణ కథను తెరకెక్కించాలని నితిశ్ ప్రయత్నిస్తున్నారు. అందుకే ఐదేళ్ల పాటు తన టీమ్‌తో కలసి వర్క్ చేసి, స్క్రిప్ట్ సిద్ధం చేశారు. ఇదొక దృశ్య కావ్యంలా ఉండాలని నితిశ్ తపన. విజువల్ ఎఫెక్ట్స్ విషయంలో కూడా ఆయన ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. రామాయణం షూటింగ్ ఎప్పుడు మొదలవుతుంది, నటీనటుల వివరాలు ఏమిటి అనే పూర్తి సమాచారాన్ని శ్రీరామనవమి సందర్భంగా ఏప్రిల్ 17న వెల్లడిస్తారని సమాచారం. 2025 దీపావళికి ఈ సినిమాను విడుదల చేయాలనే ఆలోచన ఉన్నప్పటికీ, విజువల్ ఎఫెక్ట్స్ కు ఎంతో ప్రాధాన్యం ఉంది కనుక రిలీజ్ విషయంలో తొందర పడకుండా అంతా సంతృప్తికరంగా వచ్చిన తర్వాతే విడుదల చేయాలని నితిశ్ ఆలోచన. నమిత్ మల్హోత్రాతో కలసి నితిశ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



బాయ్ ఫ్రెండ్‌కు బెస్ట్ విషెస్

బాలీవుడ్‌లో అత్యంత సన్నిహిత జంటల్లో దిశా పటానీ, టైగర్ ష్రాఫ్ కూడా ఉన్నారు. తన బాయ్ ఫ్రెండ్ టైగర్ ష్రాఫ్ బర్త్‌డే సందర్భంగా తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఇప్పటివరకు ఎవరూ చూడని ఒక ఫొటోను షేర్ చేసింది. ఈ ఫొటోలో టైగర్ ష్రాఫ్ తన కికింగ్ నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారు. ఆ ఫొటోపై "పుట్టిన రోజు శుభాకాంక్షలు బాఘీ.. నువ్విలాగే నీ నైపుణ్యాలను చాటుతూ మరింతగా పైకెదగాలి" అని విష్ చేసింది. దీంతో వీరిద్దరి మధ్య ఉన్న అన్యోన్యత మరోసారి బయటపడింది. ఇది బాఘీ సినిమా సిరీస్ షూటింగ్ సమయంలో తీసిన పిక్ అని అర్థమవుతోంది. ప్రస్తుతం సోషల్‌మీడియాలో హల్‌చల్ చేస్తోందీ ఫొటో. బాఘీ-2, బాఘీ-3 చిత్రాల్లో కలిసి నటించిన వీరు మొదటి నుంచి ఒకరిపై ఒకరికి ఉన్న అభిమానాన్ని చాటుకుంటూనే ఉన్నారు. మరోవైపు, టైగర్ ష్రాఫ్‌కు బాలీవుడ్ అగ్ర నటుడు అక్షయ్ కుమార్ విషెస్ తెలిపారు.



తొంభై ఏళ్ల వయసులోనూ అదే ఉత్సాహం



భారతీయ చిత్ర పరిశ్రమలో ఒకప్పుడు అత్యధిక పారితోషికం అందుకున్న నటి, తొలి మహిళా సూపర్‌స్టార్ వైజయంతిమాల. ఆవిడ మంచి నటే కాదు, అద్భుతమైన నర్తకి కూడా. పదహారేళ్ల వయసులోనే చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టిన వైజయంతిమాల తన అందంతో, అభినయంతో ఓ తరం ప్రేక్షకులను అలరించారు. తమిళ, తెలుగు, హిందీ భాషల్లో ఎన్నో చిత్రాల్లో నటించిన వైజయంతిమాల ఇటీవల పద్మవిభూషణ్ పురస్కారం పొందారు. ఇప్పుడు ఆమె వయసు 90 ఏళ్లు. మనసులో ఉత్సాహం ఉరకలు వేస్తున్నా.. వయసు పెరిగిన తర్వాత ఎవరికైనా మునపటిలా శరీరం సహకరించదు. అడుగులు వేయడమే కష్టమవుతుంది. అయితే అందుకు తను మినహాయింపు అని నిరూపించారు వైజయంతిమాల. ఇటీవల అయోధ్యలో 'రాగ్ సేవ' పేరుతో 45 రోజుల పాటు జరిగిన కార్యక్రమంలో భాగంగా వైజయంతిమాల ఒకరోజు నృత్య ప్రదర్శన ఇచ్చారు. 90 ఏళ్ల వయసులో ఆవిడ ఎంతో చలాకీగా, ఉత్సాహంతో నృత్యం చేస్తుంటే చూసిన వాళ్లు షాక్‌కు గురయ్యారు. నిండు నూరేళ్లు ఆవిడ ఇలా ఉండాలని అభిమానులు కోరుకున్నారు.

'కేజీఎఫ్', సలార్ మూవీలతో మోస్ట్ వాంటెడ్ డైరెక్టర్‌గా ప్రశాంత్ నీల్ పేరు తెచ్చుకున్నారు. తాజాగా ప్రశాంత్ నీల్ ఇంట్లో జరిగిన ఓ కార్యక్రమానికి జూనియర్ ఎన్టీఆర్ తన సతీమణి ప్రణతితో వెళ్లారు. అలాగే 'కాంతార' సినిమాతో తెలుగువారికి బాగా చేరువైన నటుడు రిషబ్ షెట్టి కూడా తన భార్య ప్రగతితో ఈ కార్యక్రమంలో మెరిశారు. ఇద్దరు సౌత్ ఇండియన్ స్టార్స్ ఇలా ఒకే చోట తళుక్కుమన్న ఫొటోలు అభిమానులకి ఆనందాన్ని పంచాయి.




12 ఎకరాల స్థలంలో ఆస్పత్రి?



తలైవా రజనీకాంత్ ఏది చేసినా అది ఓ వార్తే. అది ఎప్పుడూ వైరల్ అవుతుంటుంది. అలాగే ఇటీవల ఆయన ఓ ప్రాపర్టీ కొనుగోలు చేశారు. తమిళనాడులో చెంగల్పట్టు జిల్లాలో తిరుపోరూర్ గ్రామంలో ఇటీవల పన్నెండు ఎకరాలు ఆయన కొన్నారు. సినీ తారలు, సెలబ్రిటీలు ఆస్తులు కొనడం కొత్తమీ కాదు. అందులో వింతేమీ లేదు. కానీ ఆ స్థలం రిజిస్ట్రేషన్ కోసం తారలు రిజిస్ట్రార్ ఆఫీసుకు వచ్చినప్పుడు అభిమానులు చేసే హడావిడి ఓ రేంజ్‌లో ఉంటుంది. రజనీకాంత్ విషయంలోనూ అంతే జరిగింది. ఎవరికీ తెలియకుండా తన వర్క్ పూర్తి చేసుకోవాలని తలైవా అనుకున్నారు కానీ అభిమానులకు ఎలా తెలిసిందో ఏమో వాళ్లంతా పరుగున అక్కడికి చేరుకున్నారు. దాంతో వాళ్లని కలసి మాట్లాడక తప్పలేదు రజనీకాంత్‌కు.

ఇంతకీ ఆయన పన్నెండు ఎకరాలు ఎందుకు కొన్నట్టు.. అక్కడ ఫామ్ హౌస్ కడతారా, లేక ఆస్పత్రి కడతారా? అనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కొందరు మాత్రం ఆ స్థలంలో రజనీకాంత్ ఓ పెద్ద ఆస్పత్రి కడతారని, అందులో పేదలకు ఉచితంగా వైద్య సదుపాయాలు కల్పిస్తారని చెబుతున్నారు. మరి తలైవా ఏం చెబుతారో వేచి చూద్దాం.

భర్తను అన్‌ఫాలో చేసిన నయనతార



స్టార్ హీరోయిన్ నయనతార, తన భర్త విఘ్నేశ్ శివన్‌ను ఇన్‌స్టాలో అన్‌ఫాలో చేసింది. ఈ విషయం ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ మధ్యే ఇన్‌స్టా ఖాతా తెరిచింది నయనతార. మొదటి పోస్టుగా తన పిల్లల ఫొటోలను అభిమానులతో పంచుకుంది. ఇప్పుడు ఈ అన్‌ఫాలో విషయంపై సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కొందరు పొరపాటున నయనతార ఇలా చేసుంటుందని సమర్థిస్తున్నారు. మరికొందరు ఏదో టెక్నికల్ సమస్య తలెత్తడం వల్లే విఘ్నేశ్ శివన్ ఫాలోయర్స్ లిస్ట్‌లో నయన్ పేరు లేదని వాదిస్తున్నారు. కోలీవుడ్‌లో ముచ్చటైన జంటగా పేరొందిన వీరు ఏడేళ్లు ప్రేమలో మునిగి తేలి 2022లో ఒక ఇంటి వారయ్యారు. మరి ఈ విషయంలో నయనతార ఎలా స్పందిస్తుందో వేచి చూద్దాం.

మల్టీస్టారర్ మూవీ విశ్వనాథ నాయకుడు బడ్జెట్ ఎంతో తెలుసా?

తెలుగు చలనచిత్ర చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని సృష్టించిన చిత్రం విశ్వనాథ నాయకుడు. 16వ శతాబ్దానికి చెందిన కథతో తీసిన చారిత్రక చిత్రం ఇది. రెండు కోట్ల 70 లక్షల రూపాయల వ్యయంతో రూపుదిద్దుకున్న తొలి తెలుగు భారీ చిత్రం ఇదే. హీరో కృష్ణ ఇందులో టైటిల్ రోల్ పోషించారు. ఆయన నటించిన 250వ చిత్రం ఇది. దాసరి దర్శకత్వంలో విజయమాధవి సంస్థ అధినేత వడ్డే రమేశ్ ఈ సినిమాను నిర్మించారు. ఇందులో శ్రీకృష్ణదేవరాయలుగా కృష్ణంరాజు, నాగమ నాయకునిగా శివాజీ గణేశన్, రాజ నర్తకిగా జయప్రద, పట్టపు రాణిగా సుమలత, తిమ్మరుసుగా సోమయాజులు, రాజ గురువుగా రామకృష్ణ.. ఇలా ప్రముఖ తారాగణమంతా ఈ చిత్రంలో నటించారు. ఇలా మేటి తారాగణంతో రూపుదిద్దుకొన్న ఈ చిత్రాన్ని చెన్నైలో చిత్రీకరిస్తే ఖర్చు పరంగా నిర్మాతకు కలసి వస్తుంది. అయితే స్వరాష్ట్రంలో తెలుగు చిత్ర పరిశ్రమ స్థిరపడాలని సంకల్పంతో మొదటినుంచి తన సినిమాల షూటింగ్స్ హైదరాబాద్ లోనే చేస్తున్న దర్శకుడు దాసరి నారాయణరావు నిర్మాతలను ఒప్పించి 'విశ్వనాథ నాయకుడు' చిత్రాన్ని హైదరాబాదులోనే తీయించారు. అయితే ఇంతటి భారీ చిత్రాన్ని నిర్మించడానికి అనువైన వాతావరణం అప్పట్లో హైదరాబాదులో లేదు ఆర్టిస్టులతో సహా అందరినీ చెన్నై నుంచి తీసుకు రావడంతో చాలా ఖర్చుతో కూడుకున్న విషయం. అయినా నిర్మాతలు రాజీ పడలేదు. వెనక్కి తగ్గలేదు.

సంవత్సరం పాటు నిర్మాణం

1986 ఫిబ్రవరి 4న అన్నపూర్ణ స్టూడియోలో విశ్వనాథ నాయకుడు షూటింగ్ మొదలైంది ఆరు నెలల్లో షూటింగ్ పూర్తి చేయాలని ప్లాన్ వేసుకున్నా, అనుకోని అవాంతరాలు ఎదురు కావడంతో చిత్ర నిర్మాణంలో ఆలస్యం జరిగి సినిమా పూర్తి



చేయడానికి సంవత్సర కాలం పట్టింది ఈ సినిమాలో కీలకమైన యుద్ధ సన్నివేశాలను రూ. 40 లక్షలతో చిత్రీకరించడం విశేషం.ఈ మొత్తంతో ఆ రోజుల్లో ఓ లో బడ్జెట్ చిత్రం తీయవచ్చు. అయినా వడ్డే రమేశ్ ఎక్కడా రాజీపడకుండా డబ్బుని మంచి నీళ్లలా ఖర్చు చేశారు. మే నెలలో.. మండే ఎండల్లో ఈ సన్నివేశాలను రెండు యూనిట్లతో, నాలుగు కెమెరాలతో చిత్రీకరించారు. విద్యుత్ స్తంభాలు ఎక్కడా కనిపించని ప్రదేశం కావాలి కనుక ప్రస్తుతం హైటెక్ సిటీగా ఉన్న మాదాపూర్ పరిసర ప్రాంతాలను ఎన్నుకున్నారు. ఆ రోజుల్లో మాదాపూర్ ప్రాంతం ఓ అడవిలా ఉండేది. జన సంచారం తక్కువ. భారీ అంచనాలతో అగ్రశ్రేణి తారాగణంతో రూపుదిద్దుకున్న 'విశ్వనాథ నాయకుడు' చిత్రం 1987 ఆగస్టు 14న విడుదలైంది. ఆశించిన విజయం సాధించకపోయినా చారిత్రక చిత్ర నిర్మాణాల చరిత్రలో ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకుంది



సేవ్ ద టైగర్స్ సీజన్ 2

సూపర్ హిట్ వెబ్ సిరీస్ 'సేవ్ ద టైగర్స్' సీజన్ 2 వచ్చేస్తోంది. తొలి భాగం ప్రేక్షకుల్ని బాగా ఆకట్టుకోవడంతో సెకండ్ సీజన్ మీద అంచనాలు పెరిగాయి. ఈ నెల 15 నుంచి డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో 'సేవ్ ద టైగర్స్ 2' స్ట్రీమింగ్ కానుంది. మహి వి రాఘవ్, ప్రదీప్ అద్వైతం ఈ సిరీస్‌ను క్రియేట్ చేశారు. అరుణ్ కొత్తపల్లి దర్శకత్వం వహించారు. ప్రియదర్శి, అభినవ్ గోమఠం, చైతన్యకృష్ణ, పావని, జోర్దార్ సుజాత, శ్రీకాంత్ అయ్యంగార్, గంగవ్వ ప్రధాన పాత్రలు పోషించారు.ఈ సిరీస్ ట్రైలర్‌ను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా షో క్రియేటర్ మహి వి.రాఘవ్ మాట్లాడుతూ 'ఈ సెకండ్ సీజన్ అందిస్తున్నందుకు హ్యాపీగా ఫీలవుతున్నాం. ఫస్ట్ సీజన్‌కు మించి హ్యూమర్, సస్పెన్స్, ఫన్ ఇందులో ఉంటుంది' అని చెప్పారు. ఈ సిరీస్ ట్రైలర్ వినోద ప్రధానంగా సాగిపోయింది. వైవాహిక జీవితంలో విసిగిపోయిన భర్తలుగా ప్రియదర్శి, అభినవ్ గోమఠం, చైతన్యకృష్ణ నటించారు. సంసారపు ఒత్తిడుల నుంచి రిలాక్స్ అవడం కోసం వీరు ముగ్గురూ చేసే ప్రయత్నాలు ప్రేక్షకులను నవ్విస్తాయని దర్శకుడు అరుణ్ కొత్తపల్లి చెప్పారు.



న్యూఢిల్లీలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(స్పా)- డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్‌నకు నిర్దేశించిన జాతీయ స్థాయి పరీక్షలో సాధించిన ర్యాంక్, ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ

డిగ్రీ ప్రోగ్రామ్‌లు: బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్, బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్ కోర్సులు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. ఎన్‌టీఏ నిర్వహించే జేఈఈ మెయిన్ 2024 ర్యాంక్ ద్వారా వీటిలో ప్రవేశాలు కల్పిస్తారు. బీ ఆర్కిటెక్చర్‌లో 134 సీట్లు, బీ ప్లానింగ్‌లో 45 సీట్లు ఉన్నాయి.

మాస్టర్స్ ప్రోగ్రామ్‌లు: మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్, మాస్టర్ ఆఫ్ ప్లానింగ్, మాస్టర్ ఆఫ్ బిల్డింగ్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, మాస్టర్ ఆఫ్ డిజైన్ కోర్సులు ఉన్నాయి. ఒక్కో కోర్సు వ్యవధి రెండేళ్లు. గేట్, సీడ్ వ్యాలిడ్ స్కోర్ ఉన్న అభ్యర్థులకు స్కాలర్‌షిప్ ఇస్తారు. మొత్తం 276 సీట్లు ఉన్నాయి.

- **మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ స్పెషలైజేషన్‌లు-సీట్లు:** ఆర్కిటెక్చరల్ కన్జర్వేషన్ 19, అర్బన్ డిజైన్ 25, ల్యాండ్ స్కేప్ ఆర్కిటెక్చర్ 29 సీట్లు ఉన్నాయి.
- **మాస్టర్ ఆఫ్ ప్లానింగ్ స్పెషలైజేషన్‌లు-సీట్లు:** ఎన్విరాన్‌మెంటల్ ప్లానింగ్ 19, హౌసింగ్ 29, రీజనల్ ప్లానింగ్ 19, ట్రాన్స్‌పోర్ట్ ప్లానింగ్ 29, అర్బన్ ప్లానింగ్ 39 సీట్లు ఉన్నాయి.
- మాస్టర్ ఆఫ్ డిజైన్(ఇండస్ట్రియల్ డిజైన్) కోర్సులో 29 సీట్లు ఉన్నాయి.
- మాస్టర్ ఆఫ్ బిల్డింగ్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్ కోర్సులో 39 సీట్లు ఉన్నాయి.
- **అర్హత:** స్పెషలైజేషన్‌ను అనుసరించి ఆర్కిటెక్చర్/సివిల్/కన్‌స్ట్రక్షన్ విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. మాస్టర్ ఆఫ్ ప్లానింగ్ కోర్సుకు పీజీ(జాగ్రఫీ/ఎకనామిక్స్/సోషియాలజీ/ఎకనామిక్స్/స్టాటిస్టిక్స్/ఆపరేషన్స్ రీసెర్చ్) అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. నెట్/గేట్/సీడ్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు: ఫుల్ టైం, పార్ట్ టైం విధానాలు అందుబాటులో ఉన్నాయి. ఏడాదికి రెండు సార్లు అడ్మిషన్స్ నిర్వహిస్తారు. ఫుల్ టైం ప్రోగ్రామ్ వ్యవధి రెండు నుంచి అయిదేళ్ల వరకు ఉంటుంది. పార్ట్ టైం ప్రోగ్రామ్ వ్యవధి మూడు నుంచి ఏడేళ్ల వరకు ఉంటుంది. మొత్తం 36 సీట్లు ఉన్నాయి.

- **అర్హత:** ప్లానింగ్/ఆర్కిటెక్చర్ విభాగాల్లో ప్రథమ శ్రేణి మార్కులతో పీజీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 80 శాతం మార్కులతో డిగ్రీ(ఆర్కిటెక్చర్/ప్లానింగ్/సివిల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణతతోపాటు కనీసం మూడేళ్ల టీచింగ్/రీసెర్చ్/ప్రొఫెషనల్ అనుభవం ఉన్నవారు; అదే 60 శాతం మార్కులతో పదేళ్ల అనుభవం ఉన్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,500
- **పీజీ ప్రోగ్రామ్‌ల ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 27
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** ఏప్రిల్ 10
- **పీజీ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు:** ఏప్రిల్ 15 నుంచి 19 వరకు
- **డాక్యుమెంట్స్ వెరిఫికేషన్:** జూలై 25 నుంచి 27 వరకు
- **ఓరియంటేషన్ ప్రోగ్రామ్:** జూలై 29
- **అకడమిక్ సెషన్స్ ప్రారంభం:** జూలై 29 నుంచి
- **వెబ్‌సైట్:** www.spa.ac.in

ఐఐటీ ఢిల్లీలో సమ్మర్ ఫెలోషిప్

ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ ఢిల్లీ)- సమ్మర్ రీసెర్చ్ ఫెలోషిప్ ప్రోగ్రామ్ 2024లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ ప్రోగ్రామ్ వ్యవధి 8 నుంచి 12 వారాల వరకు ఉంటుంది. దీనిని మే 14 నుంచి జూలై 12 వరకు నిర్వహిస్తారు. అభ్యర్థులు ఎటువంటి ఫీజు చెల్లించనవసరం లేదు. ఎంపికైన అభ్యర్థులకు స్లీపర్ క్లాస్ ట్రైన్ ఫేర్ ఇస్తారు. ఐఐటీ ఢిల్లీ క్యాంపస్‌లో భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తారు. వారానికి రూ.500ల స్టయిపెండ్ కూడా ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన ఇంజనీరింగ్ కళాశాల నుంచి బీఈ/బీటెక్ రెండో ఏడాది పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఐఐటీల విద్యార్థులు దరఖాస్తుకు అనర్హులు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 20
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** ఏప్రిల్ రెండో వారంలో
- **వెబ్‌సైట్:** academics.iitd.ac.in/srf/

కాకతీయ వర్సిటీలో డిస్టెన్స్ ప్రోగ్రామ్‌లు

వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీకి చెందిన సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్- ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్(ఓడీఎల్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. వీటిలో సెమిస్టర్ విధానాన్ని అనుసరిస్తారు.



డిగ్రీ ప్రోగ్రామ్‌లు: బీఏ, బీకాం(జనరల్), బీకాం(కంప్యూటర్స్), బీబీఏ, బీఎస్సీ(మేథ్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్స్) ప్రోగ్రామ్‌ల వ్యవధి మూడేళ్లు. బీలైబ్రరీ సైన్స్ ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. బీకాం కంప్యూటర్స్, బీబీఏ, బీ లైబ్రరీ సైన్స్ ప్రోగ్రామ్‌లను ఇంగ్లీష్ మాధ్యమంలో; మిగిలినవాటిని ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో చదువుకోవచ్చు.

- **అర్హత:** బీ లైబ్రరీ సైన్స్ ప్రోగ్రామ్‌నకు డిగ్రీ ఉత్తీర్ణులు; మిగిలిన ప్రోగ్రామ్‌లకు ఇంటర్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అర్హులు.

పీజీ ప్రోగ్రామ్‌లు

ఎంఏ స్పెషలైజేషన్‌లు: తెలుగు, ఇంగ్లీష్, హిందీ, సంస్కృతం, హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, రూరల్ డెవలప్‌మెంట్, సోషియాలజీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్

- **ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు:** సైకాలజీ, మేథమెటిక్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ
- **ఇతర కోర్సులు:** ఎంకాం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంలైబ్రరీ సైన్స్
- ఎంలైబ్రరీ సైన్స్ కోర్సు వ్యవధి ఏడాది. మిగిలిన కోర్సుల వ్యవధి రెండేళ్లు.
- **అర్హత:** ఎంలైబ్రరీ సైన్స్‌కు బీ లైబ్రరీ సైన్స్ ఉత్తీర్ణులు; మిగిలిన కోర్సులకు సంబంధిత సబ్జెక్టులతో డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

ఏడాది డిప్లొమాలు

- **విభాగాలు:** బిజినెస్ మేనేజ్‌మెంట్, రిటైల్ మార్కెటింగ్, ట్యాలీ, కంప్యూటర్ అప్లికేషన్స్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్, గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్-కమ్యూనికేషన్ స్కిల్స్, యోగా, డిజాస్టర్ మేనేజ్‌మెంట్

మూడు నెలల ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌లు

- **విభాగాలు:** మిమిక్రీ, ఓకల్ మ్యూజిక్, ఇన్‌స్ట్రుమెంటేషన్ మ్యూజిక్, సాఫ్ట్ స్కిల్స్, మీడియా ఫొటోగ్రఫీ

ఆర్నెల్ల సర్టిఫికెట్ ప్రోగ్రామ్

- **విభాగం:** లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 26
- **వెబ్‌సైట్:** www.sdlceku.co.in

జాబ్ కార్నర్

కేంద్ర ప్రభుత్వ శాఖల్లో వివిధ పోస్టులు



ఖాళీలు 2049

స్టాఫ్ సెలెక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ).. కేంద్ర విభాగాల్లో ఖాళీగా ఉన్న సెలెక్షన్ పోస్టుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలున్న విభాగాలు: ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా, సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్, సెంట్రల్ వాటర్ కమిషన్, రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ హైవేస్ మినిస్ట్రీ, హోం అఫైర్స్ మినిస్ట్రీ, డిఫెన్స్ మినిస్ట్రీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిషరీస్, సెంట్రల్ ట్రాన్స్‌లేషన్ బ్యూరో, డిపార్ట్‌మెంట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మర్స్ వెల్ఫేర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ రూరల్‌డెవలప్‌మెంట్. వీటిలో ఎస్సీలకు-255; ఎస్టీలకు-124; ఓబీసీలకు-456; యూఆర్-1028; ఈడబ్ల్యూఎస్-186 పోస్టులు రిజర్వ్ చేశారు.

సెలెక్షన్ పోస్టుల లెవల్స్: 1, 2, 3, 4, 5, 6.

పోస్టులు: లైబ్రరీ అటెండెంట్, మెడికల్ అటెండెంట్, నర్సింగ్ ఆఫీసర్, ఫార్మసిస్ట్, ఫీల్డ్‌మన్, అకౌంటెంట్, అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్, ల్యాబొరేటరీ అటెండెంట్, ఫోర్‌మన్, జూనియర్ ఇంజనీర్, యూడీసీ, డ్రైవర్-కమ్ మెకానిక్, టెక్నికల్ అసిస్టెంట్, సూపర్‌వైజర్, సీనియర్ ట్రాన్స్‌లేటర్, స్టోర్ కీపర్ ఎంట్రీ ఆపరేటర్, రీసెర్చ్ ఇన్వెస్టిగేటర్, కోర్ట్ క్లర్క్, సీనియర్ జియోగ్రాఫర్ తదితరాలు.

అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, పన్నెండో తరగతి, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: కనిష్ఠంగా 18 ఏళ్లు నిండి ఉండాలి

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్-టైపింగ్/డేటా ఎంట్రీ/కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్(సంబంధిత ఖాళీలకు మాత్రమే), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా

దరఖాస్తు రుసుము: రూ.100. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ, ఎక్స్-సర్వీస్‌మెన్ అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంది.

పరీక్ష విధానం: ఇది ఆన్‌లైన్ పరీక్ష. వ్యవధి 60 నిమిషాలు. జనరల్ ఇంటెలిజెన్స్(25 ప్రశ్నలు, 50 మార్కులు), జనరల్ అవేర్‌నెస్(25 ప్రశ్నలు, 50 మార్కులు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్(బేసిక్ అర్థమెటిక్ స్కిల్)(25 ప్రశ్నలు, 50 మార్కులు), ఇంగ్లిష్ లాంగ్వేజ్(బేసిక్ నాలెడ్జ్) (25 ప్రశ్నలు, 50 మార్కులు). ప్రతి తప్పు సమాధానానికి0.50 మార్కుల నెగిటివ్ మార్కింగ్ ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 18

పరీక్ష తేదీలు: 2025 మే 6 నుంచి 8 వరకు

వెబ్‌సైట్: https://ssc.gov.in/

పుణె ట్రిపుల్ ఐటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు

పుణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ..కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 20

విభాగాలు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, అప్లయిడ్ మేథమెటిక్స్ అండ్ డేటా సైన్స్

అర్హత: కనీసం 60 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు బోధన/పరిశోధనానుభవం ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: డెమో క్లాస్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను డైరెక్టర్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, పుణె చిరునామాకు స్పీడ్/రిజిస్టర్/కొరియర్ ద్వారా పంపాలి.

ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 18

వెబ్‌సైట్: www.iiitp.ac.in/careers

నాల్కోలో గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రెయినీలు

ఖాళీలు 277

భువనేశ్వర్(ఒడిశా)లోని భారత ప్రభుత్వ రంగ సంస్థ నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్ (నాల్కో)...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: గ్రాడ్యుయేట్ ఇంజనీర్

కేటగిరీ వారీగా ఖాళీలు: యూఆర్-116; ఈడబ్ల్యూఎస్-27; ఓబీసీ-72; ఎస్టీ-18; ఎస్సీ-44; దివ్యాంగులు-15.

విభాగాలు: మెకానికల్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, మెటలర్జీ, కెమికల్, కెమిస్ట్రీ.

అర్హత: 65 మార్కులతో బీఈ, బీటెక్(మెకానికల్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, మెటలర్జీ, కెమికల్, కెమిస్ట్రీ), ఎమ్మెస్సీ(కెమిస్ట్రీ) ఉత్తీర్ణతతో పాటు గేట్-2023 మార్కులు సాధించి ఉండాలి.

వయోపరిమితి: 2024 ఏప్రిల్ 2 నాటికి 30 సంవత్సరాలు మించకూడదు

పే స్కేల్: రూ.40,000 - రూ.1,40,000

ఎంపిక ప్రక్రియ: ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్-2023 మార్కులు, పర్సనల్ ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు రుసుము: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.500. ఇతరులకు రూ.100

ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: మార్చి 4

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 2

వెబ్‌సైట్: https://nalcoindia.com/

ఏపీ ఐటీఐల్లో అసిస్టెంట్ ట్రెయినింగ్ ఆఫీసర్లు

ఖాళీలు 71

ఏపీలోని పలు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)ల్లో ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి ఉపాధి, శిక్షణ శాఖ దరఖాస్తులు కోరుతోంది.

జోన్: 1, 2, 3, 4

ట్రేడులు: ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెషినిస్ట్, టర్నర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, మెకానిక్ డీజిల్, వెల్డర్, డ్రాఫ్ట్‌మ్యాన్ సివిల్, వైర్‌మ్యాన్, సీవోపీఏ, డ్రెస్ మేకింగ్, మెకానిక్ మోటార్ వెహికల్, కార్పెంటర్, వర్క్‌షాప్ కాలిక్యులేషన్ అండ్ సైన్స్, ఇంజనీరింగ్ డ్రాయింగ్.

అర్హత: సంబంధిత విభాగంలో బి.ఒకేషనల్/డిగ్రీ/డిప్లొమా/ఎన్‌టీసీ/ఎన్ఏసీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 2023 సెప్టెంబరు 30 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక విధానం: రాత పరీక్ష, ప్రాక్టికల్ డెమో, పని అనుభవం తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: మార్చి 20

వెబ్‌సైట్: detrecruitments.apcfss.in/

ఏపీఎండీసీలో మేనేజ్‌మెంట్ ట్రెయినీలు

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్... రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ విభాగాల్లో మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 6

1. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(సర్వే)(మెటాలిఫరస్): **3 పోస్టులు**
2. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(సర్వే)(కోల్): **3 పోస్టులు**

అర్హత: డిగ్రీ/డిప్లొమా(మైనింగ్/మైన్ సర్వే) లేదా డిగ్రీ(సైన్స్), మైన్ సర్వేయర్స్ సర్టిఫికెట్ ఆఫ్ కాంపిటెన్సీ కలిగి ఉండాలి.

వయోపరిమితి: 2024 జనవరి 31 నాటికి 18 నుంచి 32 సంవత్సరాల మధ్య ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: కంప్యూటర్ ఆధారిత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

పే స్కేల్: రూ.40,970 - రూ.1,24,380

పరీక్ష రుసుము: బీసీ/ఎస్సీ/ఎస్టీ/పీహెచ్ కేటగిరీకి రూ.500. ఇతర కేటగిరీలకు రూ.1000.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 14

వెబ్‌సైట్: apmdc.ap.gov.in/

లిటిల్స్



తాబేలు- కుందేలు

ఒక అడవిలో ఓ తాబేలుండేది. దాన్ని అందరూ వెక్కించేవారు. ఎందుకంటే అది సోమరి అని.. అందరికంటే వెనకాల ఉంటుందనీ.. ఆపద వచ్చినప్పుడు తాబేలు ముడుచుకుపోతే.. మిగతా పక్కన ఉండేవి కష్టాలబారిన పడతాయని చెప్పేవారు. దీంతో తాబేలు బాధగా ఉండేది. ఇతర జంతువులు కావాలనే తనను ఇబ్బంది పెట్టడానికి చూస్తున్నాయని తెలుసుకుంది. అయితే ఏమీ చేయలేని పరిస్థితి.

ఒక రోజు తాబేలుకు ఓ కుందేలు పరిచయమైంది. అంత తెల్లగా ఉండే కుందేలును ఇది వరకెన్నడూ ఈ తాబేలు చూడలేదు. కుందేలు తీరును చూసి మెచ్చుకుంది. తెల్లని రంగు బావుందని చెప్పింది. 'ఇవన్నీ కాదు.. ఈ చోటు నాది. ఇక్కడనుంచి వెళ్లిపో' అన్నది కుందేలు. 'నేను ఎప్పటినుంచో ఉన్నానని' చెప్పింది తాబేలు. అయినా కుందేలు ఒప్పుకోలేదు. నీతో వాదించటం ఉపయోగం లేదు. 'మనం పరుగు పందెం పెట్టుకుందాం. ఎవరు గెలిస్తే వారిదే ఈ ప్రాంతం' అన్నది కుందేలు. మిగతా జంతువులన్నీ 'ఇది జరిగే పనేనా' అంటూ నవ్వాయి. తాబేలుకు నిజంగానే కోపం వచ్చింది. ఆ పందేనికి అంగీకరించింది.



ఉదయాన్నే ఓ గీత దగ్గర నిలబడ్డాయి. కుందేలు, తాబేలు పోటీదారులు. సరే అంటూనే పరిగెత్తాలి. కిలోమీటరు దూరం ఉండే గీతను దాటినవాళ్లే విజేతలు. ఎవరు ఓడిపోయినా అవతలి వారి మాటను శిరసావహించాల్సిందే అన్నాయి మిగతా జీవులు. పరుగు ప్రారంభమైంది. కుందేలు చెంగుమని పరిగెత్తింది. తాబేలు మెల్లగా నడుస్తోంది. ఇలా అయితే తాబేలు గెలిచినట్లే అంటూ అందరూ వెటకారంతో అరిచారు. కుందేలు కొంచెం దూరంగా వెళ్తూనే చెట్టు కనపడింది. చల్లగా ఉందది. దీంతో అక్కడే నిద్రపోయింది తాబేలు. బాగా నిద్రపోయి లేచాక చూస్తే తాబేలు ఎప్పుడో ముందు వెళ్లిపోయింది. పరుగు గట్టిగా అందుకుంది ఒక్కసారిగా కుందేలు. పరిగెత్తి చూస్తే తాబేలు గమ్యాన్ని చేరుకుంది. లక్ష్యరేఖను దాటింది. దీంతో కుందేలు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అందరూ తాబేలును మెచ్చుకున్నారు. తాబేలు అందరికీ ఆదర్శం అంటూ పొగిడాయి మిగతా జంతువులు. అలా తాబేలు గెలిచింది. తన ప్రాంతాన్ని దక్కించుకుంది. తక్కువ అంచనాతో, అతి తెలివితేటలతో తాబేలుతో ఓడిపోయిన ఆ కుందేలు మరెన్నడూ కనపడలేదు ఆ అడవిలో.

దారి కనుక్కోండి



7 తేడాలను గుర్తించండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 245

	9					8	4	1
	5	4			8			
			2		4			
9	4							2
7			4	2	3			8
3							6	7
			6		9			
			3			2	1	
4	6	3					9	

సుడోకు - 244 సమాధానం

2	6	3	4	5	7	1	8	9
4	5	7	8	9	1	3	2	6
9	1	8	6	3	2	5	4	7
1	3	5	9	4	6	8	7	2
7	9	6	2	8	3	4	5	1
8	2	4	1	7	5	9	6	3
6	4	1	5	2	9	7	3	8
5	7	2	3	1	8	6	9	4
3	8	9	7	6	4	2	1	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.